శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం

# అరణ్యకాండ

## మందర మకరందం

వక్త


ఆంధ్ర వాల్మీకి - కవి సార్వభౌమ

వావిలికొలను సుబ్బారావు

శ్రీ వాసుదాసస్వామి

అనువక్త - వాచవి

వనం జ్వాలా నరసింహారావు



ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం

# అరణ్యకాండ
# మందర మకరందం

వక్త

ఆంధ్రవాల్మీకి–కవిసార్వభౌమ

**వావిలికొలను సుబ్బారావు**

**శ్రీ వాసుదాసస్వామి**

**అనువక్త–వాచవి**

**వనం జ్వాలా నరసింహారావు**

దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

"దర్శనమ్"
ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక సభక్తి పూర్వక సమర్పణం

# అరణ్యకాండ మందరమకరందం

వక్త

ఆంధ్రవాల్మీకి–కవిసార్వభౌమ
శ్రీ వాసుదాసస్వామి
అనువక్త–వాచవి
వనం జ్వాలా నరసింహారావు


ప్రథమ ముద్రణ

నవంబర్, 2018

ప్రతులు 1000

వెల: రు. 300

ముఖచిత్రం: **రామోజు గణేష్**

లేఅవుట్ : **శ్రీనివాసరావు త్రిపురాన**

ముద్రణ: **సాయితిరుమల ప్రింటింగ్ ప్రెస్,**
చిక్కడపల్లి, హైదరాబాద్

ప్రతులకు:
**మరుమాముల వెంకట రమణ శర్మ**
**దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక**
29–105/1/1, న్యూ విద్యానగర్, నేరెడ్మెట్
సికిందరాబాద్–5000 56
94410 15469 and 040–27220401

# విషయసూచిక

— ● —

# జయభేరి

మ్రొక్కెద రామచంద్రునకు మ్రొక్కెద గేలు సుమిత్ర పట్టికిన్
మ్రొక్కెద దద్విదేహపతనూజకు శ్రీరఘురాము దేవికిన్
మ్రొక్కెద ధర్మ వాసవ మరుద్గణ మారుత రుద్రపాళికిన్
మ్రొక్కెద సూర్యచంద్రులకు మ్రొక్కెద దామరసాప్తు సూతికిన్''

★

"జయము జయంబు రామునకు సారపరాక్రమ ధన్యమూర్తికిన్
జయము జయంబు విద్విశద సహ్యాత రస్వి సుమిత్ర పట్టికిన్
జయము జయంబు దాశరథి సంపరిపాలితుడౌ వలీముఖో
చ్చయపతి సూర్యపుత్రునకు సాహస విక్రమ కీర్తిశాలికిన్''

★

"దాసుడ సర్వసద్గుణ వితాన మనోహర రామమూర్తికిన్
గోసల దేశ వల్లభునకున్ హతశత్రుడ వాయుపుత్రుడన్
నాసరిగారు సంగరమునన్ దశకంఠులు వేవురేనియున్
వాసియడంతురాల ద్రుమ పాళుల నే హనుమత్సమాఖ్యుడన్''

★

"అయోధ్యాపుర నేతారమ్, మిధిలాపుర నాయకీమ్
రాఘవాణా మలంకారమ్, వైదేహానా మలంకియామ్'
రఘూణామ్ కులదీపంచ, నిమీనామ్ కులదీపికామ్'
సూర్యవంశ సముద్భూతమ్, సోమవంశ సముద్భవమ్'

★

పుత్రమ్ దశరధస్యాపి, పుత్రీమ్ జనక భూపతే
వసిష్టను మతాచారమ్, శతానంద మతానుగామ్'
కౌసల్యా గర్భ సంభూతమ్, వేదగర్భోదితామ్ స్వయమ్'
పుండరీక విశాలాక్షమ్, స్ఫురదిన్దీ వరేక్షణామ్'
మత్త మాతంగ గమనమ్, మత్తహమ్స వధూగతామ్'

★

సర్వలోక విధాతారమ్, సర్వలోక విధాయినీమ్'
లోకాభిరామమ్ శ్రీరామమ్ అభిరామాంచ మైధిలీమ్
అన్యోన్య సదృశా వేతౌ త్రైలోక్య గృహదమ్పతీ''

# ముందుగా నా మాట

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో రెండు దశాబ్దాల క్రితం అదనపు సంచాలకుడిగా పనిచేస్తున్న రోజుల్లో అక్కడి ప్రభుత్వ క్వార్టర్స్లో నివసిస్తుండే వాడిని. మా పొరుగునున్న శ్రీమాన్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు లేచింది మొదలు నిద్ర పోయేదాక రామనామం తప్ప దేని మీద మనస్సు పోనీయడు. ప్రతినిత్యం రామాయణ పారాయణం చేస్తూ వుంటాడు. నా కంటే వయస్సులో చిన్న వాడైనా, జ్ఞానవృద్ధుడు. నా నిత్య కృత్యాలు చాలవరకు ఆయనకు నచ్చవు. నేనంటే మాత్రం ఇష్టం. ఆయన ఉదయం అనుష్టానం చేసుకుంటుంటే, చనిపోయిన మా నాన్న స్వర్గీయ వనం శ్రీనివాసరావు గారు గుర్తొచ్చేవారు. నాన్నగారు వాసుదాసు గారు రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణం, మందరం అన్ని కాండల్నీ, కనీసం పాతిక సార్లకు పైగా పారాయణం చేసినవారు. వాసుదాసుగారూ ఆయన శిశ్యులు సుబ్బదాసుగారూ (దాసశేషుడు) ఖమ్మం జిల్లాలోని వనంవారి కృష్ణాపురం గ్రామంలో వున్న మా ఇంట్లో వారి పాదాలు మోపి మా ఇంటిని పావనం చేసారు చాలా సంవత్సరాల కింద. నేనూ మా నాన్నగారితో నా చిన్నతనంలో తెనాలి దగ్గర అంగలకుదురులోని వారి ఆశ్రమానికి వెళ్లాను ఒకటి-రెండు సార్లు.

మా శ్రీమతికి మా నాన్న గారి పూజ-పునస్కారాల వారసత్వం వచ్చింది. నాకంతగా అబ్బ లేదు. ప్రక్కనున్న విజయరాఘవ గారినీ, ఆయన భక్తి సంబంధమైన మాటలను ఎప్పుడూ వింటుంటే ఆమె: " మీరు అన్న గారి

మార్గంలోనన్నా పోతారు, లేదా, ఆయన మీ దారికన్నా వస్తారు" అనేది, మేమిద్దరం చర్చించుకుంటుంటే. అదే నిజమైంది కొద్ది రోజుల్లో. నేను రామాయణం చదువుతాను, మీదగ్గరుంటే ఇవ్వండి, అయితే వాసుదాసు గారు వ్రాసిన ఆంధ్రవాల్మీకి రామాయణం మాత్రమే కావాలన్నాను. అలా అడగటానికీ, అదే కావాలంటానికీ, ప్రత్యేక కారణం ఏమీ లేదు. కాకపోతే నా చిన్న తనంలో, మా నాన్న గారు "మందరం" పారాయణం చేస్తుంటే చూశాను కనుక అది మాత్రమే రామాయణమేమో అనుకున్నాను. అయితే నేను రామాయణం చదువుతానంటే ఆయన కొన్నాళ్ళు నమ్మలేదు. నేనూ గట్టిగా అడగనూలేదు. ఆయన ఇవ్వనూ లేదు. నేను ఆలోచన వచ్చిన వెంటనే చదవటమూ జరగలేదు.

మళ్ళీ నిత్య జీవితం. దైనందిన చర్యలు. మధ్యలో మా జిల్లాలోనే వున్న భద్రాచల రాముడినీ, పొరుగు రాష్ట్రంలో ఉన్న శ్రీరంగనాథ స్వామినీ, దర్శించుకొనే భాగ్యం కలిగింది, డిసెంబర్ 2002-జనవరి 2003 లో. "శ్రీ రామావతార సమయంలో శ్రీ సీతా రాముల దర్శనం ఏదోవిధంగా కలగందే ఈ జన్మలో శ్రీరంగనాధుని (శ్రీరంగం) దర్శనం కలగనే కలగదు" అన్నారు విజయరాఘవ గారు. జనవరి 15, 2003 న తన ఇంట్లోకి పిల్చి, స్నానం చేసి రమ్మని, వాసుదాసుగారి శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణం సుందరకాండ మందరం నా చేతిలో పెట్టారు. రామాయణం మొత్తం చదవడం తర్వాత, ముందిది చదవమన్నారు. ఎందుకంటే, రామాయణం పఠనమో, పారాయణమో సుందరకాండ తోనే మొదలెట్టాలన్నారు. అవునేమోననుకుని చదవడం ప్రారంభించాను.

సరీగ్గా పది రోజుల్లో ఆసాంతం చదివాను. ఏరోజుకారోజు, వీలున్నప్పుడల్లా చదివేవాడిని. చదివిన విషయ సారాంశం ఎప్పటికప్పుడు బడి పిల్లాడిలా, విజయరాఘవ గారికి అప్ప చెప్పే వాడిని. వశిష్ఠుడి నోట బ్రహ్మర్షి అంటేనే విశ్వామిత్రుడు ఒప్పుకున్నాడట! నేను చదువుతున్నానన్న నమ్మకం ఆయనకు కలిగితేనే నాకెందుకో తృప్తనిపిన్చేది. పదిరోజుల్లో చదవడం గొప్ప కాదు. నన్ను ప్రేరేపించి, ప్రోత్సహించి చదివించిన ఆయన గొప్పతనం అది. వాల్మీకి సంస్కృతంలో వ్రాసిన ఇరవైనాలుగు వేల శ్లోకాలను ఎప్పుడంటే అప్పుడు ప్రతిపదార్థంతో సహా అప్పచెప్పగల సమర్థుడాయన!

ఆరువందల డెబ్బై పేజీల పద్య-గద్య-ప్రతిపదార్ధ తాత్పర్య సహిత సుందరకాండ మందరాన్ని చదవడానికైనా, పారాయణం చేయడానికైనా, నాలాంటి చాలామందికి తీరికా, ఓపికా వుండదేమో అనిపించింది. తెలుగు భాషలో కనీస ప్రావీణ్యత వున్నవారికి అర్ధమయ్యే రీతిలో వాసుదాసుగారి సుందరకాండ మందరాన్ని, ఆయనే "వక్తగా", నేను కేవలం "వాచవిగా"- "అనువక్తగా" సంక్షిప్తీకరించి నలుగురికీ అందించగలుగుతే బాగుంటుందేమో అనుకున్నాను

కొన్ని పేజీలు వ్రాసినతర్వాత విజయరాఘవగారు చూసారు. సుందర హనుమంతుడిని అర్థం చేసుకున్న దాఖలాకు నేను వ్రాసిన కొన్ని పేజీలు నిదర్శనమని వ్యాఖ్యానించారు. "బాగుంది, పెద్దల ఆదరాభి మానాలకు, ఆమోద-ప్రమోదాలకు పాత్రం కాగలదు" అంటూనే, మనం మాట్లాడే శిష్ట వ్యావహారిక భాషలో వ్రాయడం వల్ల మరింత శోభిస్తుందని ఓ చురక తగిలించారు. ఇంతలో అనుకోకుండా సిన్సినాటి (అమెరికా) లో వుంటున్న మా అమ్మాయి కిన్నెర దగ్గరకు మా ఆవిడతో సహా వెళ్లాల్సి వచ్చింది, మనుమరాలు పుట్టబోయేముందర మా అమ్మాయికి తోడుగా వుండేటందుకు. అక్కడ మళ్ళీ మొదలెట్టి ఓ నెల రోజుల వ్యవధిలో శ్రీరామానుగ్రహం వల్ల పూర్తి చేసాను. అయితే, అసలు-సిసలు శిష్ట వ్యావహారిక భాష అన్ని చోట్లా వాడలేక పోయాను.

అలా సుందర కాండ మందరమకరందం పూర్తి చేసిన తరువాత దాన్ని ఇప్పటికి మూడు పర్యాయాలు, తడవకు వేయి కాపీల చొప్పున ముద్రించడం, పదిమందికి పంచిపెట్టడం జరిగింది.

ఆ తరువాత చాలామంది, ముఖ్యంగా కోరమాండల్ సీతారామయ్య గారు, చిలకపాటి విజయ రాఘవాచార్యులు గారు, తదితర పెద్దల సూచన మేరకు రామాయణంలోని మిగతా కండలు కూడా శిష్ట వ్యావహారిక భాషలో అనువక్తగా సంక్షిప్తీకరించడానికి నిర్ణయించుకున్నాను. 2009 సంవత్సరంలో మా అబ్బాయి ఆదిత్య, కోడలు పారుల్ కపూర్ అమెరికా, సాన్ ఫ్రాన్సిస్కో లో వుంటున్నప్పుడు, వాళ్లకు కూతురు (మాకు ఇంకో మనుమరాలు-కనక్) పుట్ట బోయే ముందు అక్కడికి పోవాల్సి వచ్చింది భార్యా సమేతంగా. అప్పుడు అమెరికాలో ఆర్నెల్లు, కొన్నాళ్లు అక్కడా, కొన్నాళ్లు మా అమ్మాయి వుంటున్న హ్యూస్టన్ లో వున్నాం. ఆ సందర్భంగా బాలకాండ మందర మకరందం

రాయడం పూర్తి చేయగలిగాను. దాని మొదటి ముద్రణ 2010 లో త్రిదండి చిన జీయర్ స్వామి (పుస్తకానికి వారి ఉపోద్ఘాతంతో) జీయర్ ట్రస్ట్ ద్వారా చేయించారు. పుస్తక ఆవిష్కరణ కూడా ఆయనే చేశారు. బాలకాండ ద్వితీయ ముద్రణ ఇటీవలే జరిగింది.

ఆ తరువాత అయోధ్యాకాండ మందర మకరందం రాయడం ప్రారంభించాను. ఆ కాండ చాలా పెద్దది. మందరమే రెండు భాగాలుగా రాశారు వాసుదాస స్వామి. 2010-11 లో మొదలు పెట్టిన అయోధ్యాకాండ హైదరాబాద్ లో కొంత, సింగపూర్లో కొంత, మళ్లీ హైదరాబాద్ లో కొంత రాశాను కాని చాలాకాలం వరకు పూర్తి చేయలేకపోయాను. అయోధ్యాకాండ సాగనివ్వదని కోరమాండల్ సీతారామయ్య గారు అనేవారు. మరోమారు మా అబ్బాయి, కోడలు వుంటున్న అమెరికా, సాన్ ఫ్రాన్సిస్కోకు వెళ్లాం 2017 లో. అప్పుడు తదేక దీక్షగా రాసి, అయోధ్యకాండ మందరమకరందం పూర్తి చేశాను. దాని ముద్రణ అమెరికా నుండి వచ్చిన వెంటనే గత ఏడాది (2017)లో అయింది. ఆ వెంటనే అరణ్యకాండ మందరమకరందం రాయడం మొదలెట్టాను. ఇంతకు ముందు రాసిన మూడు కాండలు అమెరికాలో పూర్తవుతే ఇదొక్కటి మాత్రం పూర్తిగా ఇక్కడే రాశాను.

సహృదయులు చదివి నన్ను ప్రోత్సహించాలని ప్రార్థన.

**– వనం జ్వాలా నరసింహారావు**

# శ్రీరామాయ నమః
# 'రామో విగ్రహవాన్ ధర్మః'

శ్రీ రామాయణం ఆదికావ్యం. వాల్మీకి మహర్షి ఆదికవి. ఆర్ష వాఙ్మయానికి సంబంధించి సంస్కృత సాహిత్యమే ప్రామాణికం. వ్యాస, వాల్మీకులే అందుకు ప్రాతఃస్మరణీయులు కదా! "వ్యాసాయ విష్ణురూపాయ", "వ్యాసోనారాయణోహరిః", అని తలవంచి ప్రణమిల్లారే కానీ, "కవి" అనలేదు. 'కవి' అంటే వాల్మీకి మహర్షి. 'కావ్యం' అంటే శ్రీరామాయణం...వాల్మీకం. 'ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితమ్' అని తీర్పు. వాల్మీకి రామాయణం భారత జాతికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు! ధర్మశాస్త్ర సంపుటం. భారతీయులకు ఆజీవన పారాయణ వేదం. నిత్య ప్రత్యూషంలో కోట్ల గృహాంగణాలలో, దేవాలయాలలో, శ్రీరామ మందిరాలలో వినిపించే భద్రమంగళ గీతిక! మానవ మనుగడకు నడవడిని నేర్పిన మహోపదేశశీల సంహిత సత్సంగాలకు హత్తిన వరవడి.

ఎందరెందరో మహానుభావులు వాల్మీకి రామాయణాన్ని వారివారి భాషలలో, వారివారి దివ్య భావనలలలో, సంప్రదాయాలలో, కవితారీతులలో శ్రీ సీతారాములనూ, భరత, లక్ష్మణ, హనుమ, విభీషణ, సుగ్రీవాదులను విలక్షణంగా ప్రస్తుతించారు. శ్రీ రామాయణం అసంఖ్యాకులకు 'కల్పవృక్షం', అల్పసంఖ్యాకులకు 'విషవృక్షం', పారాయణ పరాయణులకు 'పీయూషం' 'యద్భావం తద్భవతి' అస్తు!

'ఆంధ్ర వాల్మీకి' గా శతాబ్దం క్రితమే లబ్ధ ప్రతిష్టులైన వావిలికొలను సబ్బారావు గారు 'వాసుదాసు' గా తెలగునేల నాలుగు చెరగులూ ప్రాచుర్యం

పొందిన మహాభాగవతోత్తములు. చతుర్వింశతి సాహస్రశ్లోక సంభరితమైన వాల్మీకి రామాయణానికి సమసంఖ్యలో పద్యరూపంలో యధాతథంగా ఆంధ్ర అనువాద గంగావతరణం చేసిన అపర ఆంధ్ర భాషా భగీరథులు వారు. రాబోయే కాలంలో 'పద్యవిద్య' దురవగాహనమౌతుందని భావించిన 'ఆంధ్రవాల్మీకి' తామే 'మందరం' అను పేరుతో అన్ని పద్యాలకు అర్థ తాత్పర్య విశేషాలతో బాటు 'గోవిందరాజీయా'న్ని ప్రామాణికంగా స్వీకరించి వూహాతీత ప్రభావ సంపన్నంగా వ్యాఖ్యానాన్ని అందించారు. వందేళ్లు గడిచిపోయాయి. నాకూ శ్రీరామాయణమే ఆజీవన జీవికగా, ఆలంబనగా, హృద్యమైన శ్రీరామ నైవేద్యంగా మారింది. తత్ఫలితంగానే శ్రీమాన్ వనం జ్వాలానరసింహరావు గారితో మైత్రిబంధం కుదిరింది. వారు పితృవరంగా పొందిన వారసత్వం శ్రీ సీతారామానుశీలనతత్త్వం! ఆపాతమధురనిష్యంది వారి సమాలోచన పరిధి. అద్భుతమైన వక్త, రచయిత. ఆంధ్ర శ్రీరామాయణానికి 'వాసుదాస' స్వామి వారి అనువక్త. 'మందర'కృతి వాచవి.

శ్రీరామానుగ్రహం వల్ల మేమిద్దరం 'మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ' హైదరాబాదులో నాలుగైదేండ్లు సహోద్యోగులం. సహవాసులం అంటే ఇరుగుపొరుగులం. పరస్పర ప్రేమాదరాలతోనూ, సత్సంగ సౌమనస్యాలతోనూ ఉభయ కుటుంబాలు స్నేహలతలను పల్లవిస్తూ విస్తరించాయి.

శ్రీమాన్ వనం జ్వాలానంసింహరావు గారు 'మందరాన్న' ఔపోసన పట్టారు. వారు ఏకసంథాగ్రాహి. విలక్షణమైన చదువరి. భావగ్రాహి. 'రామ ప్రభావదాశ్చర్యం' అంటారు వాల్మీకి మహర్షి. 'రామభూతం జగదభూత్ రామే రాజ్యం ప్రశాసతి' అంటారు. శ్రీరామానుగ్రహ ప్రభావం 'అప్రమేయ' మట. ఇంగితాలకు, అవయవాలకు, ఇంద్రియాలకు అందే విషయం కాదు. అయోధ్యావాసులకు 'రామభూతం' పట్టిందట. అలాంటివేవో మా 'జ్వాలా' గారిని ఆవహించింది. అమ్మాయిని (కూతరు) చూసివద్దామని అమెరికా వెళ్లి, అక్కడే అంతర్జాలాన్నీ, ఆంధ్ర లిపినీ ఒంటబట్టించుకుని 'ఆంధ్రవాల్మీకి కృత' 'సుందరాకాండ' ను సంక్షిప్త సుందరంగా వుల్లేఖించారు. అద్భుతమైన ప్రాచుర్యాన్ని పొందింది. వెంటనే బాల, అయోధ్యాకాండలను 'మందర' పథంలో అనునయిస్తూ రచించారు. ప్రస్తుతం 'అరణ్యకాండ'ను అందిస్తున్నారు.

'అరణ్యకాండ' అనుష్టాన కాండ. అద్భుతమైన ధర్మమర్మాలను నిష్కర్షించిన

మహర్షి మహోపదేశం. శ్రీ సీతారామలక్ష్మణులు వనప్రవేశంతో ఈ కాండ ప్రారంభమౌవుతుంది.

శ్లో!! ప్రవిశ్యతు మహారణ్యం దండకారణ్యమాత్మవాన్!
దదర్శరామో దుర్ధర్షః తాపసాశ్రమమండలమ్ !
అలాగే పంపా సరోవర దర్శనంతో సమాప్తమై
'కిష్కంధకాండ'కు నడిపిస్తుంది.

శ్లో!! తలో మహద్వర్త్మసుదూర సంక్రమః
క్రమేణగత్వా ప్రతికూల ధన్వనమ్ !
దదర్శపంపాం శుభ దర్శకాననాం
అనేక నానవిధపక్షిజాలకామ్ !

అరణ్యకాండలో శరభంగ, సుతీక్షణ, మాండకర్ణి, అగస్త్య, మతంగాది మహర్షులూ, జటాయువూ, శబరీ దర్శనమిస్తారు. 'ఆచార్యవైభవా'న్ని శబరి స్మరింప చేస్తుంది. పంచవటిలో శూర్పణఖ ప్రవేశం. ఆమెకు 'శృంగభంగం'. శ్రీరాములవారి ధనుర్విద్యావైశారద్యం, శ్రీరామలక్ష్మణుల సౌందర్యవర్ణనం, సీతాపహరణం, జటాయు వీరమరణం, శ్రమణి, ధర్మనిపుణ శబరి వృత్తాంతం అరణ్యకాండలో ఆవిష్కరించబడిన ఆలోచనామృతాలు! 'గురువందనం' ఆచార్య ప్రస్తుతి ప్రాశస్త్యాన్ని శ్రీరామాయణం ఇందులోనే అందగిస్తుంది.

అరణ్యకాండలో అనేక ధర్మాలు ప్రవచిస్తాయి. జ్వాలా గారు 'వాచవి' గా వీటిని ఎంతో హృద్యంగా వివరించారు. వారి వచనం, సరళసుందరం. సీతమ్మ రామయ్యతో అంటుంది

శ్లో!! క్వచ శస్త్రం క్వచవనం, క్వచక్షాత్రం తసః క్వచ !
వ్యావిద్ధమిదమస్మాభిః దేశధర్మస్తు పూజ్యతామ్!

"మనం వనానికి వచ్చాం. ఈ వనమెక్కడ! క్షత్రియ ధర్మం ఎక్కడ! ఆయుధాలెక్కడ! ఋష్యాశ్రమం ఎక్కడ! ఇవి పరస్పర వ్యతిరిక్తాలు కద! ఈ ఋషివాటికలలో ఋషిధర్మాన్ని పాటించాలి. ఈ ఆతుధాలు, హింసాత్మకాలుకదా! మనకెందుకు ! అని! అంటూనే సవినయంగా మీరూ, మీ తమ్ముడూ చక్కగా ఆలోచించి ఏది మంచిదో అలా చెయ్యండి" – అంటుంది

మన సీతమ్మ తల్లి. శ్రీరామయ్య తండ్రి అంటాడు.

శ్లో !! అప్యహం జీవితం జహ్యాం త్వాం వాసీతే సలక్ష్మణామ్!
నతు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః !

– ధర్మవ్రతుడు, ధర్మమూర్తి, ధర్మసంధాయకుడు, ధర్మనాయకుడు శ్రీరాముడు కద! "సీతా! నేను ప్రాతాన్నైనా వదులుతాను. లక్ష్మణుడినైనా వదులుతాను. నిన్ను అయినా విడిచిపెడతాను.. కానీ చేసిన ప్రతిజ్ఞను మాత్రం విడిచి పెట్టేదిలేదు. అందునా విశేషించి బ్రాహ్మణులకు (ఋషులకు) ఇచ్చిన మాటను తప్పేది అసలు లేదు".

అన్నదమ్ముల అనుబంధానికి మరో చక్కని సందర్భం మనస్సును రంజిల్ల చేస్తుంది. లక్ష్మణ స్వామి తన అన్నా వదినెలకు హాయిగా వుండేలా ఆశ్రమం నిర్మించాడు. వాస్తు పూజలు చక్కగా చేసాడు. శ్రీరాముల వారికి చూపించాడు. శ్రీరాములవారు పరమానందభరితుడై 'సుసంహృష్టః పరిష్వజ్య బాహుభ్యాం లక్ష్మణం తదా' – లక్ష్మణుడ్ని గట్టిగా కౌగిలించుకున్నాడు. ఎంతో అభినందించాడు. ఆయన అంటాడు. ఏమని!

శ్లో! భావజ్ఞేన కృతజ్ఞేన ధర్మజ్ఞేన చ లక్ష్మణ!
త్వయా నాథేన ధర్మాత్మాన సంవృతః పితామహ!

"తమ్ముడా నీవు ఎదుటి వారి మనస్సును గ్రహిస్తావు. ధర్మం తెలిసినవాడివి. కార్యశీలుడవు. నీవు తోడుగా వున్నందున ధర్మాత్ముడైన నాన్నగారులేని లోటు తెలియడం లేదు". అంటాడు. ఇలా అన్నదమ్ములు ఉండగలిగితే కుటుంబాలు మల్లెల వుద్యానాలు కావా!

విష్ణ్వాలయాలలో శ్రీ సీతారాములకు వింజామరవీస్తూ చెప్పే శ్లోకాలు మనం వింటూ వుంటాం. అవి తనను అవమానించి బాధించిన దివ్యమజ్ఞల విగ్రహుడైన శ్రీరామచంద్రమూర్తిని గురించి శూర్పణఖ తన అన్నలైన ఖరదూషణాదులతో చెప్పిన విశేషాలు అవి.

శ్లో! తరుణా రూప సంపన్నౌ – సుకుమారౌ మహాబలౌ !
పుండీక విశాలాక్షౌ చీరకృష్ణాజినాంబరౌ!
శ్లో! ఫలమూలాశనౌ దాన్తౌ తాపసౌ ధర్మచారిణౌ!
పుత్రౌ దశరథస్యాస్తాం భ్రాతరౌ రామలక్ష్మణౌ!

అపాకృత దివ్యసుందరమూర్తులైన శ్రీరామలక్ష్మణుల దర్శన తీరుతెన్నులివి. అర్థం స్పష్టం.

శ్లో! తం దృష్ట్వా శత్రుహంతారం మహర్షీణాం సుఖావహమ్!
బ భూనహృష్టా వైదేహీ భర్తారం పరిషస్వజే!

శ్రీరాముడు 72 నిమిషాలలో ఖరదూషణాదులతో సహా 14వేల మంది రాక్షసులను సంహరించడాడు. అనంతరం ఈ సన్నివేశాన్ని గుహలోనుంచే చూసిన సీతమ్మ ఆనందాన్ని తమాయించుకోలేక భర్తను గట్టిగా కౌగిలించుకున్నదట! నవరస భరితమైన శ్రీరామాయణ మహాకావ్యంలో ఇలాంటి సన్నివేశాలు అసంఖ్యాకాలు. వీటిని నాటకీయంగా, కథాకథనంగా, అమృతమథనంగా, కాంతా సమ్మితంగా అను'వదించిన' మా జ్వాలానరసింహారావుగారిని శ్రీ సీతారామ శ్రీచరణ కమల స్మరణ పురస్సరంగా సంభావిస్తున్నాను. మిగిలిన కిష్కింధా, యుద్ధ కాండలను కూడా ఇలాగే రసరమ్యంగా, భవ్యరంజనంగా, శ్రీఘ్రంగా రచించి, శ్రీరామ పట్టాభిషేక (సామ్రాజ్య) మహోత్సవాన్నీ జరిపించాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రచురణ సంస్థ 'దర్శనమ్' పత్రిక, అధిపతి బ్రహ్మశ్రీ మరుమాముల వేంకటరమణ శర్మనూ హార్ధంగా అభినందిస్తున్నాను.

శ్లో! చతుర్ముఖేశ్వరముఖైః పుత్రపౌత్రాదిశాలినే!
నమస్సీతాసమేతాయ రామాయ గృహమేధినే!!

శ్రీరామ –రామానుజ – దాసానదాసుడు
**డాక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు**
చీఫ్ కన్సల్టెంట్, SEEDAP,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అమరావతి

# నివేదన

ఎంత చదివినా తనివి తీరనిది రామాయణం. ధర్మానికి ప్రతిరూపమైన రామాయణం ప్రపంచభాషలన్నింటిలోకి అనువదించబడిందంటే దాని గొప్పతనం సులువుగానే మనం గ్రహించవచ్చు. కవి అనిపించుకున్న ప్రతివ్యక్తి ఏదో ఒకరకంగా రామాయణ కథని తమ తమ జ్ఞానానికి అనుగుణంగా రాసినవారే!

యుగయుగాలకు ధర్మమార్గాన్ని ఉపదేశించే మహాకావ్యం శ్రీమద్రామాయణం. ధర్మప్రభువైన శ్రీరామచంద్రుడు, మహాసాధ్వి సీతమ్మ తల్లిల దివ్యగాథను ఎన్ని సార్లు విన్నా తనివితీరని మహాకావ్యం రామాయణం.

**ఆర్షకవి** వాసుదాసుగారి రామాయణానికి అనువక్త-వాచవిగా నిలిచిన **శ్రీ వనం జ్వాలా నరసింహారావు** గారి కలం నుండి జాలువారిన రామాయణం మందర మకరందంను గత పుష్కరకాలంగా **దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రికలో ధారావాహికగా ప్రచురితమవుతూ, పాఠకుల హృదయాలను రంజింపజేస్తోంది. ఈ పరంపరలో భాగంగా గ్రంథరూపంలో తీసుకురావాలనే ఉద్దేశ్యంతో **బాలకాండ, అయోధ్యకాండ, సుందరకాలండ**లను ఇదివరకే ప్రచురించాము. ఇప్పుడు **అరణ్యకాండ**ను గ్రంథరూపంలో వెలువరిస్తున్నాం.

సులువైన భాషలో, సామాన్యుడు సైతం చదువుకునేలా, చదువుతున్నకొద్దీ ఆసక్తిని కలిగించేలా ఉన్న కథనం ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. విస్తృతమైన, వర్ణనాత్మకమైన రామాయణాన్ని మందర వ్యాఖ్యాసహితంగా వెలయించిన **వనం జ్వాలానరసింహారావు** గారి రచన ఆసాంతం హృద్యంగా, మనోజ్ఞంగా సాగుతుంది.

ప్రత్యేకంగా **దర్శనమ్**పై వున్న ఆత్మీయానురాగంతో తన రామాయణ రచననంతా ప్రచురణకు అవకాశం కల్పించిన విఖ్యాత రచయిత, ధార్మికవేత్త **శ్రీ వనం జ్వాలా నరసింహారావు** గారికి జీవితాంతం ఋణపడి వుంటాను.

ఇప్పుడు ముద్రణ పొందుతున్న **అరణ్యకాండ** కూడా పాఠకుల మనసులను రంజింపజేస్తుందని భావిస్తున్నాను.

ఈ అక్షర యజ్ఞంలో భాగస్వాములైన మా **దర్శనమ్** సబ్ ఎడిటర్ **బాలసుబ్రహ్మణ్యం**, చక్కని ముఖచిత్రాన్ని అందించిన **శ్రీరామోజు గణేశ్**, ఎల్లవేళలా తన తోడ్పాటు నందిస్తున్న సహధర్మచారిణి **రుక్మిణి**కి, తక్కువ సమయంలోనే అందంగా ముద్రించి ఇచ్చిన **లక్ష్మీ నర్సు** గారలకు ధన్యవాదాలు.

ఈ **దర్శనమ్** ధార్మిక యజ్ఞంలో నాకు ఆశీరానుగ్రహాన్ని అందిస్తున్న గురుదేవులకు, మా పితృదేవులు **కీ.శే. మరుమాముల రాజమౌళి శర్మ**గారికి, మాతృమూర్తి **మరుమాముల అన్నపూర్ణమ్మ**, సోదరుడు **శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ**గారలకు నమస్సుమనస్సులు.

తేది: 05-11-2018.

**(మరుమాముల వెంకటరమణశర్మ)**
సంపాదకులు
**దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

# చిన్నా–పెద్దా–అందరికీ కృతజ్ఞతలు

ఎందరో సహృదయులు, అందరికీ కృతజ్ఞతలు. ఈ అరణ్యకాండ మందర మకరందం వ్రాయడానికి వాడిన కలం కానీ, కాగితం కానీ, టైపు చెసిన కంప్యూటర్లు కానీ నావి కావు. అలాంటప్పుడు రాసింది నేను మాత్రమేనని, రాసిన విషయమంతా నా కృషివల్లనే జరిగిందని ఎలా అనగలను? నేనేంటి? ఆంధ్రవాల్మీకి రామాయణం అరణ్యకాండ మందరం చదవడమేంటి? చదివిన తర్వాత మందర మకరందం గా మలచడమేంటి? తెలుగు సాహిత్యంలో, రచనా వ్యాసంగంలో అంతో, ఇంతో ప్రవేశం వున్న మాట కొంత వాస్తవమే అయినప్పటికీ, ఆంధ్రవాల్మీకి అరణ్యకాండను మందర మకరందంగా మలిచే శక్తి నాకు కలగడమేంటి?

రామాయణం నేను రాయడానికి అనుక్షణం నన్ను ప్రోత్సహించిన మా శ్రీమతికి ధన్యవాదాలు.

మా పిల్లలు ప్రేమ మాలిని, కిన్నెర, ఆదిత్య, అల్లుళ్ళు విజయగోపాల్, కిషన్, కోడలు పారుల్, వాళ్ల పిల్లలు యశ్విన్, మేథ, మిహిర, అన్ష్, కనక్, ఇరాలకు కూడా థాన్క్స్.

ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన మరెందరికో ధన్యవాదాలు. ముఖ్యంగా కేవలం ప్రోత్సహించడమే కాకుండా ఆర్థికంగా మందర మకరందం పుస్తక ప్రచురణలకు సహాయం చేస్తున్న కోరమాండల్ సీతారామయ్య గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఆంధ్రభూమి ఆదివారం సంచికలో ధారావాహికంగా ప్రచురిస్తున్న సంపాదకులు సదాశివ శర్మ గారికి ధన్యవాదాలు.

దర్శనమ్ శర్మగారికి ధన్యవాదాలు. ముఖ చిత్రం వేసిన గణేష్ కు ధన్యవాదాలు. ముద్రించిన ప్రింటర్స్ కు ధన్యవాదాలు. పేజ్ మేకర్ శ్రీనివాస్ కు కృతజ్ఞతలు.

అక్షర దోషాలను సరిదిద్దిన శ్రీ కొమరగిరి శ్రీరామచంద్రమూర్తికి ధన్యవాదాలు.

చివరిగా, కానీ, ముఖ్యంగా,

మా నాన్న గారు ఇప్పుడు జీవించి వుంటే బహుశా ఆయన కంటే ఈ విషయంలో సంతోషించే వారెవరూ వుండరు! ఆయన బ్రతికున్నప్పుడు నేనెట్లా వుండాలని కోరుకున్నాడో అలా కొంతవరకూ వున్నానంటానికి ఈ పుస్తకం కూడా నిదర్శనం.

నన్నింత వాడిని చేసిన నా తండ్రి, తల్లి, స్వర్గీయ వనం శ్రీనివాసరావు గారికీ, స్వర్గీయ వనం సుశీలమ్మ గారికీ, వారి ద్వారా ముత్తవరం శ్రీసీతారామచంద్ర స్వామి వారికీ ఈ పుస్తకం అంకితం.

**– వనం జ్వాలా నరసింహారావు**

### శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం...

# అరణ్యకాండ

శ్రీ రామాయణం క్షీర ధార. వాసుదాసుగారి శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం, మందరాలన్నీ, మందార మకరంద మాధుర్యాలే. కవికులగురువు కాళిదాసు అన్నట్లు."చరిత్ర మా రాముడిది. రచన సాక్షాత్తు వాల్మీకులవారిది. గానం చేసినవారు కిన్నెర గాత్రులైన కుశ లవులు. ఇంతటి మహనీయమైన రామాయణ కావ్యంలో, శ్రోతలను పరవశింప చేయని అంశం అనేదేదీ లేదు.

భగవద్గీత, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రం, శ్రీ రామాయణం భారతీయ సంస్కృతీ రూపాలు. సనాతన ధర్మ ప్రతిపాదకాలు. వీటి మౌలిక తత్వాలు ధర్మ–జ్ఞానాలు. ఈ రెండింటినీ వాచ్య–వ్యంగార్థాలతో శ్రీ మద్రామాయణం ఆవిష్కరిస్తోంది. వాల్మీకి ఆదికవి. రామాయణం ఆదికావ్యం. ఇది ధ్వని–అర్థ ప్రతిపాదిత మహా మంత్రపూతం. గాయత్రీ బీజసంయుతం. ఔపనిషతత్వసారం. స్మరణ–పారాయణ మాత్రంగా అంతఃకరణ శుద్ధి అవుతుంది.

వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా, పూర్వ కాండలతో సహా ఉత్తర కాండను కూడా కలిపి తెనిగించిన ఏకైక మహాకవి కీర్తి శేషులు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు. ఆ మహానుభావుడి ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకున్నాయి. కానీ, కాలక్రమంలో అవన్నీ మరుగున పడిపోతున్నాయి. రామాయణానికి రచయిత ఒక్కడే. వాల్మీకి మహర్షి తప్ప

ఇతరులెవరికీ రామాయణం రచయిత అని చెప్పుకునే హక్కులేదనే అనాలి. వాసుదాసుగారు కూడా వ్యాఖ్యాతననే అంటారు తన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి.

వాల్మీకి రామాయణ క్షీరసాగర మధనాన్ని చేసి "మందర" మకరందాలనూ, రమా రామ పారమ్య పీయూషాలనూ, నాలుగు చెరగులా పంచి, ఆ మథనంలో ఆవిర్భవించిన శ్రీ సీతారాముల తత్వాన్ని, వేద వేదాంగేతిహాస స్మృతి శ్రుతి శుభంగా అన్వయించి, ఆంధ్రుల హృదయ కేదారాలను ప్రపుల్లంచేసిన పరమ భాగవతోత్తములు "ఆంధ్ర వాల్మీకి" వాసుదాస స్వామి. "రామ భక్తి సామ్రాజ్యం యే మానవుల కబ్బెనో మనసా! ఆ మానవుల సందర్శనం అత్యంత బ్రహ్మానందమే" అన్న త్యాగరాజ స్వామి వారి కీర్తనకు సాకార దివ్య స్వరూపులు వాసుదాస స్వామి. ఆంధ్ర వాల్మీకి వాసుదాస స్వామి అవతరించి వున్న కాలంలో, వారి దర్శన–అనుగ్రహ భాషణా సౌభాగ్యమబ్బిన వారు, "శ్రీ మద్రామాయణం – మందరం" పారాయణ పరులై, తమ పరంపరకు శ్రీ వాసుదాస స్వామి గారి దివ్య స్మృతులను అందించి తరించారు. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని అందరికంటే మొట్ట మొదలు ఆంధ్రీకరించి, పదే–పదే రామాయణ పఠన పాఠన శ్రవణాదుల పట్ల ఆంధ్రులకు అత్యుత్సాహాన్ని కలిగించి, "రామ భక్తి సామ్రాజ్యం" అంటే, ఆంధ్ర దేశమే సుమా, అనిపించిన నిరుపమ రామ భక్తులు వాసుదాస స్వామివారు.

ఇరవైనాలుగు గాయత్రీ మంత్రాక్షరాలలో నిబంధించబడిన మంత్ర మంజూష వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం. మహానుభావులూ, మహా విద్వాంసులూ కీర్తి శేషులు శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు, వాల్మీకి రామాయణాన్ని యధాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందో యతులను ఆయా స్థానాలలో నిలిపి, వాల్మీకాన్ని తెనిగించారు. వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ–పారమ్యాన్నీ, తొలుత నిర్వచనంగా ఆంధ్ర వాల్మీకి రామాయణానికి అందించి, తదనంతరం, "మందరం" అని దానికి విశేష ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆంధ్ర పాఠక లోకం మందరాన్ని అపారంగా అభిమానించింది–ఆదరించింది.

వాసుదాసుగారి కీర్తికి ఆలవాలమైంది ఆంధ్ర వాల్మీకి రామాయణం. ఆంధ్ర భాషలో అంతకుముందు రామాయణానికి యధా మూలాలు లేవని, అర్థ పూర్తి కలిగి, కావ్య–ఇతిహాస గౌరవ పాత్రమై, సర్వజన పఠనీయమై, ప్రామాణికమై,

మూలానుసరమైన రామాయణం తెలుగులో వుండడం లోకోపకారంగా భావించి, రచించించారీ గ్రంథాన్ని వాసుదాసుగారు. ఎనిమిదేళ్లలో రామాయణాన్ని తొలుత నిర్వచనంగా ఆంధ్రీకరించి, అలనాటి కడప మండలంలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామికి అంకితం చేసారు . ఆయన రచించిన నిర్వచన రామాయణం, ఆయన జీవిత కాలంలోనే, నాలుగైదు సార్లు ముద్రించబడింది. ఆంధ్ర వాల్మీకి రామాయణం బాల కాండలో, తన స్వవిషయం గురించి ప్రస్తావిస్తూ వాసుదాసుగారు, సంస్కృత రామాయణాన్ని శ్రీరామచంద్రుడి కుమారులైన కుశ–లవులు లోకానికి ప్రకటించినట్లే, తనకూ ఆయన కుమారుడిగా, అలాంటి అధికారం వుందని, అయితే సంకల్పించడం మాత్రమే తన వంతని–నిర్వహించడం శ్రీరాముడి వంతని, పూర్తిచేయించే భారం ఆయన భుజాలపైనే వేస్తున్నానని, ఆయన వలదన్నా వదలనని చెప్పుకుంటారు.

వాసుదాసుగారు రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి తెలుగులో సరైన వ్యాఖ్యానముంటే, సంస్కృతం రానివారికి చక్కగా అర్థమవుతుందని మిత్రులంటారాయనతో. మూల గ్రంథం రాయడంకంటే వ్యాఖ్యానం రాయడం కష్టమనుకుంటారాయన మొదట్లో. బాగా ఆలోచించిన తర్వాత, (శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం) “మందరం” పేరుతో గొప్ప వ్యాఖ్యానం రాసారు వాసుదాసుగారు. వాస్తవానికి అదొక గొప్ప ఉద్గ్రంథం. సరికొత్త విజ్ఞాన సర్వస్వం.”మందరం”అంటే, క్షీరసాగరాన్ని మథించడంలో కవ్వంగా ఉపయోగించిన మందర పర్వతమే గుర్తుకొస్తుంది సాధారణంగా ఎవరికైనా. కాని, వాసుదాసుగారి శ్రీపాద సంబంధులకు మాత్రం, “మందరం” అంటే, మొదట గుర్తుకొచ్చేది, ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరమే. వాల్మీకి విరచితమైన రామాయణాన్ని శ్రీవారు, “క్షీరవారాసి” గా సంభావించి, దానిని మధించిన తమ “మేథ” అందించిన మకరందాలను–మధురిమలను, ముచ్చటగా “మందరం” అని పేర్కొన్నారు. సహృదయ నైవేద్యంగా–అనుభవైక వేద్యంగా వచ్చిన రచనలకు అసాధ్యంగా–నిగమ గోచరంగా భావించబడిన రామాయణానికి “మందరం” అని నామకరణం చేయడంలో తను కొంతవరకే న్యాయం చేయగలిగానని అంటారాయన. ఇందులోంచి చిలికిన కొద్దీ ఎన్నో దివ్య రసాయనాలు ఉద్భవిస్తాయని, భావితరాలవారు ఇందుకు పూనుకోవాలని కూడా సూచించారు వాసుదాసుగారు.

వాసుదాసుగారు,తాను రచించిన నిర్వచన రామాయణంలో సంస్కృత రామాయణంలో వున్న ప్రతి శ్లోకానికొక పద్యం వంతున రాసారు. మందరంలో తను రాసిన ప్రతి పద్యానికి, ప్రతి పదార్థ తాత్పర్యం సమకూర్చారు. ఒక్కో పదానికున్న వివిదార్థాలను విశదీకరించారు. భావాన్ని వివరణాత్మకంగా విపులీకరించారు. ఆయన మందరాలలోని శ్రీరామాయణ వ్యాఖ్యానంలో "జ్ఞాన పిపాసి" కి విజ్ఞాన సర్వస్వం దర్శనమిస్తుంది. ఇక ఆయన రాసిన నిర్వచన రామాయణంలో సాధారణంగా అందరూ రాసే చంపక మాలలు, ఉత్పల మాలలు, సీస–ఆటవెలది–తేటగీతి–కంద–శార్దూలాలు, మత్తేభాలు మాత్రమే కాకుండా, తెలుగు ఛందస్సులో వుండే వృత్తాలన్నిటినీ, సందర్భోచితంగా ప్రయోగించారు. వాటిలో, "మత్తకోకిలము" , "పంచ చామరం" , "కవిరాజ విరాజితము" , "తరలము" , "ప్రహరణకలిత" , "సుగంధి" , "ఉత్సాహం" , "మనోహరిణి" , "వనమయూరము" , "తోటకము" , "మానిని" , "ఇంద్రవంశము" , "లయగ్రాహి" , "తోదకము" , "మాలిని", "కలితాంతము" , "మధురగతిరగడ", "వనమంజరి", "కమలవిలసితము", "వసంతమంజరి" , "మంజుభాషిణి" , "స్రగ్ధర" , "వసంతతిలక" , "మాలి" , "కరిబృంహితము" , "చారుమతి", "వృషభగతిరగడ", "స్రగ్విని", "మనోరంజని", "తామరసం", "పద్మనాభ వృత్తం", "అంబురుహ వృత్తం", "మందాక్రాంత"లాంటివెన్నో వున్నాయి. ద్విపదలూ వున్నాయి. దండకం కూడా వుందో సందర్భంలో. ఎక్కడ ఎందుకు ఏ విధంగా ఛందో యతులను ఉపయోగించారో కూడా వివరించారు. వీటికి తోడు అనేక వ్యాకరణ విషయాలను అవసరమైన ప్రతి చోటా పాఠకులకు అర్థమయ్యే రీతిలో విపులంగా తెలియచేశారు.

వాసుదాసుగారి ఆంధ్ర వాల్మీకంలోని ప్రతి కాండకొక ప్రత్యేకతుంది. ప్రతికాండ ఒక్కోరకమైన విజ్ఞానసర్వస్వం. ప్రతి కాండలోని, ప్రతి పద్యానికి, ప్రతి పదార్థం ఇస్తూ, చివరకు తాత్పర్యం రాస్తూ, అవసరమైన చోట నిగూఢార్థాలను–అంతరార్థాలను–ఉపమానాలను ఉటంకిస్తూ, సాధ్యమైనంత వరకు ఇతర గ్రంథాల్లోని తత్సంబంధమైన అంశాలను పేర్కొంటారు కవి. ప్రత్యుత్తరం కోరి చదవాల్సిన విషయాలన్నింటికీ సోదాహరణంగా జవాబిస్తారు. శ్రద్ధగా చదువుకుంటూ పోతే–అర్థం చేసుకునే ప్రయత్నం చేసుకుంటూ చదువగలిగితే, ప్రతి కాండలో ఆ కాండ కథా వృత్తాంతమే కాకుండా, సకల శాస్త్రాల సంగమం దర్శనమిస్తుంది. ఒక సారి ధర్మశాస్త్రం లాగా, ఇంకో సారి

రాజనీతి శాస్త్రం లాగా, మరో చోట ఇంకో శాస్త్రం లాగా బోధపడుతుంది. ప్రతికాండ ఒక భూగోళ శాస్త్రం–ఖగోళ శాస్త్రం–సాంఘిక, సామాజిక, ఆర్థిక, సామాన్య, నీతి, సంఖ్యా, సాముద్రిక, కామ, రతి, స్వప్న, పురా తత్వ శాస్త్రం లాగా దర్శనమిస్తుంది. బహుశా, క్షుణ్ణంగా చదివితే, ఇంకెన్నో రకమైన శాస్త్ర విషయాలు గోచరిస్తాయి. అసలు–సిసలైన పరిశోధకులంటూ వుంటే, మందరం ఏ ఒక్క కాండ  మీద పరిశోధన చేసినా, ఒకటి కాదు–వంద పీహెచ్‌డీలకు సరిపోయే విషయ సంపద లభ్యమవుతుంది. డాక్టరేట్ తో పాటు, అద్భుతమైన రహస్యాలు అవగతమౌతాయి. పాదరసం నుండి బంగారం చేసే రహస్యమైన విషయాలలాంటి అనేకమైనవి తెలుసుకోవచ్చు, పరిశోధనా దృక్పదంతో చదివితే. ప్రతి కాండ చివర వాసుదాసుగారు రాసిన ఆఖరు పద్యంలో, ఆ కాండలో వున్న మొత్తం పద్యాలెన్నో తెలియచేసే పంక్తులుంటాయి.

ఆంధ్ర వాల్మీకిరామాయణం రాయడానికి ప్రేరణ–స్పూర్తి, భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన సంకల్పం ద్వారానే తనకు లభించిందంటారు వాసుదాసుగారు. పోతనను కరుణించిన శ్రీరామచంద్రమూర్తి, ఆయనతో భాగవతాన్ని తెనిగింపచేసి భవ బంధ విముక్తుడిని చేసాడని, అందుకే, పలుకుపలుకులో తేనెలొలికించి, వ్యాస భాగవతాన్ని మరిపించగలిగాడని వాసుదాసుగారి అభిప్రాయం. ఆ విధంగానే, శ్రీరాముడి కరుణ తనపైన కూడా ప్రసరించిందని వాసుదాసుగారు భావించి వుండాలి. తద్రూపమే ఆంధ్ర వాల్మీకం. వాల్మీకాన్ని ఆమూలాగ్రంగా పరిశోధించిన పరమ భాగవతోత్తముడు వాసుదాసస్వామి.108సార్లు వాల్మీకి సంస్కృత రామాయణాన్ని పఠించి–పారాయణం చేసి, పట్టాభిషేకాలు, సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించిన ఏకైక మహానుభావుడు వాసుదాసస్వామి.

తనకంటే ముందు కాలం నాటి పూర్వ కవులెవరు, రామాయణాన్ని (పూర్వ కాండలు, ఉత్తర కాండ కలిపి) సంపూర్ణంగా తెనిగించలేదని గ్రహించిన వాసుదాసుగారు, అన్ని కాండలను తెనిగించి, విశేషించి తెలుగు పాఠక లోకానికి ఆవిష్కరించాలని సంకల్పించుకున్నారు."వాల్మీకిరామాయణాన్ని సమగ్రంగా, యథామూలంగా పలికినవారు పూర్వ కవులందూ–నేటి (ఆయన కాలం నాటి) కవులందూ లేరు. నేటి (ఆయన కాలం నాటి) రామాయణాలలో మూలానుసరణంగా వుంది, సమగ్రం కాదు. సమగ్రమయింది మూలాను సరణం కాదు. తమ అభిప్రాయాలను, ఇతరుల అభిప్రాయాలను మూలంగా

చేర్చిపెడితే, అది వాల్మీకి పలికిందెలా అవుతుంది?" అని ప్రశ్నించాడు వాసుదాసుగారు.

భగవత్ చరిత్రలెన్నో వుండగా రామాయణ రచనకే ఎందుకు పూనుకున్నావని అడిగినవారికి తనదైన శైలిలో జవాబిచ్చారు వాసుదాసుగారు. జనన-మరణ రూపకమైన సంసార బంధం నుండి విముక్తి చేసేది రామ కథేనని, భగవత్ సాయుజ్యం పొందేందుకు రామాయణ రచన చేసానని అంటారాయన. పూర్వం కొందరు రాసారుకదా, మరల ఎందుకు రాస్తున్నావంటే, "ఎవరి పుణ్యం వారిదే. ఒకరి పుణ్యం మరొకరిని రక్షించదు" అని జవాబిస్తూ, శ్రీరాముడి అనుగ్రహం కొరకు రామాయణాన్ని రచించి వాగ్రూపకైంకర్యం చేయదల్చానంటారు వాసుదాసుగారు. భారద్వాజ గోత్రీకుడు, ఆపస్తంబ సూత్రుడు, గోల్కొండ వ్యాపారి శాఖీయుడయిన వావిలికొలను సుబ్బరావుగారు, కడప జిల్లా-జమ్మలమడుగులో 1863 లో జన్మించి 1939 లో పరమపదించారు. ఎఫ్.ఎ చదువు పూర్తిచేసి, పొద్దుటూరు తాలూకా కార్యాలయంలో చిరుద్యోగిగా చేరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హోదాకెదిగారు. ఆ విధంగా 1893-1904 మధ్య కాలంలో పదకొండేళ్లు రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసారు మొదట్లో. కందుకూరి వీరేశలింగం పంతులు గారి తర్వాత, మద్రాస్ (నేటి చెన్నై) ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్ర పండితులుగా 1904-1920 మధ్య కాలంలో పనిచేసారు. వాసుదాసుగారి తర్వాత ఆ పదవిని అలంకరించింది అక్కిరాజు ఉమాకాంతం గారు. కళాశాలలో చేరక ముందే, పినతండ్రి మీద తనకున్న కృతజ్ఞతకు గుర్తుగా, "శ్రీ కుమారాభ్యుదయం" అనే ప్రబంధ గ్రంథాన్ని రచించి, ఆయనకు అంకితమిచ్చి శాశ్వత స్వర్గ సుఖాన్ని కలిగించారాయనకు. ఆయన రచించిన ఆ ప్రబంధం, నాటి కవి పండితులను ఆశ్చర్య పరిచింది. ఆయన ప్రతిభకది తొలి హారం.

ఆంధ్ర పండితుడిగా పనిచేస్తున్న రోజుల్లోనే, భార్యా వియోగం కలగడంతో, వాసుదాసుగారు భక్తి-యోగ మార్గం పట్టారు. జీర్ణ దశలో వున్న ఒంటిమిట్ట రామాలయాన్ని సముద్ధరించాలన్న సంకల్పంతో, బిక్షాటనచేసి లభించిన ధనంతో ఆలయాన్ని అభివృద్ధి చేసారు. ఆంధ్ర వాల్మీకి రచనాకాలం 1900-1908 మధ్య కాలంలో. గాయత్రీ మంత్రం, రామ షడక్షర మంత్రం మూలంలో వున్నట్లే, అనువాదంలో కూడా నిక్షిప్తం చేసారాయన. వాల్మీకంలో వున్న బీజాక్షరాలన్నీ, ఇందులోనూ యథాస్థానంలో చేర్చబడ్డాయి. విడిగా

వాసుదాసుగారు, గాయత్రీ రామాయణం, శ్రీరామనుతి కూడా రాసారు. ఆంధ్ర వాల్మీకం అనువాదమైనా, స్వంత రచన–స్వతంత్ర రచన అనిపించుకుంది.

వావిలికొలను సుబ్బరావుగా పండిత పదవీ విరమణ చేసిన అనంతరం, తన జీవితమంతా, భక్తి మార్గంలోనే గడిపారు. ఈ నాటికీ క్రమం తప్పకుండా గుంటూరు జిల్లా తెనాలి దగ్గరున్న అంగలకుదురు నుంచి ప్రచురించబడుతున్న "భక్తి సంజీవని" అనే భక్తి–జ్ఞాన–కర్మ యోగాలను తెలిపే ఆధ్యాత్మిక మాసపత్రిక సంస్థాపక సంపాదకులుగా–వాసుదాసుగా–ఆంధ్ర వాల్మీకిగా–కవి సార్వభౌమగా ప్రసిద్ధికెక్కారు. అంగలకుదురులోని శ్రీ కోదండ రామ సేవక ధర్మ సమాజం స్థాపించింది ఆయనే. కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయాన్ని పునరుద్ధరించి, ఈ నాటికీ దర్శనీయమైన రీతిలో శాశ్వత కైంకర్యం చేసిన వాసుదాసుగారు, వాఙ్మయ ప్రపంచంలోని భక్త కవులలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు."సత్కవి మిత్రుడను" అని చెప్పుకున్న ఆయనకు, తిరుపతి వేంకటకవులు, కొక్కొండ వేంకట రత్నం పంతులు, వేదం వేంకటరాయ శాస్త్రులు మొదలైన ప్రసిద్ధ కవులందరూ స్నేహితులే.

వాసుదాసుగారు "కౌసల్యా పరిణయం" అనే ప్రబంధం, "సుభద్రా విజయం" అనే నాటకంతో పాటు, "హిత చర్యలు", "ఆధునిక వచనరచనా విమర్శనం", "పోతన నికేతన చర్చ", "పోతరాజు విజయం", "రామాశ్వమేథం", ఆంధ్రవిజయం" కూడా రాసారు."ఆర్యకథానిధులు" అన్న పేరుతో ఆయన రాసిన సులభ వచన గ్రంథాలు తెలుగువారందరికి అత్యంత ఆదరణీయమైనాయి."సులభ వ్యాకరణం" తెలుగు వ్యాకరణాన్ని నిజంగానే సులభం చేసింది. ఆయన రచించిన "కృష్ణావతార తత్వం" ప్రశస్త కృతిపాండిత్యంతో, ఆధ్యాత్మిక భావనతో, పాఠకులలో ఆంధ్ర భాషాభిమానాన్ని ఉద్దీపించచేసి–తాను తరించి, ఇతరులను తరింపచేసిన ధన్యాత్ముడు, మహామనీషి వావిలికొలను సుబ్బరావుగారు.

ఆంధ్ర వాల్మీకిరామాయణం తర్వాత రచించబడిన పలు గద్య–పద్య రామాయణాలకు విశేషప్రాచుర్యం లభించినా, ఆ రోజుల్లోనూ–ఈ రోజుల్లోనూ, వాసుదాసుగారి రామాయణానికి ప్రాచుర్యం లభించినా తగినంత గుర్తింపు ఎందుకు లభించలేదనేది జవాబు దొరకని ప్రశ్న. "ఆదికవి–ఆంధ్ర వాల్మీకి", యథాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందోయతులను ఆయా స్థానాలలో

నిలిపి తెనిగించిన వాల్మీకానికి రావాల్సినంత మోతాదులో, ఎందుకు గుర్తింపు రాలేదు? వ్యాస మహాభారతాన్ని మొదట తెనిగించిన నన్నయను "ఆదికవి" గా పిలిచినప్పుడు, వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా పూర్వ కాండలతో కలిపి ఉత్తర కాండను కూడా మొట్టమొదట తెనిగించిన వాసుదాసుగారు కూడా "ఆదికవే" కదా? నన్నయంతటి గొప్పవాడే కదా. వాస్తవానికి సరైన పోషకుడో–ప్రాయోజకుడో వుండి వుంటే, వాసుదాసుగారి ఆంధ్రవాల్మీకిరామాయణం, ఎప్పుడో–ఏనాడో నొబెల్ సాహిత్య బహుమతికో, జ్ఞానపీఠ పురస్కారానికో నోచుకుని వుండేది. ఏ మాత్రం మన తెలుగువారు ప్రయత్నం చేసినా, ఆ మహానుభావుడికి భారతరత్న–జ్ఞానపీఠ ఆవార్డులతో పాటు నొబెల్ బహుమానం వచ్చేది. ఇప్పటికైనా ఆ ప్రయత్నం చేస్తే మంచిదేమో.

వాసుదాసుగారు ఆంధ్ర వాల్మీకిగా లబ్ధ ప్రతిష్టులయ్యారు. మహనీయమైన "మందర" రామాయణాన్ని అనేకానేక విశేషాలతో, పద్య–గద్య–ప్రతి పదార్థ–తాత్పర్య–ఛందోలంకార విశేష సముచ్చయంతో, నిర్మించి, వేలాది పుటలలో మనకందించారు. రామాయణ క్షీర సాగరాన్ని "మందరం" మథించి, మనకందరికీ ఆప్యాయంగా అందించింది. అయితే, దానిని ఆస్వాదించే తీరికా–ఓపికా లేని జీవులమైపోయాం మనం. భాష, శైలి, అర్థం, తాత్పర్యం కాలక్రమంలో పరిణామం చెందుతున్నాయి. "సూక్ష్మంలో మోక్షం" కావాలంటున్నారు నేటి తరం పఠితులూ, పండితులూ.

కాలం గడిచిపోతున్నది. వాసుదారుగారు మారిపోతున్న తరాలకు గుర్తురావడం కూడా కష్టమైపోతున్నది. వారి "ఆర్యకథానిధుల" తోనూ, "హితచర్యల" పరంపరలతోనూ, పరవశించిపోయిన ఆ నాటి తెలుగు పాఠక మహనీయులు క్రమంగా తెరమరుగవుతున్నారు. మళ్లీ–మళ్లీ జ్ఞాపకం చేసుకోవాల్సిన, మరువలేని మహనీయుడు, ప్రాతఃస్మరణీయుడు వాసుదాసస్వామి.

నారాయణా! కరుణా!

ధీనా! దీనార్తిహరణ ధీమజ్జనర
క్షానియా! యపపర్గ వి
ధానక్షమ! యొంటిమిట్ట దశరథరామా!
మందరం..వ్యాఖ్యానారంభం
శ్రీరామచంద్ర ప్రభో పాహి పాహి.

# రామాయణంలో ఏముంది..

## ఆంధ్ర వాల్మీకి రామాయణం ఎందుకు చదవాలి?

## శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణానికివాసుదాసుగారి పీఠిక

శ్రీ రామాయణం, భారతం, భాగవతం అద్వితీయమైన గీర్వాణ భాషా గ్రంథాలు. వేద వేదాంత అర్థోపబృంహితంబులు. ఈ మూడింటి లో ఆద్యమైంది శ్రీ రామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రధమంగా ఉత్పన్నమైంది కావడంతో ఆదికావ్యమైంది. శ్రీమద్రామాయణం–ఉత్తర కాండ 94వ సర్గలో చెప్పినట్లు రామాయణాన్ని చక్కగా తెలిసినవారు–అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. (రామాయణ తత్వాన్ని తనకు తెలిసినంత వరకు ఆంధ్ర వాల్మీకంలో చెప్ప సాహసించానని, తన ఆ సాహసానికి క్షమించమని వాసు దాసు గారు పాఠకులకు విజ్ఞప్తి చేశారు).

మన పూర్వీకులకు తెలియని నాగరికతలు లేవు. మన పూర్వులు ఏ కారణం వల్ల ఆర్యులయ్యారు? వారు ఎటువంటి గుణాలు కలిగి, ఎటువంటి మహోన్నత స్థితిలో వుండే వారు? వారి నాగరికత విధానం ఎటువంటిది? వారి కులా చార ప్రవర్తనలెలావుండేవి? రాజుకు–ప్రజలకు మధ్య ఐకమత్యం ఎలా వుండేది? భార్యా–భర్తలు, సోదరులు, తల్లి తండ్రులు, పుత్రులు పరస్పరం ఎలా ప్రవర్తించేవారు? సుఖ–దుఃఖాల విషయంలో స్త్రీ–పురుషులు ఏ విధమైన నడవడి గలవారు? వారికి దేవుడంటే ఎలాంటి ఆలోచన వుండేది? దైవాన్ని వారెలాఆరాధిస్తుండేవారు? ఇలాంటిలౌకికవిషయాలనుతెలుసుకోవాలనుకునే వారికి శ్రీ రామాయణాన్ని మించి తెలిపే గ్రంథం ఎక్కడా లేదు.

జనన మరణ చక్ర బంధంలో ఇరుక్కొని, పరిభ్రమిస్తూ, ఆ బాధ తొలగించుకునేందుకు పారలౌకిక చింత కలిగి, నిరామయమై–నిత్యమై–నిర్మలమైన పరమపదానికి పోవాలనుకునే కోరికగల వారికి, కరతలామలకంగా సుఖమైన మార్గాన్ని బోధించగల గ్రంథం శ్రీ రామాయణం తప్ప మరొకటి లేదు. కాలక్షేపానికి చదవడానికైనా శ్రీ రామాయణం లాంటి పుస్తకం ఇంకోటి లేదు. ఏ విధంగా చదివినా, చదివిన తర్వాత, సమయాన్ని సద్వినియోగం చేశామన్న తృప్తినిచ్చేది రామాయణమే. శ్రద్ధా భక్తులతో చదివినవారికి కల్పవృక్షంలా కోరిన కోరికలు తీర్చేదీ రామాయణమే. కాబట్టి, ఇహ–పర లోకాల్లో సుఖపడాలనుకునేవారికి, శ్రీ రామాయణ పఠనం అవశ్య కర్తవ్యం.

భరత ఖండంలో శైవులని, వైష్ణవులని, శాక్తేయులని భిన్న మతాల వారున్నారు. అయితే వీరిలో కొందరు వైష్ణవులకు శైవుడంటే ఇష్టం లేకపోవడం, అలానే నారాయణుడి పేరంటే నే ముఖం చిట్లించుకునే శైవులుండడం అందరికీ తెలిసిందే. ఐనప్పటికీ, శ్రీ సీతారాముల పేరు విన్న ప్రతి ఆర్యుడు మనస్సులోనైనా భక్తితో నమస్కారం చేసుకోవాల్సిందే. ఇలా సీతారాములు సార్వజనీన సంపూజ్యులు కావడానికి కారణమేంటి? హరిశ్చంద్రుడి లాంటి సత్యాత్ములు, ధర్మరాజు లాంటి ధర్మాత్ములు, దమయంతి–సావిత్రి లాంటి పతివ్రతలు లేరా? వారి మీద ఎంత గౌరవం వున్నా లోకులు వారిని పూజించడం లేదే? మరి, సీతారాములలో విశేషమేమిటంటే, వారు అవతార మూర్తులు కావడమే! ఎవరెవరు–ఏ ఏ పేరుతో పిలిచినా, భగవంతుడనేవాడు ఒక్కడే అని ఆర్యుల నమ్మకం. భిన్న–భిన్న రూపాల్లో దర్శనమీయుడం భగవత్కళా విశేషం. అలాంటి భగవంతుడే, శ్రీరాముడుగా, లోక రక్షణార్థం జన్మించాడన్న నమ్మకమే, లోకులందరు ఒకేవిధంగా శ్రీ సీతారాములను అర్చన చేయడానికి కారణమైంది. ప్రత్యక్షానుభవమున్న భక్తులే దానిలోని గూఢార్థాన్ని వెల్లడిచేయగల సమర్థులు–శక్తిమంతులు. అలాంటివాడైన వాల్మీకి మహర్షి ఆ అవతార రహస్యాన్ని, తాను గ్రంథస్థం చేసిన శ్రీ రామాయణంలో, "కంఠోక్తి ఘోషించినాడు".

"శ్రీ రామాయణం" అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన శ్రీరామ చరిత్రనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్రనీ అర్థం. దంపతుల మాదిరిగా, వారి "అభిధానంబులు అనపాయంగా" వుండినట్లే, తత్త్వమెరిగిన మహాత్ముడు వాల్మీకి మహర్షి, తను రచించిన ఆది

కావ్యానికి శ్రీ రామాయణం అనిపేరు పెట్టాడు. ఇందులో సీతాదేవి మహాత్మ్యాన్ని విశేషించి చెప్పడంవల్ల వాల్మీకి మహర్షే, శ్రీ రామాయణాన్ని "సీతాయాశ్చరితం మహత్తు" అని వెల్లడిచేశాడు. ఈ చిత్రం గ్రంథం పేరులోనే కాకుండా, గ్రంథమంతా కనపడుతుంది. శ్రీరామచంద్రుడు మనుష్యుడివలె నటిస్తుంటే, వాల్మీకే మో వాస్థవార్థం చెప్తూ, ఆయన సాక్షాత్తు భగవంతుడే అంటాడు. రాముడి చర్యల ద్వారా, రాముడి వాక్కుల ద్వారా తాను చెప్పదల్చుకున్న దాన్ని సిద్ధాంతీకరించాడు వాల్మీకి. శ్రీరాముడు భగవంతుడేనన్న అర్థం, హారంలోని సూత్రంలాగా, రామాయణంలోని ఏడు కాండల్లోనూ వ్యాపించి వుంది. రామాయణాన్ని చదివేవారందరు, ఈ అర్థాన్ని మనస్సులో పెట్టుకొని, ఇందులోని ప్రతి అంశాన్ని-ప్రతి వాక్యాన్ని హెచ్చరికతో శోధించాలి. ఇలా ఆసక్తిగా శోధించిన వారికి-పరీక్షించిన వారికి మాత్రమే, వాల్మీకి రామాయణానికి-ఇతర రామాయణాలకు (ఆ మాటకొస్తే, ఏ భాషలో వున్న ఏ గ్రంథాలకు) గల తారతమ్యం, వాల్మీకి రామాయణంలోని గొప్పదనం తెలుస్తుంది. కవి హృదయాన్ని తెలుసు కోకుండా, ఆయన శైలిని అనుసరించకుండా చదివినవారికి, అందులోని సారాన్ని అర్థంచేసుకోలేక , ఆ శక్తి హీనతను వాల్మీకి దోషంగా భ్రమించి సంతోష పడవచ్చు.

శ్రీ రామాయణం మహాకావ్యం. పుట్టుకతోనే కాకుండా గుణంలో కూడ అదే మొదటిది. దానిలోని గుణాలు, రహస్యాలు తెలుసుకోవాలంటే వాల్మీకికి గాని, సర్వజ్ఞుడికి గాని మాత్రమే సాధ్యమవుతుంది. అనంత కల్యాణ గుణ విశిష్టుడైన భగవంతుడిని, దయావంతుడని-సర్వజ్ఞుడని-సర్వ శక్తిమంతుడని, ఏవో కొన్ని గుణాలు వర్ణించి సంతసించడానికి, రామాయణం చదివిన వారు, వారి వారి శక్తికొలది కొన్ని గుణాల వరకు అర్థంచేసుకోవచ్చు. వాస్తవానికి, అర్థం చేసుకునే ప్రయత్నం చేసినా కొద్దీ, శ్రీమద్రామాయణంలో ఉత్తమోత్తమ మహాకావ్య లక్షణాలెన్నో వున్నాయి. వర్ణనలెన్నో వున్నాయి. రామాయణం గానం చేసినా, పఠించినా మనోహరంగా వుంటుంది. లోకంలో కొన్ని కృతులను పాడుతుంటే శ్రావ్యంగా వుంటాయి గాని, మామూలుగా చదువుతుంటే, నీరసంగా అనిపిస్తాయి. కొన్నేమో, చదవడానికి ఇంపుగా వున్నా, రాగానికి-తాళానికి అనువుగా వుండవు. రామాయణం అలాంటి కోవకు చెందింది కాదు. చదివినా, పాడినా మధురమే. ఆ విషయం గ్రంథంలోనే వుంది. ఆ ప్రకారమే కుశ లవులు పాడారు కూడా.

రామాయణంలో శృంగారం లాంటి నవ రసాలున్నాయి. అందులో శృంగార రసం "సంభోగ శృంగారం". సీతారాముల కల్యాణం తర్వాత అయోధ్యలో వారు అనేక ఋతువులు ప్రియంగా గడిపిన వర్ణన ఉదాహరణగా తీసుకోవచ్చు. భార్యా భర్తల పరస్పర అనురాగం ఇంతకన్నా మించి వర్ణించడం ఎవరితరం కాదు. వాల్మీకి శ్లోకాల (ఆంధ్ర వాల్మీకి పద్యాల) భావం మాత్రమే కాకుండా, అందులోని కొన్ని పదాలు ఎంత అర్థ గాంభీర్యం గలవిగా–రసవంతంగా వుంటాయో చెప్పలేము. వాల్మీకి వాక్యామృత రసాన్ని నిరంతరం ఆస్వాదన చేసిన భవభూతి వర్ణించినట్లు ఇందులో హాస్యం (శూర్పణఖ–త్రిజటల వృత్తాంతం), కరుణ (ఇష్ట వియోగం వల్ల అనిష్ట సంభవం, దశరథుడి చావు), వీర (లక్ష్మణుడి వృత్తాంతం), రౌద్రం (రావణుడి వృత్తాంతం), భయానక (మారీచాది వృత్తాంతం), బీభత్సం (కబంధ–విరాధుల వర్ణన), అద్భుతం (రావణ యుద్ధంలో), శాంతం (శబరి వృత్తాంతం) రసాలను కనుగొన వచ్చు.

ఇక అలంకారాల విషయానికొస్తే, శబ్దాలంకారాలని, అర్థాలంకారాలని రెండు రకాలున్నాయి. రామాయణంలో శబ్దాలంకారాలు తరచుగా కనబడవు. అంత్యానుప్రాసలు కొన్ని చోట్ల వున్నాయి. శ్రీమద్రామాయణం స్వభావోక్త్యలంకారాలకు పుట్టిల్లు. స్వభావోక్తులు దేశకాలవక్తృ స్వభావాలను అనుసరించి చెప్పబడ్డాయి. వర్షాన్ని వర్ణన చేసిన సందర్భంలో మన ఎదుట వర్షం కురుస్తున్నట్లే వుంటుంది. హేమంతాన్ని వర్ణిస్తుంటే, మనకు మంచులో తడుస్తున్నామా అనిపిస్తుంది. అడవులలో జరిగినవి, మనమెప్పుడూ చూడనివి–విననివి చదువుతుంటే, మన కళ్లకు కట్టినట్లే వుంటుంది. తన వర్ణనా చాతుర్యంతో వాల్మీకి, పాఠకులను, తన చేతిలో బొమ్మలా చేసి, ఇష్టమొచ్చినట్లు ఆడుకుంటాడు. ఆయన ఏ విషయాన్ని వర్ణించినా అది మన కళ్ల ఎదుట జరిగిన భావం కలుగుతుంది. ఇక ఉపమాన అలంకారాల విషయానికొస్తే, వాల్మీకి కాళిదాసుకే గురువనిపిస్తాడు. రావణ వధానంతరం రాముడు సీతతో అన్న మాటలకు అర్థం వెతుకుతే, ఆ ఉపమానంలో, సీత నిర్దోషురాలనీ–శంక అనే దోషంతో బాధ పడినవాడు రాముడనీ స్పష్టంగా తెలుస్తుంది. అలానే, రావణుడు సీతను అపహరిస్తున్నప్పుడు రాసిన శ్లోకం కూడా. దానర్థం: సీత లోకమాత అయినందున ఆమెను రావణుడు పట్టుకోవడం తల్లిని పట్టుకోవడమంత మహా ఘోరమైన కార్యమని. ఇంద్రజిత్తు మరణం తర్వాత వాడి సేనలకు పట్టిన గతిని

వర్ణిస్తూ రాసిన శ్లోకం మరో చక్కటి ఉదాహరణ.

వాల్మీకి మరో ప్రత్యేకత "ఉత్ప్రేక్ష". లంకలో– అశోక వనంలో ఒక "వంక" పారుతుంటుంది. దాని తీరంలో వున్న చెట్ల కొమ్మలు నీళ్లలో వేలాడుతుండడం వల్ల, నీరు వెనక్కు పోతుంటుంది. ఈ సామాన్య విషయాన్ని వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) ఎలా ఉత్ప్రేక్షించినాడో చదివి తీరాల్సిందే. "ఆ పర్వతం పైనుండి కిందకు పారుతున్న సెలయేరు, చూడడానికి, మగడి తొడపై నుండి కోపంతో దిగిపోతున్న స్త్రీలా వుంది. వేలాడుతున్న కొమ్మలు ప్రవాహాన్ని అడ్డగించడంతో, వెనుదిరుగుతున్న నీటి కదలిక సన్నివేశం, బంధువుల బుజ్జగింపులకు సమాధానపడి–శాంతించి, మగడి వద్దకు మరలిపోతున్న ఆడదానిలా వుంది" అన్న అర్థం వస్తుంది ఆ శ్లోకానికి–పద్యానికి. అలానే ఆయన వాడిన శ్లేషాలంకారాలు.

శ్లేషాలంకారానికి చక్కటి ఉదాహరణ వాల్మీకి నోట వెలువడిన ప్రథమ శ్లోకం.

*"మానిషాద ప్రతిష్ఠాం త్వ! మగ మ శ్శాశ్వతీ స్సమాః*
*యత్క్రౌంచ మిథునాదేక! మవధీః కామమోహితం"*

వేదాన్య విషయంలో కలిగిన ఈ ఆదిమ శ్లోకానికే నిషాద పరంగా ఒక అర్థం, భగవత్ పరంగా రెండో అర్థం వున్నాయి.ఆంధ్ర వాల్మీకంలో దీన్ని ఇలా పద్యంగా మలిచారు కవి.

*"తెలియు మా నిషాదుండ ప్రతిష్ఠ నీక*
*ప్రాప్తమయ్యెడు శాశ్వతహాయనముల*
*గ్రౌంచ మిథునంబునందు నొక్కండు నీవు*
*కామమోహిత ముం జంపు కారణమున"*

"ఒక బోయవాడు క్రౌంచ మిథునంలో వున్న మగ పక్షిని చంపడం, ఆడ పక్షి అది చూసి దుఃఖించడం, పరమ దయామయుడైన వాల్మీకి అది చూసి, బోయవాడు చేసిన అధర్మ కార్యానికి కోపగించి అతడిని ఈ శ్లోకంలో శపించడంజరిగింది. ఇదే రామాయణ ఉత్పత్తికి కారణమైన శ్లోకం కావడంతో నాంది శ్లోకం అయింది. కాబట్టి దీనికి భగవత్ పరంగా ఒక అర్థం వుంది. రామాయణంలోని ఏడు

కాండల అర్థం–కథ ఇందులో సూక్ష్మంగా సమర్థించబడింది.

లక్ష్మణుడు రాముడితో అరణ్యాలకు వెళ్లే ముందర తల్లికి నమస్కారం చేసినప్పుడు, సుమిత్రా దేవి కుమారుడికి చేసిన బోధనను తెలియచేసే శ్లోకానికి పండితులు అనేక అర్థాలను చెప్పారు. అందులో సార్వజనీన సమ్మతమైనవి–ప్రధానమైనవి మూడర్థాలు. సంగ్రహంగా అవి:

**మొదటిది**: "ఇదివరకు నీవు రాముడికి కుడిచేతిలా, వెలుపల ప్రాణంలా వుండేవాడివి. ఆ భక్తితోనే ఇప్పుడు ఆయన వెంట అడవులకు పోతున్నావు. ఇదివరకు రాముడు మహారాజ కుమారుడు. పట్టణంలో అనేక భోగాలను అనుభవిస్తుండే వాడు. నువ్వూ అలానే సుఖానికి హాని లేకుండా అన్నను కొలుస్తుండే వాడివి. ఇక మీద అలా కాదు. చేయబోయేది సకల దుఃఖ నిలయ కాననవాసం. అదికూడా ఒక రోజు కాదు. 14సంవత్సరాలు. పరివారంతో కాదు–ఒంటరిగా. నువ్వే పరిచారకుడవు. అలాంటి కష్ట కాలంలో నీకు విసుగు కలగవచ్చు. జ్ఞాత వెంట నేనెందుకు కష్టాల పాలు కావాలని అనుకుంటావేమో. అలా భావించ వద్దు. అడవిలో వున్నా, పట్టణంలో వున్నా, ధనికుడైనా, దరిద్రుడైనా తండ్రి ఎలా పూజనీయుడో, పితృసమానుడైన రాముడలానే. తండ్రిమీద ఎలాంటి గౌరవం వుంచాలో అలాంటిదే శ్రీరాముడి మీదుంచు. అలానే, నామీద నీకెలాంటి గౌరవం వుందో అలాంటిదే సీత మీదుంచు. అడవిని దుఃఖాలయంగా భావించ వద్దు. సుఖమైన అయోధ్యగా భావించు. సుఖ దుఃఖాలు మనఃకల్పితాలు. నీ మనస్సు నీ వశంలో వుంటే ఎక్కడున్నా నీకు సుఖ దుఃఖాలు సమానమే".

**రెండోది**: అదే "రాముడ యెరుంగుమీ దశరథుడు నిజము" అన్న సుమిత్ర మాటలకు మరో అర్థం రాముడు అడవులకు పోయిన తర్వాత ఆయన తండ్రి జీవించడని–అది నిజమని. "నీ తండ్రి ఎప్పుడు మరణించునో అప్పుడు నా గతేంటి? ఇక్కడే మో కైక ప్రభుత్వం. ఆమెకు నా మీద ద్వేషమన్న సంగతి నీకు తెలిసిందే. నీ తండ్రి లేకుండా, రాముడు లేకుండా, నువ్వూ లేకుండా నన్ను కైక ఇక్కడ వుండనిస్తుందా? కాబట్టి నేను పుట్టిల్లు చేరాల్సినదాన్నే. అక్కడ నాకు ప్రతిష్టేముంటుంది? దశరథుడి భార్య అన్న గౌరవం నశించింది. అక్కడివారు మన రాజు కూతురు పుట్టింటికి వచ్చిందని నన్ను–నా తండ్రిని చులకనగా అంటారు. అలాంటప్పుడు అయోధ్య గతి ఏమందువా? అయోధ్యే అడవి కాగలదు"

**మూడోది**: "కుమారా–నేనెందుకు జ్ఞాతైన రాముడి వెంట అడవికి పోయి ప్రాణాపాయానికి లోనుకావాలనీ, నన్నెవ్వరు పొమ్మన్నారనీ, నాకై నేను చెట్టు కొట్టి మీద వేసుకొనడమెందుకనీ, నేను పోతే కలిగే లాభమేమిటనీ, పోకపోతే నష్టమేంటనీ సందేహిస్తున్నావేమో ! అలాంటి ఆలోచనలు చేయవద్దు. లక్ష్మీనారాయణులుండే స్థలమే వైకుంఠం. అడవియే వైకుంఠం. అలాంటి ఏకాంత సేవ దొరకడం దుర్లభం. కాబట్టి–నాయనా, తదేక ధ్యానంతో భగవత్ సేవను అరణ్యంలో చేసుకో" అని బోధించెను.

ఇలా నానార్థాల పద్యాలను అన్వయించేందుకు ఆంధ్ర వ్యాకరణ సూత్రాలను సమయోచితంగా అనుసంధానం చేసుకోవాలి.

అలంకార శాస్త్రంలో ఎన్ని అలంకారాలు చెప్పబడ్డాయో, అవన్నీ వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి)రామాయణంలో వున్నాయి. వాల్మీకి అసమాన కవితా చాతురి వర్ణనాతీతం. మరొక్క ఉదాహరణ చిత్రాలంకార ఉపయోగం. రావణుడు సీతాదేవిని అపహరించిన తర్వాత, శ్రీరాముడు ప్రియా వియోగానికి దుఃఖిస్తూ, అడవిలో జనులెవ్వరూ వుండకపోవడంతో, కళ్లకు కనిపించే పక్షి–వృక్ష–మృగాలను సంబోధించుకుంటూ పోతూ–పోతూ, రావణుడు జటాయువుతో యుద్ధం చేసిన స్థలానికి సమీపంలో వున్న ప్రస్రవణగిరిని చూస్తాడు. చూసి " ఓ పర్వత రాజా ! నా వల్ల ఒంటరిగా, రమ్యమైన ప్రదేశంలో విడువబడిన సర్వాంగ సుందరైన సీత నీ చేత చూడబడెనా" అన్న ప్రశ్న వేసిన శ్లోకం (పద్యం) చక్కటి చిత్రాలంకారం. వృక్షాలకు–నదులకు వలె కాకుండా, కొండలకు ప్రతిధ్వని ఇచ్చే గుణం వుంది. దీన్ని మనస్సులో పెట్టుకున్న కవి ఈ శ్లోకాన్ని (పద్యాన్ని) రచించారు. ప్రతిధ్వనిలో మనం అన్న మాటలే మనకు తిరిగి వినపడ్తాయి. "నీవు చూశావా?" అంటే "నీవు చూశావా?" అని ప్రతిధ్వని వస్తుంది. అలా వినబడిందని రాస్తే సారస్యం లేదనుకున్న వాల్మీకి ప్రతిధ్వనిగా వినపడిన శ్లోకాన్ని " ఓ రాజ శ్రేష్టుడా ! రమ్యవనదేశమందు నీ చేత ఒంటరిగా విడువబడిన సర్వాంగ సుందరి నా చేత చూడబడె" అనిఅర్థం వచ్చే ట్లు రాశారు. ఇలా ప్రశ్న–జవాబు ఒక్క వాక్యంగానే వుంటే చిత్రాలంకారం అవుతుంది. ఇంత దీర్ఘంగా ఊహించి రాసిన కవి ఇంతవరకూ ఒక్క వాల్మీకే. అలంకారాల వరకెందుకు? సాధారణ విషయాన్ని చెప్పాల్సి వచ్చినప్పుడు కూడా ఏదో ఒక చమత్కారాన్ని కనబరిచేవాడు.

వాల్మీకి రామాయణంలోని పాత్రలు–పాత్రధారుల వాక్కులు, ఆయా పాత్రల చిత్త వృత్తి గుణాలను తెలియచేసేవిగా, సందర్భోచితంగా, వారున్న అప్పటి

స్థితికి అర్థమైనవిగా వుంటాయి. దశరథుడి మృతి గురించి కైక భరతుడికి చెప్తూ, “ఎల్ల భూతములకు నెయ్యదిగతి నీదు తండ్రి యట్టిగతికి దనయ యరిగె" అని అంటుంది. తానేదో ఘనకార్యం సాధించినట్లు కైక చెప్పిన పద్ధతిలో, తన భర్త చావు గురించి, తన కుమారుడితో ఏ తల్లైనా చెప్తుందా? ఇదే వాల్మీకిలోని ప్రత్యేకత. ఇదే వార్తను భరతుడు శ్రీరాముడితో మరోలా చెప్తాడు. "నిను దలంచియ యేడ్చుచున్.... ..... నీదు దర్శన కాంక్షియై..... ..... జనకు డక్కట యస్తమించెను జాల నిన్నె స్మరించుచున్" అని దీనోక్తిగా అంటాడు. వినాశ కాలానికి నోటినుంచి విపరీత వాక్యాలే వస్తాయి. శుభ వాక్యాలు, అశుభ వాక్యాలుగా అవుతాయి.

మరో సందర్భంలో, మొట్టమొదట వానరుల మీదకు యుద్ధానికి పొమ్మని ధూమ్రాక్షుడుని ఆజ్ఞాపించాడు రావణాసురుడు. ఆజ్ఞాపిస్తూ, “నీవు వధార్థమై మదవ నేచరయుక్తుడు రాముమీదికిన్" అంటాడు. రావణుడి కోరిక రామాదులను చంపటానికే అయినా, “నువ్వు చావడానికి" అన్న విపరీతార్థం వచ్చింది ఆయన మాటల్లో. శ్రీరామచంద్రుడు ఎలా "ఆత్మవంతుడో" అలానే కుంభకర్ణుడు "వపుష్మంతుడు". అతడిది సహజ శక్తి. వరబలం కాదు. కేవలం దేహం మీదే దృష్టి నిలిపేవాడి కుండే పెద్దదేహముందతడికి. బలం, తాగుబోతు దనం, నిద్దురబోతుదనం, తిండిబోతుదనం లాంటి గుణాలన్నీ పరిపక్వదశకొచ్చి వాడిలో నిలిచాయి. ఇలాంటి వాడు, తను రాముడి మీదకు యుద్ధానికి పోతానని రావణుడితో అంటాడు. ఆయన చెప్పిన మాటల్లోనూ విపరీతార్థం స్పష్టంగా స్ఫురిస్తుంది. “.... బోదు హతుడుగాగ, రామవిభు డక్షయంబుగ రమణి సీత బొంద గలుగును..." అని కుంభకర్ణుడుతో అనిపించాడు వాల్మీకి.

పాత్ర గుణ మహాత్మ్యానికి అసంగతమైన వాక్యాలు ఆయా పాత్రల నోటినుంచి వెలువడవు. శ్రీరాముడు భగవంతుడన్న అభిప్రాయం వాల్మీకి పదే పదే చెప్పుకుంటూ పోయాడు రామాయణంలో. అలాంటప్పుడు, ఆయన భగవంతుడే అయితే, తనకు జరగాల్సిన పట్టాభిషేకం ఆఖరు క్షణంలో విఘ్నమైనప్పుడు సీతతో “... చెలియ యువరాజు నన్నిప్డు చేయురేడు" (... "ధ్రువ మద్యైవ మాం రాజా, యౌవరాజ్యే భిషేక్ష్యతి") అని ఎందుకు చెప్పాడన్న సందేహం కెలగొచ్చు. వాల్మీకి ఆ సందర్భంలో రాసిన శ్లోకార్థాన్ని పరిశీలించడానికి ముందు, అదే విషయం ప్రస్తావిస్తూ, అంతకు పూర్వం జాగ్రత్తగా చెప్పిన రామ వాక్యాలను అర్థం చేసుకోవాలి. శ్లోకంలో బాహ్యార్థం స్పష్టంగా తెలుస్తూనే వుంది.

అంతరార్థంలో రాముడు చెప్పిందేంటి? తన పట్టాభిషేకం గురించి తల్లి-తండ్రి ఆలోచిస్తున్నారని అంటాడు. ఇది వాస్తవం. ఏమని ఆలోచిస్తున్నది-పట్టాభిషేకం చేయాలనా? వద్దనా?- అనేది విశదపర్చలేదు. అలానే మిగతా సందర్భాలలో చెప్పిన రామ వాక్యాలన్నీ పరిశీలించుకుంటూ పోతే-అర్థం చేసుకుంటూ పోతే ఆయన అవతార ప్రయోజనం గురించి తెలుసుకోవచ్చు. ఉదాహరణకు సీతతో అన్న " .. నా యర్థవృద్ధికై తొందరపెట్టు బతిని.." అన్న రామ వాక్యాలనే తీసుకోవచ్చు. అర్థ వృద్ధి అంటే లోకాభిప్రాయం ప్రకారం "పట్టాభిషేకం-ధన వృద్ధి". అయితే రాముడి అభిప్రాయం వేరు. "నా ప్రయోజనం గురించి" అంటే, తాను రావణవధాది కార్యాలు చేసే ప్రయోజనం గురించి అని అర్థం. ఇదే అర్థాన్ని వచ్చేటట్లు శ్రీరాముడు మునులతో కూడా అంటాడు తన మనస్సులో మాటగా.

రాముడి మనస్సులో వున్న అర్థం రావణవధాదికమే. సర్వసముడగు భగవంతుడని పేరుపొందిన రాముడు, తల్లిదండ్రులమీద ద్వేష బుద్ధిగలవాడు ఎలా అవుతాడు? కాదు. కాబట్టి వారిపై నున్న సదభిప్రాయంతోనే ఒకచోట "సభ యెట్టిదో దూత యట్టివాడ" ని చెప్ప బడింది ఆయన మాటలుగా సీతకు. ఆయన అవతార ప్రయోజనం నెరవేరాలంటే, పట్టాభిషేకం చేసుకుని రాజుగా అయోధ్యలో వుండకూడదు. అరణ్యాలకు పోవాలి. ఆ పని జరగాలంటే పట్టాభిషేకం విఘ్న కారి. కాబట్టి జరగబోయేదేంటటే, "... చెలియ యువరాజు నన్నిప్డ చేయురేడు" (... "ధ్రువ మద్యైవ మాం రాజా, యౌవరాజ్యే భిషేక్ష్యతి"). దానర్థం "రాజు ఇప్పుడు నన్ను యువరాజు చేయడు" అని.

వాల్మీకి రామాయణమనే "కలశార్ణవం" లో రత్నాలను వెదికేవారు, మొట్టమొదటగా తెలుసుకోవాల్సింది వాల్మీకి శైలి-విధానం. అది తెలుసుకోలేక వెతకడం మొదలుపెట్టితే, చీకట్లో తారాడినట్లే. ఒక విషయం గురించి చెప్పాల్సిందంతా ఒకచోట చెప్పడు. కొన్ని సందర్భాలలో ఆ విషయానికి సంబంధించిన ప్రస్తావనే వుండదు. అదే విషయం మరెక్కడో సూచన ప్రాయంగా వుండొచ్చు. ఒక్కోసారి విపులంగా విశదీకరించబడి వుండొచ్చు. ఆయన చేసిన వర్ణనలను బట్టి, ప్రయోగించిన పదజాలాన్ని బట్టి, పాఠకులు ఊహించుకోవచ్చు. ఒకే విషయం, ఒకటి కంటె ఎక్కువ సార్లు చెప్పితే, ఒక్కోసారి ఒక్కోరకమైన విశేషంతో చెప్పబడుతుంది. ఇలాంటి చిత్రాలు అనేకం వుంటాయి.

సుందర కాండలో సీతాదేవి హనుమంతుడిని ప్రశ్నించిన వాక్యాలు ఇంకో ఉదాహరణ. "కౌసల్యయు సుమిత్ర కపివరా! భరతుండు, కుశలులే? ..

భరతుండు.. యక్షౌహిణీసేన నంపునయ్య?" అని అడుగుతుంది సీత హనుమంతుడిని. ఎక్కడి పంప? ఎక్కడి పంచవటి? ఎక్కడి అయోధ్య? ఎక్కడి క్షేమ సమాచారం? ఎక్కడి సేన రావడం? ఈ సందేహాలన్నీ పాఠకులకు కలగొచ్చు. అయితే ఉత్తర కాండ చదివినవారికి, భాతృవత్సలుడైన భరతుడు, దూతలద్వారా శ్రీరామాదుల సమాచారాన్నంతా, వారు పంచవటి విడిచి పోయిందనక తెలుసుకుంటుండేవాడని స్పష్టంగా తెలుస్తుంది.

వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) రామాయణం "ధ్వని కావ్యం". కావ్యానికి ప్రధానమైంది ధ్వని. కావ్యానికి ప్రాణం ధ్వని. ధ్వని లేని కావ్యం శవంతో సమానం. రామాయణంలో ధ్వని విశేషంగా వుంది. కావ్యమంతా ధ్వన్యర్థం వుండడమే కాకుండా, పలు శ్లోకాలకు విడిగా ధ్వన్యర్థం వుంది. రుతు వర్ణనలలో ధ్వని స్ఫురిస్తుంది. ఉదాహరణకు, సుందర కాండలోని "తతో రావణ నీతాయాః సీతాయా..." (తరువాత రావణాసుర, వరనీత ధరాత్మజాత...") అన్న శ్లోకానికి ఆచార్య పరమైన అర్థం ధ్వని. అలానే మరో శ్లోకంలో గురువు ఎలాంటివాడై వుండాలో ఆ లక్షణాలను వివరించబడింది. ఇలాంటి అర్థ బాహుళ్యం గల శ్లోకాలు వందల కొద్దీ వున్నాయి.

శ్రీ రామాయణ అంతరార్థాన్ని పెద్దలు ఇలా చెప్పుకుంటారు: భగవంతుడు ఒక్కడే పురుషుడు. తక్కిన దంతా స్త్రీ మయం అన్న నియమం ప్రకారం, సీతే జీవుడు. ఆ జీవుడు భగవంతుడిని ఆశ్రయించి వున్నంతవరకు ఎలాంటి ఆపదా కలగదు. కర్మవశాన దుర్బుద్ధితో, మాయా మయమైన ప్రకృతి పదార్థాల (మాయ జింక) మీద ఆసక్తి కలిగితే, మోక్ష సాధనానికి విరుద్ధమైన అలాంటి బుద్ధి మళ్లీ పుట్టకుండా చేయడానికి భగవద్వియోగం కలుగుతుంది. వెంటనే దేహ ప్రాప్తి (లంక) కలుగుతుంది. అందులోని రావణ-కుంభకర్ణులు అహంకార-మమకారాలు. ఏకాక్షి ప్రభృతులు ఇంద్రియాలు. అనుభవంతో బుద్ధిమంతులు కావల్సినవారు, వాటికి చిక్కి అవస్థ పడుతున్నప్పుడు, జీవుడికి వివేకం కలిగి-పరితపించడం ప్రారంభించి, తన మీద భగవంతుడికి దయ కలుగుతోందా-తన దగ్గరకు చేర్చుకుంటాడా, అని విలపిస్తారు (సీతా విలాపం). తనను ఆశ్రయించిన జీవుడు ఇలా అజ్ఞానం వల్ల కష్ట దశలో పడిపోయెగదా అని అత్యంత దయాళుడైన భగవంతుడు బిడ్డకొరకు తండ్రి దుఃఖించినట్లు, జీవుడికంటే ఎక్కువగా పరితపిస్తాడు (రామ విలాపం). జీవుడికి ధైర్యం కలగడానికి, భగవంతుడికి తనపై అనురాగం వుందని చెప్పి భయపడ

వద్దని తెలియచేయడానికి ఆచార్యుడిని (హనుమంతుడు) పంపుతాడు. ఆచార్యుడు అక్కడకు (లంకకు) పోయి అతడి చేష్టలన్నీ తెలుసుకొని, ధైర్యం చెప్పి, మరల భగవంతుడితో జీవుడు అనన్య భక్తుడనీ–ఆయనే దిక్కని నమ్మినాడనీ (నియత–యక్షత), కాబట్టి భగవంతుడే కాపాడాలనీ వేడుకుంటాడు. భగవంతుడు ప్రతిబంధకాలను అణచివేసి, చిత్తశుద్ధి పరీక్షించి (సీత అగ్ని ప్రవేశం) మరల తన దగ్గర చేర్చుకుంటాడు. దానర్థం: అనన్యాసక్తుడై, దృఢ నిశ్చయంతో, జీవుడు భగవంతుడిని సేవిస్తుంటే, అతడికి కావల్సిందంతా భగవంతుడే నెరవేరుస్తాడు. సుందర కాండ చదివేటప్పుడు పాఠకులు తమను సీత గాను, శ్రీరాముడిని భగవంతుడి గాను భావిస్తే ఈ అర్థం స్పష్టంగా తెలుసుకోవచ్చు.

వాల్మీకి రామాయణంలో, సాధారణంగా, సర్గ మొదట్లో– చివర్లో, మొదలు చెప్పిన కథనే సంగ్రహంగా తిరిగి చెప్పడం జరిగింది. ఇది కాకుండా, యజ్ఞాలు–శకునాల లాంటివి చెప్పవలసి వచ్చినప్పుడు, వర్ణించిన విషయాన్నే మరల వర్ణించాల్సి వస్తే, పూర్వోక్త శ్లోకాలనే మళ్లీ చెప్పడం జరిగింది. వీటినే పునరుక్తులు అనవచ్చు. ఇలాంటిది ఆ కవి కవితా విశేషమే గాని మరొకటి కాదు. రావణుడు రాముడిని గురించి అనుకున్న శ్లోక పాదంలో, రాముడు తనను అదే విషయం గురించి అనుకున్న శ్లోకంలో ".. .. మానుషం మన్యే రామం దశరథాత్మజం" అన్న పదాలుంటాయి. "విదితం", “ఆత్మానం" అన్న పదాలు మారతాయి. రావణుడు మనుష్యుడి చేతిలో చావడం విధి. కాబట్టి తన విరోధి (రాముడు) మనిషి అని అనుకోకుండా భగవంతుడని నమ్మితే చావు రాదు. ఇక సమర్థుడైన నర్తకుడు తాను ధరిస్తున్న పాత్రను ఉచిత రీతిగా నటించడానికి, తన్ను–తాను మరిచినట్లు, మనుష్య వేషం వేసి నటిస్తున్న రాముడు చేయాల్సిన పనిమీదున్న ఆసక్తితో తనను తాను మరిచి పోయాడు. ఉభయుల అభిప్రాయం ఒకటే కావడంతో రాముడి చేతిలో రావణుడు చచ్చాడు–రాముడు రావణుడిని చంపగలిగాడు. ఇలాంటివే ఒకే తరహాలో వున్న, సుగ్రీవుడు రాముడితో–లక్ష్మణుడితో చెప్పిన వాక్యాలు.

కొన ఊపిరితో వున్న జటాయువుని, శ్రీరాముడు సీతాదేవి వార్తను అడుగుతుండగానే అతడు ప్రాణాలను విడిచాడు. ఇలాంటి సందర్భంలో ఎవరికైనా, బతికుంటే ఏం చెప్పేవాడో కదా అనిపిస్తుంది. ఇలాంటిది నివారించేందుకు, సంపాతి అంగదాదులతో, రావణుడి వృత్తాంతాన్ని చెప్పే

సందర్భాన్ని ఎంచుకున్నాడు వాల్మీకి. అక్కడా–ఇక్కడా ఉమ్మడి వాక్యాలున్నాయి. అర్థం మారింది. జటాయువు చెప్పని రావణుడి వూరు–పేరు ఇక్కడ సంపాతితో చెప్పించాడు కవి. వాల్మీకి మహర్షి "కవితౌత్కృష్ట్యానికి" వేరే దృష్టాంతం అవసరమా? శ్రీరాముడు శరభంగుడితోను, సుతీక్ష్ణుడితోను ".. నీ వనమున వాసయోగ్య మగు పట్టెది చెప్పుము" అని భగవంతుడిలా పలికి, వెంటనే మనుష్య భావంతో మాట్లాడే చమత్కారం వాల్మీకి రామాయణం ప్రత్యేకత. ఇలాంటివెన్నో వున్నాయిందులో. చదివే పాఠకులు, ఈ అద్భుత విశేషాలను స్వయంగా ఆస్వాదించవచ్చు.

శ్రీ రామాయణంలోని కవితా చమత్కృతిని విశదీకరించాలంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఇంతెందుకు ! కాళిదాసు, భవభూతి అంత గొప్ప వాళ్లు కావడానికి రామాయణమే కారణం. వాళ్లు రామాయణాన్ని ఎన్ని సార్లు చదివారో గాని, వారి కవితా వల్లి "వాల్మీకి వాక్సుధాసేచనం" లో జీవించి, వృద్ధి పొందిందనడం నిర్వివాదం. శ్రీ విశిష్టాద్వైతం మతోద్ధారకుడైన శ్రీ రామానుజాచార్యులు పద్దెనిమిది పర్యాయాలు గురు ముఖంగా రామాయణాన్ని పఠించి వ్యాఖ్య రాశారు. ఒక్కసారి కూడా గ్రంథమంతా చదవకుండా, సంస్కృత భాష తెలియకపోయినా, "పూర్వ పక్షం" రాసేవారెందరో వున్నారు ! వారెలాంటి ప్రాజ్ఞులో కదా !

"ఒక్క ఏరునో–నదినో చూసిన మాత్రాన అదెంత గొప్పగా వుందో అనుకుంటాం. అలానే కాళిదాసు లాంటి వారిని గొప్ప కవులంటాం. అలాంటప్పుడు అన్ని నదులకు ఆధారమైన సముద్రాన్ని ఏమనాలి? అలానే, కాళిదాసాదులకు జీవనదమైన రామాయణాన్ని ఏమని వర్ణించాలి? మన మతంలో వున్న ఏదో ఒక సుగుణాన్ని గ్రహించి, దాన్నే విస్తరించి చెప్తూతూ, అన్య మతాలు ప్రసిద్ధికెక్కినట్లే, ఉపమా విషయం, కాళిదాసుని వలె ఇతర కవుల ఇతర గుణాలను ఒక్కొక్కదానిని ఇందుండి గ్రహించి, దానిని తమ చిన్న కావ్యాలలో విశేషంగా చొప్పించి ప్రసిద్ధులయ్యారు". ఆర్య మతంలా, వాల్మీకి రామాయణం గొప్పదై, పామరులకు ఇందులోని అన్ని విషయాలను అర్థం చేసుకోవడం దుస్సాధ్యం కావడంతో, పిల్ల మతాల లాగా ఇతర గ్రంథాలు ప్రసిద్ధికెక్కాయి. మహర్షైన–మహా యోగైన వాల్మీకెక్కడ? ఇప్పటి (అప్పటి) కవులెక్కడ?

కాళిదాసు రచనలోని "అస్మాన్ సాధు విచిం త్యేత్యాది" శ్లోకాలలోని విశేషాలను, వాల్మీకి రామాయణం "అహం వేద్మి మహాత్మానం...., ఇయం సీతా

మమ సుతా...." (ఏ నెరుంగుదు రాజేంద్ర !......, ఈ సీత నాదుకూతురు, నీ సహధర్మచరి, దీనినిం గైకొనుమా....") శ్లోకాలలోని, ప్రతి పద సారస్యాన్ని నిశితంగా పరిశీలించితే, కాళిదాసు వాల్మీకి శిష్యుడని తెలియడమే కాకుండా, గురు శిష్యుల తారతమ్యం స్పష్టంగా బయట పడుతుంది. కాళిదాసు "విక్రమోర్వశీయం" నాలుగో అంకం శ్లోకంలోని ఒక్క పదం తప్ప మిగతా దంతా, వాల్మీకి రామాయణంలో ఇంతకుముందు రాసిందే. ఇరువురి శ్లోకాలలోని ఉమ్మడి వాక్యాలిలా వున్నాయి: "... .... క్షితిభృతాంనాథ ! దృష్టా సర్వాంగసుందరీ రామా! రమ్యవనోద్దేశే, మయా విరహితా త్వయా". "కచ్చిత్" కు బదులుగా "సర్వక్షితి" అన్న ఒక్క పదాన్ని చొప్పించాడు కాళిదాసు. ఇలా వాల్మీకి రామాయణం నుంచి కాళిదాసు లాంటి వారు గ్రహించినవి ఎన్నో వున్నాయి. వేదవ్యాసుడంతటి వాడు వాల్మీకి శ్లోకాలను అనువదించగా లేంది, వేరేవారి సంగతి చెప్పాలా !

ఎవరికైనా సత్కవి కావాలని కోరికుంటే, వారువాల్మీకి రామాయణాన్ని అనేక పర్యాయాలు, శ్రద్ధగా-భక్తితో పఠించాల్సిందే.

శ్రీమద్రామాయణం గొప్ప ధర్మ శాస్త్రం. ఇందులో సర్వ విధాలైన, అన్ని రకాల ధర్మాల గురించి వివరంగా చెప్పబడింది. రాజ ధర్మం, ప్రజా ధర్మం, పతి ధర్మం, సతీ ధర్మం, భాతృ ధర్మం, పుత్ర ధర్మం, భృత్యు ధర్మం, మిత్ర ధర్మం లాంటి అన్ని ధర్మాలను గురించి చక్కగా తెలుపబడి వుంది. లాభ-లోభ-పక్షపాత బుద్ధి లేకుండా, న్యాయం మీదే దృష్టి నిలిపి వాదించే న్యాయవాది ధర్మం కూడా చెప్పబడింది. వీటితో పాటు కథా సందర్భానుసారంగా, అంతరాంతరాలలో ఎన్నో నీతులు చెప్పబడ్డాయి.

సత్ ప్రభు లక్షణం తెలుసుకోవాలంటే, రామ-దశరథుల రాజ్య పాలనా విధానంలో దొరుకుతుంది. ఆర్య ప్రభువులు ఏ పని చేసినా ప్రజల అనుమతి లేకుండా చేయలేదు. తాము ప్రభుత్వం నడిపేది ప్రజలకొరకేనని, వారిని సుఖ పెట్టడానికేనని వారు భావించేవారు. ప్రత్యక్షంగానైనా-పరోక్షంగానైనా ప్రజలకు హాని కలిగించే పనేదీ చేయరు. శ్రీరాముడి పట్టాభిషేకం గురించి దశరథుడు చేసిన (అయోధ్య కాండ) ఉపన్యాసం ఇందుకో ఉదాహరణ. ప్రజల దగ్గర పన్నులు తీసుకుంటూ, వారి కష్టాలు తొలగించకపోతే నరకంలోకి పోతామని వారి నమ్మకం (అరణ్య కాండ).

ప్రభువైన వాడు ధర్మాన్ని ఆధారంగా చేసుకొని, వేగులవారి ద్వారా, ప్రజల

కష్ట సుఖాలను తెలుసుకోవాలి. ప్రజలు ఇష్టపడని గుణాలు తనలో వుంటే, ఎంత నష్టమైనా–కష్టమైనా అవి మానుకోవాలి. ఆ విషయంలో రాజు అంతఃకరణం చెప్పింది ముఖ్యం కాదు. ఇతరులను సంతోష పెట్టడానికి తనెందుకు దుఃఖపడాలని అనకూడదు. ఈ విషయంలో రాముడే ప్రమాణం.

శ్రీరాముడు పట్టాభిషేకం జరిగిన తర్వాత ఒక నాడు వేగులవాడైన భద్రుడిని నగరంలో– పల్లెల్లో వార్తలేంటని, తమను గురించి ప్రజలేమనుకుంటున్నారని అడిగాడు. జవాబుగా వాడు, తనను లోకులందరూ ప్రశంసిస్తున్నారని చెప్తే, అంతటితో తృప్తి పడలేదాయన. ఉన్నదున్నట్లు–విన్నది విన్నట్లు అసలు విషయాలన్నీ చెప్పమంటాడు రాముడు. భద్రుడప్పుడు లోకుల పొగడ్తల మాటలు ముందు చెప్పి తర్వాత, "తామసుడగు రాక్షసు గృహసీమను జిరకాల మట్లు చెరబడిన సతిన్, రాముడు రోయక కూడెడి, గాముకులగు వారి కెందు గన్నులు గలవే" అని ప్రజలు వారికి తోచినట్లనుకుంటూన్నారని అంటాడు. అతడు చెప్పిన మాట సత్యమని ఇతరులతో దృఢపర్చుకొని, భరతాదులను పిలిపించి, లక్ష్మణుడితో లంకలో జరిగిన సంగతంతా చెప్పి, ".. అపవాదము దుస్సహమై, తపియింపగ జేసె నన్ను.... .... విడిచెద మిమ్మెల్లర, నే విడిచెద నా ప్రాణమేని, విమల యశము కై...." అంటూ, సీతను వాల్మీకాశ్రమానికి పంపాడు రాముడు. ఒకడిపైన ఇంతకంటే అసత్యమైన అపవాదం పడుతుందా? అలాంటి అపవాదాన్ని పోగొట్టుకోవడానికి ఇంతకంటే స్వార్థ పరిత్యాగం చేసిన వాడుంటాడా? కాబట్టి, ప్రతి మనిషి, తనను చూసి ఇతరులు తప్పు తోవలో ప్రవర్తించకుండేట్లు, లోకోపకారమైన మార్గాన్నే అనుసరించాలి.

సత్ ప్రభువు ప్రజల సుఖ దుఃఖాలను అనుదినం విచారించాలి. సీతా వియోగానంతరం, లక్ష్మణుడు తిరిగొచ్చేంతవరకు, నాలుగు రోజులు, కొలువు దీర్చలేదు రాముడు. దానికి "మర్మనికృంతన మైన బాధ" పడుతూ లక్ష్మణుడితో వెంటనే కొలువు తీర్చమని చెప్పి పరితపించాడు.

అలాంటి అనురాగం గల ప్రభువు విషయంలో, ప్రజలు కూడా అలానే వుండేవారు. అతడితో అడవులకు పోవడానికి, ప్రాణాలైనా పరిత్యజించడానికి అంగీకరించారు. ప్రభువు తానెంత గొప్పవాడైనా, తక్కువ వారితో కూడా కలిసి–మెలిసి వుండాలి. దీన్నే సౌశీల్యం అంటారు. గుహుడికి రాముడిని చూడగానే తటాలున కౌగలించు కోవడానికి వాళ్లిద్దరి మధ్య ఎంత స్నేహం వుండాలో కదా? అలానే రాజు ఎంత తెలిసినవాడైనా, మంత్రుల ఆలోచనలను–సలహాలను

తిరస్కరించకూడదు. వారు చెప్పింది విని, వారితో తాను చేయదల్చుకుంది, సరైందని నమ్మే విధంగా సమాధానం ఇవ్వాలి. విభీషణుడు శరణు చొచ్చినప్పుడు జరిగిన సంగతి ఇందుకొక ఉదాహరణ. ఇంతెందుకు? రాముడి గుణగణాలను చక్కగ అర్థం చేసుకుంటే, రాజుకుండవలసిన సద్గుణాలే కాకుండా, సాధారణంగా ప్రతి పురుషుడికి వుండాల్సిన, సత్యం–దయ–ఇంద్రియ నిగ్రహం–పితృభక్తి–ఏక పత్నీనియమం–సౌభ్రాత్రం–దైవ భక్తి–దేవతారాధనం–నిత్య కర్మానుష్ఠానం విపులంగా ఆయనలో వున్నాయని తెలుసుకోవచ్చు.

ఇక ఉత్తమ స్త్రీల లక్షణాలన్నీ కలిగున్నవారిగా సీత, కౌసల్య, సుమిత్రల గుణాలను బట్టి, నీచ స్త్రీల లక్షణాలున్న వారిగా కైకేయి, శూర్పణఖల గుణాలను బట్టి తెలుసుకోవచ్చు. రావణాసురుడు చెడిపోవడానికి ఎన్నో కారణాలు కనిపిస్తాయి రామాయణంలో. ఇంద్రియాలను జయించ లేకపోవడం, అసత్యాలు పలకడం, వేగుల వారు లేకపోవడం–వున్న వారికి సరైన జీతాలు ఇవ్వక పోవడం, తన పరిసరాలో జరుగుతున్న వృత్తాంతాలను తెలుసుకోలేక పోవడం, విన్న ప్రతి విషయాన్నీ నమ్మడం–నిజా, నిజాలు మంత్రులపైన పడవేయడం, తన మేలుకోరి చెప్పగలవారికి–జ్ఞాన హీనతతో చెప్పేవారికి మధ్య తేడా తెలుసుకోలేక పోవడం, ఎవరినీ నమ్మక పోవడం, మూర్ఖత్వం లాంటి పలు దుర్గుణాలు వున్న రావణుడు సమూలంగా నాశనమయ్యాడు. పైన పేర్కొన్న విషయాలన్నీ, శూర్పణక, మారీచుడు, విభీషణుడు చెప్పిన మాటల్లో బయట పడుతుంది. రాముడితో యుద్ధమెందుకు చేయవలసి వచ్చిందో–యుద్ధ కారణమేంటో తన భటులకే తెలియనీయక వంచన చేసి, వారి ప్రాణాలను తీసిన (రావణాసురుడి లాంటి) ప్రభువు ఎలాంటి వాడో రామాయణం చదువుతే అర్థమవుతుంది.

ఇలాగే, రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల చర్యల వలన భాతృ ధర్మం, సుగ్రీవుడి చర్యల వలన మిత్ర ధర్మం, హనుమంతుడి చర్యల వలన భృత్యు ధర్మం తెలియ చేయబడ్డాయి రామాయణంలో. అరణ్య వాసానికి పోయేటప్పుడు శ్రీరాముడు తల్లి కౌసల్యతో (అయోధ్య కాండ) అన్న మాటల్లో సతీ ధర్మం ఏమిటో తెలుసుకోవచ్చు. ఆ విషయం "... ... వారిజనేత్రకు భర్తృసేవ సద్గతి సమకూర్చు దల్లి........, ....... భర్తృహిత కారిణివై చరియింపు మంగనా..." అన్న ఆంధ్ర వాల్మీకి పద్యాల్లో స్పష్టంగా తెలుస్తుంది. అలానే అనసూయ సీతకు హితోపదేశం

చేసిన ఘట్టం చదివితే సతీ ధర్మం గురించి తెలుసుకోవచ్చు.

పితృ భక్తిని తెలుసుకోవాలంటే, అయోధ్య కాండలోని "....... పుత్ర లబ్దికై పనిగొని తల్లి తండ్రి పడు పాటులకుం బ్రతి సేయ నౌనె? యింపున దల జూచి నీళ్లు కడుపుంగని యన్నము పోసిపెట్టి యెండను జడి గాలి బ్రోతురు దినంబును వారల తుల్యులే యొరుల్" అన్న రాముడి వాక్యాలను చదవాలి.

మిత్ర ధర్మాన్ని గురించి "సులభము మిత్రుల జేర్చుట, కలసిన మరి మైత్రి చెడక కాపాడుటయే బలితపు గష్టము మది చం, చల మగుటను బ్రీతి చెడును స్వల్పంబున కేన్" అన్న సుగ్రీవుడి మాటల్లో తెలియచేయబడింది. న్యాయవాది ధర్మాన్ని హనుమంతుడి వాక్యాలలోను, కన్యాజనకత్వాన్ని" జననీ వంశమువారిని, జనకు కులమువారి స్వపతి సంతతి వారిన్ దనయా ! కన్యక సంశయ, మున ద్రోయు సదా యకీర్తి ముంచునొ యనుచున్" అన్న ఉత్తర కాండ పద్యాలలోను తెలుసుకోవచ్చు. సుందర కాండలోని "కోపి తునుము గురువులనేన్, గోపి కడుం గరకులాడు గుణవంతులనేన్, గోపి యొనర్పగజాలని, పాపం బేదైన గలదే భావింపగన్" అన్న పద్యంలో కోపి లక్షణం ఏంటో తెలుసుకోవచ్చు.

రామాయణంలో సకల ధర్మాలున్నాయి. ఇందులో వున్న ధర్మాలే మిగిలిన అన్ని గ్రంథాలలోనూ కనబడతాయి. ఇందులో లేని ధర్మాలు మరింకేదాంట్లోను కనిపించవు. రామాయణంలో సూత్రప్రాయంగా చెప్పిన ఎన్నో విషయాలను వ్యాసమహర్షి తన గ్రంథాలలో పేర్కొన్నాడు. ఉదాహరణకు "నాళీక జంఘుని" కథ. ఇలానే రామాయణంలో సూక్ష్మంగా చెప్పబడిన ధర్మాలను, కథలు–కథలుగా కల్పించి వ్యాస భగవానుడు ఇంతకు నాలుగింతలు గ్రంథాన్ని తయారు చేశాడు. భగవద్గీతంతా కూడా రామాయణ సారమేనని గ్రహించాలి.

శ్రీమద్వాల్మీకి రామాయణం మంత్రనిధానం. ఇందులో అనేకానేక మంత్రాలు ఉద్ధరించబడి వున్నాయి. అందువల్లే, వాల్మీకి రామాయణం పారాయణం చేసేవారు, "అంగన్యాస కరన్యాసాదులతో" యథావిధిగా చదివి, వారి వారి కోరికలు నెరవేర్చుకుంటారు. సద్భావంతో సుందర కాండ పారాయణం చేసి కార్య సిద్ధిని పొందనివారు ఇంతవరకు లేరు. ఉత్తర కాండలో చెప్పినట్లు, రామాయణమంతా గాయత్రీ స్వరూపమే. గాయత్రిలోని 24 అక్షరాలను, ప్రతి వేయి శ్లోకాలకు ఒక అక్షరం చొప్పున శ్లోకం ఆరంభంలో చెప్పబడింది. ఏడు కాండలలో ఏడు వ్యాహృతులు వివరించడం జరిగింది. ఈ

గాయత్రీ విధానాన్ని నారదుడే స్వయంగా వాల్మీకి మహర్షికి, రామాయణంతో పాటే ఉపదేశించాడు. " తప స్స్వాధ్యాయ నిరతం, తపస్వీ వాగ్విదాంవరమ్, నారదం పరిపప్రచ్ఛ, వాల్మీకిర్మునిపుంగవమ్" అని గాయత్రిలోని మొదటి అక్షరంతో శ్లోకాన్ని ప్రారంభించి, "జనశ్చ శూద్రోపి మహత్త్వ మీయాత్" అని గాయత్రి కడపటి అక్షరంతో సర్గను ముగించాడు వాల్మీకి. అంధ్ర వాల్మీకంలో, మూలంలో వున్నట్లు "తపమున స్వాధ్యాయంబున, నిపుణుని... ..... తమి గావించెన్" అన్న పద్యంతో ప్రారంభించి, "యథావిధి విన్న బఠింప నారయన్" అని ముగించబడింది.

సంస్కృత మూలంలో మాదిరిగానే, ఆంధ్ర వాల్మీకంలో, ప్రణవం–ప్రణవార్థం సముద్ధరించబడి వున్నాయి. ఉదాహరణకు, ఆంధ్ర వాల్మీకంలోని, "అగ్రవర్తియై శ్రీరాము... నువిద తను మధ్య..... మహిత కోదండ..... డోలి....ప్రేమ" అన్న పద్యంలోని మొదటి మూడు పాదాల ప్రథమాక్షరాలు (అవుమ) కలిపితే, నాల్గవ పాదం ప్రథమ–అంత్య అక్షర (ఓం) స్వరూపం వస్తుంది. ఇలా మంత్రార్థమంతా మూలంలో వలె వుంటుంది. ఇలా, షడక్షరి, అష్టాక్షరి, ద్వయము లాంటి మంత్రాలు కూర్చబడ్డాయి. పరిశోధకులకు ఇవి కనుగొనడం తేలిక.

ఆంధ్ర వాల్మీకంలోని ఈ పద్యం చదువుతే సాంఖ్య శాస్త్ర రహస్యం గురించి కూడా తెలుసుకోవచ్చు.

"శ్రీమహిజాధవుండు జడ చేతనజీవనధాత సద్గరీ
యో మరభూరుహంబు సమ దారివిదారణశీలి భక్తవా
రామృతదాత సంభృతశ రాసకరాంబుజు డొంటిమిట్టశ్రీ
**రా**ము డ**మాయ**వర్తనుడు రక్తి గ్రహించుత మ**న్నమ**స్కృతుల్

పాదంలోని మొదటి అక్షరం "రా" అంటే సంఖ్యా శాస్త్రం ప్రకారం 2కు సమానం. ఈ అక్షరం తర్వాత రెండు అక్షరాలను వదిలి చదివితే "మాయ" వుంటుంది. సాంఖ్య శాస్త్రం ప్రకారం మాయ 15కు సమానం. మొదటి అక్షరం తర్వాత 15 అక్షరాలు వదిలి చదివితే "నమః" వుంటుంది. ఇలా అన్నీ కలిపి చదివితే "రామాయనమః" ఏర్పడుతుంది. ఇలాగే కాండాది పద్యాలలో ద్వయము, షడక్షర నియమం కనిపిస్తాయి. కాండాంత పద్యాలలో "రామషడక్షరి" చొప్పించబడి వుంది. వాస్తవానికి సంస్కృత మూలంలో కొన్ని

శ్లోకాలు అభేద్యంగా, వాటి స్వరూపాలు ఊహకందకుండా వుండడంతో తెనిగించడం అంత తేలికైన విషయంగా కనిపించలేదు.

ఇంద్రజిత్తును లక్ష్మణుడు సంహరించేటప్పుడు "సారధర్మాత్ముడును సత్యసంధుడేని, రామచంద్రుండు దశరథ రాజసుతుడు పౌరుషమునను నప్రతి ద్వంద్వు డేని, శరమ ! ఈ రావణాత్మజు సంహరింపు" అని రాయబడింది. ఇదొక మహా మంత్రం. దీనికి ప్రతి మంత్రం లేదు. దానితోనే, సర్వాస్త్రవేదియై ఏ అస్త్రంతోనూ చావని ఇంద్రజిత్తును లక్ష్మణుడు చంపగలిగాడు. "రామ" అన్న రెండక్షరాలే "తారక మంత్రం" కదా ! దానినే సర్వజ్ఞుడు శివుడు పార్వతికి ఉపదేశించాడు.

కామ్యార్థమైనా, మోక్షార్థమైనా, రామాయణం పారాయణం చేసినవారి కోరికలు నెరవేర్చే శక్తి, రామాయణానికి వుండడానికి కారణం, అది భగవత్ కథ కావడానికి అదనంగా సర్వజ్ఞుడైన వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) కూర్చిన బీజాక్షరాల మహాత్మ్యమే. ఉదాహరణకు ఒక దృష్టాంతం తీసుకుందాం. సుందర కాండను అందరు పారాయణం చేస్తారు కదా ! అలా చేసినవారి కోరికలు నెరవేరడం కూడా సహజమే కదా ! ఆ కాండంలో ప్రథమాక్షరం "త". చివరి అక్షరం కూడా "త". "తరువాత రావణాసుర...." తో మొదలయ్యి, “తత భవద్దుఃఖమునకు....శాంతి సీత" తో ముగుస్తుంది. సుందర కాండలో ప్రతి సర్గ మొదటి అక్షరం "స" కారంతోనో, “త" కారంతోనో వుంటుంది. అలా కాకపోతే ఆ శ్లోకంలో "సీత" అన్న శబ్దంకాని, దాని పర్యాయ పదం కాని వుంటుంది. అది కూడా కుదరనప్పుడు, రెండో శ్లోకం మొదటి అక్షరం "స" కాని, “త" కాని తప్పకుండా వుంటుంది. ఈ "స", “త" లు "సీత" అన్న పదాన్ని సూచించడం స్పష్టంగా తెలుస్తోంది. సుందర కాండకు అధిష్టాన దేవత సీత. ఈ సకార-తకార మహిమ ప్రకారం సీత అంటే "ఓం" అని అర్థం కూడా. బీజాక్షర మహిమ కూడా వుంది. ఇప్పుడు చెప్పిన దాని కంతా పారాయణం చేస్తున్న వారే సాక్షులు. హనుమంతుడు ఆమె పేరు చెప్పాల్సి వచ్చినప్పుడల్లా, ఆమె వున్న దిక్కుకు నమస్కరించి మరీ ప్రస్తావించేవాడు. ఇలా రామాయణంలో ఎన్ని రహస్యాలున్నాయన్న సంగతి ఎవరికన్నా తెలుసునా?

శ్రీమద్రామాయణం వేదంతో సమానమైందే కాకుండా వేదమే అనాలి. వేదమే అయినప్పుడు, వేదంతో సమానమైందని ఎలా అనవచ్చునంటే, వేదంలోని వర్ణాలనే, అనులోమ-విలోమాలుగా మార్చి, వేద ప్రసిద్ధమైన రామ

కథను చెప్పడంవల్ల ఇది వేదమే అయింది. వేదాల్లోని అర్థాలున్నందువల్ల వేదంతో సమానమైంది. అందువల్లనే, వేద పఠనం అవశ్యంగా చేయాల్సిన కార్యక్రమాల్లో, రామాయణ పఠనం నియమితమైంది. "రామాయణం వేదసమం, శ్రాద్ధేషు శ్రావయే ద్బుధః" అని రామాయణంలోనే చెప్పబడింది.

శత కోటి, అంటే 24 గాయత్రీ బీజాక్షరాలతో కూడిన 24,000 గ్రంథాల రామాయణంలోని ప్రతి అక్షరానికి మహా పాతకాలను నాశనం చేయగల శక్తిగలదని కొందరంటారు. కొందరేమో, శత కోటి రామాయణాన్ని వాల్మీకి సంగ్రహంగా చెప్పాడంటారు. ఇలాంటి మహిమ రామాయణంలో వుండడానికి కారణమేంటో ఆలోచించాలి. వాల్మీకి సూత్రాన్ననుసరించి, రామాయణం వేద స్వర సముద్ధృతంగా–సర్వశ్రుతులందున్నట్లుగా తెలుస్తోంది. వాల్మీకి రచించిన 24,000 శ్లోకాలలో, యజుర్వేదంలోని 1 29 290 పదాలే కాకుండా, రుగ్వేదం, సామవేదం, అథర్వ వేదాలలోని పదాలు కూడా అనులోమ–విలోమంగా కూర్చబడిందన్న రహస్యం తెలుసుకోవచ్చు. యజుర్వేదానికి ప్రాముఖ్యం ఇవ్వడానికి కారణం, శ్రీరాముడు యజుర్వేది కావడమే.

యజుర్వేద సంహితా ప్రమాణం ఆధారంగా, రామాయణంలోని ఏడు కాండలంటే, సౌమ్యము, ప్రాజాపత్యము, వైశ్వదేవము, ఆగ్నేయము, ఆగ్నేయ బ్రాహ్మణము, సౌమ్య బ్రాహ్మణము, కామ్యకము. అదే విధంగా ప్రశ్నలు 44. అందులో మొదటి కాండలో 8, రెండులో 6, మూడులో 5, నాలుగులో 7, ఐదులో 7, ఆరులో 6, ఏడవ కాండలో 5 ప్రశ్నలున్నాయి. అనువాకాలు 651, పనసలు 2198, పదాలు 129290, అక్షరాలు 253868 వున్నాయి. ఈ విధంగా యజుర్వేదంలోని కాండల, ప్రశ్నల, అనువాకాల, పదాక్షరాల నిర్ణయం జరిగింది. శ్రీమద్రామాయణంలోని కాండలలో వేదాక్షరాలు ఎలా వున్నాయో పరిశీలించితే, బాల కాండ ప్రథమ సర్గ నుంచి ఐదో సర్గ వరకు రెండో శ్లోకం దాకా, నారదుడు ఉపదేశించిన విధానం రాసి, తర్వాతనే బ్రహ్మ ప్రత్యక్షం కావడంతో కథా భాగం వుంది. బాల కాండ 5 సర్గ 3 వ శ్లోకం నుంచి, అయోధ్య కాండ 115 వ సర్గ వరకు యజుర్వేదం. అయోధ్య కాండ 116 వ సర్గ మొదలు, అరణ్య కాండ 74 వ సర్గ వరకు ఋగ్వేదం. అరణ్య కాండ 75 వ సర్గ మొదలు సుందరకాండ 48 వ సర్గ వరకు సామవేదం. సుందర కాండ 49 వ సర్గ మొదలు ఉత్తర కాండ 36 వ సర్గ వరకు అథర్వ వేదం. ఉత్తర కాండ 37వ సర్గ మొదలు చివర వరకు ఉపనిషత్తు–అంటే శాంతి. ఈ విధంగా 647సర్గలలో 23635

శ్లోకాలు, 776794అక్షరాలున్నాయి. అక్షరాల సంఖ్యలో కొంచెం తేడా రావడానికి కారణం వేదాలలో వర్ణముల పదాలు విశేషంగా వుండడం వల్ల ఇవి సరి చూసుకుంటే, వేద వర్ణాల లెక్కకు, రామాయణ వర్ణాల లెక్కకు సరిపోతాయి. రామాయణం వేదం కాబట్టే, నిరంతర అధ్యాయనపరుడైన వాల్మీకి, కొన్ని చోట్ల వేద పరిభాషా పదాలను, వేద సంజ్ఞలను ప్రయోగించాడు. ఈ సంకేతాలన్నింటినీ తెలుసుకోగలిగితే సందేహాలకు తావులేకుండా వాల్మీకి రామాయణ సారాన్ని గ్రహించగలుగుతారు.

రామాయణం ఒక మహత్తరమైన సాంఖ్య శాస్త్రం. "కాదినవాది సూత్రాల" ప్రకారం అక్షరాల కొచ్చే సంఖ్యలను బట్టి చూస్తే, రామాయణంలో కొన్ని చిత్రాలు కనిపిస్తాయి.

| | |
|---|---|
| రా + మ = 2+5 = | 7 |
| అవతార సంఖ్య | 7 |
| రామాయణ కాండ సంఖ్య | 7 |
| యుద్ధం జరిగిన రోజుల సంఖ్య | 7 |
| రామాయణ యుద్ధంలో ముఖ్యమైన పురుషుల సంఖ్య | 7 |

(రామ, లక్ష్మణ, హనుమ, విభీషణ, రావణ, కుంభకర్ణ, ఇంద్రజిత్తులు)

పారాయణం చేసే వారికి ముఖ్యంగా నియమిత మైన సర్గల సంఖ్య 7. వ్యాహృతులు 7. ఇలా ఈ ఏడవ సంఖ్య మహిమ అద్భుతం. "శ్లోక శతై" అని వాల్మీకి చెప్పినట్లు, బాల కాండం మొదటి సర్గ మొదటి శ్లోకం (తప స్స్వాధ్యాయ...) లోని అక్షరాల కొచ్చే సంఖ్యలను కూడితే 100 వస్తుంది. ఈ 100 సంఖ్య ప్రథమ సర్గలోని శ్లోకాల సంఖ్య. రామాయణంలోని సప్త సంఖ్యా నియమాన్ని గ్రహించిన వ్యాస భగవానులు నిజ రచిత గ్రంథానికి "జయ" అని పేరు పెట్టాడు. “జయ" అంటే18. భారతంలోని పర్వాలు 18. యుద్ధం జరిగింది 18 రోజులు. రణ శూరులు 18 మంది. భగవద్గీతలో 18 అధ్యాయాలున్నాయి. ఇలా ఆలోచిస్తే, మహర్షులందరి మార్గాలు ఒక్కటేననిపిస్తుంది.

సీతారాముల వియోగం గురించి, కలిసి వుండడం గురించి అయోధ్యా కాండలో చెప్ప బడింది. మిగిలిన కాండలలో కొంత కాలమన్నా వియోగం గురించి చెప్పబడింది. కాబట్టి "సీత, రామ" నామాల సంఖ్యలు కలిపితే

(సీత=67 + రామ=52) 119 వస్తుంది. అయోధ్య కాండలో 119 సర్గలున్నాయి. ఇలాంటి చిత్రాలు ఎన్నెన్నో వాల్మీకి రామాయణంలో నిక్షేపం చేశాడు.

శ్రీరాముడు సామాన్య ధర్మాలన్నీ ఎలా అనుష్టించింది, కష్ట కాలంలో ఎలా ప్రవర్తించింది, సుఖ కాలంలో ఎలా నడచుకుంది, ఎలాంటెలాంటి వారి మీద ఏ విధమైన అభిప్రాయంతో మెలిగేవాడనేదీ, వీటి కారణాలేంటి అన్న విషయాలన్నీ చర్చించాల్సినవే. రాముడి పైనా, ఆయన తమ్ముళ్లపైనా ఏక పత్నీవ్రతం విషయంలో కూడా విరుద్ధాభిప్రాయాలను వెలిబుచ్చిన వారున్నారు. అసలా మాటకొస్తే " దుష్టులు వెలిచవి (జారత్వం) మరగిన భ్రష్టులు లేరప్పురమున రాష్ట్రమునందున్" అని బాలకాండలో చెప్పినట్లు, దశరథుడు పాలించిన అయోధ్యలో ప్రతి మనుష్యుడు ఏక పత్నీవ్రతుడే. అలాంటప్పుడు రాముడు అనేక పత్నీకుడని ఎలా చెప్పారు? అలాంటి రాముడు వాల్మీకి వర్ణించిన శ్రీరాముడు మాత్రం కాదు. ఒక్క వాల్మీకే యథార్థ చరిత్రను వర్ణించాడు. మిగిలిన వారందరూ, రాముడి పరత్వాన్ని వర్ణించినవారే. ఇలానే వాలి వధ విషయంలో కూడా రాముడి గుణం దోషరహితమే. శ్రీరాముడు సంధ్యావందనం, దేవతార్చన, విగ్రహారాధన, వ్రతానుష్టానం లాంటి నిత్య కర్మలన్నీ శ్రద్ధగా చేసేవాడు.

రామాయణ గ్రంథమేమో చాలా గొప్పది. రాసిన కవేమో బ్రహ్మర్షి. ఇందులోని మర్మాలేమో మెండుగా వున్నాయి. రాసిందేమో సంస్కృత భాషలో. చదివినా కొద్దీ విశేషాలు కనిపిస్తాయి. నేనా కించిజ్ఞుడను-చంచల చిత్తుడను-శక్తి హీనుడను. అందుకే దోషాలు దండిగా వుంటాయి. పాఠకులు ఆంధ్ర వాల్మీకి రామాయణాన్ని దయతో చదివి నన్ను ధన్యుడిని చేయండి. భగవద్ధ్యానంలో ఆసక్తిగల భక్తులందరూ దీన్ని భగవంతుడికి నివేదించబడిన ప్రసాదంలా ఈ కృతిని భావించమని ప్రార్థన.

చివరగా:

"తప్పైనను నొప్పైనను, దెప్పుచునో మెచ్చుకొనుచొ, దీనిన్ శ్రద్ధన్
దప్పక సకలము జదివెడు, నప్పుణ్యాత్ముల కొనర్తు సాష్టాంగనతుల్"

(వావిలికొలను సుబ్బరావు, కీలక సంవత్సరం, మాఘ శుద్ధ ౧౧, తిరువళిక్కేణి)

సర్గ-1

# దండకారణ్యం ప్రవేశించిన శ్రీరాముడు

ఇంతకు ముందు జరిగిన రామయణ గాథలో, ఆ రెండు-బాల, అయోధ్య-కాండలలో, శ్రీరాముడు అనేకానేక గుణాలు కలవాడని చెప్పడం జరిగింది. ఈ అరణ్యకాండలో సజ్జన రక్షణ అనే ధర్మం గురించి వివరంగా చెప్పడం జరుగుతుంది. రామావతార ప్రథమ ప్రయోజనం కూడా చెప్పడం జరుగుతుంది. సజ్జన సంరక్షణ ఈ కాండలో సారాంశమని ఆది నుండీ చెప్పడం జరుగుతుంది. అయోధ్య కాండలో సామాన్య లౌకిక ధర్మాలు, పుత్ర ధర్మం, రాజ ధర్మం, భ్రాతృ ధర్మం, మిత్ర ధర్మం, సత్యధర్మ నిష్ఠ లాంటివి చెప్పడం జరిగింది. ఈ కాండలో విశేష ధర్మాలు చెప్పడం విశేషం.

శ్రీమద్రామాయణంలో శ్రీ సీతారామలక్ష్మణులు ముఖ్యం. తక్కినవారందరూ సందర్భానుసారంగా వచ్చినవారే. ఈ ముగ్గురి సంబంధం చిద చిదీశ్వరుల సంబంధాన్ని తెలుపుతున్నది. ప్రకృతికి అధిష్ఠాన దేవత లక్ష్మి-సీత. ఈమె చైతన్య స్వరూపిణి. ప్రకృతి బద్ధాత్మ స్థానంలో ఈమె చెప్పబడింది. లక్ష్మణుడు ప్రకృతి సంసర్గంలేని జీవుడు. కాబట్టే ఈయన్ను భార్యతో జంజాటంలేని వాడిగా చెప్పడం జరిగింది. శ్రీరాముడు ఈశ్వరుడు. ప్రకృతి బద్ధజీవుడు, శుద్ధజీవుడు...ఇరువురూ ఈశ్వరుని ఆశ్రయించి, ఆయనకు శేషభూతులై వుండేవారే. ఈ తత్వం తెలిసినవాడు ముక్తుడవుతాడని భగవద్గీతలో చెప్పబడింది. శ్రీమద్రామాయణం ఈ ముగ్గురి సంబంధమనే విషయం ఆద్యంతం బోధిస్తున్నది. ఇందులో

సీతాలక్ష్మణులకు శ్రీరామచంద్రమూర్తి మీద కల ప్రేమ బాలకాండలో సూక్ష్మంగా వర్ణించడం జరిగింది.

తీవ్ర పరాక్రమవంతుడు, ధీరుడు, శ్రీరామచంద్రమూర్తి భయంకరమైన క్రూర మృగాలతో కూడిన దండకారణ్యంలో ప్రవేశించి, అక్కడ నానారకాలైన సుందర వృక్షాలతో అందంగా, శుభంగా వున్న మునీశ్వరుల ఆశ్రమాలను చూశాడు. నార చీరెలతో, దర్భలతో, వ్యాపించి, సారవంతములైన వేదాధ్యయనాలతో వచ్చిన బ్రహ్మ వర్చస్సు అనే సంపదతో వుండి, మిక్కిలి కాంతివంతంగా వున్న దుర్దశ్శమైన సూర్యమండలంలాగా కనిపించే ఆశ్రమ మండలాన్ని సమీపం నుంచి చూశాడు శ్రీరాముడు. ఆ ఆశ్రమ మండలం...పలు రకాలైన మృగాలతో వ్యాపించి, నగరాల్లో ఎప్పుడూ కనపడని కొత్త-కొత్త పక్షులతో కూడి, చూడడానికి కన్నుల పండుగగా వుండి, యజ్ఞార్థమై వచ్చే దేవతల వెంట వచ్చిన దేవతా స్త్రీల=అప్సర స్త్రీల ఆట-పాటలతో, పూజలతో సంతోషం కలిగించేదిగా వుంది. విశాలమైన అగ్నిహోత్ర గృహాలతో, స్రుక్కులు, స్రువాలు, దర్భలు, సమిధలు, జలకుంభాలు, పండ్లు, కందమూలాలు కలిగి, తీయటి పండ్లతో నిండిన అడవి చెట్ల గుంపులతో సత్కరించబడిందిగా వున్నాయా ఆశ్రమాలు. వేద పాఠ రవం కలిగి కమలాలున్న కొలనులతో ప్రకాశిస్తున్నాయి. ఫలాలు, కందమూలాలు ఆహారంగా, ఇంద్రియ నిగ్రహం కలిగి, నారచీరెలు, జింకచర్మాలు కట్టి, బ్రహ్మ వర్చస్సుతో సూర్యాగ్నులలాగా ప్రకాశించే మునులున్నారక్కడ. వానప్రస్థ, సన్న్యాసాశ్రమం స్వీకరించిన వారితో, తపస్వులతో, వేదనాదంతో, పరబ్రహ్మజ్ఞానం కలవారితో నిండివున్న ఆప్రదేశంలోకి ప్రవేశించాడు శ్రీరాముడు.

శ్రీరాముడి రాకను దివ్యదృష్టి ద్వారా అవతార రహస్యం తెలిసిన ఆ మునీశ్వరులు కనుక్కున్నారు. ఇన్ని జన్మలకు తమకు సాక్షాత్ భగవత్ దర్శన భాగ్యం కలిగింది కదా! మనం వెతుక్కుంటూ పోతే దొరకనివాడు మనల్ని అనుగ్రహించి ఇక్కడికే వస్తున్నాడు కదా! ఆహా! ఏం దయ? ఏమి సౌలభ్యం? ఏమి భక్త వాత్సల్యం? అనుకుంటూ, ఎదురుపోయి సీతారామలక్ష్మణులను చూశారు.

## తమను రక్షించమని శ్రీరాముడిని ప్రార్థించిన మునులు

శ్రీరామచంద్రమూర్తిని, లక్ష్మణుడిని, సీతాదేవిని మునులంతా నిండారు

మనసుతో, ప్రేమతో, సగౌరవంగా, మంగళాశాసనాలు చేసి సేవించారు. అడవిలో నివసించే ఆ ఋషీశ్వరులు లక్ష్మీదేవైన సీతాదేవికి ప్రియమైన శ్రీరాముడిని ఎంత చూసినా ఇంకా చూడాలని తృప్తిలేక ఆశ్చర్యంతో అలాగే వుండిపోయారు. సీతాదేవిని, లక్ష్మణుడిని, శ్రీరామచంద్రమూర్తిని ఋషీశ్వరులందరూ చూసి-చూసి ఆశ్చర్యపడి రెప్పవాల్చకుండా మళ్లీ-మళ్లీ తృప్తిలేక చూశారు. (దీనివల్ల భక్తులకు ఆనందానుభవమే ముఖ్యమని అనుకోవాలి). బ్రహ్మవర్చస్సుతో ధర్మాత్ములైన ఆ ఋషీశ్వరులు తమ పర్ణశాలకు రామచంద్రమూర్తిని పిలుచుకునిపోయి, ఆసనం చూపించి, కూర్చుండబెట్టి, కందమూలాలు, ఫలాలు, పుష్పాలు సమర్పించి చేతులు జోడించి ఇలా అన్నారు:

"ఈ మునులందరినీ రక్షించే శక్తికలవాడివి నువ్వే. వారి-వారి స్వధర్మం వారు చేసేట్లు రక్షించగల గొప్పతనం కలవాడివీ నువ్వే! కాబట్టి మా స్వధర్మంలో మేముండేట్లు చూడు. నువ్వు ఇలాంటి వాడివని నీ కీర్తిని అందరూ ఇదివరకే పొగుడుతున్నారు.నువ్వు గురువులందరికీ గురువువి...పరమ గురువువు కాబట్టి పూజార్హుడివి. కాబట్టి మేం చేసే పూజలను అంగీకరించి బిడ్డలను తల్లిదండ్రుల లాగా రక్షించు. నువ్వెందుకు రక్షించాలంటావా? నువ్వు మా స్వామివి....మేం మాది అనుకునేదంతా నీ సొమ్ము కాని మాది కాదు. నీ సొమ్ము నువ్వే కాపాడుకోకపోతే మరెవరు కాపాడుతారు? నీ సొమ్ము నువ్వు కాపాడుకోవడానికి మెమెందుకు ప్రార్థించాలి? అది నువ్వే చేయాల్సిన పని కదా? సర్వస్వామివి కాబట్టే గౌరవించాల్సిన వాడివి. మాలో లోపం ఏదైనా వుంటేనువ్వు శాసించు. నువ్వు అసహాయుడవై ఎంత పనైనా చేయగల సమర్థుడివి. కాబట్టి నువ్వు మమ్మల్నందరినీ రక్షించు. రాజు దేవేంద్రాది అంశం గ్రహించి ప్రజలను రక్షించుకుంటూ ప్రజలచే శ్లాఘించబడి ఎక్కువ సంతోషంగా వుంటాడు. మేమందరం ఈ దేశవాసులమైనందున నీ వల్ల రక్షించబడాల్సిన వాళ్లం. కాబట్టి నువ్వు అధిక దయతో మమ్మల్ని రక్షించు".

"చూసి, భరించడానికి సాధ్యపడని, తేజస్సుగల శ్రీరామచంద్రమూర్తీ! ఎల్లప్పుడూ ధ్యానం చేసుకుంటున్న మేము, ఎప్పుడూ మా మనసు నీ మీదే వుంచినందువల్ల, నీ సత్వగుణం మాలోనూ కొంచెం వున్నందున, తమోగుణమైన దండించడం మాకు తగదు.అలా చేస్తే మా తపస్సు నాశనమై మేం స్వతంత్రులమనే అహంకారం మాకు కలుగుతుంది. దానివల్ల మాకు స్వరూపహాని జరుగుతుంది. కాబట్టి మేం ఆపని చేయం. నీ గర్భంలో

వుండేవారం. తల్లిగర్భంలో వున్న శిశువును తల్లికాకుండా మరెవరు రక్షిస్తారు? శిశువు తనను తాను రక్షించుకోగలదా? కాబట్టి మమ్మల్ని రక్షించే భారం సర్వకాల సర్వావస్థలలో నీమీదే వుంది. అందుకే నువ్వు మమ్మల్ని రక్షించాలి. నువ్వు ఎక్కువ దయకలవాడివి కదా! నీమీద మా రక్షాభారం వేసి నిన్నే నమ్ముకుని వుంటాం. అలాంటి మామీద కాకుండా నీ అపారమైన దయ మరెవరిమీద చూపుతావు?"

ఈ విధంగా ఆ మునులు శ్రీరామచంద్రుడిని పూజించి, తమవద్ద వున్న కందమూలాలను ఇచ్చి ఆయన్ను తృప్తిపరిచారు. దీనర్థం భగవంతుడిని పరివార సమేతంగా అర్చించి పూజించాలని. సిద్ధసాధననిష్ఠులు, అగ్నిహోత్రసమానులు, ఇతర తాపస శ్రేష్ఠులు, న్యాయవృత్తులు వారి-వారి వర్ణాశ్రమ ఆచార పద్ధతుల ప్రకారం ఈశ్వరుడైన శ్రీరామచంద్రమూర్తిని సంతోషంగా పూజించారు.

సర్గ–2

# సీతను ఎత్తుకునిపోయిన విరాధుడు

శ్రీరామచంద్రమూర్తి వారి ఆతిథ్యాన్ని స్వీకరించి, అక్కడే నిద్రించి, ఉదయాన స్నానసంధ్యాది కార్యక్రమాలను తీర్చుకుని, వారి అనుమతి తీసుకొని, అడవిలోకి పోయాడు. ఆ అడవి అనేక రకాలైన మృగాలతో వ్యాపించి వున్నది. అనేక రకాలైన వృక్షాలున్నాయి. అనేకరకాలైన పక్షులున్నాయి. చెట్లతీగెలు, పొదలున్నాయి. అవన్నీ, విరాధుడి భయంతో అక్కడికీ ఎవరూ రానందున, చివికి నశించాయి. వీటితో పాటున్న నీరులేని మడుగులను చూసుకుంటూ సీతారామలక్ష్మణులు అడవిలో పోసాగారు. ఇలా అడవిలో పోతున్న శ్రీరామచంద్రమూర్తి ఒక క్రూరుడిని చూశాడు. పర్వత శిఖరంలాగా పొడగాటి దేహంతో, పెద్ద ధ్వని చేస్తూ మనుష్యులను తినేవాడిగా, లోతైన పెద్ద కళ్లతో, భయంకరమైన పెద్ద నోటితో, భయంకరమైన వికార ఆకారంతో, కొత్తగా నెత్తురుకారే పులిచర్మం కప్పుకుని, మూడులోకాలని మింగే విధంగా నోరు తెర్చుకుని, యముడిలాగా భూతాలకు భయంకరంగా వుండి, నాలుగు పులులు, రెండు తోడేళ్లు, పది దుప్పులు, ఏనుగుతల శూలంకొనలో గుచ్చి, పెద్దగా బొబ్బలు పెట్తూ వున్నాడు ఆ క్రూరుడు.

ఆ విరాధుడు సీతారామలక్ష్మణులను చూసి కోపించి, భూమి గడగడలాడేట్లు, ప్రళయకాలం నాటి యముడిలాగా, విజృంభించి, భయంకరంగా ధ్వని చేస్తూ,

తటాలున వాళ్లమీద పడ్డాడు. పడి, సీతాదేవిని ఎత్తుకుని, చంకలో వుంచుకుని, శ్రీరామలక్ష్మణులతో ఇలా అన్నాడు:

"మీరెవ్వరు? ఋషులలాగా జడలు, చర్మాలు ధరించి మిక్కిలి పొగరుగా, కత్తి, విల్లు, బాణాలు ధరించి భార్యతో అడవిలో తిరుగుతున్నారు? మునీశ్వరులకు వయసు ఆడది తోడెందుకు? దుష్ట ప్రవర్తన కలవారా మీరు? మీ వ్యవహారం వేరే విధంగా కనిపిస్తున్నది. మీరు పాపాత్ములు...మునులకు అపకీర్తి తెస్తున్నారు. మీరు నా చేతిలో చావనున్నారు. నా వృత్తాంతం చెప్తా వినండి. నా పేరు విరాధుడు....నేను వీరుడను. కాబట్టి, ఆయుధాలు ధరించి, మునులను చంపి, వారి మాంసం తింటూ, సంతోషంగా ఈ అడవిలో తిరుగుతున్నా. పాపాత్ములైన మిమ్మల్ని యుద్ధంలో చంపి, మీ నెత్తురు తాగి, ఈ ఆడదానిని నా పెళ్లంగా చేసుకుంటా". ఇలా విరాధుడు చెప్పిన మాటలకు సీతాదేవి భయపడి పెద్దగాలికి అరటి చెట్టులాగా వణికింది.

సీతాదేవి ఇలా రాక్షసుడి ఒడిలో వణుకుతుంటే, శ్రీరామచంద్రమూర్తి దుఃఖపడుతూ లక్ష్మణుడితో ఇలా అన్నాడు: "లక్ష్మణా! జనకమహారాజు ప్రియపుత్రిక, నా భార్య, నిడివికళ్లది, రాచబిడ్డ, సీతాదేవి మనసులో వున్న భయంతో రాక్షసుడి ఒడిలో ఎలా వణుకుతుందో చూసావా? తమ్ముడా, భూమి పుత్రికకు ఎలాంటి గొప్ప ఆపద వచ్చిందో చూశావా? కైక ఏ ప్రయోజనం కోరి నన్ను అడవులకు పొమ్మందో, అది తొందరగానే ఆమెకు చేకూరింది. ఆమె దూరాలోచనకలది కాబట్టే సర్వజనప్రియుడనైన నేను నగరంలో వుందగా భరతుడికి రాజ్యం స్థిరపడదని భావించింది. ప్రజలందరూ నాకే వశపడుతారనీ, నామీద ప్రేమతో భరతుడిని విరోధిస్తారనీ ఆమెకు తెలుసు. కాబట్టి నన్ను అడవులకు పంపితే, నా వెంట పతివ్రత సీత ఎలాగూవస్తుందని ఆమెకు తెలుసు. ఆ వచ్చిన సీత రాక్షసుల వాత పడి, కష్టాలు సహించలేక చనిపోతుందనీ తెలుసు. ఆమె చస్తే రామచంద్రుడు బతకడని ఆమె కోరిక. అలా జరుగుతే రాజ్యానికి భరతుడు స్థిరపడుతాడనుకుంది. ఇలా ఆలోచించి నన్ను అడవులకు పంపింది. ఆమె కోరిక తొందరగానే ఫలించింది. తండ్రి మరణ వార్త విన్న దుఃఖం కంటే, రాజ్యం పోయిన దుఃఖం కంటే, సీతాదేవిని ఇతరులు తాకడం ఎక్కువ దుఃఖాన్ని కలిగించింది".

ఈ విధంగా చెప్పి దుఃఖంతో కన్నీళ్లు కారుతుంటే బాధపడుతున్న శ్రీరామచంద్రమూర్తిని చూసి కోపంతో పాములాగా బుసకొట్టూ లక్ష్మణుడిలా

అన్నాడు: "విష్ణుతేజా! సమస్త భూతకోటికి నువ్వే దిక్కు. చిత్త ఔన్నత్యం విడిచి దిక్కులేనివాడిలాగా ఎందుకిలా దుఃఖపడతావు? ఇప్పుడేం చెడిందని ఇంత దుఃఖం? ఏ పనైనా చేయడానికి నీ సేవకుడిని నేను లేనా? నీ సేవ చేయడానికే కదా నేను వచ్చింది? నేనిప్పుడు ఏం చేస్తానంటావా? నా బాణాలతో వాడి భుజాలను పడగొడ్తాను. వీడెక్కడికి పోతాడు? ఆనాడు భరతుడిమీద వచ్చిన కోపం ఆయన శరణాగతుడైనందున పరిహారం లేకుండా వ్యర్థమైంది. ఆ కోపాన్ని ఇంద్రుడు కొండలమీద వజ్రాన్ని విడిచిన విధంగా వీడిమీద విడుస్తా. స్పష్టమైన నా భుజబలంతో వదిలిన బాణాలు వేగంగా పోయి వాడి రొమ్ములు చీల్చి వాడిని పీనుగగా చేస్తాయి".

సర్గ–3

# విరాధుడిని చంపిన రామలక్ష్మణులు

ఇలా శ్రీరామచంద్రమూర్తితో చెప్పిన లక్ష్మణుడు, రాక్షసుడివైపు తిరిగి, “ఓరీ నువ్వెవడివిరా...ఈ అడవిలో ఎందుకు తిరుగుతున్నావురా?” అని చిరునవ్వుతో అడిగాడు. తన వనానికి వచ్చి తనెవ్వరని ఎందుకడుగుతున్నారనీ, ముందు వారెవరో చెప్పాలనీ, వారెక్కడికి పోతున్నారనీ, విరాధుడు జవాబుగా ప్రశ్నించాడు. దానికి శ్రీరామచంద్రుడు “ఓరీ వినరా! మేం ఇక్ష్వాకు వంశంలో పుట్టిన క్షత్రియులం. అడవిలో తిరుగుతున్నాం. నువ్వనుకున్నట్లు మేం పాపాత్ములం కాదు. నిర్దోషమైన నడవడి కలవారం. నువ్వెందుకు ఈ అడవిలో తిరుగుతున్నావు?” అని అడిగాడు. జవాబుగా విరాధుడు: "నా తండ్రి జయుడు, నా తల్లి శతహ్రద నన్ను దనుజులందరూ విరాధుడు అని పిలుస్తారు. నేను తపస్సు చేసి శస్త్రంతో చావకుండా బ్రహ్మ నుండి వరం పొందా. నరకబడడం వల్ల, చీల్చబడడం వల్ల, చంపబడకుండా వరం పొందా. మీరు బతకాలనుకుంటే ఈ స్త్రీని నాకు వదిలి వెళ్లండి. ఈమెను నాకు వదిలితే మిమ్మల్ని చంపను" అని అన్నాడు.

విరాధుడు చెప్పిన మాటలకు కోపగించిన శ్రీరామచంద్రుడు, “ఓరీ! నీచ రాక్షసుడా! దుష్టుడా! నీ అంతట నువ్వే చావును వెతుక్కుంటూ వచ్చావు. నా ఎదురుగా నిలబడి మరల బతికిపోతావా?” అంటూ బాణం ఎక్కుపెట్టాడు.

పదునైన బాణాలను రాక్షసుడిమీద వేశాడు. రాముడు ఏడు బాణాలను విరాధుడి రొమ్ము దూర్పోయే విధంగా వేయగా, అవి కొండ లాంటి వాడి దేహాన్ని చీల్చి, ఎర్రగా మారిపోయి, భూమిలోకి పోయాయి. బాణాల తాకిడి బాధను సహించలేని విరాధుడు జానకిని నేలమీద వదిలి, శూలం తీసుకుని రామలక్ష్మణులను సమీపించాడు. రామలక్ష్మణులిరువురూ ఆ రాక్షసుడి మీద పదునైన బాణాలను వర్షంలాగా కురిపించారు. వారు వేసిన బాణాలను చూసిన విరాధుడు, ఈ బాణాలు తననేమీ చేయలేవని నవ్వి, తన భయంకరమైన శరీరాన్ని పెంచాడు. దేహంలో నాటుకుని పోయిన బాణాలన్నీ నేలరాలాయి. శ్రీరామచంద్రమూర్తి మరి కొన్ని బాణాలను వేశాడు. శ్రీరామలక్ష్మణులు వేస్తున్న పదునైన అబాణాలను చూసి రాక్షసుడు నవ్వాడు. వాళ్లూ వదలకుండా వీడిపై బాణాలు వేయసాగారు. వాటివల్ల బాగా బాధకలిగిన విరాధుడు, ప్రాణాలను బిగపట్టుకుని, రామలక్ష్మణులపై వజ్రసమానమైన శూలాన్ని విసిరాడు. మండుతూ వస్తున్న ఆశూలాన్ని చూసి శ్రీరాముడు దాన్ని రెండు బాణాలతో నరికాడు. భూమి కంపించే విధంగా అది నేలరాలింది. వాడి శూలం విరగగానే, రామలక్ష్మణులిద్దరూ వాడి మీద దూకారు. దూకి తమ కత్తులతో వాడిని కొట్టారు. అప్పుడా రాక్షసుడు వాళ్లిద్దరినీ ఎత్తుకుని ఆకాశంలో పరుగెత్తాడు. అడవి మధ్యలోకి వాళ్లను తీసుకుని వెళ్లి తమను చంపాలన్న వాడి కోరికను గ్రహించాడు శ్రీరాముడు. వాడు ఎక్కడికి తీసుకునిపోతే అక్కడికే పోదామనీ, అదే మన మార్గమనీ శ్రీరాముడు లక్ష్మణుడితో అన్నాడు.

సర్గ-4

# శ్రీరాముడికి తన శాపాన్ని గురించి చెప్పిన విరాధుడు

చంటి పిల్లను ఎత్తుకున్న విధంగా రామలక్ష్మణులను భుజాలమీద ఎత్తుకుని అడవిలో పోతున్న ఆ విధానం చూసిన సీతకు భయం కలిగింది. గట్టిగా , ఇలా జరిగిందికదా అని ఏడ్చింది. అప్పుడు సీతాదేవి ఇలా అంటుంది: "దానవోత్తముడా! నన్ను ఒంటరిగా విడిచి వారిద్దరినీ తీసుకొనిపోతే నన్ను ఇక్కడ పెద్ద పులులు, తోడేళ్లు, చిరుతపులులు మింగుతాయి. కాబట్టి వాళ్లను వదిలి నన్ను తీసుకొని పోయి చంపు. అలా అయితే వాళ్లు సుఖంగా జీవిస్తారు. వాళ్లు లేకుండా నేనున్నా చచ్చినదానితో సమానమే. కాబట్టి నీకు నమస్కారం చేస్తా....వాళ్లను విడిచి పెట్టు". సీత ఈ ఏడుపు మాటలు విన్న శ్రీరామలక్ష్మణులు రాక్షసుడిని చంపడానికి తొందరపడసాగారు. విరాధుడి కుడి భుజమందున్న లక్ష్మణుడు వాడి ఎడమ చేతిని, ఎడమ భుజాన వున్న శ్రీరాముడు వాడి కుడిచేతిని నరికారు. విరాధుడు ఆయుధాలతో చచ్చేవాడు కాదు. చేతులు లేనివాడయ్యాడు. కాబట్టి వాడిని మోచేతులతో, మోకాళ్లతో గుద్ది, పైకెత్తి కింద పడేశారు. కత్తులతో నరికినా, బాణాలతో గుచ్చినా, నేలమీద వేసి గుద్దినా, చావని ఆ కఠిన రాక్షసుడిని చూసిన శ్రీరాముడు లక్ష్మణుడితో , వీడిని ఒక గుంట తీసి పూడుద్దామన్నాడు. ఇది విన్న విరాధుడు, రాముడితో, తాను ఆయన చేతిలో చచ్చిపోయాననీ,

అజ్ఞానం వల్ల ఆయన ఎవరైందీ తెలుసుకోలేక పోయాననీ, అని తన శాప విషయాన్ని గురించి చెప్పాడు.

విరాధుడిలా అన్నాడు: "కౌసల్యానందనా! కరుణాస్వరూప! శ్రీరామచంద్రా! తండ్రీ! మీరెవరో ఇప్పుడు తెలుసుకున్నా. శ్రీరాముడివి నీవు.... అవతార మూర్తైన భవంతుడవని, సీతాదేవి లక్ష్మి అని తెలుసుకొంటిని. నేను పూర్వం తుంబురుడనే గంధర్వుడిని. రంభతో కూడి కామావేశాన మర్యాద తప్పి సంచరిస్తుంటే కుబేరుడు నన్ను రాక్షసుడివి కమ్మని శపించాడు. శాపం తొలగే ఉపాయం కూడా ఆయనే చెప్పాడు. దశరథ కుమారుడు శ్రీరాముడు ఎప్పుడు నన్ను చంపుతాడో అప్పుడు నాకు రాక్షసత్వం పోతుందని, గంధర్వ రూపం వస్తుందని అన్నాడు. శ్రీరఘురామచంద్రమూర్తీ! నీ కరుణవల్ల భయంకరమైన శాప బాధ తొలగింది. మీ దర్శనం వల్ల కృతకృత్యుడనయ్యాను. స్వర్గానికి పోతాను. దయ చేసి ఆజ్ఞ ఇవ్వు. మీకు మేలు కలుగుగాక! ఈ దారిలో ఒకటిన్నర ఆమడ దూరం పోయాక అక్కడ సూర్యతేజుడైన శరభంగ మహర్షి వున్నాడు. ఆయన్ను మీరు దర్శించండి. మేలు కలుగుతుంది. నన్ను పూడ్చి వేయండి. ఆ తరువాత అక్కడికి పోండి శ్రీరామచంద్రమూర్తీ! లక్ష్మణా! ఏనుగును పూడ్చడానికి ఎంత గుంట తవ్వుతారో అంతది తవ్వండి" అన్నాడు. వెంటనే చనిపోయాడు.

శ్రీరామచంద్రమూర్తి చెప్పిన విధంగా లక్ష్మణుడు విరాధుడి దేహం పక్కనే వెంటనే ఒక గుంత తవ్వాడు. శ్రీరామలక్ష్మణులు కల్సి వాడి శరీరాన్ని ఆ గుంటలో వేశారు. ఇంకా ప్రాణంతో వున్న విరాధుడు, శ్రీరామలక్ష్మణులు బలవంతంగా గుంతలో పడేయగానే, భయంకరమైన ధ్వని చేస్తూ, దాంట్లో పొర్లాడాడు. వాడిని పిడికి పోటులతో చంపారు రామలక్ష్మణులు. ఊపిరితో పూడ్చరాదు కాబట్టి చంపి మరీ పూడ్చారు. శ్రీరామలక్ష్మణులు విరాధుడిని ఈ విధంగా చంపి, సంతోషించి, ఆ గోతిని పెద్ద రాయితో పూడ్చారు. ఇలా చేసి, దూరంగా వుంచిన వారి బాణాలను మరల తీసుకుని, సీతాదేవి దగ్గరకు పోయి, అడవిలో చంద్రుడు సూర్యుడులాగా ప్రకాశించారు.

సర్గ-5

# శరభంగాశ్రమానికి పోయిన సీతారామలక్ష్మణులు

భయంతో-శోకంతో ఖిన్నురాలై వున్న సీతాదేవిని ఓదార్చిన శ్రీరాముడు, తమ్ముడు లక్ష్మణిడితో శరభంగాశ్రమానికి పోవడానికి దారి బాగు చేయమని అంటాడు. అక్కడికి పోయి మహాత్ముడైన వాడిని, దేవ-గంధర్వులు, సిద్ధులు, గొప్ప ఋషులు స్తోత్రం చేసేవాడిని, విశేష బ్రహ్మ తేజస్సు గల శరభంగుండితో సంభాషిస్తున్న ఇంద్రుడిని చూశారు సీతారామలక్ష్మణులు. అప్పుడు లక్ష్మణుడితో శ్రీరాముడిలా అన్నాడు: "ప్రకాశిస్తున్న కాంతిగల ఇంద్రుడిని చూశవా? లక్ష్మణా నువ్విక్కడే సీత దగ్గర వుండు. ఆ ఇంద్రుడి వృత్తాంతం, ఆయన ఇక్కడికి ఎందుకు వచ్చాడో తెలుసుకొని వస్తా" అని ముని ఆశ్రమానికి చేరబోయాడు. శ్రీరాముడు రావడం చూసిన ఇంద్రుడు, శరభంగుండితో రహస్యంగా, శ్రీరామచంద్రుడు తనను చూడడానికి వస్తున్నాడనీ, ఆయన్ను తానిప్పుడు చూడకూడదనీ అంటాడు. శ్రీరాముడు చేయాల్సిన అసాధ్య కార్యం, రావణాధికం ముందున్నదనీ, అది చేయనివ్వాలనీ, అది ఇతరులు చేయలేనిదనీ, దాంట్లో విజయం సాధించిన తరువాత-కీర్తి పొందిన తరువాత, తానే ఆయన్ను సమీపించి సంభాషిస్తాననీ చెప్పి ఇంద్రుడు రథం ఎక్కి ఆకాశానికి పోయాడు. అలా ఇంద్రుడు పోగానే, వెనక్కు తిరిగి వచ్చిన శ్రీరామచంద్రమూర్తి, సీతాలక్ష్మణులను కలిసి, వారితో

సహా అగ్నిహోత్రంతో ప్రకాశిస్తున్న శరభంగ మహర్షిని భక్తితో సమీపించాడు. చేరి ఆయన పాదాలకు శిరస్సు వంచి మొక్కాడు. మొక్కి ముగ్గురూ నిలుచున్నారు. వారికి ఆసనానికి తగిన పీటలను అమర్చారు ముని. వారు కూర్చొనిన తరువాత, శ్రీరామచంద్రమూర్తి ఇంద్రుడు అక్కడకు రావడానికి కారణం ఏంటని శరభంగుండిని అడిగాడు. జవాబుగా శరభంగుండు ఇలా చెప్పాడు.

### ఇంద్రుడి రాకకు కారణం శ్రీరామచంద్రుడికి చెప్పిన శరభంగ మహర్షి

"రామచంద్ర దేవా! నేను తపస్సు చేసి క్షుద్రులు పొందలేని బ్రహ్మలోకాన్ని సంపాదించాను. అక్కడకు నన్ను పిలుచుకొని పోవడానికి ఇంద్రుడు ఇక్కడకు వచ్చాడు. ఆ బ్రహ్మలోకానికంటే కూడా ప్రియమై కోరాల్సిన నువ్వు అతిథిగా నా దగ్గరకు వస్తున్నావని తెలిసి, బ్రహ్మలోక ప్రాప్తికంటే కూడా నీ దర్శనం శ్రేష్ఠం కాబట్టి ఇంద్రుడితో పోవడానికి మనసొప్పలేదు. ఫలితంగా నీ దర్శన భాగ్యం కలిగింది. ఇక దేవతలు దర్శించే త్రిదివమునకు పోతాను. నేను తపస్సుతో సంపాదించినవన్నీ ఎప్పటికీ తరిగిపోనివి....పుణ్యలోకాలు కలిగిస్తాయి. నిన్ను దర్శించకుండా నేను బ్రహ్మలోకానికి పోతే ఎలా? స్వర్గలోకంలోని భోగస్థానాలను, బ్రహ్మలోకంలోని భోగస్థానాలను, సంపాదించడానికి నేను చేసిన పుణ్యమంతా నీకిస్తాను. గ్రహించు". అప్పుడు సకల శాస్త్రవేత్త అయిన శ్రీరామచంద్రమూర్తి ఇలా అన్నాడు: "మునీంద్రా! నీ పుణ్యాన్నంతా నేను తీసుకుంటా. మేముండడానికి నివాసయోగ్యమైన స్థలమేదో చెప్పు". జవాబుగా శరభంగుడిలా అన్నాడు: "మీరుండడానికి సరైన స్థలం సుతీక్ష్ణుడనే ముని చెప్తాడు. ఈ అడవిలోనే ఆయన వున్నాడు. రామచంద్రా! మీరు ఇక్కడనుండి తూర్పుగా పారుతున్న ఈ పుణ్యనదికి ఎదురెక్కి, పడమటగా పొండి. మధ్యలో పూల గుంపులు నదిలో కనిపిస్తాయి. అదే సరైన తోవ. రామచంద్రా! పోవద్దు. కాసేపుండు. శరీరాన్ని వదులుతా" అని అంటూనే తన శరీరాన్ని అగ్నిలో ప్రవేశింపచేశాడు. భస్మమైన శరభంగుడు మళ్లీ కుమారుడి రూపాన్ని దాల్చాడు. ఆ రూపంతో బయల్దేరి పోయి, పరబ్రహ్మ లోకంలో భగవన్మూర్తిని చూశాడు. ఆయన కూడా మునిని సుఖంగా వచ్చావా? అని అడిగాడు. సీతారామలక్ష్మణులు ముగ్గురూ ముని శక్తికి ఆశ్చర్యపడ్డారు.

సర్గ-6

# శ్రీరాముడికి తమ కష్టాలు చెప్పి శరణు వేడిన మునీంద్రులు

శరభంగుడావిధంగా పరమపదం చేరగా, దివ్యతేజస్సుకల రామచంద్రమూర్తిని, అక్కడున్న ఋషులు కలిసి రక్షించమని వేడుకున్నారు. ఆత్మరక్షణ విషయంలో తాము సమర్థులం కామని, పరాధీనులమనీ, భగవంతుడొక్కడే ఆపద్బాంధవుడనీ భావించిన మునులు శరణాగత రక్షణే పరమ ధర్మమనే జ్ఞానం కల శ్రీరాముడిని రక్షించమని ఇలా వేడుకున్నారు."రఘువంశసత్తమా! పురుష రత్నమా! నీ అభిజాతత్వం శ్లాఘ్యమైంది. నిన్ను లోకులు పొగుడుతున్నారు. అరణ్యానికి రావడం వల్ల తండ్రి మీద భక్తి, భరతుడు అడిగినా ఒప్పుకోనందున సత్యవాక్కు మీద ప్రీతి, ధర్మం అంటే నిష్ఠ, నీలో సంపూర్ణంగా వున్నాయి. సీతావల్లభా! పరమాత్మ స్వరూపడవైన నిన్ను త్రికరణ శుద్ధిగా శరణు కోరుతున్నాం. నిన్ను మేమొక విషయం యాచిస్తాం. రామచంద్రమూర్తీ! మేమొక విన్నపం చేయదల్చాం. కోపగించుకోవద్దు. మేం కార్యార్థులమై వచ్చినందున, నీకు తెలిసినా-తెలియకున్నా చెప్పుకోవాల్సిన విధి మాది. చెప్పుకోలేదన్న లోపం మాలో వుండకూడదు. ప్రజాపాలనే రాజులకు ముఖ్యకార్యం కాబట్టి, మా విన్నపాన్ని ఆలకించు. ఏ రాజైతే తన ప్రాణం కంటే ఎక్కువగా ప్రజలను పాలిస్తాడో, ఆ రాజు, శాశ్వత కీర్తిని సంపాదించి బ్రహ్మలోకానికి పోయి అక్కడ బ్రహ్మతో గౌరవం పొందుతాడు. తపస్సు చేస్తున్న

తాము ఆకులలాలు తింటూ కూడా, తమ కష్ఠ ఫలమైన తపస్సులో నాలుగో భాగం రాజుకు ఇవ్వడానికి కారణం అతడు ప్రజలను రక్షించడానికే కదా?".

"దుష్టులు పెట్టే బాధల వల్ల దుఃఖపడుతూ, బాధపడుతున్న వారిని రక్షించే సామర్థ్యం కల శ్రీరామచంద్రమూర్తీ! యథార్థం చెప్తున్నాం. విను. ఈ వానప్రస్థ సమూహాల్లో బ్రాహ్మణులు చాలామంది వున్నారు. కొద్దిమంది క్షత్రియ, వైశ్యులు కూడా వున్నారు. వీరంతా గొప్ప తపో మహిమవల్ల కీర్తిపొంది నువ్వే దిక్కని నమ్మారు. క్షత్రియులు, వైశ్యులు కూడా స్వశక్తితో తమ్ము కాపడుకునే శక్తి కలవారు కాదు. దుష్టులైన రాక్షసులు పెట్టే బాధలు సహించలేకపోతున్నారు. ఇక నువ్వు ఉపేక్షించ కూడదు. మామీద ప్రేమతో మాకు అభయం ఇవ్వు. మాకు భయం లేకుండా చేయి. శ్రీరామచంద్రా! రాక్షస సమూహాల వల్ల హింసించబడ్డ మునుల దేహాల నుండి వెడలిన ఎముకలు దూరంగా పడి వున్నాయి, మా వెంట రా...చూపిస్తాం. మందాకినీ తీరంలో పంపానది ఒడ్డున, చిత్రకూట పర్వతం దగ్గర నివసిస్తున్న ఋషులను రాక్షసులు బాధించి చంపుతున్నారు. మృత్యువును లక్ష్యపెట్టక తపస్సు చేసే మాకెందుకు మరణభీతి అంటావేమో? మాకుగా మేం దుఃఖించడం లేదు. సంసారాన్ని వదలి అడవులకు వచ్చి తపస్సు చేసుకుంటున్న మునిజనులకు కలుగుతున్న అపకారాన్ని చూసి మేం సహించ లేకపోతున్నాం. కాబట్టి నువ్వు రక్షించాలి. అమోఘబలవంతుడివి కాబట్టి నిన్ను రక్షించమని శరణుజొచ్చాం. మేం రాక్షసుల చేతిలో చావకుండా నీ దయాగుణంతో ఆలోచించి మమ్మల్ని కాపాడు. మమ్మల్ని కాపాడమని నిన్ను నిర్బందించం. నీ కళ్యాణగుణాలకు హాని రాకుండా కాపాడుకో. మేం అనన్యులం...కాబట్టే...నీ రక్షకత్వాన్ని కోరి, నువ్వెప్పుడు అవతరిస్తావా? ఎప్పుడు దర్శనమిస్తావా? ఎప్పుడు మమ్మల్ని కృతార్థులను చేసి రక్షిస్తావా? అని ఎదురుచూస్తున్నాం. నువ్వుతప్ప మాకు వేరే గతిలేదు. మా విషయంలో దయచూపాలా? వద్దా? అనే విషయం సీతాదేవిని అడిగి చూడు".

## మునులకు అభయం ఇచ్చిన శ్రీరాముడు

ఋషులందరూ చెప్పిన మాటలు విన్న శ్రీరామచంద్రమూర్తి వారితో ఇలా అన్నాడు: "మహానుభావులారా! మీరు నన్ను ఇలా గొప్పవాడిని చేసి మాట్లాడవచ్చా? నేను మీ ఆజ్ఞానుసారం నడుచుకునేవాడినే! మీరు ఆజ్ఞాపించాల్సిన వారే కాని విజ్ఞాపించాల్సిన వారు కాదు. నేను ఈ అడవుల్లోకి

నా స్వకార్యం కొరకే వచ్చా. ఈ అడవుల్లోని రాక్షసులందరినీ వధించి మీకు మేలు చేయడమే నా స్వకార్యం. నా తండ్రిని సత్యవాదిని చేయడానికి అడవులకు రావడం నెపం మాత్రమే కాని యదార్థం కాదు. ఆశ్రితులను రక్షించడం రక్షకుని విధి. నేను చేయాల్సిన కార్యాన్ని ఇంతవరకూ చేయకపోవడం నా లోపమే. నన్ను క్షమించండి. ఈ కారణం వల్ల మాకు అరణ్యవాసం గొప్ప ఫలితాన్ని ఇస్తుంది. యుద్ధంలో తమ్ముడితో కలిసి విరోధులను చంపుతా. అప్పుడు నా భుజ శక్తి చూడండి".

సర్గ-7

# సుతీక్ష్ణాశ్రమానికి చేరిన శ్రీరాముడు

ఇలా ఆ ఋషులకు అభయమిచ్చిన శ్రీరామచంద్రమూర్తి తన మాట నెరవేర్చడానికి అభిలాషతో, తన వెంట మునీశ్వరులందరూ వస్తుంటే, సుతీక్ష్ణాశ్రమానికి పోయే దారిలో పయనించాడు. తన వెంట వచ్చిన వానప్రస్థులతో ముచ్చటించుకుంటూ నడిచిన శ్రీరాముడు అందమైన ఆశ్రమాన్ని చూశాడు. పూలతో నిండి, కొండలాగా నల్లగా వ్యాపించిన పర్వతంతో, సౌందర్య సంపత్తితో అలరారుతున్న ఆ శుభాశ్రమాన్ని సమీపించి, అక్కడ కూచున్న సుతీష్ణుడిని శ్రీరామచంద్రమూర్తి చూసి, ప్రీతితో ఇలా అన్నాడు: "ఋషీశ్వరా! పాపరహితుడా! నేను రాముడిని. నిన్ను దర్శించుకోవాలని మిక్కిలి సంతోషంగా వచ్చాను. మనసారా ప్రేమగల చూపులతో నన్ను చూడు". వెంటనే ఆ మునిశ్రేష్ఠుడు రాముడిని కౌగిలించుకుని, "సీతేశ్వరా, నీకు క్షేమమే కదా?" అని కుశల ప్రశ్న వేస్తూ ఇలా అన్నాడు: "ఇతరులు చూసి సహించలేని తేజస్సుకలవాడా! నువ్వు రావడం వల్ల ఇక్కడి ఈ ఆశ్రమం మరింత పవిత్రమై, దిక్కుకలదిగా ప్రకాశిస్తున్నది. ఓ వీరుడా! నువ్వు ఇక్కడికి వస్తున్నావని తెలిసి శరీరాన్ని వదిలి దేవలోకానికి పోవడానికి ఇష్టం లేక ఇక్కడే నీకొరకు కాచుకుని వున్నాను. నా పుణ్యం వల్ల నువ్వొచ్చావు నాయనా!. కకుత్థ్స వంశంలో పుట్టినవారిలో శ్రేష్ఠుడవు, మంచి పరాక్రమవంతుడవు అయిన శ్రీరామచంద్రమూర్తీ! రాజ్యాన్ని వదిలి మునివేషంతో చిత్రకూటంలో నువ్వు నీ

భార్యతో, తమ్ముడు లక్ష్మణుడితో కలిసి వున్నావని విన్నాను. రామచంద్రా! నేను సంపాదించిన పుణ్యంతో స్వర్గాన్ని పొందాను. అక్కడికి రమ్మని ఇంద్రుడు నన్ను పిలవదానికి వచ్చాడు. కాని, నువ్వు ఇక్కడకు వస్తున్నావని తెలిసి, అక్కడికి పోకుండా, నీ దర్శనంకొరకు ఇక్కడే కాచుకుని వున్నాను. నన్ను అనుగ్రహించి ఇక్కడ విహరించు" అని అన్నాడు.

జవాబుగా శ్రీరామచంద్రమూర్తి ఇలా అన్నాడు: "మునీంద్రా! నీ తపఃఫలం నువ్వు నాకివ్వాల్సిన అవసరం లేదు. ఫలకాంక్షలేకుండా రామార్పణం అని నువ్వు సంకల్పిస్తే చాలు. అవే వచ్చి నాలో కలుస్తాయి. అప్పుడు నేను గ్రహిస్తా. మేముండడానికి అనువైన స్థలం చూపించు. నీ గురించి అంతా శరభంగుడు చెప్పాడు". ఈ మాటలు వినగానే మునీంద్రుడు శ్రీరాముడితో "శ్రీరామచంద్రా ఈ ఆశ్రమ భూమియే రమ్యమైనది. గుణం కలది. ఋషులెందరో ఇక్కడ తపస్సు చేస్తున్నారు. ఫలమూలాలు దండిగా దొరకుతాయిక్కడ. ఇక్కడ భయమంటే ఏమిటో తెలియదు. కాకపోతే ఇష్టం వచ్చినట్లు తిరిగే మృగాలు వచ్చి దేహాలను తాకటం వల్ల తపస్సుకు విఘ్నం కలుగుతుంది. అది తప్ప మరే భయం లేదు. కాబట్టి ఇక్కడే వుండండి" అన్నాడు. తాను ఆమృగాలను చంపితే మునీంద్రుడికి మనోవ్యధ కలుగుతుంది కాబట్టి తానక్కడ ఎక్కువ రోజులుండకూడదని అంటూ శ్రీరాముడు, సరస్సుకు పోయి సాయం సంధ్య పూర్తి చేశాడు. ఆ ముని ఇచ్చిన ఆహారాన్ని తిన్నాడు. ఆ రాత్రి సీతాలక్ష్మణులతో అక్కడే గడిపాడు.

సర్గ-8

# రామలక్ష్మణులు యుద్ధ సన్నద్ధులైనారని తెలుసుకున్న సీత

తెల్లవారుఘాము కాగానే లక్ష్మణుడు ముందుగా లేచి, స్నానం చేసిన తరువాత సీతాదేవి కూడా నిద్రలేచి అలాగే చేసింది. శ్రీరామచంద్రమూర్తి కూడా తటాకజలాలలో స్నానం చేసి, హోమం చేసి, ఇష్టదైవ ప్రార్థన చేసి, సూర్యోదయం కాగానే సూర్యుడికి నమస్కారం చేసి సుతీక్ష్ణ మునిని సమీపించి అంజలి ఘటించి ఇలా అన్నాడు: "తపస్సు వల్ల పవిత్రమైన హృదయం కల మునీంద్రా! నువ్వు మమ్మల్ని గారవించి గౌరవించడం వల్ల రాత్రి మాకు హాయిగా గడిచింది. ఇక బయల్దేరి పోవడానికి అనుమతి ఇస్తారా?ఎక్కడికి పోతారంటారేమో? తమ-తమ ఆశ్రమాలకు రమ్మని దండకారణ్యంలో నివసించే మునులు మమ్మల్ని అడుగుతున్నారు. వారివెంట మేం పోవాలనుకుంటున్నాం.కాబట్టి మామీద దయతో అనుమతి ఇవ్వండి. ఎండ సోకకముందే వెళ్లడానికి శలవివ్వండి". ఇలా చెప్తూ శ్రీరాముడు ముని పాదాలను తాకి నమస్కరించాడు. శ్రీరాముడిని ముని దగ్గరకు తీసుకుని గట్టిగా కౌగలించుకుని, "రామచంద్రా! నీ నీడ నిన్ను విడిపోకుండా నీవెంట వచ్చేవిధంగా, సీత నిన్ను కొలుస్తుండగా పోయిరా!. నువ్వు ఎవరివెంట పోవాలనుకుంటున్నావో ఆ ఋషులు మిక్కిలి పుణ్యాత్ములు. వారు నిన్ను పాపపు పనులు చేయమని ప్రోత్సహించరు. కాబట్టి

వారి ఇష్టప్రకారం పో. దానివల్ల నీకు కీడులేదు. మేలు కలుగుతుంది. లక్ష్మణా! ఇక్కడి కొండలు, వృక్షాలు, సరస్సులు అందలి నెమళ్లు మీకు అత్యంత ఆనందాన్ని కలిగిస్తాయి. కాబట్టి సుఖంగా పోయిరండి. పాపరహితుడవైన శ్రీరామచంద్రా! నా ఆశ్రమానికి మళ్లీ రండి." అని అంటాడు.

అప్పుడు లోకసుందరి అయిన సీత విల్లంబులను, ఇతర ఆయుధాలను అంబులపొదులను రామలక్ష్మణులను తీసుకొమ్మని చెప్పి ఇచ్చింది. వాళ్లు వాటిని తీసుకుని తమదగ్గర వుంచుకుని ఎక్కుపెట్టారు. రామలక్ష్మణులు విండ్లు ధరించిన విధం చూసి ఆయుధాల పట్టువిడుపులు తెలిసిన సీతాదేవి వారు యుద్ధ సన్నద్ధులైనారని తెలుసుకుంది.

సర్గ-9

# శ్రీరాముడికి హితోపదేశం చేసిన సీతాదేవి

అందరూ బయటకు పోతున్న సమయంలో సీతాదేవి శ్రీరాముడి ముఖారవిందాన్ని చూసి, స్నేహభావంతో, ప్రేమతో, మెత్తటి-తియ్యటి మాటలతో ఇలా చెప్పింది: "ప్రాణేశ్వరా! నువ్వు అనుష్టించదల్చిన వానప్రస్థ ధర్మం కామం వల్ల కలిగే వ్యసనాలను వదిలి కూడా సూక్ష్మమైన ధర్మ మార్గంలో అనుష్ఠించవచ్చు కదా? కామజ వ్యసనం లేదంటావా? అవి మూడు. మొదటిది అసత్యం చెప్పడం. దానికంటే పెద్దది పరస్త్రీలతో భోగించడం. దానికంటే పెద్దది పగలేకుండా ఇతరులను నిష్కారణంగా హింసించడం. ఈ మూడింటిలో మొదటిదైన మిథ్యాభిభాషణం నీలో లేదు. ఇంతదాకా నువ్వు అసత్యం ఆడలేదు. ఇక, రెండోదైన పరభార్యా సంగమం విషయంలో నీకలాంటి కోరికే లేదు. నువ్వు ధర్మ నిరతుడవు కాబట్టి నీలో ఏ పాపాలు కనబడవు. కాబట్టి అధర్మకర దోషం లేదు. లక్ష్మణాగ్రజా!నాథా! నువ్వు సర్వదా సత్యం, ధర్మం తప్పనివాడివి. కాబట్టే తండ్రి వాక్యాన్ని పాలించడానికి ఇంత శ్రమ పడ్తున్నావు. సత్యం, ధర్మం నీలో ఏ కొరతా లేకుండా వున్నాయి. ఇంత సత్యం, ధర్మం విజితేంద్రియులకు తప్ప ఇతరులకు లభించవు.నువ్వెంత జితేంద్రియుడివో నాకు తెలుసు. రామచంద్రా! మిథ్యాభిభాషణం పరదార సంగమాభిలాష నీలో లేవు. ఆ విషయం గురించి నేనేం చెప్పను. కామజవ్యసనాలలో మూడోది మిగతా రెండింటి కంటే క్రూరమైనది. నువ్వు అది చేయబూనావు. జ్ఞానహీనులు పగలేకపోయినా

ఇతరుల ప్రాణం తీస్తారు. అది అలాంటివారికి తగునుకాని నీకు తగదు. అది నాకెలా తెలుసంటావా? మునీశ్వరుల కొరకు దండకారణ్య వాసులైన రాక్షసులను చంపుతానని ప్రతిజ్ఞ చేశావు. అందుకోసమే ఇక్కడకు వచ్చావు. మునిలాగా తిరగాలనుకుంటున్న నీకు, నీ తమ్ముడికి విల్లు బాణాలెందుకు? అవి హింసించే సాధనాలే కదా? ఆత్మరక్షణ కోసమని అనుకోవచ్చుకదా అంటావేమో? ఈ మునులందరూ ఆత్మరక్షణ కొరకు ఏ ఆయుధాలు ధరించారు? నువ్వు సాయుధుడవై వచ్చినందున మునులు వచ్చి నిన్ను రక్షించమని అడిగారంటావా? అలాగే నిన్ను రాక్షసులు హింసించడానికి వస్తే క్షత్రియుడవైన నువ్వు ఎవరిని ప్రార్థించాలంటావా? అలా వారు వస్తే నువ్వు ఆయుధాలు పట్టవచ్చు. కాని, ఇప్పుడు మీరు విల్లు–ఆయుధాలు పట్టిన తీరు చూస్తే యుద్ధానికి పోతున్నట్లున్నది. అందువల్ల మీ శుభం, హితం కోరినదాన్నైన నేను, నిష్కారణ విరోధంతో మేకేం అశుభం కలుగుతుందో అని భయపడుతున్నా. నువ్వు సత్యం, ధర్మం పాటించేవాడివి. ఇంతదాకా ఆ రెంటినీ సమంగా కాపాడుకుంటూ వస్తున్నావు. సంతోషమే! ఇప్పుడు రెంటికీ విరోధం వచ్చేట్లున్నది. సత్యంతో విరోధించే ధర్మం, ధర్మం కాదు. ధర్మంతో విరోధించే సత్యం, సత్యం కాదు''.

"మీరు ఇప్పుడు అడవులకు ప్రయాణమై పోవడం సమ్మతమైన కార్యం కాదు. పోతే ఏమైతుందంటావా? కారణం చెప్తా విను. మీరు యుద్ధానికి పోయే విధంగా చేతులో విల్లంబులు, కత్తులు ధరించి పోతున్నారు. తోవలో ఎవరైనా రాక్షసుడు కనిపిస్తే ఇదిగో రాక్షసుడు దొరికాడని వాడిమీద బాణం వేస్తారు. ఆ దెబ్బకు వాడు చస్తాడు. అదే రాక్షసులకు, మనకు విరోధ కారణమవుతుంది. రాక్షసులు మనకు ప్రత్యక్షంగా అపకారం చేస్తే వారిని చంపవచ్చు కాని, ఎవరో ఋషీశ్వరులు చెప్పారని రాక్షసులను చంపి మనం కయ్యానికి కాలు త్రవ్వడం నాకిష్టం లేదు. రాక్షసులమీద బాణం నువ్వు ప్రయోగిస్తావని నేనెలా ఊహించానంటావా? నువ్వు రాక్షసులను చంపుతానని ప్రతిజ్ఞ చేశావు.నువ్వు సత్య ప్రతిజ్ఞుడవు. కాబట్టి చంపక మానవు. భయపడవద్దు...నిష్కారణంగా నువ్వెవరినీ చంపనని అంటావా? హింసించవచ్చే వారినే హింసిస్తానంటావా? అలా అని ధైర్యం చెప్తావా? అలా అయితే నీ ప్రతిజ్ఞ ఎలా నెరవేరుతుంది? దానికి సరైన కారణం కావాలి. ఆ కారణం నేనే అవుతా. అప్పుడు నాకొరకు నువ్వు రాక్షసులను వధించవచ్చుకాని, నువ్వు ఏక పత్నీవ్రతుడవు కదా! నన్ను వదిలి

నువ్వెలా వుంటావు? నా వియోగం వల్ల నువ్వెంత దుఃఖిస్తావో? నీ దుఃఖం నేను సహించలేను. కాబట్టి నువ్వు అరణ్యానికి పోవడం నాకిష్టం లేదు. నా వియోగం వల్ల మీ ప్రతిజ్ఞ నెరవేరడం మేలా? ప్రతిజ్ఞ చెడినప్పటికీ మీరు దుఃఖపడకుండా వుండడం మేలా? అనేదే నా ఆలోచన. క్షత్రియులకు చేతిలో ఆయుధం వుంటే బలాన్ని-తేజాన్ని వృద్ధి చేస్తుంది. కాబట్టి కలహం లేకుండా వుండేందుకు మీ ఆయుధాలను ఇక్కడే వుంచి పోదాం".

## శస్త్ర సాంగత్య దోషాన్ని తెలియచేసే ఇతిహాసాన్ని శ్రీరాముడికి చెప్పిన సీత

సీత శ్రీరాముడికి శస్త్ర సాంగత్య దోషాన్ని తెలియచేసే ఇతిహాసాన్ని చెప్తూ ఇలా అంటుంది: "ప్రాణేశ్వరా! రామచంద్రా! పూర్వకాలంలో సత్యం, ధర్మం అంటే ఆసక్తిగల ఒక ముని వుండేవాడు. అడవిలోని మృగాలన్నా, పశు పక్ష్యాదులన్నా మిక్కిలి ప్రేమకలవాడాయన. ఆయన తపస్సుకు విఘ్నం కలిగించడానికి ఒకనాడు ఇంద్రుడు భటుడి వేషంలో వచ్చి, ఒక కత్తిని ఇచ్చి, ఇది నీదగ్గర వుంచుకొమ్మని చెప్పి వెళ్లాడు. దాన్ని కాపాడాలన్న ఆసక్తితో ఆ ముని ఎక్కడికి పోయినా ఆ కత్తిని వెంట తీసుకుపోయేవాడు.అలా దానికి అలవాటు పడ్డాడు. కత్తి చేతులో వుంచుకుని పోవడానికి అలవాటుపడ్డ మునికి దానిమీద ప్రేమ పుట్టుకొచ్చింది. లోగడ కాయలు, కూరలు చేతితో కోసే ముని ఇప్పుడు కత్తితో కోయసాగాడు. అగ్నిహోత్రానికి సమిధలు చేత్తో విరిచేవాడల్లా కత్తితో కొమ్మలు కోయసాగాడు. అడవి మృగాలను కత్తితో తరమ సాగాడు. ఆ తరువాత హింసనే ప్రారంభించాడు. ఈ క్రూర వినోదాలకు అలవాటుపడి తాను చేయాల్సిన నిత్య కృత్యాలను ఉపేక్షించాడు. ఆ కారణాన వాడు అధోగతుల పాలయ్యాడు. ఆయుధం చేతిలో వుండడాన ఎంత అనర్థం కలిగిందో చూశారా? ఆయుధం చేతిలో వుంటే దేన్నైనా కొడ్దామన్న ఆలోచనే కలుగుతుంది".

"ఇప్పుడు నేను చెప్పిన ఇతిహాసం నా కల్పితం కాదు. పూర్వకాలంలో జరిగిన చరిత్రే. ఇది శస్త్ర సంయోగం వల్ల కలిగే కీడు గురించి తెలియచేస్తుంది. అగ్నిహోత్రుడు దేనిని (కట్టెలను) ఆశ్రయిస్తాడో, దాన్నే దహించి వేస్తాడు. అలాగే శస్త్రం కూడా తన్నెవరు ధరిస్తారో వారికే కీడు చేస్తుంది. ఇదంతా నీకు తెలియదని, నువ్వు అజ్ఞానివనీ, నేను నేర్పడం లేదు. మీరు నాకిచ్చిన చనువు కారణాన, నన్ను సగౌరవంగా చూసి నా మాట మన్నించడం వల్లా, నాకు స్వభావసిద్ధంగా మీమీద స్నేహ భావం వుండడం మూలాన, నేను మీరు మరచిన దానిని జ్ఞప్తికి వచ్చేట్లు

చెప్పాను. కాని నీకు తెలియని కొత్త విషయం నేర్పడానికి రాలేదు. కాబట్టి నన్ను క్షమించు. నేనెంత దూరం ఆలోచించినా ఇప్పుడు, ఇక్కడ, మీ ప్రయత్నం నాకిష్టం కావడం లేదు. నువ్వు సుజన శేఖరుడవే. కాని ఏదో ప్రమాద వశాత్తు సుజన కృత్యాన్ని మరచావు. మునివృత్తిలో వుండే వారికి ఆయుధాలతో పనిలేదు. కాబట్టి ఆయుధాలను మీరు ధరించడం సరైన పని కాదు. ఆపైన మనం బలవంతులం. మనకు ఎవరడ్డమని బలగర్వంతో పగలేకపోయినా దండకారణ్యంలోని రాక్షసులను చంపడం మరో సరికాని పని. నేనెంతో ఆలోచించా. రాక్షసులైనా నిరపరాధులను దండించడం నాకిష్టం లేదు. నాకు కొంచెమైనా తృప్తి కలగడం లేదు. ప్రాణేశ్వరా! శ్రీరామచంద్రా! అడవుల్లో మునులు తిరగడానికీ, శస్త్రాలను ధరించడానికీ ఏం సంబంధం? మునివృత్తి శాంతి ప్రధానం. ఆయుధ ధారణ కౌర్య ప్రధానం. ఒకటి శుద్ధ సాత్త్వికం.... ఇంకొకటి శుద్ధ తామసం. ఇక నీకులోచితమైన క్షత్రియత్వం ఎక్కడ? బ్రాహ్మనోచితమైన తపస్సెక్కడ? రెండింటికీ పొంతన ఎలా కుదుర్తుంది? నువ్వు చేయబోయే ఈ పని పరస్పర విరుద్ధ గుణాలున్నది. నువ్వే ఆలోచించు. కాబట్టి రెండింటిలో ఒకటి వదలు. శస్త్రాన్నైనా వదలు....క్షాత్రమైనా వదలు....తపస్సైన వదలు. అలా కాకుండా ఎందుకు రెంటా చెడాలి?"

"ఏ దేశంలో మనం వుంటామో, ఆ దేశాల ధర్మం ప్రకారమే మనం నడచుకోవాలి. కాబట్టి ముని మార్గంలో వున్న నువ్వు మునుల పనైన అహింసను అవలంభించడం సరైన కార్యం కదా? శస్త్రాన్ని ధరించడమే జరగుతే, దాన్ని ఉపయోగించాలన్న పాపపు బుద్ధి పుట్తుంది. కాబట్టి నువ్వు అడవుల్లో వున్నన్నాళ్లు శస్త్రం ధరించవద్దు.నాకులోచిత ధర్మాన్ననుసరించి శస్త్రాన్నిధరించాలనుకుంటే, అయోధ్యకు నువ్వు మరలిపోయిన తరువాత, మళ్లీ గృహస్థ ధర్మంలో వున్నప్పుడు, ధర్మ సంరక్షణార్థం శస్త్రాన్ని ధరించవచ్చు. అనుభవించాల్సిన ఐశ్వర్యం, పాలించాల్సిన భూమి, వదలిపెట్టి, మునిలాగా అడవుల్లోకి వచ్చిన నువ్వు, మునిలాగానే తపస్సు చేస్తే, రాముడు యదార్థవాది–నాతో చెప్పినట్లే చేస్తున్నాడని కైక సంతోషిస్తుంది. నా కొడుకు ఎక్కువ శ్రమపడకుండా సుఖంగా వున్నాడని కౌసల్య సంతోషిస్తుంది. వీరేకాకుండా స్వర్గంలో వున్న నా మామగారు కూడా తనకొడుకు తనను సత్యవాదిని చేస్తున్నాడని సంతోషిస్తారు. కాబట్టి అలాగే చేయి. ధర్మంతో ధనం లభిస్తుంది. ధర్మం వల్ల సుఖం కలుగుతుంది. ధర్మంతో చేసే సత్కర్మలు మంచి ఫలితాలను ఇస్తాయి. ధర్మహీనుడు చేసే

సత్కర్మలు ఫలించవు. కాబట్టి, శర్మకరా ప్రపంచం ధర్మమే సారంగా కలది. ధర్మం చెడితే జగమంతా చెడుతుంది. రామచంద్రా! ఈ ఋషీశ్వరుల వెంట హాయిగా నువ్వు ఈ ఆశ్రమానికి, ఆ ఆశ్రమానికీ తిరుగుతుంటే సుఖం లేదు. పరలోకంలో సుఖం కావాలనుకునేవారు కఠిన వ్రతాలను, నియమ నిష్ఠలను అనుసరించాలి. మనస్సు జయిస్తే లోకోత్తరమైన ధర్మ ఫలం లభిస్తుంది. కాబట్టి దానికొరకు కృషి చేయి. నీ సౌజన్యం, సాధుత్వం, లోకమంతా గౌరవిస్తాయి. మనస్సు నచ్చిన ప్రకారం నడచుకోకుండా, నిష్కల్మషమైన బుద్ధితో కార్యం సాధించగలవాడివి. ఇలాంటి నీకు మూడులోకాలలో తెలియందేదీ లేదు. ప్రాణేశ్వరా! నీకు నీతులు చెప్పేటంత దాన్ని కాదు. నువ్వు అడవుల్లో తిరిగినంత కాలం హింసా వ్యాపారం లేకుండా వుండకూడదా? ఇదే నేను కోరేది. నువ్వు సజ్జన వందితుడవు. హింసారతుడవైతే సజ్జనులు మెచ్చరేమో? రాముడు క్రూరుడు అంటారేమోనని విచారిస్తున్నాను. స్త్రీలకు స్థిర బుద్ధి లేదు. ఇతమిత్థమని నిశ్చయించలేరు. కాబట్టి నాకు స్వభావ సిద్ధమైన బుద్ధి చపలత వల్ల తోచింది చెప్పా. నీకు ధర్మం చెప్పగల సమర్థులెవరు? కాబట్టి, నువ్వు, నీ తమ్ముడు ఆలోచించి ఏది మేలని తోస్తే అదే చేయండి".

సర్గ-10

# ఆర్తరక్షణ పరమ ధర్మమని సీతకు చెప్పిన శ్రీరాముడు

రాముడు ఆడినమాట తప్పేవాడు కాదు. కాబట్టి రాక్షసవధ చేయకుండా వుండడు. అలా అని నిష్కారణంగా వాళ్లను చంపడు. రాక్షసులేమో దుష్టులు.... ఊరకే వుండేవారు కాదు. రాముడి ధనస్సు చూసి తమకు కీడు కలుగుతుందని భయపడి, వారే ఏదైనా కీడు చేయడానికి ప్రయత్నం చేస్తారు. రాముడు వూరకున్నా వాళ్లు వుండరు. అందుకే రాక్షస వధ మానని సీతకు ప్రత్యుత్తరం ఇస్తున్నాడు. పతివ్రత అయిన సీతాదేవి కేవలం తన మీద ప్రేమతో, తన క్షేమం కోరి, చెప్పిన మాటలను విని, ఆమె అభిప్రాయం గ్రహించి, సీతాదేవి చెప్పిన అర్థ-కామ సుఖాల మీద కోరికలేక, ధర్మమే పరమార్థం అని, దానిమీదే మనసున్న వాడైన శ్రీరామచంద్రమూర్తి సీతతో ఇలా అన్నాడు:

"దేవీ! నువ్వు నన్ను క్షత్రియులకు "సార్తిప్రజరక్షారంభమునకు గార్ముక ధారమగు" నని అంగీకరించావు కదా? ఇప్పుడు దండకలో వున్న మహానుభావులు గొప్ప మనస్సు కలవారు. ఆ కారణాన ఇతరులను బాధించరు. అందుకొరకై ఇతరులను ప్రేరేపించరు. అలాంటి అహింసాపరులైన ఋషులు రాక్షసులకు భయపడి వారంతట వారే, నా ప్రయత్నం లేకుండా, కడు దుఃఖంతో నాదగ్గరకు వచ్చి, నేనే దిక్కని శరణుజొచ్చారు. ఇలా నేనే దిక్కని నమ్మిన ఆ

ఆశ్రితులను ఎలాగైనా పాడైపొమ్మని తిరస్కరించడం ధర్మమా? నువ్వే చెప్పు. హింస నిషేధం అని నువ్వన్నావు. అది నేను అంగీకరిస్తా. హింస అంటే ఎలాంటిది? నిరపరాధులైన సాధువులను హింసించడాన్ని హింస అంటారు కాని అసాధువులను హింసించడాన్ని హింస అనరు కదా? రాక్షస వధమీద నాకున్న ఉద్దేశం ఏంటి? అదేమన్నా వినోద క్రీడా నాకు? వాళ్లను నేను, కామంతో కాని, క్రోధంతో కాని, లోభంతో కాని, మదమాత్సర్యాలతో కాని, మోహంతో కాని చంపాలనుకోవడం లేదు కదా? సాధువుల మేలుకొరకై చేసే పనిలో దోషముందా? దేవీ ఈ మునులు అడవుల్లో, అక్కడొక కాయ, ఇక్కడొక కూర తెచ్చుకుని దాంతోనే కడుపు నింపుకుని దేహయాత్ర చేస్తారు. ఇక రాక్షసులంటావా...మృగాలనే కాకుండా మనుష్యులను కూడా పీక్కుని తిని భోగాలనుభవిస్తారు. మునులు ధర్మపద్ధతిన నడుస్తే, వారు దయాదాక్షిణ్యాలు లేకుండా క్రూరపద్ధతిన నడుస్తారు. మునులు ఎల్లప్పుడూ వ్రతాలు ఆచరిస్తున్నందువల్ల ఇతర కార్యాలంటే ఆసక్తిలేని వారు...ఇక రాక్షసులు శిశ్నోదరపరాయణులై ఇతరులను బాధించడమే వ్రతంగా వున్నవాళ్లు. ఇలాంటి నిష్కారణ హింసాపరాయణులైన రాక్షసులను వధించి శిష్ట రక్షణ చేయడం అధర్మమా చెప్పు?''

"దండకారణ్యంలో నివసిస్తున్న మునీశ్వరుల సమూహాలు మా ఇద్దరి దగ్గరకు వచ్చి, అనేకవిధాలుగా తాము పడుతున్న దుఃఖాలను చెప్పి, తమను రక్షించాలని ప్రార్థించారు. అప్పుడు నేను, వారి పాదాలకు నమస్కారం చేసి, మునులు తన్ను చూడడానికి ముందే, వారిని చూడడానికి తాను పోనందుకు సిగ్గుపడుతున్నానని, తాను చెసిన అపరాధానికి దయతో క్షమించమని అన్నాను. వారి కోరికలేంటనీ, వారికి తాను చేయాల్సిన సహాయం ఏంటో చెప్పమని అడిగాను. అప్పుడు, దేవీ, ఏకవాక్యంగా వారంతా ఒక్కటే చెప్పారు. దండకలో వున్న రాక్షసులు తమపై పగ బూని, తాము హోమం చేస్తున్న సమయంలో తమను బాధపెట్టున్నారని, ఆ బాధ పడలేక తమకు రక్షకుడు ఎవరు వస్తారో అని విచారపడ్తుండగా, తమ పుణ్యఫలం వల్ల నేను దొరికానని అన్నారు. తపస్సు చేయడం సులువు కాదనీ, అది మిక్కిలి కష్టకార్యమనీ, అంత కష్టపడి చేద్దామంటే మధ్య-మధ్యలో విఘ్నాలు కలుగుతున్నాయనీ, తమ తపశ్శక్తి పోగొట్టుకోదల్చుకోలేక వారిని శపించడం లేదనీ, ఎంతమందిని అలా శపించగలమనీ, ఒక వేళ శపించినా తమకింక ఏ శక్తి మిగుల్తుందనీ, జీవించినా

వ్యర్థమే కదా అనీ, వాళ్లన్నారు”.

వాళ్లింకా ఇలా చెప్పారు: "నిర్మలమైన కీర్తికలవాడా! మా స్థితిగతులను ఆలోచించు. రాక్షసులు చేసే పనులు ఆపుచేయించు. మా తపస్సులు సాగేట్లు చేయి. మామీద దయచూపి మమ్మల్ని రక్షించు. నువ్వు, నీ తమ్ముడే మాకిక్కడ దిక్కు. వేరే రక్షించేవారెవరూ లేరు. మీరు తప్ప మరేరాజులైనా వీరి బారినుండి మమ్మల్ని కాపాడలేరు. పూబోణీ! వాళ్లిలా చెప్పగా వారిని కాపాడాలని ప్రతిజ్ఞ చేశాను. వట్టి మాటలు చెప్పి కన్నీళ్లు తుడిచి పంపలేదు. నాకు సత్యం అన్నింటికంటే ముఖ్యం కాబట్టి ప్రాణాలున్నంతవరకు చెప్పినమాట తప్పను. నువ్వే దిక్కని నన్ను ఆశ్రయించి, ఎప్పుడుకూడా ఇతరులకు హాని కలిగించే వాటి జోలికి పోకుండా, దిక్కులేనివారిగా వున్న మునులను, రాక్షసులు పనిగట్టుకుని వధించారు. నువ్వు నిర్మలమైన మనసున్నదానివికదా? ఇంతకంటే విరోధమైన పని ఏమన్నా వుందా చెప్పు? నన్ను ఆశ్రయించేదాకా ఎవరేపాపాలు చేసినా వారి పాపఫలం వాళ్లే అనుభవిస్తారని, వారిని నేను రక్షించే ప్రయత్నం చేయను. ఒకసారి నన్ను ఆశ్రయిస్తే, నేనే దిక్కని వారి రక్షాభారం నామీద వేస్తే, పాపకార్యాలు చేయకుండా వుండే దిక్కులేనివారిని రక్షించడమే నాపని. దానికి నేను కట్టుబడి వున్నాను. అలాంటి వారిని, నా రక్షణలో వున్నవారిని, నా ఆశ్రితులను, రాక్షసులు చంపుతున్నారు. నా భక్తులు నాప్రాణంతో సమానం. నా భక్తులను భాదించడమంటే నన్ను బాధించడమే. కాబట్టి పగకు దీనికి మించిన కారణం ఏం కావాలి? దీనికి జవాబు చెప్తే, సుమతీ, నువ్వు చెప్పినట్లే చేస్తా. ఇక నా మనోనిశ్చయం విను. సత్యాన్ని రక్షించేందుకు ప్రాణాలైన విడుస్తాను. ప్రాణాలకంటే ఇష్టమైన నిన్నైనా విడుస్తాను. నీ కంటే ప్రియమైన తమ్ముడినైనా విడుస్తాను. కాని సామాన్య విషయమైన ప్రతిజ్ఞ విడువను. అందునా, ముఖ్యంగా, బ్రాహ్మణులకు ఇచ్చిన మాట తప్పను".

శ్రీరాముడు సీతతో ఇంకా ఇలా అన్నాడు: "ఆశ్రిత రక్షాభారాన్ని వహించిన నేను ఆ ఆశ్రితులై, నా పరతంత్రులై, వుండే మునుల కార్యాన్ని రక్షించడం నా విధి. ఒక్క సారి వాళ్లు నాతో మేము నీ ఆశ్రితులం అని చెప్తే చాలదా? గడియ–గడియకు చెప్పాలా? నేనంత మరిచేవాడినా? వారి యోగక్షేమాలు నేను విచారించాల్సినవాడిని. అలాంటిది, వారు వచ్చి, నేను చేయాల్సిన పనిని గుర్తుచేసిన తరువాత, వారికి ప్రతిజ్ఞ చేసికూడా ఎలా నెరవేర్చకుండా వుంటాను? నువ్వు జనకరాజు కూతురువు కదా! ఇది నీకు తెలియని విషయమా? అప్పు

తీసుకున్నవాడు మళ్లీ–మళ్లీ అడిగించుకోవచ్చా? అడిగించుకుని ఇవ్వడం శ్లాఘ్యమా? ఇవ్వకపోవడం శ్లాఘ్యమా? రెండూ కావు. నన్ను నమ్మి, నన్ను స్మరించి, నన్ను ధ్యానించి, అర్చించి, జపించి, సేవించి, వర్ణించి, కీర్తించి నాపై ఋణమెక్కించిన వారి ఋణం నేను తీర్చుకోవద్దా? నా భక్తుడిని నేను స్మరిస్తాను. నేను చెప్పిన మాట నెరవేర్చడం ఆలశ్యమైందని నేను విచారపడుతుండగా వారి కార్యం నెరవేర్చకుండా ఎలా వుండగలను? నాకు నీమీద, నీకు నామీద, స్నేహం–మోహం వున్న కారణాన, నువ్వు మంచి మనసున్నదానివైనందున, ఇదంతా చెప్పాను. రక్షోవధకు పూనుకున్నప్పుడు నాకు నీమీద, నీకు నామీద కల స్నేహానికి–మోహానికి విఘ్నం కలుగొచ్చునేమొ అన్న నీ అనుమానం గ్రహించాను. అది సహించైనా కార్యం నెరవేర్చాలి. నువ్వు ఉత్తమ స్త్రీవికాబట్టి, నీకిలాంటి మంచిమాటలు చెప్పగలిగాను. స్నేహం–మోహం భర్తకు తమ మీద లేకపోయినా, భర్తలమీద తమకు లేకపోయినా చెప్పగలరా? చెప్పరు. కాబట్టి నువ్వు ఉత్తమగుణ సంపన్నవనీ, నిష్కపటవ్యాపారవనీ మెచ్చాను. నిర్దోషురాలా! కమలహస్తా! నువ్వు పుట్టిన జనక వంశానికి, నీ శీలానికి తగినవిధంగా చెప్పాను. ఇందేం దోషం వుంది? నువ్వు సహధర్మచారిణివి. ప్రాణాలకంటే ఎక్కువ ప్రియమైన దానివి". అని చెప్పి లక్ష్మణుడు, సీత తోడురాగా శ్రీరాముడు విల్లు ధరించాడు.

సర్గ-11

# విల్లంబులు ధరించి బయల్దేరిన శ్రీరాముడు

ముందు శ్రీరామచంద్రమూర్తి పోతున్నాడు. ఆయన వెనుక రామలక్ష్మణులకు మధ్యలో సీత పోతున్నది. ఆమె వెనుక దనుర్ధరుడై లక్ష్మణుడు ప్రేమతో నడుస్తున్నాడు.

(ఇలా జరగడంలో ప్రణవస్వరూపం,ప్రణవార్థం వుందనివ్యాఖ్యాతలంటారు."ఓం"అనే అక్షరానికి ప్రణవమని పేరుంది. ఈ ఓం అనేది కేవలం ఒక అక్షరం మాత్రమే కాదు. దాంట్లో అకార, ఉకార, మకారాల మూడక్షరాలున్నాయి. "అ+ఉ"=సంధికలిసి "ఓ" అయింది. దానికి "మ్" చేరగా "ఓమ్" అయింది. ఇందులో అకారం, ఉకారం, రెండూ అచ్చులు కావడంతో సజాతీయాలు ఒక విజాతీయంతో కలిసి ఒక్కటైనందున దాన్ని ఏకాక్షరమంటారు. ఇక ప్రణవానికి అర్థమేంటో తెలుసుకోవాలి. ఈ జగత్తు విష్ణువు వల్ల పుట్టింది. ఆయనలోనే వుంది. ఈ ప్రపంచానికి స్థితి సంయమకర్త ఆయనే...ఆయనే జగత్తు. జగత్సృష్టి, స్థితి, సంహారాలు చేసేవాడు విష్ణువే. ఆయనే అకారవాచ్యుడంటారు. అకార, మకారాల మధ్యన వుండే ఉకారం లక్ష్మీదేవిని గురించి చెప్తున్నది. సర్వదేవేశ్వరుడైన విష్ణువును అకారంతో చెప్పడం జరిగింది. విష్ణువుతోఉద్ధృతైన లక్ష్మీదేవిని ఉకారంతో చెప్పడం జరిగింది. విష్ణువే

శ్రీరామచంద్రమూర్తి. లక్ష్మే సీత. శేషుడే లక్ష్మణుడు. ఈ తత్త్వాన్ని బోధిస్తూ వాళ్లు ఈ వరుసలో నడచారు. ఇందులో విష్ణువు, సర్వదా లక్ష్మీ విశిష్టుడై వుంటాడుకాబట్టి విడిచి వుండడు.

ఇక ఉకారం లక్ష్మిని తెలుపుతుంది కదా! ఆ కారణాన జీవుడు ఈమెను దాటికాని భగవంతుడిని చూడలేడు. ఈమెకే మాయ అని పేరుంది. ఈ మాయను దాటనివాడికి భగవత్ప్రాప్తి లేదు. కాబట్టి జీవుడు ఆమెను అనుసరించి పోవాలి. జీవుడిని భగవంతుడికి కలపడమే ఆమె కృత్యం. దీన్నే పురుషకారం అంటారు. కాబట్టు ఉకారం జీవాత్మ-పరమాత్మలకు నిత్య సంబంధాన్ని చెప్తున్నది. ఈమె ఇరువురి మధ్యన వుండడం వల్ల భగవదనుగ్రహం ఆమె వల్లే రావాలి. మూర్తీభివించిన భగవంతుడి కరుణే లక్ష్మీదేవి. భగవంతుడి ప్రాప్తి లక్ష్మీదేవి వల్లే కలగాలికదా! మూర్తీభవించిన భగవంతుడి కరుణే లక్ష్మీదేవి. భగవంతుడి ప్రాప్తి భగవంతుడి కరుణవల్లే కలగాలికదా! భగవంతుడు కూడా కరుణవల్లే కదా జీవుడిని అనుగ్రహించాలి. విష్ణువు వక్షస్థలంలో కదా లక్ష్మీదేవి వుండేది! తన హృదయానికి తెలియకుండా ఎవరైనా ఏపనైనా ఎలా చేయగలరు? కాబట్టి శిరస్సు విష్ణువనీ, కంఠం కింది మధ్యభాగం లక్ష్మీదేవి అనీ, భగవత్ సంకల్పం ప్రకారమే లక్ష్మీదేవి చేస్తున్నదనీ అర్థం. ఇక లక్ష్మణుడు శ్రీరాముడికి దాసుడుకానీ ఇతరులకు కాదుకదా! శ్రీరాముడు ముందుపోవడం వల్ల ఆయనను అనుసరించి సీత, ఆమె వెనుక లక్ష్మణుడు పోవడమంటే, ఈ ఇరువురికీ రక్షకుడు రాముడైనట్లు, ప్రకృతికి-జీవుడికి ధారణ-పోషణకర్త భగవంతుడే అని స్పష్టమవుతున్నది. లక్ష్మణుడు ఇరువురికీ వెనుకపోవడం వల్ల అయనకు సీతారాములిద్దరూ సేవ్యులే అని అనుకోవాలి.

ఇదంతా సత్యమేకాని దీనివల్ల మనం తెలుసుకోవాల్సింది ఏంటి? సీతారామలక్ష్మణులు మొదట అరణ్యంలో ప్రవేశించినప్పుడు, లక్ష్మణుడు దారి చూపిస్తూ ముందు పోతుండేవాడు. దండకలో ప్రవేశించి ఋషులతో స్నేహం అయినతరువాత రామచంద్రమూర్తి ముందు పోసాగాడు. ఈ మార్పుకు కారణమేంటి? శ్రీరామావతారం అనుష్టాన అవతారమనీ, శ్రీకృష్ణావతారం ఆచార్యావతారమనీ చెప్పడం జరిగింది. తన నడవడితో లోకులందరినీ సందేహం లేనివారిగా చేసి ధర్మాన్ని గ్రహించేట్లు చేసినవాడు శ్రీరామచంద్రుడు. శ్రీరాముడు ఋషిమయమైన దండాకారణ్యం ప్రవేశించగానే ఆయన వెంట వారు రాసాగారు. వారందరూ భగవత్ ధర్మ కర్మనిష్టపరులైనప్పటికీ అంతా ఒక

రకం వారు కాదు. కాబట్టి తత్త్వ విచారంలో సందేహాలున్నాయి వారికి. శ్రీరామాదులు అలా పోవడం వల్ల ఋషుల సందేహాలు ఎలా తీరాయంటే.... ఎల్లప్పుడూ ఋషులు బ్రహ్మవిచారంలోనే వుంటారు కాబట్టి ఈ ముగ్గురి స్థితి వాళ్లకు ప్రణవాన్ని జ్ఞాపకానికి తెస్తుంది. ప్రణవానికి మూడక్షరాలున్నప్పటికీ, ఏకాక్షరమని చెప్తారు. అలాగే, ప్రకృతి పురుష విశిష్టుడైనా బ్రహ్మానికి అవి శరీరమని చెప్పడం వల్ల, శరీరం–శరీరి ఒక్కటిగా లెక్కించినట్లే, బ్రహ్మం ఒక్కటే అని ఋషులు గ్రహించారు. శ్రీరాముడు అరణ్యవాసం చేశాడంటే, సీతాలక్ష్మణులతో చేసెననేకదా అర్థం?

ప్రపంచమంతా భగవంతుడే అన్నప్పుడు, స్థూలంగా మనకు కనపడే ప్రకృతినీ, దానికి జీవభూతుండైన పురుషునీ, వీటిని శరీరంగాకల బ్రహ్మమును, మూడింటినీ ఒక్కటిగానే గ్రహించాలి. స్థూల శరీరం కనబడ్తుంది. సూక్ష్మమైన అంతర్యామి మనకు కనబడడం లేదు. వ్యష్ఠిగా భేద దృష్టితో చూస్తే, తత్త్వాలు మూడని చెప్పాల్సి వుంటుంది. సమిష్ఠిగా చూస్తే ఒక్కటనే చెప్పాలి. ఈ మూడు ఏ దశలోనూ వేరు కాదు. ఏది, ఏకాలంలో, ఏ అవస్థలో వేరుపడకుండా, నిత్యంగా–సత్యంగా అంటివుంటాయో, అది ఆ పదార్థంగానే చెప్పడం లోక వ్యవహారానుసారం. ఎండను చెప్పినప్పుడు సూర్యుడు లేనిదిగానూ, సూర్యుడిని చెప్పినప్పుడు ఎండలేనివానిగా గ్రహింపలేం. మూడు వేరని కూడా అనవచ్చు. ఒకటనికూడా అనవచ్చు. జీవుడు కడతేరే మార్గం లక్ష్మణ చర్య–కైంకర్యం వల్ల నేర్చుకోవాలి. ఇప్పుడు జీవుడైన లక్ష్మణుడు పరమాత్మ ఐన రామచంద్రమూర్తికి మధ్యలో సీత (ప్రకృతి) వున్నది. ఆమె తెర అడ్డం తీస్తేనేకాని రాముడు లక్ష్మణుడికి కనబడడు. వారిరువురికి సేవచేస్తేనే ఆ అడ్డం తొలగిపోతుంది. ఇది వారి అనుగ్రహంవల్ల రావాల్సిందేకాని మన ప్రయత్నం వల్ల సాధ్యమయ్యేది కాదు. ఇలా గ్రహించిన ఋశీష్వరులు తమ సందేహాలను తీర్చుకున్నారు. ఈ ప్రణవార్థం పరమార్థ తత్త్వాన్ని వివరంగా చూపుతున్నది).

సారవంతమై, కొత్తగా వికసించే కమలాల–కలువల పరిమళాల గుమాయింపులతో ప్రకాశించే కొలకులను; నదీతీరాలలోని ఇసుకదిబ్బలలో తిరిగే అందమైన చక్రవాక దంపతుల సమూహాలను, కొండల్లో వున్న సుందర గుహల్లో పడుతున్న నీళ్ల పవిత్రమైన కొందవంకల ప్రవాహాలను, పూలతో అందమైన పొదల్లో గుంపులుగా ఝుంకారం చెసే తుమ్మెదలను, భయంకరమైన అడవి పందులను, పెనుపాములను, అడవి దున్నపోతులను, ఏనుగుల

సమూహాలను, సింహాలను, గుహల సమూహాలను చూసుకుంటూ పోయారు సీతారామలక్ష్మణులు. ఇవన్నీ చూస్తూ దూరంగా పోయి, సాయం సమయమైనందున, వేలాడేట్లున్న సూర్యబింబం కిరణాలతో ప్రాకాశిస్తున్న ఒక యోజనం సమంగా పొదవైన ఒక తటాకాన్ని చేరారు. ఆడుతుమ్మెదల గుంపులతో నల్లగా కనిపిస్తూ, తామరాకులతో, తామరపూలతో మనోహరంగా కనిపిస్తూ, హంసలతో, అవ్యక్త మధుర ధ్వనులతో వున్న ఆ తటాకం ఒడ్డునుంచి దాని తీరాన్ని చూసారు శ్రీరామలక్ష్మణులు.

## మాండకర్ణి వృత్తాంతాన్ని శ్రీరాముడికి తెలిపిన ధర్మభృతుడు

తమ వెంట వస్తున్న సదాచార సంపత్తికల ధర్మభృతుడు అనే మునిని చూసి, శ్రీరామచంద్రుడు, మనుష్యులు లేకున్నా ధ్వనులొస్తున్న ఆ తటాకం వివరాలేంటి అని అడిగాడు. శ్రీరాముడు అడిగినదానికి సమాధానంగా ఆ తటాకం చరిత్రను ధర్మభృతుడు ఇలా చెప్పడం ప్రారంభించాడు."ధర్మాత్ముడా! విను. ఇక్కడ మాండకర్ణి అనే గొప్ప తపస్వి తన తపోబలంతో దీనిని కల్పించాడు. ఇది వానలు లేకున్నా ఎండిపోయేది కాదు. చూడడానికి మనోహరంగా వుంటుంది. ఈ తటాకం పేరు పంచాప్సరసం. ఈ నీళ్లలో నుండి అతడు ఆహారం లేకుండా పదివేల సంవత్సరాలు గాఢమైన తపస్సు చేశాడు. ఆ మాండకర్ణి కొన్నాళ్లు జలం, కొన్నాళ్లు గాలి, మాత్రమే ఆహారంగా తీసుకొని కఠిన తపస్సు చేశాడు. ధృఢచిత్తంతో ఆయన చేస్తున్న తపస్సు చూసితమ పదవులను కోరుతాడేమోనని, ఎవరికి స్థానభ్రంశం కలుగుతుందోనని భయపడి, అగ్ని మొదలైన దేవతలు గుంపుగా ఒకచోట చేరి, ఎలా అతడి తపస్సు చెరచాలా అని ఆలోచన చేశారు. అతడింకా కామాన్ని జయించలేదు కాబట్టి ఆదిశగా అతడి తపస్సు చెరచడానికి ప్రణాళిక వేశారు. ఐదుగురు అప్సరసలను ఆయన వద్దకు పంపారు దేవతలు, వారు ఆయన్ను వశపర్చుకున్నారు. శ్రేష్టుడైన ఆ ఋషి, ఆత్మ సాక్షాత్కారం, భగవత్ సాక్షాత్కారం కలిగినవాడైనప్పటికీ, కామాన్ని జయించనందున దేవతల కార్యం ఫలించేట్లయింది. తనను సమీపించిన ఆ స్త్రీలను తన భార్యలుగా చేసుకొని, ఈ నీటిలో ఒక ఇంటిని కట్టుకొని, ఆ స్త్రీలతో తన యోగబలంతో క్రీడిస్తున్నాడు. మహాత్మా! రామచంద్రా! ఇలా మునీశ్వరుడుఆ స్త్రీలతో సంతోషంగా వున్నప్పుడు వారి ఆట-పాటల, భూషణాల ధ్వని చక్కగా వినపడేది”.

ఆ ముని ఇలా చెప్పగా శ్రీరామచంద్రమూర్తి విని, ఆశ్చర్యపడి, తమ్ముడు లక్ష్మణుడితో, భార్య సీతతో కూడి బ్రాహ్మణ సమూహంతో నిండిన ఆశ్రమం చూసి, వారంతా తనను పూజిస్తుంటే, అక్కడ తిరుగుతూ, వారికి రాక్షస బాధ లేకుండా విల్లంబులు ధరించి, ఆశ్రమాలలో సంచరించాడు. ఒక్కో స్థలంలో కొన్ని-కొన్ని రోజులు, నెలలు, సంవత్సరాలు చొప్పున రామచంద్రమూర్తి పదినెలలు అక్కడి ఆశ్రమాలలో గడిపాడు. ఆ తరువాత సుతీక్షణాశ్రమానికి పోయి అక్కడ ఆయన కోరికమేరకు కొంతకాలం వున్నాడు. ఇలా వున్నప్పుడు శ్రీరామచంద్రమూర్తి మునీశ్వరుడితో ఇలా అన్నాడు.

### అగస్త్యాశ్రమానికి పోవడానికి సుతీక్షణుడి అనుజ్ఞ తీసుకున్న శ్రీరాముడు

"మునీంద్రా! ఈ వనంలోనే అగస్త్య మునీశ్వరుడున్నాడని ప్రతిరోజూ అందరూ చెప్పుకుంటుంటే విన్నాం. కాని ఆయన వుండె ప్రదేశం నాకు తెలియదు. నేను నా భార్యతో, లక్ష్మణుడితో ఆయన్ను దర్శిమ్చుకోవాలని కోరిక వుంది. అక్కడికి పోయే మార్గం తెలియ చేయండి" అని శ్రీరామచంద్రమూర్తి అడగ్గా, సుతీక్ష్ణుడు, తానే ఆ విషయం ఆయనకు చెప్పాలనుకున్నానని, కానీ ఈ లోపల ఆయనే అడిగాడని, అంటూ శ్రీరాముడిని అక్కడకు పొమ్మని చెప్తాడు. "ఇక్కడికి నాలుగు యోజనాలు దక్షిణానికి పోయి, అక్కడ నుండి మళ్లీ దక్షిణానికి నాలుగు యోజనాలు పో. అక్కడ ఒక రావి తోపుంది. అక్కడ తుమ్మెదల గుంపుతో అందంగా వికసిస్తున్న మడుగులు, పెద్ద చెట్లు, నీటి పక్షుల గుంపులు కనపడతాయి. అదే అగస్త్యుడి సోదరుడైన సుదర్శన ముని వుండే ఆశ్రమం. రాత్రికి అక్కడ వుండు. ఉదయంకాగానే బయల్దేరి దక్షిణంగా ఒక ఆమడ దూరం పో. అక్కడ అగస్త్యముని ఆశ్రమాన్ని కన్నులపండుగగా చూడొచ్చు. అది అనేక వృక్షాలతో, కూడి, గొప్పనైన వనప్రదేశంగా అందంగా కనిపిస్తుంది. అక్కడ సీతాలక్ష్మణులతో నువ్వు సుఖంగా వుండవచ్చు" అని చెప్తాడు.

సుతీక్ష్ణ మహాముని చెప్పిన తోవ పట్టుకుని, అడవిలో ముగ్గురూ బయల్దేరి పోతూ, మార్గమధ్యంలో అందమైన వంకలను, సంతోషకరంగా వున్న సరస్సులను చూశారు వారు. ఇవన్నీ చూసి, రామచంద్రుడు మనస్సు సంతోషంతో పొంగిపోగా, లక్ష్మణుడితో ఇలా అన్నాడు: "లక్ష్మణా! మనకు సుతీక్ష్ణుడు చెప్పిన గుర్తులు ఇక్కడ కనిపిస్తున్నాయి. అగస్త్య సొదరుడి ఆశ్రమం ఇదే. మనోహరంగా, సంతోషకరంగా వుందిది. దీన్ని చూడు. లక్ష్మణా! చూడు.

పళ్ల, పూల, మొగ్గల బరువు వల్ల చెట్లకొమ్మలు నేలనంటుతున్నాయి. పండిన రావిపళ్ల వగరు వాసనలు వాయుదేవుడు తెస్తున్నాడు. అక్కడక్కడా అగ్నిహోత్రాల కోసం చీల్చివేయబడిన కట్టెపుల్లల రాసులు కూడా వున్నాయి. దర్భలు నేలమీద పడి వున్నాయి. నల్లని మేఘాల లాగా అగ్నిహోత్రుడి పొగ కొనలు కనబడుతున్నాయి. అగస్త్యుడి తమ్ముడి ఆశ్రమమని మనం దేన్ని గురించి విన్నామో అది నిశ్చయంగా ఇదే. ఇక్కడున్న సుదర్శనుడు లోకాలను ఏలేందుకు ఎవరైతే రాక్షసులను చంపి, ప్రజలు దక్షిణంగా వుండేట్లు చేశాడో అతడి తమ్ముడే.

## లక్ష్మణుడికి వాతాపీల్వలుల చరిత్ర చెప్పిన శ్రీరాముడు

పూర్వం ఒకప్పుడు వాతాపి, ఇల్వలుడు అనే సోదరులు బ్రాహ్మణ వేషం వేసి బ్రాహ్మణులను చంపుతుండేవారు. ఇల్వలుడు బ్రాహ్మణ వేషం వేసుకుని, బ్రాహ్మణుల దగ్గరకు పోయి, ఆ రోజున తన ఇంట్లో శ్రాద్ధం వుందనీ, నిమంత్రణకు రమ్మనీ, సంస్కృత భాషలో పిలుస్తాడు. పిలిచింది నిజమైన బ్రాహ్మణుడే అని మోసపోయి అంగీకరిస్తారు బ్రాహ్మణులు. వాడు తన తమ్ముడిని మేకగా చేసి, చంపి, ఆ మాంసాన్ని బ్రాహ్మణులకు వడ్డించేవాడు. (పూర్వకాలంలో మాంసం తినేవారు బ్రాహ్మణులు కూడా. దానిలోని చెడు గుణాలను, ఇలాంటి మోసాలను తెలుసుకొని దానిని నిషేధించారు). బ్రాహ్మణులు నోరారా తిని పొట్టలు తడవుకొంటూ కూర్చోగానే, ఇల్వలుడు "వాతాపీ రమ్మ...అని పిలిచేవాడు. అలా పిలవగానే వాతాపి వారి పొట్టలు చీల్చుకొని బయటకు వచ్చేవాడు. ఆ బ్రాహ్మణులు చనిపోయేవారు. వారిని వారిరువురూ పీకి తినేవారు.

ఈ విధంగా రాక్షసులవల్ల వేలాది మంది బ్రాహ్మణులు చనిపోయారు. అప్పుడు దేవతలు ప్రార్థించగా అగస్త్యుడు వారిని తన తపఃప్రభావం వల్ల శాంతింప చేశాడు. ఒకనాడు వీరు అగస్త్యుడికి నిమంత్రణం చెప్పగా అయన అంగీకరించి, భోజనానికి వెళ్ళి సర్వం బక్షించాడు. శ్రాద్ధం ముగించిన తరువాత ఎప్పటిలాగా ఇల్వలుడు 'వాతాపీ' అని పిలిచాడు. అగస్త్యుడు అప్పుడు "నీ తమ్ముడి మీద రాక్షసాధమా, ఎందుకు భ్రాంతి? నీ తమ్ముడు జీవించి వున్నాడని అనుకుంటున్నావా? నీ భ్రాత చచ్చిపోయాడని తెలియదా? నా కడుపులోంచి బయటకు రావడం సాధ్యమా? నీ తమ్ముడు ఎక్కడ వున్నాడో చెప్తా విను. మేకలాగా నా కడుపులో పడి జీర్ణమై నరకానికి పోయాడు తెలియదా?" అని

మందహాసంతో పలికాడు.

తన తమ్ముడు చనిపోయాడని తెలుసుకున్న ఇల్వలుడు కోపంతో అగస్త్యుడిని చంపడానికి ఆయన మీదకు పోవదానికి ప్రయత్నించగా, ఆ ముని, నిప్పులు కక్కే చూపులతో అతడిని భస్మం చేశాడు. అలాంటి మహిమ కలవాడి ఆశ్రమం ఇదే లక్ష్మణా, అని చెప్పాడు శ్రీరాముడు. ఇలా చెప్తున్న సమయంలో సూర్యుడు అస్తమించే సమయం కావడంతో, సాయం సంధ్య వార్చి, మునీశ్వరుడు ఇచ్చిన పళ్లను తిని, ఆ రాత్రి అక్కడె గడిపారు సీతారామలక్ష్మణులు. ఆ తరువాత మునీశ్వరుడి అన్నను దర్శించడానికి పోవడానికి అనుమతి కోరారు. అనుమతి లభించగానే, సుతీక్ష్ణుడు చెప్పిన దారి వెంట పోసాగారు. దారిలో రకరకాల చెట్లను, పొదలను, తోపులను, మద్దులను, తాటిచెట్లను, తుమ్మ చెట్లను, పూల చెట్లను, ఆ వనంలో చూసారు. అలా పోతూ అగస్త్యుడి ఆశ్రమం పొలిమేరలకు చేరుకున్నారు.

## అగస్త్యాశ్రమం చూసిన శ్రీరాముడు

అగస్త్యాశ్రమానికి చేరువవుతూనే శ్రీరాముడు లక్ష్మణుడితో, "లక్ష్మణా! ఇక్కడికి సమీపంలోనే తన మహిమవల్ల అగస్త్యుడని ప్రసిద్ధికెక్కిన మునీశ్వరుడి ఆశ్రమం వుంది. ఈ వనం హోమధూమంతో నిండి వుంది. అలసిపోయినవారికి విశ్రాంతినిస్తుంది. నారచీరెలతో అందంగా వుంది. శాంతమైన మృగాలున్నాయి. రమ్యమైన పక్షుల ధ్వనులు వినిపిస్తున్నాయి. కాబట్టి ఇది ఋష్యాశ్రమాలలో చేరిన ప్రదేశమే. ఈ పుణ్యాత్ముడు ఈ దక్షిణ దిక్కికు వచ్చిన తరువాత రాక్షసులు క్రూర స్వభావం వదలి భయంతో ఋషులను సమీపించి హింసించడం లేదు. దక్షిణ దిశకు అగస్త్య దిశ అని పేరుంది. సూర్యుడిని అడ్డగించాలనుకున్న వింధ్యపర్వతం ఈయన ఆజ్ఞతో నేలతో సమానమైంది. అగస్త్యుడు చిరకాలం జీవించి వుండేవాడు. ఇతడి ఆశ్రమంలో అందరూ వినయవంతులు... భయభక్తులున్నవారు. ఈయనను వీరు–వారు అనే భేధం లేకుండా అందరూ సేవిస్తారు. కాబట్టి మనం సేవిస్తే మనకూ మేలు కలుగుతుంది. మనం వనవాసం చేయాల్సిన పద్నాలుగేళ్లలో గడచిపోయిన కాలం పోగా, మిగిలిన కాలం ఈయనను కొలిచి ఈ ఆశ్రమంలోనే వుందాం. ఈయన ఆహార నియమాలు కలవాడై అల్పాహారమే తీసుకుంటాడు కాబట్టి ఈయనను గంధర్వులు వచ్చి చూసి పోతుంటారు. వంచకులు, అసత్యవాదులు ఈ ఆశ్రమంలో బతకలేరు.

దేవ–యక్ష–గంధర్వులు కూడా ఇక్కడ ఆహార నియమాలు పాటిస్తారు. ధర్మంలో ప్రేమగా వుంటారు. ఇక్కడ తపస్సు చేసిన అనేకమంది తమ తపస్సిద్ధి వల్ల దేహం వదలి సూర్య తేజంతో విమానాల మీద దేవలోకాలకు పోయారు. ఇక్కడికి ఋషులు మాత్రమే కాకుండా ఇతర భూతాలు కూడా వస్తు–పోతూ వుంటాయి. దేవతలను దర్శించి, వారిని స్తుతించి, నమస్కారం చేయడం వల్ల, దేవతలు వారికీ దేవత్వాన్ని, యక్షత్వాన్నీ అనుగ్రహిస్తారు. లక్ష్మణా, అగస్త్యు ఆశ్రమానికి వచ్చాం. నువ్వు ముందుగా పోయి, నేను, జానకి వచ్చామని చెప్పు. త్వరగా పో" అనగా లక్ష్మణుడు అలాగే చేశాడు.

సర్గ-12

# తనరాక అగస్త్యుడికి తెలియచేయమని లక్ష్మణుడిని పంపిన శ్రీరాముడు

ఆశ్రమ ప్రదేశం ప్రవేశించిన లక్ష్మణుడు అక్కడున్న అగస్త్య ముని శిష్యుడిని చూసి, అయ్యా! దశరథ మహారాజు పెద్ద కొడుకు, సీతాదేవి భర్త, శ్రీరామచంద్రమూర్తి భార్యతో కూడి ముని దర్శనార్థమై వచ్చాడని చెప్పాడు. "ఆ రాముడి తమ్ముడిని. నా పేరు లక్ష్మణుడు. నేనాయనకు హితుడను, భక్తుడిని, అనుకూలుడిని, ఎల్ల వేళల ఆయన్నే సేవిస్తాను. జనకాజ్ఞ పాలించాలన్న నీతినను సరించి అడవులకు వచ్చాం. మీ గురువు అగస్త్య మునిని దర్శించాలను కుంటున్నాం. మేము వచ్చిన సంగతి ఆయనకు చెప్పి హోమగృహంలో వున్న అగస్త్యుడితో చెప్పి పుణ్యం కట్టుకోండి" అని లక్ష్మణుడు చెప్పగా. అలానే అనుకుంటూ, హోమగృహంలో వున్న అగస్త్యుడితో దశరథ రాజకుమారులు, సీతాసమేతంగా ఆయన సేవకొరకు వచ్చారని చెప్పారు. మునీంద్రుడు ఆజ్ఞ ఇస్తే తీసుకొస్తామని అంటారు.

### అగస్త్యాశ్రమం లోపలికి పోయిన శ్రీ సీతారామలక్ష్మణులు

ముని శిష్యుడు అలా చెప్పగానే, "ఔరా నా అదృష్టం...ఇన్నాళ్లకైనా

రామచంద్రమూర్తి ఇక్కడికి వచ్చాడు. అదే చాలు. సాధుయోగ్యమైన నడవడి కల ఆయన ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తున్నాను. ఆ ముగ్గురిని పూర్ణ భక్తితో భోగ్యమైన విధంగా ఇక్కడికి తీసుకుని రా. అనావశ్యకమైనా ఆలశ్యం ఎందుకు చేశావు? సీతారామలక్ష్మణుల పేర్లు వినగానే వెంటనే పిలుచుకుని రావాలి కదా? నువ్వు రావడానికి, పోవడానికి ఇంత సమయం తీసుకుని, వ్యర్థం చేసి, వాళ్లను బయట నిలబెట్టవచ్చా? వాళ్లు మన వాకిట్లో నిలబడాల్సినవారా?" అని అగస్త్యుడు అనగానే, శిష్యుడు గురువుకు నమస్కారం చేసి, పరుగెత్తుకుంటూ పోయి, లక్ష్మణుడితో ఆయనను, రామచంద్రమూర్తిని, సీతతో సహా రమ్మని చెప్పాడు. వారంతా కలిసి శీఘ్రంగా లోపలికి పోయారు. పోతూ అక్కడ వారు... బ్రహ్మ స్థానం (బ్రహ్మను ఆవహింప చేసి పూజించే స్థానం), అగ్ని స్థానం, శ్రీవిష్ణు స్థానం, ఇంద్రుడి స్థానం, సూర్య స్థానం, చంద్ర స్థానం, భగుడి స్థానం, కుబేర స్థానం, ధాత స్థానం, విధాత స్థానం, వాయు స్థానం, ఆదిశేషుడి స్థానం, గాయత్రీ స్థానం, వసువుల స్థానం, వరుణుడి స్థానం, కుమార స్వామి స్థానం, ధర్ముడి స్థానం...అనే పూజా ప్రదేశాలను చూశారు. అలా పోతూ...పోతూ, శిష్యులతో కూడి అగస్త్యుడు ఎదురుగా రాగా,ఆయన్ను చూసిన శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణుడితో వచ్చే వాడే అగస్త్యుడు అని చెప్పాడు.

## అగస్త్యుడిని దర్శించుకున్న సీతారామలక్ష్మణులు

వచ్చే వాడే అగస్త్యుడని ఎలా చెప్పగలిగాడో రాముడంటే...ఆయన బ్రహ్మ వర్చస్సు బట్టి తెలుసుకున్నానంటాడు. ఆయన రాగానే శ్రీరాముడు ఆయన్ను సమీపించి,పాదాలమీద వాలాడు. ఆ తరువాత సీతాదేవి, లక్ష్మణుడు శ్రద్ధగా అలానే చేసారు. ఆ తరువాత వారంతా అభివందనం చేసి నిలుచుని వుండగా, ఆ ముని శ్రేష్టుడు శ్రీరామచంద్రమూర్తిని అతిథిగా గ్రహించి, ప్రేమతో అతిథులకు ఇవ్వాల్సిన అర్ఘ్యం, పాద్యం ఇచ్చి, పూజించి, యోగక్షేమాలు విచారించి, కూర్చోమని చెప్పాడు. తరువాత వానప్రస్థ ధర్మం ప్రకారం నిండుగా, తృప్తి కలిగేట్లు వారికి భోజనం పెట్టాడు. దాంతర్వాత, నిర్మల ధర్మజ్ఞానంలో పండితుడైన శ్రీరామచంద్రుడిని చూసి, వానప్రస్థగృహస్థ ధర్మాలు తెలిసే విధంగా ఇలా చెప్పాడు.

"సమస్త ప్రపంచానికి, అందులోని జనులకు, నీవే ప్రభువువి. నీవే మహారథుడవు...నీవే మూర్తీభవించిన ధర్మాత్ముడవు. విశేషంగా ప్రకాశించే

కీర్తికలవాడివి. గౌరవించాల్సిన ఆకారం కలవాడివి నీవే. ఎంతటి పూజకైనా పూర్ణంగా తగినవాడివి. భూపతివైన నీవు ప్రియాతిథివై వచ్చావు. ఇంతకు మించినపుణ్యం ఇంకేమైనా వుంటుందా?" అని చెప్పి వారికి కడుపునిండా పళ్లను, వేళ్లను, పూలను, తినటానికిచ్చి, ఆ తరువాత శ్రీరామచంద్రమూర్తికి ఒక గొప్ప విల్లు, అక్షయ బాణాలు, తూణీరాలు చూపించి ఇలా చెప్పాడు.

## శ్రీరాముడికి వైష్ణవాయుధాలు సమర్పించిన అగస్త్యుడు

"దేవసంబంధమై, పూజ్యమై, బంగారు రత్నాలతో అలంకరించబడిన అసమానమైన ఈ విష్ణు ధనస్సు విశ్వకర్మ నిర్మించాడు. ఈ బాణ సమూహం వ్యర్థం కాదు. సూర్యుడి కాంతిలాంటి కాంతికలదిది. ఇది బ్రహ్మ ఇచ్చాడు. ఈ అక్షయ బాణాలు, పదునైన బాణాలతో నిండిన అమ్ముల పొదులు, బంగారు పిడికల కత్తి, దాని ఒర ఇంద్రుడిచ్చాడు. సూర్య తేజా! ఈ వింటితో విష్ణుదేవుడు రాక్షసులను యుద్ధంలో చంపి, జయం పొందాడు. ఈ బాణాలు, కత్తి, పొదులు ఆయన యుద్ధంలో ఉపయోగించినవే. నీకూ జయం కలగడానికి ఇంద్రుడు వజ్రాయుధాన్ని తీసుకున్నట్లు వీటిని గ్రహించు" అని అంటూ ఆ శ్రేష్ఠమైన ఆయుధాలను శ్రీరామచంద్రమూర్తికిచ్చి మళ్లీ ఇలా అన్నాడు.

సర్గ–13

# శ్రీరాముడితో సల్లాపాలాడిన అగస్త్యుడు

"శ్రీరామచంద్రా! లక్ష్మణా! మీరు సీతాదేవితో సహా నన్ను చూడడానికి రావడం నాకు మిక్కిలి సంతోషాన్నించింది. మీరు అలసటతో వున్నారు. సీతాదేవికి కూడా బడలిక తీర్చుకోవాలని వుంది. ఈమె రాచకూతురు కదా! సుకుమార దేహం కలది. ఎన్నడూ కష్టపడలేదు. అలాంటి చిన్న వయసుది కష్టాలకు నిలయమైన అడవులకు భర్తమీద కల గాఢమైన ప్రేమవల్ల నీ వెంట వచ్చి, అసాధ్యకార్యం చేసింది. కాబట్టి నువ్వు ఆమెకు ఏది సుఖమో దానినే చేయి. మీరిక్కడే హాయిగా వుండవచ్చు. నీ ఇల్లాలు సీతాదేవిలో చంచల మనసున్న స్త్రీలలో వుండే దోషం ఒక్కటైనా స్వల్పంగానైనా లేదు. ఈమె పతివ్రతలతో పూజించతగింది. ఆ అరుంధతే ఈమెకు సమానురాలు. ఇలాంటి సీతాదేవి, అలాగే, నీ సేవకై స్వార్థం, సర్వం త్యాగం చేసిన ఈ లక్ష్మణుడు, ఇలాంటి వారి సేవకు యోగ్యుడవైన నువ్వు, ఇక్కడుంటే రామచంద్రా, ఇది మిక్కిలి శోభాయమానంగా పవిత్రమవుతుంది" అని చెప్పగా శ్రీరామచంద్రమూర్తి అగస్త్యుడితో ఇలా జవాబిచ్చాడు.

"భార్యతో, తమ్ముడితో, భయంకరమైన అడవిలో తిరుగుతున్న నా గుణాలు మీకు సంతోషం కలిగించాయి కాబట్టి నీ దయవల్ల నేను ధన్యుడనైనాను. నీటి సౌకర్యం కలిగి, దట్టమైన అడవులుండే ప్రదేశాన్ని చూపిస్తే, అక్కడే వ్రతకాలం

పూర్తయ్యేదాకా కాలం గడుపుతాం" అని శ్రీరామచంద్రమూర్తి అడగ్గా, అగస్త్యుడు కాసేపు ఆలోచించి శ్రీరాముడితో ఇలా అన్నాడు. "శ్రీరామభద్రా! విను. విస్తారమైన మూలాలు, ఫలాలు, నీళ్లు కలిగి, నానావిధములైన మృగాలతో కూడిన 'పంచవటి' అనే ఒక గొప్ప స్థలం ఇక్కడికి రెండామడల దూరంలో వుంది. అది సుఖమైన ప్రదేశం. మీరు విధించుకున్న పద్నాలుగు సంవత్సరాల గడువులో చాలా కాలం గడిచిపోయింది. తక్కిన కాలం మీరక్కడ ఆశ్రమం స్థాపించుకుని తండ్రి వాక్యాన్ని నెరవేర్చండి. రామచంద్రా! నువ్వు పద్నాలుగు సంవత్సరాలు వనవాసం చేస్తానని చేసిన ప్రతిజ్ఞ పూర్తిగా నెరవేర్చి రాజువై సుఖిస్తావు".

"నువ్వు పెద్దకొడుకువు అయినందున నీ తండ్రి కోరిక మేరకు రాజ్యం ఏలుతావు. దసరథుడి మీద నాకున్న ప్రేమవల్ల అతడి కొడుకైన నీ చరిత్ర అంతా, నీలోని ఆలోచనా విధానమంతా, నా తపోబలం వల్ల తెలుసుకున్నాను. నేనేం ఆలోచన చేశానో చెప్పమంటావా? నీ అభిప్రాయం ప్రకారమే మిమ్మల్ని ఇక్కడ వుండమని అన్నాను. నువ్వు నా అభిప్రాయం తెలుసుకొని నిండారు అడవులున్న ఆశ్రమ ప్రదేసం చెప్పమని అడిగావు. తదనుగుణంగానే మిమ్మల్ని పంచవటికి పొమ్మని చెప్పాను. మిమ్మల్ని మొదట నా దగ్గర వుండమని చెప్దామనుకున్నా కాని, మీ అభిప్రాయం ప్రకారమే పంచవటికి పొమ్మన్నాను. నీ సంకల్పానికి విరుద్ధంగా నేనెలా చేస్తాను? శ్రీరామచంద్రా! ఇది ఇది మిక్కిలి మెచ్చుకోవాల్సిన ప్రదేశం. చాలా అందమైంది. గోదావరి నది సమీపంలో వుంది. పళ్లు, పూలు బాగా లభిస్తాయి. పక్షులు, మృగాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. జనులుండరు. సీతాదేవికి చాలా సంతోషం కలిగిస్తుంది. ఇక్కడికి ఎక్కువ దూరం కూడా కాదు. మీరు జానకితో ఆ ప్రదేశంలో వుండి మునులను రక్షించి, గొప్ప పేరు తెచ్చుకోండి. అక్కడి పోయే దారి చూపిస్తాను. రామచంద్రా! ఇదిగో చూడు.... ఇప్పతోపు కనిపిస్తున్నది....దానికి ఉత్తరంగా పోతే ఒక మర్రి చెట్టు కనిపిస్తుంది. ఆ తరువాత మిట్ట ప్రదేశం, చెట్లు లేని స్థలం కనిపిస్తుంది. అది దాటిపోతే ఒక పర్వతం వుంటుంది. దాని దగ్గరలోనే పంచవటి వుంది".

అని చెప్పగా రామలక్ష్మణులు మునీశ్వరుడికి నమస్కారం చేసి, ఆయన దగ్గర శలవు తీసుకుని, ఆయుధాలు ధరించి, అగస్త్యుడు చెప్పిన మార్గంలో పంచవటికి మెల్లగా పోయారు.

సర్గ–14

# జటాయువును చూసిన శ్రీరాముడు

పంచవటికి వెళ్తున్న రామలక్ష్మణులకు పెద్ద దేహం కల గద్దరాజును, మహా పరాక్రమవంతుడిని, అగస్త్యుడు చెప్పిన మర్రిచెట్టు మీద వుండగా చూసి, రాక్షసుడీరూపంలో వున్నాడని భావించారు. అతడిని ఎవరని అడిగారు వారు. జవాబుగా "రామచంద్రా! మీ తండ్రికి నేను మిక్కిలి ప్రియమైన స్నేహితుడిని" అని చెప్పగా, వారి సంతోషించి, ఆయనను తమ తండ్రిలాగా గౌరవించి, ఆయన పేరు జటాయువు అని తెలుసుకున్నారు. జటాయువు తన పూర్వకథను, భూతాలు పుట్టిన విధం మొదలు పెట్టి చెప్పసాగాడు.

"భూత సృష్టికి కారణభూతులై, పూర్వం కొందరు ప్రజాపతులు ఉద్భవించారు. వాళ్లలో మొదటివాడు కర్దముడు. ఆ తరువాత విక్రీతుడు, శేషుడు, సంశ్రయుడు, స్థాణువు, మరీచి, అత్రి, క్రతువు, పులస్త్యుడు, అంగిరుడు, ప్రచేతుడు, పులహుడు, దక్షుడు, వివస్వతుడు చివరగా కశ్యపుడు ఉద్భవించారు. వీళ్లలో దక్షుడికి నలభై మంది కూతుళ్లు పుట్టారు. వాళ్లలో ఎనిమిదిమందిని కశ్యపుడు పెళ్లి చేసుకున్నాడు. వాళ్ల పేర్లు: అదితి, దితి, దనువు, కాళి, క్రోధవశ, తామ్ర, మనువు, అనల. ఈ ఎనిమిదిమందిని భార్యలుగా చేసుకున్న కశ్యపుడు వాళ్లతో ఇలాఅన్నాడు...'మీరు మూడులోకాలను రక్షించేందుకు సమర్థులైన వాళ్లను, నాతో సమానమైన వారిని, కనండి'. ఈ మాటలకు అదితి, దితి, దనువు,

కాళి అంగీకరించారు. మిగతావారు భర్త మాటను అంగీకరించలేదు. దరిమిలా, అదితి పదకొండు మంది రుద్రులను, ఎనిమిదిమంది వసువులను, ఇద్దరు అశ్వినేయులను, పన్నెండు మంది ఆదిత్యులను, ముప్పై మూడు మంది దేవతలను కనింది. వీరంతా స్వర్గవాసులు. దితికి దైత్యులు పుట్టారు. సముద్రాలతో, వనాలతో కూడిన ఈ భూమంతా మొదలు వారిదే. దనువుకు అశ్వగ్రీవుడనేవాడు, కాళికకు నరకుడు, కాలకుడు అనేవారు జన్మించారు".

"తామ్రకు క్రౌంచి, భాసి, శ్యేని, ధృతరాష్ట్రి, శుకి అనే ఐదుగురు కలిగారు. వారిలో క్రౌంచి ఊలూకాలను (గూబలు) కూడి భాసాలను కనింది. శ్యేని గద్దలను, డేగలను కనింది. ధృతరాష్ట్రి హంసలను, కలహంసలను, చక్రవాకాలను కనింది. శుకి నతను కనింది. సత వినతను కనింది. క్రోధ అనే భార్యకు ఐదుగురు కూతుళ్లు, సురస, మృగమంద, హరి, శ్వేత, సురభి, భద్రమద, మాతంగి, శార్దూలి, కద్రుక, మృగు పుట్టారు. మృగికి జింకలు పుట్టాయి. మృగమంద అనే ఆమెకు ఎలుగులు, సృమరాలు, చమరాలు జన్మించాయి. హరి అనే ఆమెకు సింహాలు; భద్రమతకు ఇరావతి; దానికి ఐరావత గజం, మాతంగోవులు, గంధర్వికి గుర్రాలు జన్మించాయి. శార్దూలికి వ్యాఘ్రాలు, గోలూంగాలు; శ్వేతకు దిగ్గజాలు; సురభికి రోహిణి, గంధర్వి; రోహిణికి గోవులు, గంధర్వికి గుర్రాలు జన్మించాయి. సురసకు పడగల నాగుపాము పుట్టింది. కద్రువకు పాములు పుట్టాయి".

"మనువుకు మనుష్యులు పుట్టారు. మానవులు, మనుజులు అనే శబ్దానికి ఇదే సరైన ఉత్పత్తి అర్థం. మనుస్మృతికారుడైన మనువు వల్ల పాలించబడినవారిని మానవులు, లేదా, మనుజులు అనవచ్చు. ఈ మనుజులలో నాలుగు భేదాలున్నాయి. అవే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనేవి. అనలకు సమస్థమైన ఫల వృక్షాలు జన్మించాయి. శుకి కూతురు, సతకూతురైన వినతకు అరుణుడు, గరుడు అనే ఇద్దరు కొడుకులు పుట్టారు. సురస చెల్లెలైన కద్రువకు భూమిని మోసే వేయిపడగల శేషుడు పుట్టాడు. కద్రువ నాగమాత అయింది. ఇక నేను సంపాతికి తమ్ముడిని. నా పేరు జటాయువు. శ్యేని కుమారుడిని.... నీకిష్టమైతే నీకు నేను సహాయం చేస్తాను".

(జటాయువు వంశ పరంపర...కశ్యపుడు...శుకి...నత...వినత... అనూరుడు... జటాయువు...అంటే, కశ్యపుడికి ఆరవ వాడు జటాయువు. శ్యేని, శుకి అనే వారిద్దరు కశ్యపుడు భార్య అయిన తామ్ర కూతుళ్లు. జటాయువు, తన

తల్లి పేరు శ్యేని అన్నాడు కాని, తనకు ముత్తవ్వ అని చెప్పలేదు. కాబట్టి ఆమె కన్న మరొక ఆమె కలదని అనుకోవాలి).

"మాకు ఇతరుల సహాయం ఎందుకు? నువ్వేం సహాయం చేస్తావంటావేమో? చేయగలవని అడుగుతావేమో? ఈ అడవి ప్రవేశించలేనిది. తోవలు, డొంకలు సరిగ్గా లేవు. జనసంచారం అసలే లేదు. కంపలుకొట్టి తోవ చేయడం సాధ్యపడదు. దానికి తోడు ఇక్కడ రాక్షసులుంటారు. ఈ సందర్భంలో, మీరిద్దరూ అడవికి వేటకు పోతే, ఒంటరిగా వున్న సీతాదేవికి, మృగాల బాధ, రాక్షసుల బాధ లేకుండా నా బలంతో ఆమెను రక్షిస్తాను" అని జటాయువు చెప్పాడు.

జటాయువు మాటలన్నీ ప్రీతితో విన్న శ్రీరాముడు తన తండ్రి స్నేహితుడైన ఆయనను సంతోషంగా కౌగలించుకుని, తన తండ్రికి ఆయనకు కలిగిన స్నేహ విషయమంతా విని, ఇక తన భార్య సీత రక్షన భారం ఆయనదే అని ఆయనకు అప్పగించి, అంతా కలిసి పంచవటి చూడడానికి వెళ్లారు. ఆ తరువాత వారంతా శీఘ్రంగా పంచవటి చేరుకున్నారు.

సర్గ-15

# పంచవటి ప్రవేశించిన సీతారామలక్ష్మణులు

అనేకానేక సర్పాలతో, మృగాలతో నిండిన ఆ పంచవటిని చూసిన శ్రీరాముడు, తన అన్నా-వదినెలకు శుశ్రూష చేయడానికి తగిన స్థలం దొరికిందికదా అని సంతోషిస్తున్న లక్ష్మణుడితో తియ్యని మాటలతో ఇలా అన్నాడు. "లక్ష్మణా! పంచవటి అని ప్రఖ్యాతిగన్న ప్రదేశం ఇదే. చక్కగా పూసిన తీగలు, చెట్లు, గుంపులు-గుంపులుగా, కన్నుల పండుగగా కనపడుతున్నాయి. ఇక్కడ సీతకు, నీకు, నాకు, మన ముగ్గురికి అనుకూలమైన, సంతోషకరమైన స్థలమేదో చూడు. నీటికి దూరంగా వుండకూడదు. మనసుకు ఇంపైనదిగా, నీటికి దూరం లేకుండా, స్వేచ్ఛా విహారానికి యోగ్యమైందిగా వుందాలి. నేల చదునుగా, పడుకోవడానికి సుఖంగా వుండాలి. నువ్వు తేవడానికి అవసరమైన పూలు, కట్టెలు, దర్భలు దండిగా దగ్గరలోనే వుండాలి. గట్టి నేల కాకుండా పడుకోవడానికి, కూర్చోవడానికి, అనుకూలంగా మెత్తని నేలగా వుండాలి. పెంట, పేడ కుప్పలు లేకుండా నిర్మలంగా వుండాలి. మనం కొన్నాళ్లు ఇక్కడే వుంటాం. కాబట్టి అనుకూలమైన ప్రదేశమైతే మంచిదు కదా? అందుకే మన ముగ్గురికీ సౌఖ్యమైన స్థలాన్ని చూడు".

ఇలా శ్రీరామచంద్రమూర్తి చెప్పగా లక్ష్మణుడు చేతులు జోడించి, నమస్కారం చేసి, సీతాదేవి సమక్షంలో ఇలా అన్నాడు. "భూజనులను సంతోషింప చేయగల

స్వభావం కలవాడా! మీరిక్కడ వందలేళ్లు సంతోషంగా, స్థిరంగా వున్నప్పటికీ మీకు నేను దాసుడనే కానీ, స్వతంత్రుడిని కాను. కాబట్టి మీరే ప్రేమతో మీకిష్టమైన, సమ్మతమైన స్థలంలో ఆశ్రమం నిర్మించ్డానికి నాకు ఆజ్ఞ ఇవ్వండి" అన్నాడు. (లక్ష్మణుడు రామకైంకర్యమే చిహ్నంగా వున్నవాడు). లక్ష్మణుడు ఇలా చెప్పగానే ఆయన మాటలకు సంతోషించిన శ్రీరాముడు తగిన స్థలాన్ని నిశ్చయించి, తమ్ముడు చేయి పట్టుకుని, ఆ ప్రదేశం మిట్టపల్లాలు లేకుండా చదరంగా వున్నదనీ, అక్కడ ఆశ్రమం నిర్మించమనీ అంటాడు. "ఎర్రతామరలతో నిండి, అందమై, లక్ష్మీదేవి సేవించే తామరకొలను దగ్గర్లోనే వుంది. మనమక్కడి నీళ్లనే వాడుకోవచ్చు. అగస్త్యుడు చెప్పిన గోదావరి నది కమలాలు, హంసలు, చక్రవాకాలతో కూడి ప్రకాశిస్తున్నదిక్కడే. ఇదెక్కువ దగ్గరలో లేదు, దూరంగా కూడా లేదు. నెమిళ్ల ధ్వనులతో, పెద్ద వృక్షాలతో నిండిన పర్వతాలు ఎక్కువ దూరంలో కాకుండా, మరీ దగ్గరలో కాకుండా వున్నాయి. తమ్ముడా...అనేకమైన లోహాలతో ఈ భూప్రదేశం రంగులు పూసిన ఏనుగులా వుంది చూశావా? పర్వతాలు ప్రకాశిస్తున్న ఈ ప్రదేశం శ్లాఘ్యంగా వుంది. మృగాలు, పక్షులు వుండడంతో అందంగా వుందీ ప్రదేశం. పుణ్యం కూడా ఇస్తున్నదిది. కాబట్టి ఇక్కడే మనకు జటాయువు తోడుండగా వుందాం. త్వరగా పర్ణశాల నిర్మించు" అని శ్రీరాముడు అనగానే, లక్ష్మణుడు ఒక ఆకుల ఇంటిని కట్టాడక్కడ.

## పంచవటిలో పర్ణశాల నిర్మించిన లక్ష్మణుడు

భూమిలో పునాది తీసి, చక్కా గోడలు కట్టి, లావాటైన వెదుళ్లు స్థంబాలుగా నాటి, వాటిమీద బక్కటి, సన్నటి వెదుళ్లను పరచి, జమ్మికొమ్మలు వాసాలుగా చేసి, నారలతో గట్టిగా బిగించి, ఆ వెదుళ్ల మీద బోద రెల్లును దట్టంగా కప్పి, నేలను చదరంగా, నున్నగా చేసి, దిమ్మెసతో మూడు-నాలుగు సార్లు నీళ్లు చల్లి కుటీరాన్ని సిద్ధం చేశాడు లక్ష్మణుడు. ఇలా కుటీరాన్ని సిద్ధం చేసిన లక్ష్మణుడు, గోదావరి నదికి పోయి, స్నానం చేసి, ఆలశ్యం చేయకుండా పళ్ళు, పూలు తెచ్చి, వాస్తు బలి ఇచ్చి, శాంతి కార్యాలు పూర్తిచేసి, ఆశ్రమాన్ని అన్నకు చూపించాడు. సీతతో కలిసి శ్రీరాముడు దాన్ని చూసి సంతోషించి, తమ్ముడిని కౌగలించుకుని ప్రేమతో, ఆయన చేసిన గొప్ప పనికి తానేమి సమానమైన కానుక ఇవ్వగలను అని అంటూ, ప్రేమతో మళ్లీ కౌగలించుకున్నాడు. ఇంకా ఇలా అన్నాడు: "చిన్నవాడా! నీ శక్తిని ఏమని మెచ్చుకోగలను? పాపరహితుడా! నా

అభిప్రాయాన్ని నేను చెప్పకుండానే తెలుసుకోగలవు. నీతిని ఎరిగినవాడివి. ఏదెలా చేస్తే నాకు ఇష్టమో తెలిసినవాడివి. ఇలాంటి నిన్ను, మిగుల శుద్ధుడిని కని ధర్మాత్ముడైన తండ్రి మరణించినా నా పాలిటికి బతికే వున్నవాడు. నువ్వుండబట్టి ఆయన లేడే అన్న కొరత రావడం లేదు" అని చెప్పి సుఖంగా, స్వర్గంలో విష్ణువు లాగా అక్కడే కొంతకాలం నివసించారు.

(పంచవటి స్థలం ఏదనే వివాదం చిరకాలంగా అనేకమందిని బాధిస్తున్నది. భద్రాచలం దగ్గరున్న పర్ణశాల అని కొందరు, నాసిక దగ్గర అని మరి కొందరు, అభిప్రాయ పడుతున్నారు. వీటిల్లో ఏది సత్యమో అనే విషయాన్ని రామాయణాన్ని బట్టి, స్థలశోధనాన్ని బట్టి నిర్ధారించాల్సి వుంది. పంచవటి గోదావరీ తీరంలో వుందనే విషయం నిర్వివాదాంశం. పంచవటి దగ్గర గోదావరి నది ఉత్తరాన్నుండి దక్షిణానికి పారుతూ వుండాలి. ఎందుకంటే రామలక్ష్మణులు సీతాపహరణం తరువాత ఆమెను వెతుక్కుంటూ గోదావరీ తీరాన వెళ్లారు. ఇలా వెళ్తున్న రామలక్ష్మణులకు దక్షిణ దిక్కుగా సీత పోయిందని మృగాలు, పక్షులు చూపాయి. అప్పుడు రామలక్ష్మణులు నేరుగా దక్షిణానికి పోకుండా, నైఋతి దిశగా పోయి, గోదావరీ తీరంలో జటాయువును చూశారు. ఈ కారణాన, గోదావరి నది జటాయువు పడ్డ స్థలం దాకా, దక్షిణాభిముఖంగా పారుతుండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో రామలక్ష్మణులు నివాపాలు విడిచినందున వారున్న స్థలం గోదావరి తీరమే అయ్యుండాలి. ఇక్కడనుండి రామలక్ష్మణులు నైఋతిదిశగానే మూడు కోసుల దూరం పయనించారు. ఇంతదాకా తూర్పుగా పోవడానికి ఏరు అడ్డం వస్తుంది. కాబట్టి తూర్పుగా పోలేదు. కొంత తూర్పుగా పోతేనే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు. కాబట్టే అక్కడినుండి మూడు కోసులు తూర్పుగా పోయారనుకోవాలి. ఇప్పుడు ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన వున్నారు వారు. ఇలా వచ్చినందున వారికి గోదావరి దాటాల్సిన పనిలేదు. ఈ కారణాన పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన వున్నదని అంగీకరించాలి. తూర్పునే వుండి వున్నట్లయితే, గోదావరి దాటే వుండాలి. ఆ విషయాన్ని వాల్మీకి చెప్పలేదు.

ఇప్పటి పర్ణశాలే పంచవటి అని అనుకుంటే, వారొకవేళ నైరుతి దిక్కుగా ప్రయాణం చేసే వుంటే, ఏటి పాలు అయ్యేవారు. భద్రాచలం దగ్గర ఏరు దాటినట్లు కొందరు రాశారుకాని, అది ఆలోచించి రాసిన రాతకాదు. ఇప్పుడు అందరూ అనుకుంటున్న పర్ణశాల కాదు కాని, దానికి ఎదురు ఒడ్డున, చక్కగా

పంచవటి వుండేదని చెప్పొచ్చు. అలాగే ఒకాయన నాసికను పంచవటి అని పేర్కొన్నారు. అక్కడి నుండి దక్షిణంగా వచ్చినట్లు చెప్పారాయన. ఇది రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నదీ పశ్చిమ తీరాన వున్నదనడానికి స్థలం ఆధారంగా వుంది. పర్ణశాలకు ఎదురుగా రథగుట్ట అనేదొకటి వుంది. ఇక్కడ రావణాసురుడు తన రథాన్ని దాచిపెట్టాడని అంటారు. ఎందుకంటే సీతాపహరణ సందర్భంలో, రావణాసురుడు సీతాదేవిని ఎత్తుకుని రాగానే రథం సిద్ధంగా వుంది అని చెప్పడం జరిగింది. సమీపంలో అది కనపడనందున ఆ పని కొనసాగింది కాని, ఏటికి ఒక ఒడ్డున రథం; సీత, రావణుడు మరో ఒడ్డున వుంటే ఇది సాగి వుండేది కాదు. కాబట్టి పంచవటి పడమటి దిక్కునే వుండాలి. సీతాపహరణం ఆ పక్కనే అయి వుండాలి. అంతే కాదు....దీనికి సమీపంలోనే, సీత గుట్టలని పెద్ద పర్వతం వుంది. ఇక్కడ ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడుసీతాలక్ష్మణులు వున్నారని, ఆ కారణాన ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందని అంటారు. కాదనడానికి కారణం లేదు. తూర్పు ఒడ్డున వున్నట్లయితే, ఏరు దాటి పోయి, అక్కడి గుట్టల్లో వుండాల్సి వచ్చేది. ఈ గుట్ట కింద పడమటి దిక్కుగా పెద్ద బయలు ప్రదేశం వుంది. అక్కడ పద్నాలుగువేల రాక్షసులు నిలిచి యుద్ధం చేయగలిగే పెద్ద స్థలం వుండేది. సీతాలక్ష్మణులకు ఇక్కడ జరిగిన యుద్ధం గుట్ట మీదనుండి కనపడేది.

మరొక చోట వాల్మీకి రామాయణంలో పద్మ సరస్సు పంచవటికి దగ్గర్లోనే వుందని చెప్పడం జరిగింది. అది ఇప్పటిదాకా వుందో, లేదో, చెప్పడం సాధ్యపడదు కాని ఇలాంటి పెద్ద చెరువొకటి వున్నట్లు అక్కడుండే కోయవాళ్లు చెప్తుంటారు. ఈ చెరువుకూ, గోదావరి నదికి, మధ్య పంచవటి వుంది. వర్షాకాలంలో ఏటి నీళ్లు బురదగా వున్నప్పుడు ఈ చెరువు నీళ్లు సీతారామలక్ష్మణులు వాడుకునేవారు. ఇప్పటి పర్ణసాలకు దక్షిణంగా గోదావరీ తీరంలో భద్రాచలానికి వచ్చే తోవలో, దుమ్మగూడెం అనే వూరుంది. దీనికి ఎదురుగా ఏటికి ఆవలి ఒడ్డున ఒక చిన్న గుట్ట వుంది. దీని దగ్గరలోనే జటాయువుకు, రావణుడికి యుద్ధం జరిగిందని రామాయణంలో వుంది. ఇప్పుడు గోదావరి నది తూర్పు ఒడ్డు కోసుకొని వస్తున్నది. ఇప్పటి ఏటి మధ్యలో దుమ్మగూడేనికి చెందిన కొంత భాగం వుండేదట. అక్కడ అలా చూసిన వారు ఆంధ్రవాల్మీకికి చెప్పారా విషయాన్ని. వాస్తవానికి ధూమగూడెమే దుమ్మగూడెం అయింది. ఆ గుట్ట దగ్గరే జటాయువుకు సంస్కారాలు చేశాడు శ్రీరాముడు.

ఇప్పటి హంపే పంప అనీ, అక్కడే పర్ణశాల వున్నదనీ, చెప్పడానికి ఒక నిరాకరించలేని ప్రబల కారణం వుంది. రామలక్ష్మణులు లంకకు పోయేటప్పుడు ఏ మార్గంలో వెళ్లినా, లంక నుండి తిరిగొచ్చేటప్పుడు విమానాన్ని చక్కగా వచ్చేట్లు చేశారు కాని, వంకర-టింకరగా పోలేదనేది స్పష్టం. లంక నుండి సముద్రం దాటిన తరువాత, రామేశ్వరం దగ్గరనుండి, అయోధ్యకు వెళ్లారనేది అందరూ అంగీకరించిందే. అలాంటప్పుడు ఎడమవైపున కిష్కింద, కుడివైపున పంచవటి వుండి వుండాలి. ఈ రెండు స్థలాలను రామచంద్రమూర్తి సీతాదేవికి చూపించాడు. ఈ మార్గానికి, నాసికకు సంబంధమే లేదు. కాబట్టి పంచవటి నాసిక కాదు...కావడానికి వీల్లేదు. నాసిక అనేది మొదటి పేరు కాదనీ, నవశిఖ అనేది నాసిక అయిందనీ, పురాణాలలో ప్రసిద్ధికెక్కిన నాసిక శూర్పణకదే అయినందువల్ల ఆ కథకు, దీనికి ముడిపెట్టారని కూడా కొందరు రాశారు. నాసిక పంచవటి కాదనడానికి మరికొన్ని కారణాలున్నాయి.

సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుండి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, అక్కడనుండి, పశ్చిమాభిముఖంగా నాసిక చేరినట్లు కొందరంటారు. వాళ్లు చెప్పిన మార్గంలో వింధ్యపర్వతాన్నే కాకుండా, నర్మద, తపతీ నదులను దాటి, విదర్భ గుండా నాసికలోకి పోవాల్సి వుంటుంది. ఇది చాలా దుర్గమ మార్గం. అదీ కాకుండా, వాల్మీకి ఎక్కడా, సీతారామలక్ష్మణులు వింధ్యనూ, నర్మదా తపతులను దాటినట్లు చెప్పలేదు. వారు దాటే వుంటే ఆ సుప్రసిద్ధ నదుల గురించి వాల్మీకి తప్పక రాసేవాడే. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధం అనాలి. వాస్తవానికి రామలక్ష్మణులు నైఋతీ మూలగా, ఆ తరువాత కొంత మేరకు నైఋతిగా పోయి, అక్కడనుండి తూర్పుగా పోయి, కబంధుడిని చంపి, అక్కడనుండి మళ్లీ పడమరగా పోయి, పంప (తుంగభద్ర) చేరి అక్కడికి పడమర వున్న శబరి గుహకు పోయారు. జటాయువు గుట్ట దగ్గరనుండి నైఋతిగా వస్తేనే కిష్కింధకు రాగలరు. అలా కాకుండా కొందరు చెప్పినట్లు ఆగ్నేయ మూలగా పోయివుంటే, సముద్ర తీరానికి చేరేవారే కాని, కిష్కింధ చేరకపోయేవారు. ఆగ్నేయ మూలగా ప్రయాణం చేసినట్లు రామాయణంలో ఎక్కడా ఒక్క మాటైనా లేదు. అలాగే భద్రాచలం దగ్గర ఉష్ణ గుండం వుందనడం, సీతాదేవి స్నానం చేసేదనడం, రేకపల్లె దగ్గర జటాయువు రెక్క పడిందనడం బహుశా కల్పితాలు కావచ్చు).

సర్గ-16

# హేమంత ఋతువు వర్ణించి అన్నకు చెప్పిన లక్ష్మణుడు

పర్ణశాలలో నిష్ఠురాలైన సీతతో, తమ్ముడు లక్ష్మణుడితో ఎంతో సుఖంగా శ్రీరామచంద్రమూర్తి వున్న సమయంలో శరత్కాలం పూర్తై, మంచుకాలం మొదలైంది. ఇలా హేమంత ఋతువు రాగా, ఆ ఋతువులో ఒక నాటి తెల్లవారు జామున రామచంద్రమూర్తి గోదావరి నదీ స్నానం చేయదానికి సీతాదేవితో పోతుండగా, లక్ష్మణుడు కమండలాలు తీసుకొని వెంట బోతున్నాడు. అప్పుడు లక్ష్మణుడు రామచంద్రమూర్తితో ఇలా అన్నాడు. "అన్నా! ఏ ఋతువువల్ల సంవత్సరం ప్రకాశిస్తుందో, నీకు ఇష్టమైన మాసమేదో, అలాంటి మార్గశిరం, హేమంత ఋతువు అయిన మంచుకాలం ఇప్పుడు వచ్చింది కదా! ప్రజలకు దేహం కఠినమైంది. స్నానం చేయడానికి సాధ్యపడకుండా నీటికి పళ్లు వచ్చి కరవసాగింది. పైరుపచ్చలు కాంతిటొ కళకలలాడుతున్నాయి. అగ్నిహోత్రుడు గతంలో లాగా కాకుండా ఆప్తుడై ప్రజలను దగ్గరకు రానిస్తున్నాడు. తమకేది మంచిదో తెలుసుకొని కొత్త ధాన్యం రాగానే పాలలో పొంగించి దాన్ని పితృ దేవతలకు నివేదించి పాపరహితులవుతున్నారు. అన్నా! రాజులు యుద్ధానికి పోవడానికి, గ్రామాలలో వుండేవారు పాలు, పెరుగు తినడానికి, ఈ

మంచుకాలం పనికొస్తుంది కదా? దక్షిణ దిక్కున సూర్యుడున్న కారణాన ఉత్తర దిక్కు ముత్తైదువు చిహ్నమై, ముఖానికి శాశ్వత కాంతిని కలిగించే కుంకుమ బొట్టులేని ఆడదాని లాగా వుంది".

(ఇది దక్షిణాయనమైనందున సూర్యుడు దక్షిణ దిక్కునే వుంటాడు. శ్రీరామచంద్రమూర్తి ఉత్తర దేశాన లేనందున అది విధవలా వుంది).

"హిమవత్పర్వతం స్వభావంగానే మంచుగడ్డలకు స్థానం. అందులో ఈ కాలంలో సూర్యుడు దూరంగా వుండడం వల్ల మంచు కరగడం ఆగిపోయి హిమవంతుడు అనే పేరు వచ్చే అర్థంతో కాలమహిమవల్ల అలరారుతున్నాడు. ఉదయం, సాయంత్రం మంచు ఎక్కువగా వుండడం వల్ల జనాలు తిరగలేరు. మధ్యాహ్నం జనులంతా సుఖంగా తిరగడానికి కొంచెమే వేడి కల ఎండ వుంటుంది. చెట్ల నీడల్లో సూర్యకిరణాలు ఎక్కువగా పడని కారణాన నీళ్లు జిల్లుమంటూ తాకడానికే కష్టంగా వుంటాయి. ఎండలు కొంచెమే వ్యాపించడం వల్లా, మంచుతో కప్పబడడం వల్లా, చల్లటి గాలి వీస్తుండడం వల్లా, వనాలలో మనుష్య సమ్చారం లేదు. ఇక పక్షుల కీళ్ళు పట్టుకునిపోయి, అవయవాలు ముద్దపడి వుంటాయి. పగలీవిధంగా వుంటుంది. రాత్రుళ్లు బయట పడుకొనేవారుండరు. పుష్యా నక్షత్రం చూసి పొద్దు తెలుసుకోవాల్సి వుంటుంది. రాత్రుళ్లు బూజు పట్టినట్లు తెల్లపారి, చలిగాలి వీస్తుంటుంది. ఆహ్లాదం కలిగించేవాడు కాబట్టి చంద్రుడికి ఆ పేరొచ్చింది. ఇప్పుడా పేరును తనకు వ్యర్థం చేసుకొని, లోకులను సంతోష పర్చడానికి ఆ శక్తిని సూరుడికి ఇచ్చాడు. ఆ కారణాన తపనుడు అనే పేరు సూర్యుడికి వచ్చి చంద్రుడిలాగా అయ్యాడు. అంటే సూర్యుడు చంద్రుడిలాగా ప్రజలకు సంతోషం కలిగించేవాడయ్యాడు. చంద్రుడేమో మంచు కురవడం వల్ల ప్రజలకు బాధ కలిగించేవాడయ్యాడు".

"అంతే కాకుండా మంచుతుంపరలు వ్యాపించడం వల్ల, చంద్రబింబం నోటి ఆవిరి కమ్మడం వల్ల గుడ్డి అయిన యుద్ధంలాగా కనపడుతున్నది. నిండు పున్నమి నాటి రాత్రి మంచుతో మలినం కావడం వల్ల సంతోషం కలిగించలేక పోయింది. ఇది ఎండవల్ల నల్లబడ్డ సీతాదేవిలాగా వుంది కాని ఆమెకున్న కాంతి మాత్రం లేదు. పడమటి గాలి స్వభావంగా చల్లగా వుంటుంది. దానికితోడు మంచుబిందువులు చేరాయి. కాబట్టి ఉదయం వేళ గాలి ఇనుమడించిన చలితో కూడి వుంది. యవగోధూమాల పైరులవల్ల ప్రకాశించే మంచు బిందువులతో

కప్పబడిన అడవి సూర్యోదయ సమయం కావడాన క్రౌంచ పక్షులు వీటి ధ్వనివల్ల ప్రకాశిస్తున్నాయి. ఖర్జూరపు పూలలాంటి కాంతి కలిగి, ఎన్నులు, వడ్ల గింజలతో నిండి ఆ బరువుకు తలలు వంచి పండడం వల్ల అపరంజి బంగారు కాంతికలిగిన పైరు చూశావా? సూర్యుడు ఉదయించినా మంచంతా పోలేదింకా. తుంపరగా, సన్నగా, వ్యాపించే వుంది. ఆ కారణాన సూర్యుడు ఉదయించి చాలా పొద్దు పోయినా చందమామలాగా వున్నాడు. శ్రీరామచంద్రా! మధ్యాహ్నానికి ముందు ఎండ వేడి లేక సుఖంగా దేహాన్ని తాకుతూ, మధ్యాహ్నంలో కొంచెం ఎరుపు, కొంచెం తెలుపుగా సూర్యకిరణాలున్నాయి''.

“మంచు తుంపరలు రాలడం వల్ల కొంచెం తడిసి వున్న లేబచ్చిక పట్టులలో సూర్యుడి ఈరెండ పడిన విధం చూశావా రామా! సూర్యకాంతి ఈ బిందువులమీద పడడం వల్ల అవి వజ్రాలలాగా కనపడుతున్నాయి. అన్నా! ఈ అడవి ఏనుగును చూడు. అది మిక్కిలి దప్పికతో బాధపడుతూ నీళ్లు తాగాలని తొండంకొనతో నీటిని తాకి అది జిల్లుమనగా తాగలేక తొండాన్ని ముడుచుకుంటున్నది. నీటిపక్షులు ఎప్పుడూ నీళ్లలోనే వుండేవైనప్పటికీ, నీటి వెంట తీరంలో కూర్చుని, నీళ్లలో దిగడానికి భయపడుతున్నాయి. వీటిని చూస్తే పిరికివాళ్లు యుద్ధరంగంలోకి దిగడానికి భయపడే విధంగా కనపడుతున్నది. లోపలా, బయటా మంచనే చీకటి, విస్తారంగా కప్పడం వల్ల అదవి పూలు లేనిదానిలాగా కనపడ్తున్నది. నీళ్లలో వుండే బెగ్గురు పక్షులు మంచు ఆవిరి కప్పడం వల్ల బయటకు రాకున్నా, వాటి ధ్వనులవల్ల వునికి తెలుస్తున్నది. భూమేమో మంచు తెరలతో తడిసిపోయింది. పైపైన మంచు రాలడం వల్ల సూర్యకిరణాలలో వేడి లేకుండా వున్నందున, రామచంద్రా, నిర్మలమైన రాళ్లమీద పడ్డ నీళ్లు కూడా విషాలై పోయాయి. తామరపూలు పూసి చాలాకాలం అయినందున మంచువల్ల అందం చెడి, వాడిపోయి, కాంతిహీనమై, అకరువులు, దిమ్మెలు రాలిపోగా కాడలు మాత్రమే వున్న తామరలతో కొలనులు అందవిహీనంగా వున్నాయి''.

“ఇలా, పుండులాగా, బాధాకరమైన మంచుకాలంలొ, అయోధ్యలో దుఃఖంతో కుమిలిపోతూ, రాజ్యసంపదలన్నీ వదలి, భోగాలు ఆశించక, ఉపవాసాలుండి, జడలు–నారలు ధరించి, మంచాలు–పరుపులు వదలి, ఆరుబయట నేలమీద పడుకుంటూ, కొంచెం మాత్రమే పళ్లు తింటూ, నీమీద

వున్న భక్తితో భరతుడు కష్టపడుతున్నాడు కదా? అన్నయ్యా! మనం లేచిన వేళకే భరతుడు కూడా నిద్రలేచి సరయూనదిలో స్నానం చేయడానికి, మంత్రులు, ఇతరులు సేవిస్తుండగా నిర్మలమైన మనస్సుతో, అయ్యో ఇలా పోవాల్సివచ్చిందికదా అనే విచారం లేకుండా పోతుంటాడు కదా? నీకంటేకూడా సుకుమారుడు, వీరుడు, పల్చటి కడుపు కలవాడు, చక్కటివాడు, కష్టింపతగనివాడు, సమస్త ధర్మాలు తెలిసినవాడు, సజ్జనులకు సంతోషకారుడు, సత్యవాది, దోషం లేని పనులు చేసేవాడు, మదించిన శత్రువుల గర్వం అణచేవాడు, తీయటి మాటలు చెప్పేవాడు, మోకాళ్లదాకా చేతులున్నవాడు, మాత్సర్యం, దుష్కామం లేనివాడు, చేయతగని పనులు చేయడానికి సిగ్గుపడేవాడు, ఇంద్రియనిగ్రహం కలవాడు, గాఢమైన భక్తి వున్నవాడు, అఖిలభోగాల రాశి, నీ తమ్ముడు భరతుడు ఆశను వదలి అడవిలో తపించే నీలాగా, తపస్సులో నిష్టబూని, స్వర్గాన్ని తిరస్కరించినవాడయ్యాడు. తండ్రిని పోలిన కూతురు, తల్లిని పోలిన కొడుకు ధన్యులని సామెత వుండగా, సముద్రంలో కలిసిన నీరు సముద్రంలాగా కావాల్సి వుండగా, ధర్మ స్వభావుడైన దశరథుడికి భార్య అయ్యి, ఇలాంటి సుగున సంపత్తికల కొడుకుకు తల్లి ఐన కైక ఇంతటి దుష్టురాలు, వాడికల మనసున్నదిగా ఎలా కాగలిగిందో?”

(లక్ష్మణుడి సందేహం న్యాయమైందేకాని, రామలక్ష్మణుల, భరతశత్రుఘ్నుల జన్మలకు బీజం కారణం కాదు. క్షేత్రమూకాదు. పాయస రూపం వహించిన భగవత్తేజం కారణం కాబట్టి తల్లిదండ్రుల గుణాలు వీరికి అంటాల్సిన అవసరం లేదు).

ఈ విధంగా లక్ష్మణుడు చెప్పగా, శ్రీరాముడు, “లక్ష్మణా! ఎందుకు నిర్నిమత్తంగా కైకను దూషిస్తావు? రఘువంశనాథుడైన ఆమె కొడుకును ప్రశంసించు. అది నాకు సంతోషం కలిగిస్తుంది. వనవాసం పూర్తిగా చేసుకోవాలని మనస్సు ధృఢం చేసుకొన్నా, భరతుడిని తలచుకున్నప్పుడు, అయ్యో! భరతుడి దగ్గరకు పోతే బాగుండేదే, ఆయన్ను విడిచి వచ్చానే, అని పామరులలాగా నాకూ దుఃఖం కలుగుతున్నది. నాయనా! లక్ష్మణా! కొందరి మాటలు వినడానికి మొదట్లో మధురంగానే వుంటాయికాని, చివరకు, అవే అప్రియాలై పరిణమిస్తాయి. భరతుడి మాటలు అలాంటి ఇచ్చకాలు కావు. కొన్ని పదార్థాలు నాలుకకు తియ్యగా వున్నా లోపలికి పోయినాకొద్దీ వికారంగా

మారుతాయి. భరతుడి మాటలు అలాకాకుండా అమృతంలాగా వుంటాయి. లోపలి పోయినా దేహారోగ్యం కలిగించే ఔశధుల్లాంటివి. అదీ కూడా ఒకటి–రెండు చుక్కలు కావు. అమృతరసప్రవాహం కాబట్టి సర్వదా అతడి మాటలు నాకు ఇప్పటికీ మరపుకు రావు. నిన్ను, భరతుడిని, శత్రుఘ్నుడిని, సీతను కూడిన నేను సంతోషంతో వుండేదెన్నడోకదా" అని అంటూ, విచారపడుతూ గోదావరి నదికి స్నానం చేయడానికి పోయాడు. సీతాలక్ష్మణులతో స్నానం చెసి వచ్చి, సంధ్యావందనం లాంటివి చేసుకొని, బ్రహ్మ యజ్ఞాన్ని చెసి, పార్వతీ నందులతో కూడిన రుద్రుడిలాగా కనిపించాడు.

సర్గ-17

# శ్రీరాముడిని చూసిన శూర్పణఖ

(వనవాసం చేయాల్సిన పద్నాలుగు సంవత్సరాలలో ఇప్పుడు పదమూడవ సంవత్సరం గడుస్తున్నది. అందులో ఇది మార్గశిర మాసం).

కళ్యాణ గునాలతో ప్రసిద్ధికెక్కిన శ్రీరామచంద్రమూర్తి, సీతాలక్ష్మణులతో కూడి గోదావరీ నదీ స్నానం చేసి, తన తపోవనం చేరి, అక్కడ నిష్ఠగా ప్రాతఃకాల కృత్యాలను ఆశ్రమానికి బయటే తీర్చి, పర్ణసాలలో సీత, తాను, లక్ష్మణుడు, పూర్వుల-పెద్దల కథలు చెప్పుకుంటూ ముచ్చటించుకుంటుండగా, శ్రీరాముడు చిత్రా నక్షత్రంతో కూడిన చంద్రుడిలాగా ప్రకాశించాడు. కథలు చెప్తున్న విష్ణు సన్నిభుడైన శ్రీరాముడిని, అప్పుడు, రావణాసురుడి చెల్లెలు శూర్పణక చూసి ఆశ్రమంలో ప్రవేశించింది.

సింహం రొమ్ములాంటి విశాలమైన రొమ్ముకలవాడిని, తామర రేకలలాంటి కళ్లు కలవాడిని, ఎడతెగని ఉత్సాహంకలవాడిని, దీర్ఘంగా మోకాళ్లనంటే చేతులు కలవాడిని, అందంగా ప్రకాశించే ముఖం కలవాడిని, సత్పురుషులతో ఉపాసించబడే వాడిని, ఇంద్రుడితో సమానుడిని, ఏనుగు నడకలాంటి నడక కలవాడిని, కీర్తించబడిన కోమలత్వం కలవాడిని, విస్తారంగా జడలు ధరించినవాడిని, ఎంతచూసినా ఇంకా చూడాలన్న ఆశ కలిగించే ప్రియమైన దర్శనం కలవాడిని, శత్రువులను కృశింపచేయగలవాడిని, నల్లకలువల చామన

చాయకలవాడిని, సౌందర్యంలో మన్మథుడిని జయించినవాడిని, రాజచిహ్నాలు కలవాడిని, మిక్కిలి శక్తికలవాడిని, సన్నని నడుముకలవాడిని, శ్రీరామచంద్రమూర్తిని చూసి కామదగ్ధచిత్త అయ్యి, పాపపు స్వభావం, పెద్దపొట్టకల ఆ రాక్షసి, భయంకరవృత్త, శ్రీరాముడిని చేరవచ్చింది.

మంచి అందమైన ముఖం కలవాడిని వికారమైన ముఖం కలది; పవిత్ర చరిత్రుడిని పాపస్వభావ; శ్రేష్ఠమైన అందం, అలంకారం కలవాడిని మిక్కిలి కురూపి; వినడానికి ఇంపైన కంఠస్వరం కలవాడిని భయంకర ఖరస్వరం కలది; వెడల్పాటి కళ్లు కలవాడిని గూబకళ్ల మిడిగుడ్లది; తుమ్మెదల్లాగా నలుపు–నునువైన వెంట్రుకలు కలవాడిని, శ్రీరాముడిని, ఎర్రటి వెంట్రుకలు కల్గినదైన శూర్పణక చూసింది. ఋజుభాషిణి, వక్రభాషిణి, వయసువానిని, తలవెంట్రుకలు నరసిన ముసలిది, భయంకరాకార ప్రియుడైన వాడి భయంకర వేషం కలది, మన్మథ బాణాలతో దహిమ్చబడుతున్న మనస్సుతో మోహావేషంతో ఇలా అంది.

## తమ వృత్తాంతాన్ని శూర్పణఖకు చెప్పిన శ్రీరాముడు

మోహావేశంతో శూర్పణఖ శ్రీరాముడిని చూసి "నువ్వెవరివి? జడలతో మునీశ్వరుడి వేషం ధరించి, కాముకుడవై, భార్యతోనూ, క్షత్రియ రూపంలో విల్లు–బాణాల తోనూ, రాక్షసులు స్వేచ్ఛగా తిరిగే ఈ స్థలానికి ఎందుకు వచ్చావు? ఈ ప్రకారం ఇక్కడ వుండడానికి కారణం ఏమిటి?" అని అడగగా శ్రీరామచంద్రమూర్తి వంచనలేక యథార్థాన్ని ఇలా చెప్పాడు.

(ఎలాంటి సందర్భంలోనూ నవ్వులాటకైనా అసత్యం చెప్పడం రాముడికి ఇష్టమైన కార్యం కానేకాదు. అందునా, ఆడవారి ఎదుట, తపస్సు చేసే స్థితిలో అసలే అబద్ధం ఆడడు).

"దశరథుడనే మహారాజు పెద్ద కొడుకును నేను. నన్ను రాముడని అంటారు. వీడు నా తమ్ముడు లక్ష్మణుడు, వా వెంట వచ్చాడు. ఈ స్త్రీ నా భార్య సీత. తల్లిదండ్రుల ఆజ్ఞ మీరలేక పితృవాక్య పరిపాలన అనే ధర్మాన్ని నిర్వహించే కోరికతో తపోరూప ధర్మాన్ని స్థాపించడానికి మేం వచ్చాం. మా చరిత్ర విన్నావు కదా? నువ్వే జాతిదానివి? నీ పేరేంటి? ఎవ్వరిదానవు? సత్యం చెప్పు. ఇది రాక్షస భూమి ఐనా నీ మనోహరాకారం చూసి రాక్షసివి అవుతావని అనుకోను. ఇక్కడికి నువ్వు రావడానికి కారణం ఏంటి?". ఇలా అడిగిన రామచంద్రమూర్తికి నిజం చెప్తా వినమని అంటుంది.

## శ్రీరాముడిని మోహించిన శూర్పణఖ

శూర్పణఖ శ్రీరాముడితో, "ఓ దేవస్వరూపా! సుందరుడా! నేను శూర్పణఖ అనే స్త్రీని. కోరిన రూపాన్ని ధరించగలను. ప్రాణికోటులకు భయం కలిగించేదానినై, ఈ అడవుల్లో ఒంటరిగా తిరుగుతుంటాను. విశ్రవసుడి కొడుకు రాక్షసరాజైన రావణాసురుడి పేరు విన్నావా? అతడు మా అన్న. నిదురబోతు కుంభకర్ణుడు, ధర్మాత్ముడై రాక్షస చేష్టలు లేని విభీషణుడు కూడా నా తోడబుట్టిన వారే. ఖరదూషణులు కూడా నా తోబుట్టువులే. వాళ్లు యుద్ధంలో మహాశూరులు. వావి వరుసలకు వాళ్లు నా అన్నలని చెప్పానేకాని వారి ఆజ్ఞకు లోబడి వుండేదాన్ని కాను నేను. నా ఇష్ట ప్రకారం నేను తిరుగుతుంటాను. కాబట్టి నువ్వు నన్ను గ్రహించావా వాళ్లు నీ మీద కోపంగా వుంటారని భయపడాల్సిన పనిలేదు. చక్కదనంలో నీలాంటి వాడిని నేను చూడలేదు. కాబట్టి కళ్లారా నిన్ను చూసింది మొదలు దొడ్డమగవాడా, నువ్వే నాకు తగిన మగడవని నిన్ను కోరుతున్నాను. నువ్వు నన్ను తిరస్కరించావా, మా అన్నలందరనీ నీమీదకు యుద్ధానికి పిలుచుకొనివచ్చి నిన్ను చంపిస్తాను".

"రామా! నన్నేమనుకుంటున్నావు? ఎవతో తోవలో పోయే ఆడది అనుకుంటున్నావా? నేను మహీశుడిని అన్న గర్వం నీకు అవసరం లేదు. నేను ఇంత అని చెప్పలేని ప్రభావ సంపదతతో స్తోత్రం చేయబడే దాన్ని. నువ్వు భూమికి ప్రభువైతే, నన్ను ప్రభావ లక్ష్మే కొనియాడుతున్నది. అంతే కాదు. నువ్వు కాలినడకన పోవాల్సినవాడివే. నేను నా ఇష్టం వచ్చినట్లు సంచారం చేయడానికి సిద్ధి పొందాను. కాబట్టి నా మగడివై, నేను శూర్పణఖ మగడినని గర్వపడు. నాకిదివరకే భార్య వుందంటావేమో? ఛీ, ఛీ, ఇదేమి సీత? చూడడానికి రోత పుడ్తున్నది. వేలెడు ముక్క. వెన్నంటు డొక్క విరిచిన బొందె తుంటెలాగా విరుగు కాళ్లు, చేతులు, చింతాకంత కళ్లు, అసలే లేని గోళ్లు, ఇక నా సొగసు నేనే చెప్పకూడదు కాని, నా డొక్క, నా పిక్క, నా ముక్కు, నా చెక్కు, నా గోళ్లు, నా కాళ్లు, నా కళ్లు, నా చన్నులు, నా చేతులు ఎలా వున్నాయో చూడు. సీత వికార రూప. దీన్ని వదిలిపెట్టు. దూరంగా పొమ్మను. నీలాంటివాడికి తగిన పెళ్లాం కాదు. కానేకాదు. నెనే ముద్దు పెళ్లామని అను".

"నన్ను సరిగ్గా చూడు. నేను నీకు తగిన భార్యను కానా? అవునను. కాబట్టి నన్ను నీ భార్యగా చేసుకో. దీన్నేం చేద్దామంటావా? దీన్ని చూస్తే నాకే భయమేస్తున్నది. నువ్వెందుకు భయపడడం లేదు? దానికి భయపడే నువ్వు

దానికి అణగి వుంటున్నావు కాబోలు. దుర్మార్గురాలు కాబట్టే సవతి అనే కోపంతో నన్ను హింసిస్తుంది. నాకు వశపడ్డావని నిన్ను చంపుతుంది. కాబట్టే అది నీచురాలు....అదీ కాకుండా మనుష్య స్త్రీ. నాకు భోజ్యమైంది. కాబట్టి దీన్ని నీ తమ్ముడితో సహా ఇప్పుడే గుటుక్కున మింగుతా. ఆ తరువాత నీకు ఇంక భయం లేదు...ఈ జంజాటం వుండదు. కాబట్టి, నా ముద్దు మగడా! కొండల్లో, అడవుల్లో స్వేచ్ఛగా ఆడుకొందామా?"

సర్గ-18

# శూర్పణఖ ముక్కు చెవులు కోసిన లక్ష్మణుడు

అని శూర్పణఖ చెప్పగా, కామవశమైన ఆ రాక్షసి మాటలకు నేర్పుగల శ్రీరామచంద్రమూర్తి, కోపపడకుండా, మెత్తటి మాటలతో సందేహం కలగకుండా, తాను చెప్పేది స్పష్టంగా అర్థమయ్యేట్లు చెప్పాడిలా ఆమెకు. "రాకాసీ! దీనిని ముందు పెళ్లి చేసుకున్నాను. అయినా ఏంటంటావా? ఇప్పుడు ప్రియురాలైన దీనిని నేనెలా విడుస్తాను? అది ధర్మం కాదే? అది వుండవచ్చు... నువ్వూ వుండవచ్చు అంటావా? నీలాంటి అద్భుతమైన అందగత్తెకు సవతి పోరు వుండకూడదు. కాబట్టి నీకు దుఃఖం కలగక తప్పదు.నున్ని దుఃఖ పెట్టడానికా పెళ్లి చేకోవడం? కాబట్టి నామీద భ్రాంతి వదిలిపెట్టు. నువ్వు కామం నిలుపలేనని అంటావా? ఇదిగో వీడిని చూడు. మంచి శీలం కలవాడు. నా తమ్ముడు. చూడడానికి ప్రియమైన వాడు. సహించరాని తేజం కలవాడు. లక్ష్మణుడనే పేరుకలవాడు. ఈ లక్ష్మణుడు భార్య లేనివాడు. అసమాన శౌర్యవంతుడు. సమర్థుడు. యౌవనంలో వున్నాడు. అందగాడు. ఇదివరకు భార్యా సుఖం తెలియనివాడు. భార్య కావాలని కోరుతున్నాడు. నీ అందమైన రూపం చూడగానే వీడు నీకు పతిత్వయోగ్యుడు అవుతాడు. పూబోడీ! సవతి పోరులేకుండా అతడిని భజించు".

అని శ్రీరామచంద్రుడు చెప్పగా విని ఆ రాక్షసి, రామ మోహం కళ్లకు కప్పి వుండడం వల్ల, తన విధవాగర్భాదాన నూతన మహోత్సవం నిమిషమైనా ఆలశ్యం కావడానికి సహించలేక, లక్ష్మణుడితో "ఓయీ అందగాడా! నీ చక్కదనానికి సరైన అందగత్తెను నేనే. నీకు పెళ్లాం అవుతాను. నువ్వు నన్ను పెళ్లి చేసుకో. వనాలలో,కొండలలో సంచారం చేద్దామా? రా..పోదాం" అన్నది. శ్రీరామచంద్రమూర్తి పరిహాసంగా మాట్లాడిన భావం తెలుసుకొన్న లక్ష్మణుడు, తానూ శూర్పణఖతో పరిహాసంగానే మాట్లాడాడు. "ఓసీ! వెర్రి పిల్లా! నేను బానిసను. నన్ను పెళ్లి చేసుకొని నువ్వు కూడా బానిసవై వీరి సేవ చేస్తావా? నీ చక్కదనానికి నువ్వు బానిసగా వుంటావా? ఈ మహాత్ముడుకి నేను బంటుగా సేవ చేస్తున్న సంగతి నీకు తెలియదేమో? నీకు తెలిసే అవకాశం లేదు. తెలుస్తే, నేనేంటి...బానిసను ఎలా పెళ్లి చేసుకుంటాను అని అనుకొనేదానివి. అలాంటి సమృద్ధమైన అర్థం కలవాడిని నువ్వే సంతోషపెట్టగలవు. నిర్మలకాంతి కలదానివి కాబట్టి, నువ్వు, ఆయన్నే వరిస్తే నువ్వు చిన్న భార్యవై,కులుకుతూ ముద్దులొలకవచ్చు. మగవారికి పెద్ద భార్య మీద కంటే చిన్న భార్యమీదే ప్రేమ ఎక్కువ కదా! ఈ మాత్రం ఆలోచించలేవా? నిన్నేమనాలి? ఇలాంటి వికార స్వరూపం గలదానిని, భయంకర స్వరూపం వున్నదానిని, ఆ సవతిని, పెద్ద పొట్టకలదానిని, ముసలిదానిని, జానకిని నెట్టి నిన్ను భార్యగా గ్రహిస్తాడు. ఇలాంటి పరమ సుందరిని వదిలి ఎవరు మనుష్య స్త్రీకొరకు వేడుక పడతాడు?" అని లక్ష్మణుడు పలికాడు శూర్పణఖతో.

లక్ష్మణుడు చెప్పిన మాటలు పరిహాస వచనాలని తెలుసుకోలేని ఆ బుద్ధిహీన, నిజమని నమ్మి, పర్ణశాలలో సీతతో వున్న శ్రీరామచంద్రుడి దగ్గరకు పోయి మదనతాపంతో ఇలా అంది: "ఈ విరూపను, సవతిని, ఈ కరాళను, నిర్ణతోదరిని గ్రహించి నువ్వు నన్ను గౌరవించడం లేదు. కాబట్టి దీన్ని ఇప్పుడే మింగి సవతిపోరు లేకుండా సుఖపడతాను". ఇలా అంటూ శూర్పణఖ జింకపిల్ల కళ్లలాంటి కళ్లున్న సీతమీద దూకింది. ఇది చూసిన శ్రీరాముడు దాన్ని బిగపట్టి, కోపంతో లక్ష్మణుడితో "లక్ష్మణా! నీచులతో పరిహాసం ఆడడం తప్పు. అలా మనం చేసినందువల్ల కష్టం కలిగింది. దీనివాత పడకుండా సీతాదేవి ఎలా బతికి సుఖంగా వుంటుందో ఆలోచించు. ఇది స్త్రీ. ఆయుధం ధరించి యుద్ధానికి వచ్చింది కాదు. కాబట్టి చంపకూడదు. దీన్ని, బలగర్వంతో దేహం తెలియనిదాన్ని, రాకాసిని పట్టుకొని విరూపగా చేయి" అన్నాడు. అప్పుడు

శూర్పణఖ కంటే మహాబలశాలి అయిన లక్ష్మణుడు తటాలున కత్తి దూసి, అది ఎదిరించినా వదలక, దాని ముక్కు, చెవులు కోశాడు.

ముక్కు–చెవులు ఈ విధంగా మొక్కలు పోగా, లబలబ నోరు కొట్టుకుంటూ, రొమ్ము గుద్దుకుంటూ, వానాకాలంలోని మేఘం అదిరినట్లు, అడవి ప్రతిధ్వనించేట్లు, పెద్ద ధ్వనితో బొబ్బలు పెట్టుకుంటూ, నెత్తురు కారుతుంటే, వికార రూపం మరింత వికారం కాగా, మనుష్యులు తనను ఇలా చేశారే, నలుగురిలో నవ్వుల పాలైతిని కదా అని ఆక్రోశంతో ఏడుస్తూ అడవుల్లో పడి వేగంగా పరుగెత్తింది.

ఇలా పరుగెత్తుకుంటూ పోయి జనస్థానంలో రాక్షసుల మధ్యన వున్న తమ్ముడు ఖరుడిని చూసి, ఏడుపు ధ్వనితో ఆకాశం నుండి పిడుగుపడ్డట్లు ధభీలున నేలమీదపడి పెద్దపెట్టున ఏడ్చింది.

సర్గ–19

# శూర్పణఖ వికృత వేషం చూసి కోపించిన ఖరుడు

దేహమంతా నెత్తురుతో తడిసి నేలమీద పడి, వికార రూపంతో ఏడుస్తున్న శూర్పనఖను చూసి ఖరుడు ఇలా అన్నాడు. "ఎవరినీ తరుమకుండా, బెదిరించకుండా, బుసకొట్టకుండా, తనంతట తాను బుట్టలో కదలకుండా వుండే మహా భయంకర, విషంకల నల్ల త్రాచుపామును ఎవడు వేలితో పొడిచాడు? ఎవడీ విషం తాగింది? ఎవడు తనంతట తానే మృత్యుపాశాన్ని తన కంఠానికి తగిలించి బిగించుకున్నాడు? చెప్పు. నేనిప్పుడే వేగంగా పోయి వాడిని చంపి నెత్తురు తాగుతా. నువ్వు బలం, పరాక్రమం విశేషంగా వున్నదానివి. కాబట్టి సామాన్య బలవంతులు నిన్ను పరాభవం చేయలేరు. నువ్వు కోరిన చోట, కోరిన రూపంతో తిరగగలిగే దానివి. నిన్ను అడ్డగించగలవారు లేరు. అలాంటి నిన్ను ఎవడే దీర్ఘకాలం బతకడానికి ఇష్టపడక ఇలాంటి కష్టాల పాలు చేశాడు? దేవతలలో కాని, గంధర్వులలో కాని, పరమర్షులలో కాని, దౌర్జన్యంగా ఇలాంటి పెద్ద అపకారం చేయడానికి తెగించిన వాడు ఎవడో చెప్పు. వాడిని చంపుతా".

"దేవతలలో బాకాసురుడిని చంపిన వేయికళ్ల ఇంద్రుడైనా, నాకు అప్రియమైన పని చేయడానికి భయపడతాడు. మరి ఎవరు నాకు ఈ విధమైన అప్రియమైన పనిచేశాడు? నీళ్లలో వున్నా పాలను హంస తాగినట్లు శీఘ్రంగా ఇదిగో, ఇప్పుడే నా బాణాలతో అతడి భూమిని కూల్చి, వాడి ప్రాణ వాయువులు

తాగుతా. అయ్యో! నా ముద్దుల అక్కా! యుద్ధ భూమిలో ఎవడిని చంపి వాడి నెత్తురును నురుగుతో సహా, నా బాణాలు తాగాలని కోరుకుంటున్నావు? నా పదునైన బాణాలతో చీల్చబడిన ఎవడు గద్దల్లాంటి పక్షిజాతికి ఆహారంగా కావాలని కోరుకుంటున్నావు? ముద్దు–ముద్దుగా ముక్కర పెట్టుకోకుండా ఎవడు నిన్నిలా బాధ పెట్టాడు? అలాంటి వారిని రక్షించడానికి దేవతలు సమర్థులు కారు. రాక్షసులూ కారు. నా బాణాల దెబ్బలకు వాడికి చావు తథ్యం. కాబట్టి బడలిక తీర్చుకొని నిన్నీ ప్రకారం చేసిన వాడి గుర్తులు చెప్పు". అని ఖరుడు అడగ్గా, తోడ బుట్టిన వాడి మాటలు విని విస్తారంగా కన్నీళ్లు కాల్వలుగా కారుతుంటే, ఈ విధంగా చెప్పింది శూర్పణఖ.

## సీతారామలక్ష్మణుల వృత్తాంతం ఖరుడికి చెప్పిన శూర్పణఖ

"నన్నీ ప్రకారం చేసింది ఎవరని అంటావా? చెప్తా విను రాక్షసుడా! వారు యౌవనవంతులు. చక్కటివారు. మునుల వేషంలో వున్నారు. కోమల దేహం కలవారు. మహాబల సంపన్నులు. వికసించిన తామర పూల లాంటి కళ్లున్న వారు. నార చీరెలు,కృష్ణాజినం వస్త్రాలుగా వున్న వారు. అడవిలో లభించే పళ్ళు తింటారు. ఇంద్రియ నిగ్రహం కలవారు. ధర్మ మార్గంలో వుండేవారు. అన్నదమ్ములు వాళ్ళు. దశరథరాజ కుమారులు....శ్రీరామలక్ష్మణులు అనే పేర్లు కలవారు".

(తనను విరూపను చేసినవారెవరు? అని ఖరుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా శూర్పణఖ దశరథ రాజకుమారులు శ్రీరామలక్ష్మణులు అని చెప్పే బదులు, వారి సౌందర్యాన్ని ఎందుకు వర్ణించాలి? ఆమెలో కామం విఘ్నమై కోపంగా మారిందేకాని, కామం చావలేదు. వైరాగ్యం ఇంకా పుట్టలేదు. గాఢంగా శ్రీరామలక్ష్మణ రూపాలలో మనస్సు నాటుకొని వుండడం వల్ల, వారి మూర్తులే దానికి కళ్ళ ఎదుట కనపడుతున్నాయి. అలా కామమోహిత అయినందువల్ల దాన్ని నిగ్రహించుకోలేక తమ్ముడి ఎదుట ఆ భావాన్నే బయట పెట్టింది. "కామాతురాణాం నభయం నలజ్జా" అనే నానుడి వుంది. అంటే, కామాతురులకు భయం, సిగ్గు వుండదు. ఈ కారణం వల్లే రామలక్ష్మణుల సౌందర్య వర్ణన చేసింది శూర్పణఖ. ఇలా చేయడం స్త్రీ అయిన శూర్పణఖ గొప్ప కాదు. శ్రీరామచంద్రమూర్తిని చూసిన వారందరూ, అనుకూలమైనా, ప్రతికూలమైనా ఇలానే మాట్లాడుతారు).

శూర్పణఖ తన జవాబును కొనసాగిస్తూ..."తాము దశరథ రాజకుమారులమని చెప్పారేకాని, వారి తేజస్సు చూస్తే, వాళ్ల మాట నమ్మడం కష్టంగా వుంది. అయినా, వారు అసత్యమాడేవారిలాగా లేరు. కాబట్టి వారి మాట ప్రకారం వాళ్లు మనుష్యులో, నా అభిప్రాయం ప్రకారం దేవతలో చెప్పలేను. చూడడానికి రాజచిహ్నాలున్నా గంధర్వరాజుతో సమానంగా వున్నారు. ఆ ఇద్దరిమధ్య ప్రాయంలో వున్నా ఒక పడుచును, సమస్తాభరణాలు ధరించిన దానిని, సన్నటి నడుముకల దానిని, తామర రేకుల్లాంటి కళ్లున్న దానిని చూశాను. అలాంటి సుందరిని నేనింతవరకు చూడలేదు. ఆ పడుచుకోసం నన్ను వారిద్దరూ ఒక్కటై, రంకుటాలిలాగా దిక్కులేని దాన్ని చేసి దురవస్థల పాలు చేశారు" అని అంటుంది.

## పద్నాలుగు మంది రాక్షసులను శ్రీరాముడి మీదికి పంపిన ఖరుడు

శూర్పణఖ చెప్పిన మాటలు విన్న ఖరుడు కోపంతో క్రూరులు, యముడితో సమానమైనవారు, అయిన పద్నాలుగురు రాక్షసులను చూసి, "దండకారణ్యంలో ఒక చెడునడవడి కల ఆడదానితో ఇద్దరు మనుష్యులు, కోదండ ధరులు, కృష్ణాజినం కట్టినవారున్నారు. వారిని చంపితె, ఆ నెత్తురు తాగాలని మా అక్క కోరుతున్నది. కాబట్టి మీరు మా అక్క కోరిక నెరవేర్చండి" అని అనగానే,శూర్పణఖ దారి చూపిస్తుంటే, దండకారణ్యానికి పోయారు వాళ్ళు. మేఘాల్లాగా వచ్చిన వారంతా సీతతో కూడి ఆశ్రమంలో కూర్చున్న తేజోవంతులైన అన్నదమ్ములను శూర్పణఖ చూపించగా చూశారు. శ్రీరామచంద్రమూర్తి రాక్షసులతో వచ్చిన శూర్పణఖను చూసి కోపంతో లక్ష్మణుడితో ఇలా అన్నాడు. "లక్ష్మణా! కాసేపు నువ్వు సీతను రక్షిస్తూ వుండు ఇక్కడే. వీళ్ళను చంపి నేను వస్తా" అని అనగా లక్ష్మణుడు అంగీకరించాడు. అప్పుడు శ్రీరామచంద్రమూర్తి విల్లెక్కుపెట్టి, బాణాలు తీసుకొని, రాక్షసులను చూసి ఇలా అన్నాడు.

"ఓ రాక్షసులారా! మేము అన్నదమ్ములం. రామలక్ష్మణులు అంటారు. ప్రసిద్ధుడైన దశరథ మహారాజు కొడుకులం. దండకారణ్యంలో ఈ సీతతో సంచారం చేయడానికి వచ్చాం. కందమూలాలు తింటాం. తపస్సు చేసుకుంటాం. ధర్మం అంటే ఆసక్తి కలవాళ్ళం. ఇంద్రియ నిగ్రహం కలవాళ్ళం. కాబట్టి మావల్ల ఎవరికీ ఏ కీడు జరగదు. మా ఇష్టప్రకారం మేం సర్వజన

సాధారణమైన దండకలో నివసిస్తాం. మీ ఇళ్లకు ఎప్పుడూ రాలేదు. మిమ్మల్ని బాధపెట్టలేదు. ఇలాంటి మామీద నిష్కారణంగా మీరెందుకు కోపంతో ఇక్కడికి వచ్చారు? ఇంత దండకారణ్యం వుందికదా? ఎక్కడికైనా పోకూడదా అని అంటారేమో? మునుల ఆజ్ఞతో దుష్టవర్తనులైన రాక్షసులను యుద్ధంలో చంపడానికి వచ్చాం. మీకు ధైర్యం వుంటే నిలిచి యుద్ధం చేయండి. బతకాలనుకుంటే పారిపోండి....మిమ్మల్ని బాధించను".

శ్రీరాముడి మాటలకు ఆ పద్నాలుగు మంది రాక్షసులు కోపంతో చేతిలో పదునైన బాణాలు పట్టుకొని, "రామా! మేం వచ్చిన పని చెప్తాం విను. పూర్ణ పరాక్రమవంతుడైన మా ఖర మహారాజుకు మీరు కోపం కలిగించారు. అలాంటప్పుడు శరీరంతో ఎలా వుంటారు? ఎక్కడికి పోతారు? మరణించాల్సిన వారే. ఇక్కడికి వచ్చిన మా పద్నాలుగు మంది రాక్షసుల ఎదుట ఒంటరిగా నిలువగలవా? నీకది సాధ్యమా? అది అసాధ్యమైనప్పుడు మమ్మల్ని ఎదిరించి యుద్ధం చేయడం కూడా అసాధ్యమే" అని అన్నారు.

సర్గ–20

# పద్నాలుగు మంది రాక్షసులను చంపిన శ్రీరాముడు

తాము ప్రయోగించే బాణాలు గుదియలు, శూలాలు అనీ, అవి రాముడిని తాకగానే ఆయన తన వీర్యం, విల్లు, బాణాలు అన్నీ వదులుతాడనీ, అని అంటూ ఆ పద్నాలుగు మంది రాక్షసులు ఒక్కసారిగా సూలాలను రాముడిమీదకు విసిరారు. శ్రీరామచంద్రుడు తన బంగారు చెక్కడపు బాణాలతో వాటన్నిటినీ చిన్నచిన్న తునకలుగా చేసి, నేలరాలకొట్టాడు. అంతటితో ఆగితే ప్రమాదమని భావించి వారిమీద పదునైన పిడుగులుకల పద్నాలుగు బాణాలను ప్రయోగించాడు శ్రీరాముడు. అవి వాళ్ల రొమ్ముల్లో దూరి వీపులోంచి బయటకు వచ్చి నేలమీద పడ్డాయి. ఆ రాక్షసాధములు వేళ్ళు తెగిన చెట్లలాగా నెత్తురుతో తడిసి, దేహాలతో ప్రాణాలు పోయినవారై, భూమ్మీద పడ్డారు. అది చూసి శూర్పణఖ పరుగెత్తింది.

సర్గ-21

# శ్రీరాముడిమీదకు యుద్ధానికి పొమ్మని ఖరుడిని ప్రేరేపించిన శూర్పణఖ

భయంకరంగా గట్టిగా ఏడ్చుకుంటూ, జనస్థానంలో వున్న ఖరాసురుడి దగ్గరకు వచ్చిన శూర్పణఖను (రాక్షస నాశనానికి కారకురాలు కాబోతున్న) చూసి ఖరుడు ఇలా అన్నాడు. "ఎందుకే మళ్ళా ఏడుస్తూ వచ్చావు? నువ్వు కోరినట్లే, నీ ఇష్టప్రకారమే, మిక్కిలి శూరులైన రాక్షస శ్రేష్టులను నీ వెంట పంపానుకదా? ఇంకా ఎందుకు ఏడుస్తావు? ఆ పద్నాలుగు మంది నేనంటే భక్తికలవారు. చెప్పిన కార్యం చేయక మానరు. మిక్కిలి ధీరులు. అనురాగం కలవారు. యుద్ధంలో ఓటమి ఎరుగానివారు-పరులకు జయించరానివారు. అయ్యో! నాథా అని ఆడుపాములాగా పొరలి-పొరలి ఏడుస్తున్నావెందుకే? ఏ కారణాన ఏడుస్తున్నావు? ఉన్న విషయం చెప్పు. దీనురాలివై, అయ్యో! నాకు దిక్కెవరూ లేరని ఏడుస్తూ వున్నావెందుకు? నేనున్నాను కదే నీకు దిక్కు. అక్కడ ఏం జరిగిందో చెప్పవే. భయం వదలవే".

ఇలా ఖరుడు అనగానే, కన్నీళ్లు చేత్తో తుడుచుకొని, లేచి కూర్చొని, తోడబుట్టినవాడిని చూసి, "నా పగ తీర్చడానికి నువ్వు బలవంతులైన పద్నాలుగు మంది రాక్షసులను పంపిన మాట వాస్తవమే. అయినప్పటికీ నువ్వు పంపిన వారందరూ రాముడి పదునైన, భయంకరమైన బాణాలకు చీల్చబడ్డ శరీరాలతో క్షణకాలంలో నిలబడి చచ్చిపోయారు. అది చూసిన నేను, అక్కడ వుంటే నన్నేం

చేస్తారో అన్న భయంతో, గాలి వేగంతో పరుగెత్తుకుంటూ వచ్చానిక్కడికి. అప్పుడు పుట్టిన వణుకు ఇప్పటికీ తగ్గలేదు. ఖరుడా చూడు, నా మాట అసత్యమేమో? గొప్ప విషాదమనే మొసళ్ళను, మహా భయమనే అలలను కల పెద్ద దుఃఖం అనే సముద్రంలో మునిగిన నన్ను లేవదీయి. నీ పనికోసం పోయిన రాక్షసుల మీద, తోబుట్టువైన నామీద, నీకు కొంచెమైనా దయ నిజంగా వుంటే, నువ్వు రాముడిని ఎదిరించి, యుద్ధం చేసే ధైర్యం వుందా? వుంటే, ఏదీ చూద్దాం... తక్షణమే ఆ రాక్షసులపాలిటి ముల్లైన రాముడిమీదకు యుద్ధానికి బయల్దేరు".

"చనిపోయిన రాక్షసుల మీద, బతికున్న నా మీద, దయ లేకున్నా, రాముడిని ఎదిరించి యుద్ధం చేసే ధైర్యం లేకున్నా, నాతో పాటు నువ్వు కూడా ఇంట్లోనే వుండు. నేను ఏడుస్తుంటా...నువ్వు సంతోషంగా నవ్వుతుండు. ఆయన నిశాట కంటకుడు కాబట్టి నువ్వు ఇక్కడ కూర్చున్నా వదిలిపెట్టడు. ఎప్పటికైనా పక్కనున్న ముల్లు గుచ్చుకోకుండా వుంటుందా? నాకు శత్రువైన శ్రీరామచంద్రమూర్తిని నువ్వు చంపడానికి ప్రయత్నం చేయకపోతే, నువ్వు చూస్తుండగానే, నీ ఎదుటనే ప్రాణాలు వదులుతా. ముక్కు-చెవులు కోయించుకొని కూడా పగ తీర్చుకోలేని ఈ అవమానపు బతుకు బతకడంకంటే చావడం మేలు కదా? నా ఆరాటం కొద్దీ నేను చెప్తున్నా కానీ వాస్తవం ఆలోచిస్తే, నువ్వు నీ సైన్యంతో పోయినా యుద్ధ భూమిలో ఆయన ఎదుట నిల్వలేవని అనిపిస్తున్నది. ఆయన బలం, ఆయన ధైర్యం ఎక్కడ? పిరికిపందవు, దుర్బలుడివి, నువ్వెక్కడ?"

"నాకేంటి? బలశౌర్యాలు లేకపోవడం ఏంటి? దేవతలను జయించానం టావా? అట్లయితే ఏదీ...నీ బాల శౌర్యాలు చూద్దాం. వెంటనే శ్రీరామచంద్రుడిని యుద్ధంలో ఎదుర్కోవడానికి సైన్యంతో బయల్దేరు. అలా చేయలేకపోతే, బలం, ధైర్యం లేని పిరికిపందకు ఈ దండకాటవి ఎందుకు? ఓరీ కులదూషకా! రాక్షస కులానికి అపకీర్తి తేవడానికి పుట్టావా? ఇక ఇక్కడ ఆలశ్యం చేస్తే, రాముడు రానే వస్తాడు. అదిగో రాముడు వస్తున్నాడు....నిన్నిక్కడే పూడుస్తాడు. మరెక్కడికైనా పరుగెత్తు. నా ముక్కు-చెవులు కోసి నన్నిలా అవమానించిన వీరుడిని, రఘువంశనాయకుడిని, శ్రీరామచంద్రమూర్తిని, ఆయన తమ్ముడు లక్ష్మణుడిని నువ్వేమని భావిస్తున్నావురా? సామాన్య మనుష్యులు అనుకుంటున్నావా? పది మంది, నూరు మంది ఆయన్ను గెలవగలరని అనుకుంటున్నావా?" అని శూర్పణఖ పెద్ద నగారా వాయించినట్లు కడుపు మీద బాదుకుంటూ, ఏడుస్తుంటే రాక్షస నాయకుడు ఖరుడు సమాధాన పరచాడు.

సర్గ-22

# సైన్యంతో శ్రీరాముడి మీదకు యుద్ధానికి పోయిన ఖరుడు

శూర్పణఖ నిందా వాక్యాలకు, తన పౌరుషాన్ని రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన మాటలకు జవాబుగా ఖరుడు "నా తోబుట్టువైన నిన్ను అవమాన పర్చారన్న అవమానం వల్ల కలిగిన కోపం, పొంగిపోయే సముద్రాన్ని అణచడం సాధ్యం కానట్లే, తగ్గించడం సాధ్యం కాదు. నీచ మనుష్యులను, చచ్చిన వాళ్లతో సమానమైన వారిని, నేను లక్ష్య పెట్తానా? వాడిని నేను చంపాల్సిన పని లేదు. వాడి దుష్ట చేష్టల వల్ల వాడే లోకంలో చంపబడుతాడు. ఇలాంటివాడు ఇలా చేసి చచ్చాడని పేరు మాత్రం నిలుస్తుంది. ఎందుకు ఏడుస్తావు? ఏడవ వద్దు. ఇదిగో ఇప్పుడే పోయి తమ్ముడితో సహా రామచంద్రుడిని నా పదునైన బాణాలతో, కఠినమైన కత్తితో చంపుతా. ఆ దుష్టుడి వేడి-వేడి నెత్తురు నీ పగతీరేదాకా జుర్రుకో" చెప్పగానే శూర్పణఖ సంతోషించింది. తమ్ముడిని మరీ-మరీ పొగిడింది. వాడు కూడా మరింత విర్రవీగుతూ, దూషణుడు అనే పౌరుషం, కోపం కల సేనానాయకుడిని పిలిచి యుద్ధానికి సన్నద్ధం కమ్మన్నాడు.

బలంతో భయంకరమైన వేగం కలవారిని, యుద్ధంలో వీపు చూపించని వారిని, సాహసవంతులను, నల్లటి మేఘం వన్నె దేహం కలవారిని, దయలేనివారిని, హింస చేయడానికి ఇష్ట పడేవారిని, సింహంలాగా పరాక్రం

కలవారిని, తన ఇష్టప్రకారం నడిచేవారిని, రణప్రయత్నం కలవారిని, భయంకరమైన బలం కలవారిని, పద్నాలుగువేల రాక్షసులను శీఘ్రంగా సమకూర్చమని దూషణుడిని పురమాయించాడు ఖరుడు. విల్లులు, బాణాలు, కత్తులు, ఇతర అనేక ఆయుధాలు కల తన రథాన్ని తీసుకురమ్మన్నాడు. పౌలస్త్య వంశంలో పుట్టిన రాక్షసుల ముందు తానూ పోతానన్నాడు. తన వెనుక సైన్యాన్ని రమ్మన్నాడు. శ్రీరామచంద్రుడికి చావుకూడేట్లు చేసి జయం పొంది లోకంలో ప్రసిద్ధికెక్కుతానన్నాడు.

ఖరుడు ఇలా చెప్పగా దూషణుడు ప్రళయకాలం నాటి సూర్యుడితో సమానమై, నానా వర్ణాల గుర్రాలు కట్టిన రథాన్ని అతడి ముందు నిలిపాడు. దాని మీదకు కోపంతో ఎక్కాడు ఖరుడు. ఖరుడు రథం ఎక్కగానే, దూషణుడు పెద్ద సేనతో ఖరుడి పక్కన నిలిచాడు. సైన్యాన్ని కదలమని ఖరుడు ఆజ్ఞాపించాడు. ఆ వెంటనే వేగంగా సేన బయల్దేరింది. ఆ ధ్వనికి అడవిలో మృగాలు తత్తరపాటుతో ఎటూ పోవడానికి దారితోచక తికమకలాడాయి. కొన్ని భయంతో మూర్ఛపోయాయి. సలాకులు, ముద్గారాలు, కత్తులు, గండ్రగొడ్డళ్ళు, బాకులు, వజ్రాయుదాల లాంటి కత్తులు, బల్లాలు, ఇనుపకట్ల గుదియలు,విల్లులు, బాణాలు చేతుల్లో ధరించి, చూసేవారికి భయంకరమైన వేషాలతో, భూమి గడగడ వణకుతుంటే పద్నాలుగు వేలమంది రాక్షసులు బయల్దేరారు. ఖరుడి మనసెరిగిన అతడి సారథి సైన్యం వెంట తీవ్రంగా రథాన్ని తోలాడు. ఆ రథం గమనవేగం వల్ల పుట్టిన ధ్వని భూమి నాలుగు దిక్కులా వ్యాపించింది. ఖరుడు కోపంతో, కఠినమైన గొంతుతో సారథిని త్వరితగతిన రథాన్ని తోలమని పురమాయించాడు.

సర్గ-23

# ఖరుడికి కలిగిన దుశ్శకునాలు

ఈ విధంగా రాక్షసులు యుద్ధకాంక్షతో పోతుంటే, గాడిదరంగు కల మేఘం రక్తవర్షం కల నీళ్లను వానగా కురిసింది. రథానికి కట్టిన గుర్రాలు, ఎత్తుపల్లాలు, గుంటలు లేని సమానమైన ప్రదేశంలో పూలున్న చోట తటాలున జారిపడ్డాయి. సూర్యుడి చుట్టూ కొరివి చక్రంలాగా గుండ్రంగా-నల్లగా, అంచున ఎర్రగా, భయంకరంగా పరివేషం కనపడింది. బంగారు ధ్వజ దండం మీద గద్ద ఒకటి వాలి కూచుంది. మాంసం తినే జంతువులు వికార స్వరాలతో అరిచాయి. సూర్యుడికి ఎదురుగా ఆయన్ను చూస్తూ నక్కలు కూశాయి. కొండల గుంపును వజ్రాయుధంతో ఇంద్రుడు రెక్కలు నరికినప్పుడు నెత్తురు ఎలా కారిందో, అలాగే ఇప్పుడూ కారడం జరిగింది. భూమేదో, దిక్కులేవో, తెలియకుండా చిమ్మ చీకట్లు కమ్మి మబ్బులు పెరిగాయి. సంధ్యాకాలం కాకపోయినా ఆకాశం నెత్తుట తడిసిన ముద్దలాగా కనిపించింది. ఖరుడికి ముఖాముఖిగా గద్దలు, తోడేళ్లు పరుషమైన ధ్వనులు చేశాయి. నక్కలు మంటలు కక్కుకుంటూ భయంకరంగా కూశాయి.

అమావాస్య కాకపోయినా రాహువు సూర్యుడిని మింగింది. సూర్యుడికి పక్కన భయంకరమైన మొండెం ఒకటి కనబడింది. ఎదురు ముఖంగా పెద్ద గాలి రివ్వున వీచింది. సూర్యుడి కాంతి క్షీణించింది. రాత్రి కాకపోయినా, చుక్కలు, నక్షత్రాలు ఆకాసంలో మిణుగురు పురుగుల్లా కనిపించాయి. నీళ్లలో

దాగిన చేపలు కమలాలతో కలిసి సరస్సుల్లో వుండిపోయాయి. చెట్ల నుండి పూలు, పళ్ళు రాలిపోయాయి. గాలి లేకున్నా ఎదురుగా ఎఱ్ఱటి దుమ్ములు ప్రబలాయి. గోరువంక పక్షులు వీచి–కూచి అని అరవసాగాయి. భయంకర ఆకారంతో నిర్ఘాతవాయువులు ఉల్కా తేజస్సులు అతిశయించాయి. భూమి కొండలతో, నదులతో వణికింది. ఖరుడికి ఎడమ భుజం అదిరింది. సింహనాదం చేద్దామంటే గొంతు మొద్దుబారి పోయి ధ్వని రాలేదు. నిష్కారణంగా కళ్ళ వెంట నీళ్ళు కారాయి. నొసట నొప్పి కలిగింది. ఇన్ని అపశకునాలు కలిగినా ఆ మూర్ఖుడు ప్రయాణం ఆపుచేసుకోలేదు.

ఈ విధంగా భయంకరమైన గొప్ప అపశకునాలు నాలుగు పక్కలా కలగడం చూసి ఆ రాక్షస నాయకుడు బలగర్వంతో వాటిని అలక్ష్యపరచి రాక్షస గుంపుతో వారు అధైర్య పడకుండా ఇలా అన్నాడు.

"స్పష్టంగా కనపడే ఆ అపశకునాలకు నేను జంకేవాడిని కాను సైనికులారా! పిరికివాడు వీటికి భయపడుతాడుకాని, భుజబలం వున్నవాడు వీటిని లక్ష్యపెట్టడుగా? నా బాణ వర్షంతో నక్షత్రాలనైనా నేలపడగొట్టాను. యముడిని దండిస్తా. అలాంటి బలపరాక్రమాలు కల నేను రామలక్ష్మణులను యుద్ధంలో చంపకుండా వెనక్కు పోతానా? మా అక్క తన కోరిక తీరా వారి రక్తాలు తాగాలి కాక. యుద్ధంలో ఇంతకు ముందు నాకెప్పుడూ అపజయం కలగలేదు. ఇది మీరే కళ్లారా చూశారు. అసత్యం చెప్పను. యుద్ధంలో ఇంద్రుడిని జయించాను. అలాంటి వాడిని ఇలాంటి నిస్సారపు మనుష్యుల చేతిలో చస్తానా?"

ఇలా చెప్పి సింహనాదం చేయగా రాక్ష శ్రేష్టులందరు యమపాశంతో కట్టబడినవారైనందున ఆ ధ్వనికి సంతోష సముద్రంలో తేలియాడారు. యుద్ధం చూద్దామని వచ్చిన దేవతలు, సిద్ధులు, ఋషిశ్రేష్ఠులు, గంధర్వులు ఆకాశంలో నిలిచి, గోవులకు, బ్రాహ్మణులకు లోకహితకారులకు మేలు కలగాలని ఆకాంక్షించారు. లోకహితం కోరి శుభకార్యాలు చేసే సుదర్శన చక్రధారైన విష్ణువు రాక్షసులను జయించిన విధంగానే, శ్రీరామచంద్రుడు సర్వ రాక్షసులను యుద్ధంలో జయించాలని కోరుకుంటూ వుండగా, ఆకాసంలో నిలబడ్డ వారికి, రాక్షస సేన సంతోషంగా, ఉత్సాహంగా యుద్ధానికి రావడం చూశారు.

తాను అనుకున్న విధంగా, వేగంగా తన సైన్యం నడవకుండా వుండడంతో, ఖరుడు ఆలశ్యం చేయకుండా సైన్యం అంతా వెనుకబడే విధంగా ముందుగా తన రథాన్ని నడిపించాడు. అతడి వెంట అమాత్యులు శ్యేనగామి, పృథుగ్రీవుడు,

కాలకార్ముకుడు, యజ్ఞశత్రువు, సర్వ్యాసుడు, దుర్జయుడు, మేఘమాలి, పరుషుడు, మహామాలి, విహంగముడు, రుదిరాశనుడు, కరవీరాక్షుడు అనే పన్నెండుమంది నడిచారు. అలాగే దూషణుడి వెంట స్థూలాక్షుడు, ప్రమాథి, మహాకపాలుడు, త్రిశిరుడు అనే నలుగురు ధ్వని చేసుకుంటూ నడిచారు. సూర్యచంద్రుల మీద క్రూర గ్రహాల గుంపు పరుగెత్తినట్లు సూర్యవంశంలో పుట్టినవారిలో శ్రేష్టులైన శ్రీరామలక్ష్మణుల మీదికి యుద్ధ కాంక్షతో రాక్షస సైన్యం నడిచింది.

సర్గ-24

# లక్ష్మణుడికి యుద్ధ శకునాలు చూపిన రాముడు

ఈ విధంగా రాక్షసులు యుద్ధకాంక్షతో పోతుంటే, గాడిదరంగు కల మేఘం రక్తవర్షం కల నీళ్లను వానగా కురిసింది. రథానికి కట్టిన గుర్రాలు, ఎత్తుపల్లాలు, గుంటలు లేని సమానమైన ప్రదేశంలో పూలున్న చోట తటాలున జారిపడ్డాయి. సూర్యుడి చుట్టూ కొరివి చక్రంలాగా గుండ్రంగా-నల్లగా, అంచున ఎర్రగా, భయంకరంగా పరివేషం కనపడింది. బంగారు ధ్వజ దండం మీద గద్ద ఒకటి వాలి కూచుంది. మాంసం తినే జంతువులు వికార స్వరాలతో అరిచాయి. సూర్యుడికి ఎదురుగా ఆయన్ను చూస్తూ నక్కలు కూశాయి. కొండల గుంపును వజ్రాయుధంతో ఇంద్రుడు రెక్కలు నరికినప్పుడు నెత్తురు ఎలా కారిందో, అలాగే ఇప్పుడూ కారడం జరిగింది. భూమేదో, దిక్కులేవో, తెలియకుండా చిమ్మ చీకట్లు కమ్మి మబ్బులు పెరిగాయి. సంధ్యాకాలం కాకపోయినా ఆకాశం నెత్తుట తడిసిన ముద్దలాగా కనిపించింది. ఖరుడికి ముఖాముఖిగా గద్దలు, తోడేళ్లు పరుషమైన ధ్వనులు చేశాయి. నక్కలు మంటలు కక్కుకుంటూ భయంకరంగా కూశాయి.

అమావాస్య కాకపోయినా రాహువు సూర్యుడిని మింగింది. సూర్యుడికి పక్కన భయంకరమైన మొండెం ఒకటి కనబడింది. ఎదురు ముఖంగా పెద్ద గాలి రివ్వున వీచింది. సూర్యుడి కాంతి క్షీణించింది. రాత్రి కాకపోయినా,

చుక్కలు, నక్షత్రాలు ఆకాసంలో మిణుగురు పురుగుల్లా కనిపించాయి. నీళ్లలో దాగిన చేపలు కమలాలతో కలిసి సరస్సుల్లో వుండిపోయాయి. చెట్ల నుండి పూలు, పళ్ళు రాలిపోయాయి. గాలి లేకున్నా ఎదురుగా ఎర్రటి దుమ్ములు ప్రబలాయి. గోరువంక పక్షులు వీచి-కూచి అని అరవసాగాయి. భయంకర ఆకారంతో నిర్ఘాతవాయువులు ఉల్కా తేజస్సులు అతిశయించాయి. భూమి కొండలతో, నదులతో వణికింది. ఖరుడికి ఎడమ భుజం అదిరింది. సింహనాదం చేద్దామంటే గొంతు మొద్దుబారి పోయి ధ్వని రాలేదు. నిష్కారణంగా కళ్ళ వెంట నీళ్ళు కారాయి. నొసట నొప్పి కలిగింది. ఇన్ని అపశకునాలు కలిగినా ఆ మూర్ఖుడు ప్రయాణం ఆపుచేసుకోలేదు.

ఈ విధంగా భయంకరమైన గొప్ప అపశకునాలు నాలుగు పక్కలా కలగడం చూసి ఆ రాక్షస నాయకుడు బలగర్వంతో వాటిని అలక్ష్యపరచి రాక్షస గుంపుతో వారు అధైర్య పడకుండా ఇలా అన్నాడు.

"స్పష్టంగా కనపడే ఆ అపశకునాలకు నేను జంకేవాడిని కాను సైనికులారా! పిరికివాడు వీటికి భయపడుతాడుకాని, భుజబలం వున్నవాడు వీటిని లక్ష్యపెట్టడుగా? నా బాణ వర్షంతో నక్షత్రాలనైనా నేలపడగొట్తాను. యముడిని దండిస్తా. అలాంటి బలపరాక్రమాలు కల నేను రామలక్ష్మణులను యుద్ధంలో చంపకుండా వెనక్కు పోతానా? మా అక్క తన కోరిక తీరా వారి రక్తాలు తాగాలి కాక. యుద్ధంలో ఇంతకు ముందు నాకెప్పుడూ అపజయం కలగలేదు. ఇది మీరే కళ్లారా చూశారు. అసత్యం చెప్పను. యుద్ధంలో ఇంద్రుడిని జయించాను. అలాంటి వాడిని ఇలాంటి నిస్సారపు మనుష్యుల చేతిలో చస్తానా?"

ఇలా చెప్పి సింహనాదం చేయగా రాక్ష శ్రేష్టులందరు యమపాశంతో కట్టబడినవారైనందున ఆ ధ్వనికి సంతోష సముద్రంలో తేలియాడారు. యుద్ధం చూద్దామని వచ్చిన దేవతలు, సిద్ధులు, ఋషిశ్రేష్ఠులు, గంధర్వులు ఆకాశంలో నిలిచి, గోవులకు, బ్రాహ్మణులకు లోకహితకారులకు మేలు కలగాలని ఆకాంక్షించారు. లోకహితం కోరి శుభకార్యాలు చేసే సుదర్శన చక్రధారైన విష్ణువు రాక్షసులను జయించిన విధంగానే, శ్రీరామచంద్రుడు సర్వ రాక్షసులను యుద్ధంలో జయించాలని కోరుకుంటూ వుండగా, ఆకాసంలో నిలబడ్డ వారికి, రాక్షస సేన సంతోషంగా, ఉత్సాహంగా యుద్ధానికి రావడం చూశారు.

తాను అనుకున్న విధంగా, వేగంగా తన సైన్యం నడవకుండా వుండడంతో, ఖరుడు ఆలశ్యం చేయకుండా సైన్యం అంతా వెనుకబడే విధంగా ముందుగా

తన రథాన్ని నడిపించాడు. అతడి వెంట అమాత్యులు శ్యేనగామి, పృథుగ్రీవుడు, కాలకార్ముకుడు, యజ్ఞశత్రువు, సర్పాసుడు, దుర్జయుడు, మేఘమాలి, పరుషుడు, మహామాలి, విహంగముడు, రుధిరాశనుడు, కరవీరాక్షుడు అనే పన్నెండుమంది నడిచారు. అలాగే దూషణుడి వెంట స్థూలాక్షుడు, ప్రమాథి, మహాకపాలుడు, త్రిశిరుడు అనే నలుగురు ధ్వని చేసుకుంటూ నడిచారు. సూర్యచంద్రుల మీద క్రూర గ్రహాల గుంపు పరుగెత్తినట్లు సూర్యవంశంలో పుట్టినవారిలో శ్రేష్ఠులైన శ్రీరామలక్ష్మణుల మీదికి యుద్ధ కాంక్షతో రాక్షస సైన్యం నడిచింది.

ఆ సమయంలో శ్రీరామచంద్రమూర్తి అన్ని దిక్కులలో స్పష్టంగా కనపడుతున్న అపశకునాలను అన్నిటినీ చూపించి, తమ్ముడితో ఇలా అన్నాడు. "లక్ష్మణా! చూశావా? రాక్షసులకు వినాశనం సూచించే అపశకునాలు. అన్ని చోట్లా విస్తారంగా కనిపిస్తున్నాయి. ఏదో కీడు రాగలదు. ఈ శకునాలు వ్యర్థమయ్యేవి కావు. మరణం సమీపించిన వారి ముఖాలు యుద్ధ సమయంలో వెలవెల పోయి కాంతిహీనంగా వుంటాయి. నీ ముఖం కాంతివంతంగా, శోభాయుక్తంగా, నిర్మలంగా, అందంగా వుంది. కాబట్టి జయం నాకు మాత్రమే కాకుండా నీకు కూడా కలుగుతుంది. మనకు భయం లేదు. ఆకాశంలో మేఘాలు గాడిదకాంతితో, గాడిదల కఠోరధ్వనితో, నెత్తురుల లాంటి జలధారలు కలిగినవిగా వున్నాయి. మన విల్లులు పొగలెగుస్తూ తమంతట తామే కదులుతున్నాయి. చాపాల్లో మంటలు వస్తున్నాయి. అడవుల్లో పక్షుల ధ్వని వింటే ప్రాణ హింసాత్మకమైన భయం కలుగుతుంది. శత్రువులు చస్తారు. మనకు జయం కలుగుతుంది. భయంకరమైన యుద్ధం జరగబోతున్నది. కుడిచేయి అదురుతున్నది. రాక్షసుల భయంకర ధ్వనులు, నగారాల మోతలు వినపడుతున్నాయి. కాబట్టి శత్రువులు సమీపంలోనే వున్నారు.

ఆపద రాబోతున్నదని తెలియగానే అనాగత విధాత అయిన ఆలోచనాపరుడు చలింపక ఆ ఆపద తొలగిపోయే ఉపాయాన్ని ముందుగానే తన బుద్ధితో ఆలోచించి చేస్తాడు.

### సీతాలక్ష్మణులను గుహలో పొమ్మనియుద్ధానికి సిద్ధమైన శ్రీరాముడు

లక్ష్మణుడు చేయాల్సిన పనేదో చెప్పాడు శ్రీరాముడు ఇలా: "సీతాదేవి ఇక్కడుంటే ఆమెకు వాళ్ళు కీడు కలిగిస్తారు. కాబట్టి ఆమె ఇక్కడ వుండకూడదు.

ఒంటరిగా ఎక్కడికీ పంపకూడదు. నువ్వు ఆమెను పిల్చుకొని, విల్లు–బాణాలు ధరించి దట్టంగా వున్నా చెట్ల గుంపులుకల కొండగుహలోకి పొండి. ఆమెను లోపల వుంచి నువ్వు బయట కాపలాగా వుండు. ప్రయాణం కండి తొందరగా. లేలే. నేనొకపని, నువ్వొకపని చేయాల్సి వుంది. రెండూ ముఖ్యమైనవే కదా?"

(వీటినే ఇప్పుడు "సీతమ్మ గుట్టలు" అని అంటారు. రాక్షస సైన్యం తూర్పు ముఖంగా వచ్చింది. సీతాలక్ష్మణులు ఎటి ఒడ్డు వెంట ఉత్తర ముఖంగా పోయారు).

శ్రీరాముడు ఇంకా ఇలా అన్నాడు లక్ష్మణుడితో. "నేను చెప్పిన మాటలకు బదులు చెప్తే నా పాదాలమీద ఒట్టు. యుద్ధ ప్రియా! నువ్వు బలహీనుడవనీ, వీళ్లతో యుద్ధం చేసి గెలవలేవనీ, నిన్నీపనికి ఏర్పాటు చేయలేదు. నువ్వు బలవంతుడివి. శూరుడివి. వీళ్లందరినీ జయించవచ్చు. ఇందులో సందేహంలేదు. అయినా ఈ రాక్షసులను నేనే స్వయంగా చంపాలనుకుంటున్నాను. అంటే తప్ప మరే కారణం లేదు. వాళ్లు రాకముందే బయల్దేరి వెళ్లు. మునులకు వాగ్దానం చేసిన వాడిని నేను. కాబట్టి ప్రథమ ప్రయత్నంగా నేనే యుద్ధానికి పోవడం యశస్కరం. అలా కాకుండా నిన్ను యుద్ధానికి పంపించి నేను చాటుగా వుంటే, రాముడు మాట్లాడేవాడే కాని సమయం వచ్చేసరికి ముఖం తప్పించి, తానూ, తన పెళ్లాం గుహలో దాక్కొని చిన్నవాడిని ముందుకు తోసాడని అంటారు. నువ్వు నన్ను ఇలాంటి అపకీర్తి పాలు చేయవచ్చా? కాబట్టి నేనే యుద్ధానికి పోతాను".

రామచంద్రమూర్తి చెప్పినట్లే త్వరగా లక్ష్మణుడు తన విల్లు, బాణాలు ధరించి సీతాదేవితో వెళ్ళిపోయాడు. ఇక సీత విచారం లేదనుకున్నాడు శ్రీరాముడు. ఆ సంతోషంతో యుద్ధ ప్రయత్నం చేశాడు. మండుతున్న అగ్నితో సమానమైన గొప్ప కవచాన్ని తొడుక్కొని, పదునైన బాణాల విల్లు చేత బట్టుకొని, అల్లెతాటి ధ్వనితో దిక్కులు భేదిల్లేట్లు రామచంద్రమూర్తి ఉత్సాహంగా విజృంభించి నిలిచాడు. ఇలా ఉత్సాహంతో యుద్ధ సన్నద్ధుడై నిలిచిన రామభద్రుడిని చూసిన గంధర్వులు, దేవతలు, చారణులు మొదలైన వారు యుద్ధం చూసే కోరికతో ఆకాశంలో నిలుచున్నారు. వారిలో వున్న ఋషులు తమలో తాము మాట్లాడుకుంటూ, మూడులోకాలకు మేలుజరగాలని కోరుకునే గోబ్రాహ్మణులకు శుభం కలగాలని అంటారు. అలానే, చక్రపాణి అయిన విష్ణుమూర్తి దైత్యశ్రేష్టులందరినీ ఎలా జయించాడో, అదే విధంగా,

పులస్త్యవంశంలో పుట్టిన భయంకర రాక్షసులందరినీ యుద్ధంలో జయించాలి అని దీవించారు. ధర్మాత్ముడైన రాముడు ఒక్కడే అనీ, అధర్మవర్తులైన దుష్ట రాక్షసులు పద్నాలుగు వేలమందనీ, యుద్ధం ఎలా జరగనుందోననీ, ధర్మమే జయిస్తుందో, అధర్మమే జయిస్తుమ్మో చూడాలనీ వారంతా ఆశపడ్డారు. కోపాతిశయంతో జగత్సంహార కార్యోన్ముఖుడైన పినాకహస్తుడు రుద్రుడి ఆకారంతో సమానమైన ఆకారాన్ని వహించి భూతాలకు భీతికలిగించే రామభద్రుడి రూపాన్ని చూసి లోకాలు బాధపడ్డాయి.

## రాముడిని చూసిన ఖరుడి సైన్యం

అప్పుడు గంభీరధ్వనితో, భయంకరమైన కవచాలు, ఆయుధాలు, ధ్వజాలు కల రాక్షససేనలోని భటుల హుమ్మనే కంఠధ్వనులు, విల్లంబుల, అల్లెతాటుల టంటమ్మనే ధ్వనులు, నగారాల భాంభాం అనే ధ్వనులు, రథికుల ధిక్కారాల ధ్వనులు, వాళ్ళు నడిచేటప్పుడు వారి కాళ్ల దభదభ చప్పుళ్లు, అన్నీ కలిసి పెద్ద సంకులమయింది. ఆ ధ్వనికి అడవుల్లోని మృగసమూహం భయపడి నాలుగు దిక్కులా పరుగెత్తి, పరుగెత్తి, ఆ చప్పుడు వినబడని స్థలం చేరి అప్పుడు తిరిగి చూశాయి. అప్పుడు రాక్షస సైన్యం రాముడిని సమీపించగా, యుద్ధపండితుడైన రామభద్రుడు వారందరినీ తేరిపార చూశాడు. రాముడప్పుడు అల్లెతాటిలోని బాణాన్ని సంధించి ప్రయోగానికి సిద్ధంగా వుంచాడు. ప్రళయకాలంలోని అగ్నిహోత్రుడిలాగా మండుతూ దక్షాధ్వరధ్వంసం నాటి శివుడిలాగా చూసేవారికి భయంకర ఆకారంతో కనిపించాడు రాముడు. భయంకరమైన రామభద్రుడి ఆకారం చిఇసి భూతాలు పెద్ద ధ్వనితో సంతోషం చెడి అధికభయంతో తొక్కిసలాడుతూ పరుగెత్తాయి. ధ్వజాలు, విల్లులు, ఆభరణ సమూహం, మండుతున్న అగ్నిలాంటి కవచాలుకల రాక్షససేన సూర్యోదయ సమయంలోని మేఘాల లాగా కనిపించాయి.

(ఇక్కడ రామచంద్రుడిని ప్రళయకాలవహ్ని అని, దక్షాధ్వరధ్వంసకుడు అని శివుడి ఉపమానాలు చెప్పడమంటే శత్రుసంహారం తథ్యమని చెప్పడమే. రాక్షసులను సూర్యోదయ మేఘాలతో పోల్చడమంటే వారికి అపజయం తథ్యమని కూడాఅర్థం).

సర్గ-25

# సైన్యంతో శ్రీరాముడిని తాకిన ఖరుడు

కోపంతో, శత్రు సంహారకుడిలా కనిపిస్తున్న యుద్ధ సన్నద్ధుడైన కోదండధరుడు శ్రీరామభద్రుడిని చూసిన ఖరుడు తన సారథితో ఆయన వున్న ప్రదేశానికి తన రథాన్ని పోనివ్వమన్నాడు. ఆయన అలా చెప్పగానే ఆయన చుట్టూ మూగిన రాక్షసులు సింహనాదాలు చేశారు. ఖరుడు ఆలశ్యం చేయకుండా పదునైన బాణ పరంపరలను విస్తారంగా రాముడి మీదకు వేశాడు. మిగిలిన రాక్షసులందరూ రాముడిని చుట్టుముట్టి గుడియలు, శూలాలు, గండ్రగొడ్డళ్ళు, కత్తులు ఆయన మీదికి విసిరారు. శ్రీరాముడు మాత్రం అప్పటిదాకా ఆత్మరక్షణ పరాయణుడై నిలిచాడు. రామభద్రుడిని చంపడానికి రాక్షసులు బాణాలతో, ఏనుగులతో, రథాలతో, ఒక్కసారిగా ఆయన మీద పడ్డారు. అందరూ కలిసి రాముడిమీద బాణాల వర్షం కురిపించారు. (దీనర్థం ప్రథమంగా అపరాధం చేసింది రాక్షసులే). రామభద్రుడు ప్రతిగా, తన బాణ సమూహాలతో వారందరినీ సర్వాయుధాలు లేకుండా చేశాడు. ఆయన తనకు తగిలిన బాణాల వల్ల కొంచెం కూడా వేదన పొందలేదు. దేహం నుండి నెత్తురు కారుతుంటే, సాయంకాల సమయంలోని మేఘాలతో ఆవరించబడిన సూర్యుడిలాగా, అందంగా ప్రకాశించాడు. క్షుద్ర రాక్షస సమూహం శ్రీరామచంద్రమూర్తిని చుట్టుముట్టి ఆయుధాలతో బాదిస్తున్నదే అని దేవతలు, ఋషులు, పరితపించారు. అప్పుడు రామభద్రుడు కోపంతో వింటిని ఆకర్ణాంతం లాగి బాణాలను సంధించాడు.

## ఖరుడి సైన్యాన్ని హతం చేసిన శ్రీరాముడు

అమిత వేగంగా వేసిన సహించనలవి కాని రాముడి బాణాలు రాక్షస గుంపులను దూరి యమపాశాల లాగా, వారి దేహాలను చీల్చి, వారి నెత్తుటి నదుల్లో మునిగి, వెడలి, మండుతున్న అగ్నిజ్వాలల్లాగా ఆకాశానికి ఎగిరిపోయాయి. రామభద్రుడి బాణాలు శత్రువులను తునాతునకలు చేశాయి. వారి శరీర భాగాలు తెగనరకబడి కుప్పలు–తెప్పలుగా పడిపోయాయి. విరోధులు తత్తరపడేట్లు బంగారు సొమ్ములతో అలంకరించబడిన రాక్షసుల గుర్రాలను చంపి, మావటివాళ్ళతో మదించిన ఏనుగులను తునకలు–తునకలు చేసి, రథికులతో, సారథులతో సహా రథ సమూహాలను పదునైన బాణాలతో నరికి, భటుల గుంపులను కూర ముక్కల్లాగా కోసి, సూర్యుడిలాగా ప్రకాశిస్తున్న రాముడిని చూసి రాక్షస సైన్యం దుఃఖించింది. ఆ రాక్షసుల గుంపులో చాలామంది చావగా, మిగిలిన కొందరు రామభద్రుడి మీదకు దాడికి దిగగా, ఆయన మరింత పదునైన బాణాలతో వారి ఆయుధాలను, తలలను ఒకేసారి నరికి వేశాడు. ఇక మిగిలిన వారంతా దుఃఖపడుతూ ఖరుడి చాటుకు పోయారు భయంతో.

ధైర్యం కోల్పోయి వెనక్కు వచ్చిన వారందరినీ మళ్లీ ధైర్యం చెప్పి, దూషణుడు రోషంతో రామభద్రుడి మీదకు యుద్ధానికి పోయాడు. ఆయన వెంట ఇంతకు ముందు మరలి వచ్చిన గుంపు కూడా తమ ఆయుధాలు ఖండించబడినందువల్ల మద్ది–తాటి చెట్లను ఆయుధాలుగా ధరించి రాముడి మీదికి పోయారు. వెనుకంజ వేయకుండా, ఒక్క రాముడిని ఓడించకపోతే అవమానం అంటూ, రాక్షసులు కొంతసేపు యుద్ధం చేశారు. ఈటెలు, కత్తులు, బాణాలు తన మీద వేస్తుంటే, రామభద్రుడు ధనుష్టంకారం చేసి వాళ్ల గుండెలు పగులచేసి, సింహనాదం చేసి, శత్రుసంహారానికి గాంధర్వాస్త్రం ప్రయోగించాడు. దాని నుండి వెలువడిన అనేక అకారాల భయంకరాస్త్రసమూహం మూలంగా, ఆకాశం చీకట్లు కమ్మింది. రాక్షస సైన్యం తూలి, వాలి, పడి, తునకలు–తునుకలై, పేగులు తెగిపడగా మూర్ఛపోయి కూలి, పొడి–పొడి అయిపోయి భయంకరంగా నాశనం అయింది. ఇదంతా ఆకాశం నుండి చూసిన దేవతలు సంతోషించారు.

విరిగిన రథాలను, చచ్చిపడిన శూరులను, నేలవాలిన ధ్వజాలను, గొడుగులను, తెరచిన నోరులను, పరుగిడుతున్న వీరులను, పడిపోయిన ఏనుగులను, దొర్లాడు గుర్రాలను, కోయబడిన చేతులను, విధం చెడ్డ, సర్వం నాసనమైన రాక్షస సైన్యాన్ని చూసిన దూషణుడు మరింతమందిని రాముడిమీడకు పంపాడు.

సర్గ-26

# శ్రీరాముడితో యుద్ధం చేసి మరణించిన దూషణుడు

ఐదువేలమంది కఠినదేహాలు, మనస్సు కల రాక్షసులను రామభాద్రుడిని చంపడానికి పంపాడు దూషణుడు. వాళ్ళు వజ్రసమానమైన శూలాలను, ఖడ్గాలను, బాణాలను వర్షంలాగా కురిపిస్తూ రాముడి మీదకు వస్తుంటే, ఆయన పరాక్రమించి తన బాణాలతో వారి ఆయుదాలన్నింటినీ ఖండించాడు. దూషణుడితో సహా సైన్యాన్నంతా దుఃఖ దశకు తీసుకొచ్చాడు. బాణ వర్షంతో వారందరినీ స్నానం చేయించాడు రాముడు. శత్రుసమూహాలను నాశనం చేయగల దూషణుడు కోపగించి వజ్రసమానమైన బాణాలను తనపై ప్రయోగించగా రామభద్రుడు అంతకంటే ఎక్కువ కోపగించాడు. పదునైన కత్తిలాంటి బాణంతో దూషణుడి విల్లు తుంచి, మరో నాలుగు పదునైన బాణాలతో నాలుగు గుర్రాలను చంపి, తరువాత సారథి కంఠాన్ని అర్థ చంద్ర బాణంతో నరికి, మూడు బాణాలు దూషణుడి రొమ్ములో నాటేట్లు రామభద్రుడు చేయగా రాక్షసుడు కూడా ఆయన మీద పడడానికి వచ్చాడు. వస్తున్న వాడి రెండు చేతులను తటాలున రెండు బాణాలతో నరికాడు. రెండు చేతులూ తెగడంతో దూషణుడు కొమ్ములు పెరికిన ఏనుగులాగా చచ్చాడు. చనిపోయిన వాడిని చూసి భూతాలన్నీ మేలు-మేలని శ్రీరామచంద్రుడిని పొగిడాయి.

ఇంతలో కొందరు రాక్షస వీరులు కోపంతో దేహం తెలియకుండా రామభద్రుడి మీదకు వచ్చారు. స్థూలాక్షుడు పట్టిసాన్ని, మహాకపాలుడు శూలాన్ని, ప్రమాథి భయంకరమైన గండ్ర గొడ్డలిని తీసుకుని చేతులతో తిప్పుకుంటూ రాముదిమీదకు వస్తుంటే, రామభద్రుడు మొదలు పదునైన బాణాలతో మహాకపాలుడి తల నరికాడు. మరో గొప్ప బాణంతో ప్రమాథిని చంపాడు. స్థూలాక్షుడి కళ్లల్లో బాణాలను చొప్పించి, ఐదువేల రాక్షసులను ఒక్కసారే ఐదువేల బాణాలతో ఖండించాడు. ఇది చూసి ఖరుడు, క్షుద్ర మనుష్యులతో దూషణుడు చచ్చాడు కాబట్టి మీరంతా పోయి రామభద్రుడిని చంపమని యోధులను ఆజ్ఞాపించి తానె స్వయంగా యుద్ధానికి దిగాడు.

## శ్రీరాముడి చేతిలో చనిపోయిన కాలకార్ముకాది సేనాపతులు

కాలకార్ముకుడు, మేఘమాలి, మహామాలి, దుర్జయుడు, యజ్ఞశత్రుడు, విహంగముడు, రుధిరాశనుడు, సర్పాస్యుడు, పృథుగ్రీవుడు, శ్యేనగామి, కరవీరాక్షుడు, పరుషుడు అనే పన్నెండు మంది సేనానాయకులు ఒక్కసారిగా రామభద్రుడిని ఎదుర్కొని బానవర్షం కురిపించారు. రాముడు వారి బాణాలను ఖండించి వజ్రంతో సమానమైన బానవర్షాలను కురిపించి, వాళ్లను నరికి భూదేవికి బాలి ఇచ్చాడు. ఆ తరువాత నూరు బాణాలతో వందమందిని, వేయి బాణాలతో మరో వేయి మందిని చంపాడు. యుద్ధ భూమి నెత్తుటితో తడిసినట్లు కనిపించింది. మరణించిన దుష్టరాక్షస సమూహం వెంట్రుకలతో భూమి దర్భల వేదికలాగా కనపడింది. మొత్తం మీద, పద్నాలుగువేల రాక్షసులను రామచంద్రమూర్తి ఒక్కడే తన భుజబలంతో చంపాడు. ఇక ఇరు పక్షాలలో మిగిలింది, ఖరుడు, త్రిశిరుడు, రామభద్రుడు మాత్రమే!

సర్గ–27

# శ్రీరాముడితో పోరి చచ్చిన త్రిశిరుడు

సైన్యమంతా నాశనమైపోవడం చూసిన ఖరుడు రాముడికి అభిముఖంగా పోవడానికి ప్రయత్నించగా, సేనానాయకుడైన త్రిశిరుడు తానుండగా ఇంద్రుడిని గెలిచిన ఖరుడు శత్రువు మీదకు పోవడం మర్యాదా అని ప్రశ్నించాడు. ఇలాంటి ఆలోచన ఖరుడు చేయకూడదనీ, తుచ్ఛుడైన రాముడిని పట్టుకొని తన బాణాలతో నిమిషంలో నరికి వేస్తానంటాడు. ఈ మాటలు తన విల్లు మీద ప్రమాణం చేసి చెప్తున్నానంటాడు. "రాముడు నన్నో, నేను రాముడినో చంపడం నిజం. దీన్ని నువ్వు నిలుచుని చూస్తుండు. రాముడు చస్తే నువ్వు సంతోషంగా ఇంటికి వెళ్లు. నేను చస్తే నువ్వు రాముడి మీదకు యుద్ధానికి పోయి అతడి గర్వం అణచు" అని త్రిశిరుడు చెప్పగా ఖరుడు అలానే చేయమని అంటాడు.

త్రిశిరుడు మూడు శిఖరాల కొండలాగా రథమెక్కి పోయి రామభద్రుడి మీద జోరున వర్షంలాగా బాణాలు కురిపించి, నీళ్లలో తడిసిన నగారా ధ్వనిలాగా సింహనాదం చేశాడు. రామభ్రదుడు కూడా రా–రమ్మంటూ తన విల్లు గిర–గిర తిప్పుతూ కత్తిని బాణాలు ధరించి త్రిశురిడి మీద వేశాడు. వాడు కోపంతో విజృంభించాడు. వారిరువురి మధ్య అద్భుతమైన యుద్ధం సింహానికి, ఏనుగుకూ మధ్య జరిగినట్లు జరిగింది. త్రిశిరుడు మూడు బాణాలను రాముడిపైకి వేశాడు. రాముడు జవాబుగా పద్నాలుగు బాణాలను వాడి రొమ్ముకు గురిచూసి వేశాడు.

నాలుగు బాణాలతో గుర్రాలను, ఎనిమిది బాణాలతో సారథిని, ఒక్క దెబ్బతో తెక్కాన్ని తుంచి, భూమి మీదకు దుమకడానికి ప్రయత్నిస్తున్న రాక్షసుడి వక్షాన్ని చీల్చేట్లు తీవ్ర బాణాలను వేయగా వాడు చేష్టలుడిగి ఖండించబడిన శిరస్సుతో నేలకూలాడు.

త్రిశిరుడు పడిపోవడం చూసిన ఖరుడిని ఆశ్రయించిన సేవకులు, ఇతర రాక్షసులు, రామభద్రుడు ఇక తమల్ని కూడా చంపుతాడనే మహా భయంతో పెద్ద పులిని చూసిన లేళ్ళలాగా నాలుగు దిక్కులా పరుగెత్తారు. తానుండగా వాళ్లకు ఎలాంటి ప్రాణభయం లేదని వాళ్లకు ధైర్యం చెప్పి వాళ్లందర్నీ పిలుచుకొని వచ్చి నిండు కోపంతో చంద్రుడి మీదకు రాహువు పోయినట్లు రాముడి మీదకు పోయాడు యుద్ధానికి.

సర్గ-28

# శ్రీరాముడితో యుద్ధం చేసిన ఖరుడు

యుద్ధంలో దూషణుడు, త్రిశిరుడు చావడం చూసి ఖరుడు తన గుండె ఝల్లుమనగా ఇలా అనుకున్నాడు. "ఆహా! ఇదేమి విక్రమం? ఔరా! ప్రసిద్ధికెక్కిన బలశాలులను పద్నాలుగు వేలమందిని, దూషణుడుని, త్రిశిరుడుని ఒక్కడిని కూడా వదలకుండా ఒంటరిగానే రాముడు చంపాడు. ఏమి భయంకర బలం? నేనొక్కడినీ వీడికి లక్ష్యమా? అయినా కానిమ్ము. చూస్తాను" అనుకుంటూ, ఇంద్రుడిమీదకు నముచి పోయిన విధంగా క్రూరమైన బాణాలను కుప్పలు-కుప్పలుగా ప్రయోగించి తన అస్త్ర-శస్త్ర విద్యాపాండిత్యాన్ని ఆసాంతం వెల్లడయ్యేలా ఖరుడు యుద్ధం చేసాడు. ఖరుడి అస్త్రాలను, శస్త్రాలను రామభద్రుడు ఏమాత్రం లెక్కచేయకుండా, మనస్సు చెదరనీకుండా, తన భుజపరాక్రమం ప్రకాశించేట్లు మహావేగంగా పోయే బాణాలను ఆకాసంలో సందులేనట్లు వేయడంతో ఆ బాణాల సమూహం ఆవరించిన సూర్యుడు కనిపించలేదు. ఆ ప్రకారం ఖరుడు, రాముడు యుద్ధం చేశారు. ఖరుడు కూడా పదునైన బాణాలతో రాముడుని నొప్పించాడు.

ఇలా రాముడుని నొప్పించిన ఖరుడు, ఇంత యుద్ధం చేసినా, ఇంతమంది రాక్షసులను వధించినా, ఈ సింహవిక్రముడు అలసిపోలేదేంటని ఆలోచించాడు. ఇక రామభద్రుడు , ఖరుడుని ఒక సింహం అల్ప మృగాన్ని చూసినట్లు

చూసాడేకాని, వాడొక బలవంతుడైన రాక్షసుడని అనుకోలేదు. అల్పుడైన ఖరుడు సూర్యుడులాగా ప్రకాశించే బంగారు రథం మీద నుండి, గిర–గిరా విల్లును తిప్పుతూ పాశాన్ని చేతిలో వుంచుకున్న యముడిలాగా రామభాద్రుడిని సమీపించాడు.

## శ్రీరాముడి కవచాన్ని భేదించిన ఖరుడు

కార్చిచ్చు సమీపించే మిడతలాగా రాముడిని తాకి తన హస్త లాఘవం మెరిసేట్లు రామభద్రుడు పట్టుకున్న విల్లు, విల్లును పట్టుకున్న పిడికిలి చీలేట్లు కరకుములుకులను ప్రయోగించి, సూర్యుడితో సమానమైన ఏడు బాణాలను రామభద్రుడి కవచం నేలమీద పడేట్లు వేగంగా కొట్టాడు. ఇలా తన కవచాన్ని నేలబడగొట్టడం సహించని రామభద్రుడు రోషంతో భయంకరమైన యుద్ధ భూమిలో ప్రకాశించాడు. కోపం రూపం ధరించినట్లై ఖరుడుని చంపడానికి అగస్త్యుడు ఇచ్చిన వైష్ణవ ధనస్సును తీసికొని ఖరుడి ధ్వజం విరిగి నేలబడేట్లు కొత్తగా అది పడిపోయింది. యుద్ధ రహస్యం తెలిసిన ఖరుడు నాలుగు పదునైన బాణాలతో రామభద్రుడి ఆయువుపట్టువు మీద వేసి నెత్తుటి దేహంగల వాడిగా రాముడిని చేశాడు. రాముడు కూడా ఒక బానాని ఖరుడి శిరస్సుమీద, రెండు బాణాలు చేతులపైనా, మూడు బాణాలు పోట్టమీదా నాటేట్లు వేశాడు. ఖరుడు ప్రతిగా వేసే బాణాలను లక్ష్యపెట్టక రామభద్రుడు పదమూడు బాణాలు సంధించి, ఒకదానితో కాడిని, నాలుగు బాణాలతో గుర్రాలను, ఒక బాణంతో సారథిని, మూడు బాణాలతో నోగాను, రెండింటితో ఇరుసును, పన్నెండో బాణంతో విల్లును తుంచాడు. పదమూడో బాణంతో ఖరుడి దేహాన్ని చీల్చేట్లు వేయగా అతడు గుర్రాలు, సారథి లేకపోవడంతో, గద తీసుకొని భూమ్మీదకు దిగాడు.

సర్గ-29

# ఖరుడిని నిందించిన శ్రీరాముడు

చేతిలో గద పట్టుకొని నిలిచి వున్న ఖరుడిని చూసి సీతాపతి మెత్తటి మాటలతో, హృదయాన్ని పుండులాగా తగిలే కఠినవాక్కులతో ఇలా అన్నాడు. "ఓరీ! నీచ రాక్షసుడా! విస్తారంగా రథాలు, గుర్రాలు, ఏనుగులు, వుండబట్టి గర్వంతో, దయలేకుండా లోకులు నిందించే చెడ్డ పనులు చేశావు. ప్రజలకు కీడు, బాధ కలిగించే పాపకార్యాలు చేసేవాడు పరమేశ్వరుడైనా కీడు పాల్పడుతాడు. పాపీ! ఇక నువ్వెంత? ఇంట్లో చేరిన పామును చంపడానికి ఎలా జనాలు ప్రయత్నం చేస్తారో, అలాగే, లోకంలో కీడు కలిగించే పనులు చేసేవారిని, దుష్టులను, వారి గర్వం అణిగే విధంగా సాధువులు, సాధువులు కానివారు కూడా ప్రయత్నం చేస్తారు. దుష్టుడు నల్లికంటి పాము వడగళ్ళను తిని చచ్చినట్లు చస్తాడు. నేనేం పాపం చేశాను? నేను పాపం చేస్తే నాకీ సంపద వచ్చేదా? అంటావేమో? ఓరీ! నీచ రాక్షసా! దండకారణ్యంలో తిరిగే మునిశ్రేష్టులను, ధర్మబద్ధులను, పరులకెవ్వరికీ బాధ కలిగించని సాధువులను, నీ ఇష్ట ప్రకారం గర్వంతో చంపావు కదా? దానివల్ల ఏం మేలుకలుగుతుందని భావించావు?"

"సాధారణంగా ఈ జన్మలో చేసిన పుణ్య-పాప ఫలాలు ఈ జన్మలోనే అనుభవానికి రావు. పోయిన జన్మలో చేసిన పుణ్యం వల్ల ఈ జన్మలో సంపద వస్తుంది. అయినా ఏం లాభం? పుణ్యం వల్ల కదా మనకు ఐశ్వర్యం కలిగిందన్న

జ్ఞానం లేకుండా మదమెక్కి పాపాలు చేసేవారి సంపద వేరుతేగిన చెట్టులాగా దీర్ఘకాలం నిలవదు. త్వరలోనే నశిస్తుంది. అలాగే పోయిన జన్మలో నువ్వు చేసిన పుణ్యఫలం తీరింది. పాప ఫలం అనుభవించే సమయం ఆసన్నమైంది. విత్తనం నాటగానే పూలు, పళ్ళు చేతికి రానట్లే పాపం చేసిన వెంటనే పాపఫలం రాదు. చెట్లు ఋతువులు వచ్చినప్పుడే కదా పూలు పూస్తాయి. అలాగే మనిషి తాను చేసిన పాపఫలం సమయం వచ్చినప్పుడు తప్పక అనుభవిస్తాడు. విషంతో కలిసిన అన్నం తింటే, ఎలా తప్పకుండా కీడు కలుగుతుందో, అలాగే పాపఫలమైన కీడులను శీఘ్రంగా ఏ విధంగానైనా అనుభవించక తప్పదు".

"పాపకార్యాలు చేసే పాపాత్ములను, లోకంలో కీడు చేసే దుష్టులను చంపడానికి రాజాజ్ఞ తీసుకొని వచ్చాను రాక్షసుడా! పుట్టలోకి పాములు పోయే విధంగా నా బాణాలు నీ శరీరంలో దూరి నిన్ను నీ సైనికులతో, మిత్రులతో సహా, నువ్వు ఇంతకు ముందు చంపిన మునుల దగ్గరకు పంపుతాయి. నీ దేహంలో ఎంత గర్వముందో ఇప్పుడే చూపించు...చూస్తా. యుద్ధరంగంలో నా బాణాలతో నేలకూలి బాధపడుతున్న నిన్ను,నువ్వు వధించిన మునులు ఆకాశంలో విమానాల నుండి చూసి సంతోషిస్తారు. తాటి పండు నేలపడగొట్టినట్లు నీ శరీరాన్ని నేలబడగొట్టుతాను. కాబట్టి నీ బలమెంతో దాన్నంతా చూపించు. నీ బలమంతా నువ్వు చూపించిన తర్వాతే నిన్ను చంపుతాను. నీ బలమంతా చూపిస్తే రాముడేమై వుండేవాడో అన్న కొరత నీకు–నీవారికి అక్కరలేదు".

ఇలా తనను నిష్ఠూరాలు ఆడుతున్న రామభద్రుడిని చూసి, అవి తన మేలుకోరకై చెప్పబడుతున్న మాటలని తెలుసుకోలేని ఆ ఖరుడు, ఇవన్నీ యుద్ధంలో సాధారణంగా చెప్పే బెదిరింపు మాటలని భావించి, కోపంతో కళ్ళు ఎర్రచేసి నవ్వుతూ ఇలా అన్నాడు.

"ఓరీ! నిస్సారమైన ఈ గుంపును చంపినంత మాత్రాన, గర్వంతో కళ్ళు కనపడకుండా మహా శూరుడనని నిన్ను నువ్వు మెచ్చుకోగానే గౌరవం వస్తుందా? బలవంతుడు తనను తాను మెచ్చుకుంటాడా? మగతనం కల బలశాలి తాను చేసే పనులను తానే చెప్పుకోడు. నీచులైన రాజులే నీలాగా నిష్ప్రయోజనంగా వ్యర్థ భాషణలు చెప్తారు. తాను గొప్ప వంశంలో పుట్టానని ప్రకటించుకుంటూ అసమర్థంగా నీలాగ మరణం దగ్గరపడుతుంటే తన్ను తాను పొగడుకోవడం జరుగుతుంది. నిన్ను నువ్వు పొగుడుకోవడం అంటే, దర్భ కొనలోని అగ్నిలాగా నువ్వెంతటి నీచుడివో తెలుస్తున్నది. చేతిలో గద పట్టుకొని

ధాతువులతో కూడి కదిలించలేని పర్వతంలాగా వున్నా నేను నీకు కనబడలేదా? ప్రళయకాలంలో యముడు ఒక్క పాశంతోనే లోకాలన్నింటినీ హింసించినట్లు నేను ఈ ఒక్క గదతోనే నిన్ను చంపుతాను చూడు. బలహీనుడా చూడు. నిన్ను ఎన్నో అనాలని వుంది. కాని అనడానికి ఇష్టం లేదు. ఎందుకంటే సాయంకాలమవుతున్నది. సూర్యుడు అస్తమిస్తే యుద్ధం ఆపాలి. రాత్రి మీకు అనుకూలమే కదా? ఎందుకు ఆపాలి అని అంటావా? నువ్వు మనుష్యుడివి. చీకట్లో యుద్ధం చేయలేవు. అలాంటి ప్రతికూల సమయంలో నిన్ను చంపడం నా పౌరుషానికి తగింది కాదు. అదీ కాకుండా నిన్ను పొద్దు కుంకే సమయంలోపుల చంపి నీ చేతుల్లో చనిపోయిన వారికై ఏడ్చే వారి బంధువులకు నేను కన్నీళ్లు తుడిచి సమాధాన పెట్టాల్సిన పని మిగిలింది. నీతో ముచ్చటలాడితే అదెలా సాధ్యం?"

ఇలా చెప్పి గదను చేత్తో తిప్పి విసిరి, పిడుగులాగా రామభద్రుడిమీద వేశాడు. దాన్ని ఆకాశంలోనే రాముడు గొప్ప బాణ సమూహంతో, మహామంత్రంతో తునుకలు చేశాడు. దాంతో దిక్కుతోచక నిలబడ్డ ఖరుడిని చూసి ఇలా అన్నాడు.

"ఓరీ! ఏమేమో వాగావు కదా? నీ బలమంతా చూపావు కదా? చెప్పినా అర్థం కాని మూర్ఖుడా? వ్యర్థపు మాటలు మాని యుద్ధానికి రా. చనిపోయిన వారికొరకు కన్నీళ్లు తుడిచే పని వున్నదన్నావు కదా? నీచుడా! నీ మాటలు ఎలా అబద్ధం అయ్యాయో చూసావు కదా? నా బాణాలతో నీ ప్రాణాలు తీయడానికి భూమి ఎదురు చూస్తున్నది. బోర్లపడి భూమిని కౌగలించుకొని చావబోతున్నావు. అప్పుడు, నీ బాధ తొలగినందుకు నిర్భయంగా మునులంతా నిర్విచారంగా, సుఖంగా, నిద్రపోతారు. ఓరీ! రాక్షసుడా! నా బాణాలతో జనస్థానం ప్రేతస్థానం అయిపోయి, ఇక మునులంతా నిర్భయంగా ఈ దండకలో సంకోచం లేకుండా సంచరిస్తారు. ఇప్పటిదాకా మునులను భయపెట్టుతున్న రాక్షస స్త్రీలు, వాళ్లను కూడా నేను చంపుతానేమో అన్న భయంతో, దిక్కులేనివారిలాగా దిక్కులవెంట పరుగెత్తుతారు. నీ భార్యలు వెల-వెల పోయిన ముఖాలతో నీలాంటి వాడిని కట్టుకున్నందుకు, బతికీ ప్రయోజనం లేని విధంగా బతుకుతారు".

"ఓరీ ఘాతకుడా! నీచుడా! పాపాత్ముడా! బ్రాహ్మణ ద్వేషీ! నిర్దయమైన మనస్సు కలవాడా! మీ వల్ల కలిగిన భయం వల్ల మునిశ్రేష్టులు హోమసమయంలో తాము హవిస్సును అగ్నిలో వేసేంతదాకా ఎక్కడ రాక్షసులు వస్తారో, ఎవడెప్పుడు విఘ్నం చేస్తారో అన్న సందేహంతో గడగడలాడే వారు. ఇలా అలాంటి చేష్టలు జరగవు".

రామభద్రుడి మాటలకు మరింత కఠినమైన మాటలతో ఖరుడిలా అన్నాడు. "ఓరీ! నీచమనుష్యుడా! నువ్వేలాంటి మనుష్యుడివిరా? ప్రాణం పోవడానికి సిద్ధంగా వుండి కూడా పొగరుగా మాట్లాడుతున్నావు? మృత్యువు ఆసన్నమై వచ్చినవాడు ఇది మాట్లాడవచ్చు, ఇది మాట్లాడ కూడదు అనికాని, ఇది చేయవచ్చు, ఇది చేయకూడదని కాని, బుద్ధిబలం పోయి, జ్ఞానం తొలగి, తెలుసుకోలేడు. నీ వ్యవహారం కూడా అలాగే వుంది".

ఇలా చెప్పి, నాలుగు దిక్కులా తేరిపార చూసి, దూరంగా వున్నా పెద్ద వృక్షాన్ని వేళ్లతో సహా పీకి, కనుబొమ్మలు కదులుతుంటే, రివ్వు-రివ్వున వేగంగా తిప్పి రాముడి మీదకు విసిరాడు.

సర్గ–30

# శ్రీరాముడి చేతిలో మరణించిన ఖరుడు

అలా తనమీదకు విసిరిన వృక్షాన్ని చూసి రామభద్రుడు వాడి బాణాలతో దాన్ని చిన్న–చిన్న తునుకలై పడేట్లు నరికాడు. ఈ దుష్టుడు కొంచెంతొ పోయేవాడు కాదని, వీడిమీద దయ చూపడం నిరర్థకమని, నిశ్చయించుకున్నాడు. భీతి కలిగించే బాణాలతో ఖరుడి దేహమంతా రంధ్రాలు పడేట్లు కొట్టాడు. ఖరుడి దేహం నుండి కొండవంకలాగా రక్తం కారసాగింది. ఆ బాధ సహించలేక అవయవాలు విల–విలా పోతుంటే రామభద్రుడి మీద పడడానికి మొండి ధైర్యంతో ముందుకు వచ్చాడు. అప్పుడు వాడిమీద బ్రహ్మ దండానికంటే ఎక్కువ కాంతి కలిగి, అగ్నిహోత్రంలాగా జ్వలించే, ఇంద్రుడిచ్చిన అమోఘ బాణం శీఘ్రంగా వేశాడు రాముడు. అది పిడుగులాగా దిక్కులు పిక్కటిల్లేట్లు ధ్వని చేస్తూ, ఖరుడి వక్షంలో నాటుకోగా, దేహమంతా దగ్ధమై పడిపోయాడు. ఆ విధంగా శ్రీరాముడి బాణానికి భస్మమై ఖరుడు చనిపోయాడు.

### శ్రీరాముడిని ప్రశంసించిన మహర్షులు

ఖరుడు చావగానే ఆత్మసాక్షాత్కారంకల రాజఋషులు, మునులు, ఒక గుంపుగా వచ్చి శ్రీరామచంద్రమూర్తితో గౌరవంగా ఇలా అన్నారు. “మహాత్మా! నిన్ను ఈ ప్రదేశానికి పంపమని కోరడానికే ఇంద్రుడు ఆనాడు శరభంగుడి

ఆశ్రమానికి వచ్చాడు. శరభంగ, సుతీక్ష్ణ, అగస్త్యాది మహర్షులు ఉపాయం చేసి నిన్ను ఇక్కడికి చేర్చారు. పాప స్వభావం కల రాక్షస సమూహాన్ని చంపించడానికి నిన్ను ఇక్కడికి వచ్చేట్లు చేశారు. మా పనులు చక్కబడ్డాయి. నీ పేరు చెప్పుకుంటూ సుఖంగా, మునులు దండకారణ్యంలో అన్ని వేళలా భయం వదిలి వారివారి ధర్మం నెరవేర్చుకుంటూ తిరగ గలరు తండ్రీ!". వీళ్లిలా అంటున్న సమయంలోనే ఆకాశం నుండి చారణులతో కూడి దేవతలు శ్రీరాముడి మీద పుష్ప వర్షం కురిపించారు. ఆకాశమార్గాన దేవదుందుభి ధ్వనులు నిండాయి.

"ఆహా! ఏం పరాక్రమం? ఏమి కార్యసాధనా సామర్థ్యం? ఔరా! బలం ఏమని చెప్పవచ్చు? ఒంటరిగా కాళ్లమీద నిలబడి పద్నాలుగు వేల రాక్షసులను మూడు గడియల్లో సంహరించాడే! ఇది ఇతరులకు సాధ్యమా? కాదు కాబట్టే ఈయన ప్రత్యక్ష విష్ణువే" అని దేవతలు పొగిడారు.

## శ్రీరాముడిని చేరవచ్చిన సీతాలక్ష్మణులు

ఇలా పొగిడిన దేవతలు తమ మనోవేదన తగ్గిపోవడంతో తమతమ స్థానాలకు పోయారు. అదే సమయంలో లక్ష్మణుడు సీతాదేవితో సహా వచ్చాడక్కడికి. యుద్ధంలో గెలిచి అపరాజితుడైన శ్రీరాముడు, మునులు పూజిస్తుండగా, సీతాలక్ష్మణులు తన తోడు వస్తుంటే, విలాసంగా తన ఆశ్రమానికి వచ్చాడు. అక్కడికి చేరిన తరువాత సీతాదేవి శత్రుసంహారుకుడు, ఋషులకు సంతోషం కలిగించిన వాడు, తన భర్త అయిన శ్రీరామచంద్రమూర్తిని గట్టిగా కౌగలించుకుంది.

(దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ నిమిత్తమై శ్రీరాముడు దండకకు వచ్చాడు. దుష్టులను శిక్షించడం ప్రథమ కార్యం. ఖరాది వధకు కారణం, దానివలన ప్రయోజనం ఋషి సంరక్షణేకదా? శ్రీమహాలక్ష్మీదేవి స్త్రీలను బాధించే రాక్షసులను సమూలంగా నాశనం చేయడానికే భర్తను భూమిమీద అవతరించాలని కోరి, తానూ అవతరించింది. తన కోరిక నెరవేరే సమయం ఆసన్నమైంది కదా అన్న సంతోషంతో, తన కార్యాన్ని స్వకార్యంగా భావించిన భర్తకు తన సంతోషం వ్యక్తం చేయడానికి ఆయన్ను కౌగలించుకున్నది. రామచంద్రమూర్తి లేని సీత గుహనుండి వచ్చి రాముడిని కౌగలించుకున్నది అంటే, హృదయమనే గుహలో వుండే జీవుడు పరతంత్రుడై ఆచార్యులవలన సర్వస్వామిని దర్శించి దానితో సర్వ విరోధి వర్గం నశించగా, అందులోంచి

వెలువడిన స్వామిని దర్శించాడని అర్థం).

బలవంతులైన రాక్షసులను వధించి, మునీశ్వరుల ప్రశంసలు అందుకొని వచ్చిన రామచంద్రమూర్తిని చంద్రవదనైన సీత రొమ్ములను హత్తుకుంది.

(శ్రీరామచంద్రమూర్తి జయం విన్నవారు పాపబంధాల వల్ల, కారాగార గృహ బంధాల వల్ల, ఋణబాధల వల్ల, ఎదుర్కొన్న ఇబ్బందులను విడవబడుతారు. పుష్పవతైన స్త్రీ వింటే రామచంద్రమూర్తి అనుగ్రహం వల్ల వంశోద్ధారకుడైన కొడుకును కంటుంది).

సర్గ-31

# ఖరాది వధ వృత్తాంతాన్ని రావణుడికి చెప్పిన అకంపనుడు

జనస్థానం నుండి అకంపనుడనే రాక్షసుడు, రావణుడి వేగులవాడు, శీఘ్రంగా బయల్దేరి లంకకు పోయి, లంకాసురుడైన రావణాసురుడితో ఇలా అన్నాడు. "రాజా! జనస్థానంలో వున్న ఖరుడుతో సహా రాక్షసులందరూ యుద్ధంలో చంపబడ్డారు. నేనెలాగో స్త్రీ వేషం వేసుకుని అతి కష్టం మీద ప్రాణాలను దక్కించుకుని ఈ వృత్తాంతాన్ని నీకు చెప్పడానికి వచ్చాను". ఈ మాటలు విన్న రావణుడు అదిరిపడి, కళ్లల్లో నిప్పులు కురుస్తుంటే, "ఓరీ! నాకు మనోహరమైన జనస్థానాన్ని నాశనం చేసింది ఎవడురా? వాడీ లోకంలో ఇంక బతుకుతాడా? దిక్పాలురైన ఇంద్ర, యమ, వరుణ, కుబేరులు కూడా నాకు ఏ కొంచెం అపకారం చేసినా సుఖంగా వుండలేరు. దండం ధరించి యముడు వచ్చినా దండిస్తాను. దహనుడిని దహిస్తాను. మృత్యువుకు నేనే మృత్యువునవుతాను. సూర్యచంద్రులను నేలబట్టి కాలరాస్తాను" అని అంటాడు.

రావణుడిలా పలకగా అకంపనుడు చెడు వార్త చెప్తే తననేమి చేస్తాడో అన్న భయంతో చెప్పకపోతే ఇంకేం చేస్తాడోనని విధి లేకుండా ఇలా అన్నాడు. "ప్రభూ! నాకేం భయం లేదని, నన్నేం చేయనని అభయమిస్తే ఉన్నదున్నట్లు చెప్తాను". తాను అభయమిస్తున్నానని, సందేహం లేకుండా వాస్తవం చెప్పమనీ,

రావణుడు అనగానే రెండు చేతులు జోడించి భయభక్తులతో అకంపనుడు ఇలా అన్నాడు.

"గౌరవించాల్సిన గుండ్రటి చేతులు కలవాడు, సమానంలేని బలం కలవాడు, ఆబోతు మూపురాలలాగా ఎత్తైన మూపురాలున్నవాడు, చంద్రబింబం లాంటి ముఖం కలవాడు, దశరథమహారాజు కుమారుడు, మంచి కీర్తికలవాడు, బాణాలనే జ్వాలలున్న అగ్నిహోత్రుడు, పరాజయం తెలియని పరాక్రమవంతుడు, ఒక్కడే, ఖరదూషణులతో సహా జనస్థానాన్ని సర్వనాశనం చేశాడు". ఇలా అకంనుడు చెప్పగా విన్న రావణాసురుడు పెద్ద పాములాగా శ్వాస విడుస్తూ, "ఓరీ! నిజం చెప్పు. రామచంద్రుడు యుద్ధానికి ఇంద్రాదులను తోడు తెచ్చుకున్నాడా? నువ్వు చెప్తున్న విషయం వింటుంటే ఇది ఒంటరిగా చేసే పనికాదని అనిపిస్తున్నది. వివరాలు చెప్పు" అని అడిగాడు.

## శ్రీరాముడి పరాక్రమం వర్ణించి రావణుడికి చెప్పిన అకంపనుడు

రావణుడు చెప్పమని అడగ్గానే, అకంపనుడు రామచంద్రమూర్తి తేజస్సు, బలం, పరాక్రమం తదితర అంశాలను వున్నదున్నట్లు చెప్పడిలా. "రాముడనే పేరుకలవాడు విల్లు, ఆయుధాలు ధరించేవారిలో చాలా గొప్పవాడు. అనేక దివ్యాస్త్రాలు, సుగుణ సంపత్తి కలవాడు. యుద్ధంలో ఇంద్రుడితో సమానుడు. దేవతలా పరాక్రమంలాంటి పరాక్రమం కలవాడు. ఆ రాముడికి ఒక తమ్ముడున్నాడు. వాడు శక్తిలో అన్నకు సమానుడు. ఎర్ర తామరలాంటి కళ్లున్నవాడు. ఆయన పేరు లక్ష్మణుడు. కమలాల లాంటి ముఖం కలవాడు. ఎప్పుడూ అన్నకు, అగ్నికి వాయువులాగా, తోడుంటాడు. అయినా ఈ యుద్ధంలో ఆయన లేడు. ఒక్క రాముడివల్లే దండకలో మన ఉనికి పట్టు పాడైంది. నువ్వు సందేహించినట్లు రాముడికి దేవతలు సహాయం చేయలేదు. ఇంద్రుడు రాలేదు. రామచంద్రమూర్తి ఒక్కడే పదునైన బాణాలను ఆయుధాలుగా చేసుకుని రాక్షస సమూహాన్నంతా వధించాడు. ఆ బాణాలను ఆయన ప్రయోగించాడని అనలేం. బంగారు పిడుగులు కల ఆ బాణాలు తమంతట తామే అల్లెతాటి నుండి బయల్దేరి ఐదుతలల పాములై యుద్ధంలో రాక్షసులందరినీ మింగాయి. ఏఏ విధంగా, ఏఏ మార్గాలలో రాక్షసులు భయపడి పారిపోతారో, ఆయా మార్గాల్లో శత్రువులందరికీ రామచంద్రుడు యుద్ధంలో కనిపించాడు. ఈ విధంగా జనస్థానమంతా పాడైంది".

అకంపనుడు ఈ విధంగా చెప్పగానే విన్న రావణుడు ముఖం ఎర్రగా చేసి తక్షణమే ఆ మనుష్యులను చంపుతానంటూ బయల్దేరడానికి సిద్ధమౌతాడు. అప్పుడు అకంపనుడు రామభద్రుడి బలపరాక్రమాలను మరింత వివరంగా చెప్పడిలా.

"రాక్షసరాజా! నువ్వాయన మీదికి యుద్ధానికి పోతే లాభం లేదు. ఆయనకే కోపం వస్తే నువ్వే కాదు...బ్రహ్మేంద్రాదులు కూడా ఆయన్ను గెలవలేరు. పొంగి పొరలి వచ్చే సంపూర్ణ ప్రవాహాన్నైనా తన బాణాలతో రాకుండా ఆపగలడాయన. గ్రహాలతో, నక్షత్రాలతో నిండిన ఆకాశాన్నైనా బాణాలతో చీల్చకలడు. శ్రీమంతుడైన రామచంద్రమూర్తి భూమిని ఉద్ధరించగలడు. అవలీలగా సముద్రం చెలియలికట్ట దాటి రారాదనే నియమాన్ని అణచి భూమినంతా సముద్రంతో ముంచగల శక్తికలవాడు. సముద్ర గర్వాన్ని మొదటంతా నాశనం చేయగలడు. బాణాలతో వాయువునైనా ఆపగలడు. తన పరాక్రమంతో రామచంద్రుడు సమస్త లోకాలనూ సంహరించి మళ్లీ సృష్టించగలడు. రామచంద్రమూర్తిని నువ్వు గెలవడం సాధ్యం కాదని నా అభిప్రాయం. రామచంద్రమూర్తిని గెలవలేని వాడివి నువ్వొక్కడివే కాదు. లోకంలో వున్న రాక్షస శ్రేష్టులందరూ, మనుష్యులతో సహా ఏకమైనా, ఆయన సమీపానికైనా పోలేరు. ఆయన ఒక్కడే...మేమందరం గుమికూడితే ఆయన్ను గెల్వలేమా? అని అంటావేమో? ఎంతమంది పాపాత్ములు కలిసినా స్వర్గానికి పోగలరా? (పాపాత్ములకు స్వర్గ ప్రాప్తి లేనట్లే పాపాత్ముడవైన నీకు రామ సాలోక్య ప్రాప్తి లేదని భావం) కాబట్టి రామచంద్రమూర్తిని నువ్వు చంపాలనుకుంటే (లేదా చచ్చిన వాడితో సమానంగా చేయాలనుకుంటే) నేనొక ఉపాయం చెప్తా ఏకాగ్రచిత్తంతో విను".

## శ్రీరామ వధోపాయంగా సీతాపహరణం చేయమన్న అకంపనుడు

అకంపనుడు శ్రీరాముడి వధోపాయంగా సీతాపహరణం చేయమని ఇలా చెప్పాడు రావణుడితో. "ఓ అసురరాజా! రామచంద్రుడి భార్యైన సీత గురించి నేనేం చెప్పగలను? రాముడి గురించి వృత్తబాహుడని, వృషాంసుడని చెప్పాను కాని సీతాదేవి విషయం చెప్పడానికి నాకు సాధ్యం కాదు. అయినా చెప్పాలి కాబట్టి చెప్తాను. ఆమె అందం లాంటి అందం ముల్లోకాలలో ఎక్కడా లేదు. ఆమె నడక ఏనుగు నడకలా వుంటుంది. నడి వయస్సులో వుంది. దేవతా స్త్రీలలో కాని,

గంధర్వ స్త్రీలలో కాని, అప్సరసలలో కాని, రాక్షస స్త్రీలలో కాని, జానకితో సమానమైన స్త్రీ లేనేలేదు. ఇక మనుష్య స్త్రీలలో లేదని చెప్పాల్నా? ఆమెను నువ్విక్కడికి తెస్తే, ఆమె మీద ప్రేమ కల రాముడు, ప్రియురాలి ఎడబాటుతో కలిగే తాపం అనే అగ్నిలో పడి చస్తాడు" అని అకంపనుడు చెప్పగా రావణుడు ఆ ఆలోచన బాగుందని ఆమోదించాడు. యుద్ధం లేకుండా శత్రువు చనిపోతున్నాడనే ఆలోచన రావణుడికి రుచించింది.

## మారీచుడిని చూడడానికి పోయిన రావణుడు

అకంపనుడు చెప్పినట్లే చేస్తానని, ఉదయాన్నే పోయి సీతాదేవిని తెస్తానని అంటూ, వాడిని వెళ్ళమంటాడు రావణుడు. అలా చెప్పి సూర్యకాంతితో సమానమైన కంచరగాడిదలు కట్టిన తెల్లటి రథం మీద సారథితో ఒక్కడే బయల్దేరి పోయాడు. ఆకాశమార్గంలో పోతున్న ఆ రథం ఆ సమయంలో మేఘాల మధ్యనుండే చంద్ర మండలంలాగా కనిపించింది. అలా పోయి మారీచుడి ఆశ్రమంలో దిగాడు రావణుడు. మారీచుడు ఆయనకు అర్ఘ్యపాద్యాలు ఇచ్చి, ఆసనం చూపించి, భక్ష్య భోజ్యాలిచ్చి తృప్తి పరిచాడు. ఆ తరువాత రావణుడితో "రాక్షసరాజా! నీకు, రాక్షసులకందరికీ క్షేమమేకదా? ఉపద్రవం ఏదీ జరగలేదు కదా? ఇలా ఒంటరిగా, తోడు ఎవరూ లేకుండా, సరాసరి ఇక్కడికి వచ్చావంటే ఏదో గొప్ప పని పడిందని సందేహం కలుగుతున్నది" అని అన్నాడు మారీచుడు. ఆ మాటలు విన్న రావణాసురుడు "తండ్రీ! రాముడనే ఒక్క మానవుడు రాక్షసులందరినీ యుద్ధ సామర్థ్యంతో వధించి జనస్థానాన్ని పాడుచేశాడు. అతడి భార్యను నేను అపహరించాలనుకుంటున్నాను. ఈ విషయంలో నాకు నీ సహాయం కావాలి. ఆ విధంగా నేను నా పగ తీర్చుకుంటాను" అని అంటాడు.

## శ్రీరాముడితో విరోధం వద్దని చెప్పిన మారీచుడు

రావణుడు ఈ విధంగా చెప్పగా విన్న మారీచుడు, సీతాదేవి గురించి లోపల శత్రుత్వం, బయటికి స్నేహం కలవాడెవడో, ఎప్పుడు రావణుడు చెడిపోవాలో అని ఎదురు చూస్తున్నవాడు ఇలా చెప్పాడని అంటాడు. "సీతను తెమ్మని చెప్పినవాడు నీ మేలుకోరేవాడు కాదు. ఇప్పుడు ముల్లోకాలను పాలించే నీ

గొప్పదనం చూసి ఓర్వలేనివాడెవడోఅది భగ్నమైపోవడానికి ప్రయత్నించాడు. ప్రసిద్ధమైన విషసర్పం కోర పీకమని నీకెవడు చెప్పాడు? ఏమరుపాటుతో వాస్తవం తెలియకుండా నిద్రపోతున్నవాడిలాగా వున్న నీతలను తన్నింది ఎవరు? రాక్షసరాజా! జగత్ప్రసిద్ధమైన గొప్పవంశంలో పుట్టటమనే తొండం కొన, గొప్ప పరాక్రమమనే మదపు నీళ్లు, గడియమాకుల లాంటి చేతులనే దంతాలు, శత్రువులకు భయం కలిగించే రాముడనే మదపుటేనుగును, ఇప్పుడు కనురెప్పలు ఎత్తైనా చూడడానికి ప్రయత్నం చేయవద్దు. యుద్ధ ముఖంలో నిలబడడం అనే పైకెత్తబడిన తోక కలిగి, రాక్షస సమూహాలను మృగాలలాగా సంహరించ కలిగి, గొప్ప బాణాలనే వాడి గోళ్లు కలిగి, వాడిగల కత్తులను కోరలుగా కలిగి, బలిష్టమైన నరరూపం ధరించిన రాముడనే సింహాన్ని, ఎక్కడో ఒకచోట ఎవర్నీ బాధించకుండానిద్రిస్తుంటే, దాన్ని లేపవచ్చా? చక్కగా ఆలోచించు". అని అంటాడు మారీచుడు.

ఇంకా ఇలా అంటాడు మారీచుడు. "పాతాళంలో పడి అక్కడి నుండి మళ్లీ పైకి రాలేనట్లు రామపాతాళంలో నువ్వు పడ్డావా మళ్లా ఊపిరితో వెలుపలికి రాలేవు. రామపాతాళం ఎలాంటిది అంటావా? విల్లే మొసలి...అది నీళ్లలో అడుగు పెట్టీ పెట్టకముందే వాతవేస్తుంది. అది దాటిపోతే భుజ వేగమనే పెద్ద బురద వుంటుంది. దాంట్లో దిగబడితే అంతే సంగతి ఇక. అదీ దాటిపోగలిగితే, బాణపరంపరలనే అలలు మీదమీద వచ్చిపడి లోపలి ఈడ్చుకు పోయి చంపుతాయి. ఇలాంటి యుద్ధ ప్రవాహంకల రామపాతాళంలో పడితే ఇక జీవితాశ లేదు. లంకాధిపతీ! నేను పరుషంగా చెప్పానని కోప్పడవద్దు. క్షమించు. వాస్తవంగా నీ మేలు కోరి చెప్పాను. కోపం తగ్గించుకొని లంకకు వెళ్లు. నీ భార్యలతో సంతోషంగా జీవించు. ఆడవిలో ఆయన భార్యతో రాముడు వుంటాడు. ఆయన భార్యతో ఆయన లేకుండా చేశావా....నీ భార్యలతో నువ్వు సుఖంగా వుండవు".

ఇలా మారీచుడు చెప్పిన హితోక్తులు విన్న రావణుడు, అలాగే ఆయన చెప్పినట్లే చేస్తానని జవాబిచ్చి, లంకకు పోయి సంతోషంగా తన ఇంటికి చేరాడు. రాముడితో బలవద్విరోధం ఎందుకు? నేనొక్కడినే పోతే, అందర్నీ చంపిన రాముడిని తానొక్కడినే జయించగలనని నమ్మకం ఏమిటి? అని ఆలోచించి సంతుష్టుడై ఇంటికి పోయాడు రావణాసురుడు.

(ఇప్పటికింకా రావణుడికి శూర్పనఖ ముక్కు-చెవులు కోసిన సంగతి తెలియదు. అకంపనుడు తెలిసినా చెప్పలేదు. ఎందుకు చెప్పలేదు? ఖరుడికి, రాముడికి యుద్ధం ఎందుకు జరిగిందని రావణాసురుడు అడగలేదు. అందరు ఋషులను చంపినట్లే రాముడిని కూడా చంపడానికి పోయి చచ్చారేమో అనుకున్నాడు. తనంతట తానుగా అకంపనుడు చెప్పలేదు. అసలు శూర్పనఖ రాముడి దగ్గరకు పోవాల్సిన అవసరం ఏమొచ్చిందని రావణుడు అడుగుతాడని భావించి అకంపనుడు ఆ విషయాన్ని దాటేశాడు. అదే వచ్చి అన్ని సంగతులు చెప్పుకుంటుందిలే, మనకెందుకీ బాధ? అనుకున్నాడు).

సర్గ-32

# లంకకు పోయి రావణుడిని కలిసిన శూర్పనఖ

పద్నాలుగు వేలమంది క్రూరులైన రాక్షస శ్రేష్టులు, ఖరుడు, దూషణుడు, త్రిశిరుడు, ఒంటరిగా యుద్ధం చేసిన శ్రీరాముడి చేతిలో చావడం చూసిన శూర్పనఖ, ఇతరులకు సాధ్యంకాని రాముడి పరాక్రమం స్వయంగా చూసి భయపడి, బొబ్బలు పెట్టుకుంటూ, ఏడ్చుకుంటూ, శీఘ్రంగా రావణుడు పాలించే లంకకు పోయింది. అక్కడ దేవతలతో కూడిన ఇంద్రుడిలాగా, పుష్పక విమానంలో మంత్రులతో, సూర్యుడిని పోలిన బంగారు పీఠంమీద తన ఇష్టప్రకారం, బంగారు ఇటికలతో కట్టబడిన వేదిలో హోమం చేయడం వల్ల మండుతున్న అగ్నిహోత్రుడిలా, సమస్త భూతకోటిని, గంధర్వులను జయించగలవాడిని, యముడిలాంటి వాడిని, రావణుడిని చూసింది శూర్పనఖ.

దేవాసురులకు మధ్య జరిగిన ఘోర యుద్ధంలో అసమానమైన వజ్రాయుధం దెబ్బ వల్ల గాయం మాత్రం పడ్డ వక్షం కల రావణుడిని; ఐరావతం కొమ్ములతో పొడవగా కాయలు కాచిన రొమ్ముకల రావణుడిని; దీర్ఘమైన ఇరవై చేతులు, పది తలలు, తెల్లని చామరాలు, తెల్ల గొడుగు, విశాలమైన ఎత్తైన రొమ్ము, రాజచిహ్నాలు కల రావణుడిని; వైడూర్యంలాగా మిస-మిస మెరిసే రావణుడిని;

నిగనిగలాడే రత్నాలు చెక్కిన బంగారు కుండలాలు కల రావణుడిని; పెద్ద ముఖం కల రావణుడిని; తెల్లని దంతాలు కల రావణుడిని; విష్ణు చక్రం లాంటి అనేక ఆయుధాలతో కొట్టబడి గాయపడ్డ సకలావయవములు కల రావణుడిని; ఇతరుల భార్యలను అపహరించే రావణుడిని; సమస్తమైన దివ్యాయుధాలు కల రావణుడిని; ఋషుల యజ్ఞాలు విఘ్నం చేసే రావణుడిని; భోగవతీపురంలో సర్పరాజైన వాసుకిని యుద్ధంలో ఓడించి, తక్షకుడిని గెలిచి, అతడి భార్యను అపహరించిన రావణుడిని; కైలాసంలో కుబేరుడిని గెలిచి పుష్పక విమానాన్ని తెచ్చిన రావణుడిని; ఇంద్రుడి ఉద్యానవనాన్ని, కుబేరుడి ఉద్యానవనంలో వున్న నలిని అనే సరస్సును కోపంతో నాశనం చేసిన బలిష్టుడైన రావణుడిని; ఉదయించే సూర్యుడిని చేతులతో అడ్డగించగల శక్తిమంతుడైన రావణుడిని; సమస్త ప్రాణులను మొర్రో అని ఏడిపించే రావణుడిని; దేవతలను పారతోలిన రావణుడిని; పెద్దనవ్వుతో దేవతా స్త్రీలకు గర్భస్రావం అయ్యేట్లు చేసిన రావణుడిని; భుజ శౌర్యంతో విరవబడిన ఐరావతం దంతాలుగల రావణుడిని; జనులను బాధించడంలోనే పరమాసక్తికల రావణుడిని; కుచ్చితపు ఆలోచనలు చేయడంలో తొందరపడే రావణుడిని; ఇంతదాకా రాక్షస వంశాన్ని వృద్ధి చేసిన రావణుడిని;కళ్లకు కనబడడం ప్రళయకాలమని ఆభరణాలతో అలంకరించుకునే రావణుడిని; తన అన్నాను చూసి శూర్పనఖ రాముడి భయంతో ఇలా అంది.

## సర్గ-33

# రావణుడిని నిందించిన శూర్పనఖ

తనకు కలిగిన అవమానం, తన దుఃఖం చూసి కూడా ఆదరించకుండా వూరికే చూస్తున్న రావణుడిని చూసి మంత్రులు వింటుంటే, వాళ్ళుండగా అలా మాట్లాడడం మంచిదికాదని కూడా భావించకుండా, దురాగ్రహంతో శూర్పనఖ ఇలా అంది. "ఓరీ! కండ కొవ్వుతో మదించి ఒళ్లు మరిచినవాడా! ఎప్పుడూ కామ సుఖాలలో ఆసక్తికలిగి హద్దూ-అదుపూ లేకుండా, దండించే వాడు లేకుండా మూర్ఖుడవై, నీ పక్కనే నిన్ను వాత వేసేందుకు కాచుకున్న మృత్యుదేవతను కనుక్కోలేక పోతున్నావుకదా! ఎప్పుడూ స్త్రీలతో రతిక్రీడల్లో మునిగి, వాట్లోనే ప్రీతికలిగి తన ఇష్టం వచ్చినట్లు సంచరించే రాజును ప్రజలు స్మశానాగ్నిలాగా గౌరవిస్తారా? నీలో అలంతో దోషం వుంది. కాబట్టే నిన్ను లోకులు గౌరవించరు. స్త్రీలతో విశేషంగా సంభోగించడం వల్ల బుద్ధి బలం చెడి కార్యాకార్యాలు ఆలోచించే శక్తి లేక రాజకార్యాలు తానై చేయని రాజు చెడిపోతాడు. వాడు తలపెట్టిన పనులు చెడి పోతాయి. వాడి రాజ్యం చెడుతుంది. నువ్వు ఆ గతికి చేరనున్నావు".

"వేగులవాళ్ళను ఏర్పాటుచేసి ఎక్కడెక్కడ ఏం జరుగుతుందో, ఎవరు మిత్రులో, ఎవరు శత్రువులో తెలుసుకోకుండా, ఆలోచన చేయకుండా, ప్రజలకు అవసరమైనప్పుడు దర్శనం ఇవ్వకుండా, అంతఃపురంలో కాంతాలోలుడై

చాటున వుంటూ, స్వయంగా పనులు చేయాల్సి వచ్చినప్పుడు సంబంధం లేనివాళ్లు, స్వార్థపరులు చెప్పిన మాటలు నమ్ముతూ, భార్యలు, మంత్రులు, తోవన పోయేవారి చెప్పిన మాటలు నమ్మి పరాధీనుడైన రాజును తొలగిపోతారు ప్రజలు. అన్ని పనుల్లోనూ తానే పెద్దగా వుంటూ, తన ఇష్టప్రకారం స్వతంత్రించి పనులు నెరవేర్చక ఇతరులకు పెత్తనం ఇచ్చి, వారితో పనులు చేయించే రాజులు సముద్రంలో పర్వతాలు మునిగినట్లు వాళ్ల వల్లే చెడిపోతారు. వారి ప్రభుత్వం, అధికారం, సంపద వాళ్లకంటే ముందుగానే నశిస్తుంది. నీకెప్పుడు కీడు చేద్దామా అని ఎదురుచూస్తున్న దేవతలు, దానవులు సమయం కోసం కాచుకున్నారు. అది కనుక్కోలేక కార్యాలోచనపరత్వం లేకుండా, స్థిరబుద్ధి లేకుండా, చపలుడవై వుండే నువ్వు ఎలా ప్రాణాలతో వుండగలవు?"

"ఇంత వయసు వచ్చినా అవివేకం పోలేదు నీకు. వివేకం రాలేదు. ఏమేమి తెలుసుకోవాలో అది నీకు తెలియదు. ఇలాంటివాడివి రాజై ఎలా బాగుపడుతావు? తనకు స్వంత వేగులవాళ్ళు లేకుండా, ఇతరులు ఏర్పాటుచేసిన వేగులవాళ్ళ మాటలు నమ్మి ప్రవర్తించేవాడు, కోశాగారానికి ఇతరులకు పెత్తనమిచ్చేవాడు, ఇతరులు చెప్పిన నీతులు అనుసరించేవాడు, వాడెంత గొప్పవాడైనా పామరుడితో సమానమే. దూరదేశాల్లో జరిగే సంగతులు వేగులవాళ్ళ ద్వారా తెలుసుకుంటే, అది తన సమక్షంలోనే చూసినట్లు వుంటుంది. కాబట్టే రాజుకు దీర్ఘ చక్షువు అని పేరు. నీకు వేగులు లేరు కాబట్టి నీకా పేరులేదు...నీకా చూపూ లేదు. ఇలా నువ్వుండంవల్లే, నీ మంత్రుల గుంపు సేవిస్తుంటే వారి మాటలు వింటూ వుండడం వల్లే, అలా సుఖానికి అలవాటు పడడం వల్లే, నీ జనస్థానంలో నీ బంధువులందరూ చచ్చిన వార్త నీకెలా తెలుస్తుంది? ఖరదూషణాది బంధువులతో సహా పద్నాలుగువేల మంది రాక్షసులను రామచంద్రమూర్తి ఒక్కడే తన విల్లు బలంతో యుద్ధభూమిలో నాశనం చేశాడు. నీ తమ్ములను, బంధువులను, అందరినీ ఒక్కడు కూడా లేకుండా చంపాడు. నీకు విరోధులై, నీ కీడు కోరే రాక్షసులకు ఇక రావణుడి భయం లేదు. తాను రక్షిస్తానని చెప్పాడు. దండకారణ్యంలో నీ వాళ్ల భయం లేకుండా చేశాడు. ఇవన్నీ అతిబలవంతుడైన రామచంద్రుడు ఒక్కడే చేశాడు".

"నువ్వు లోభివి కాబట్టి వేగులవాళ్ళకు జీతాలు ఇవ్వవు కనుక వారంతా జరిగే విషయాలు నీకు తక్షణమే చెప్పారు. నువ్వేమో ఇతరులకు స్వాధీనపడి స్వతంత్రశక్తిలేక, ఆ మంత్రి, ఈ మంత్రి చెప్పినట్లు వింటున్నావు. రాగల కీడు

తెలుసుకోలేక పోతున్నావు. నీ దేశంలోనే భయం కలగడం నీకింతవరకూ తెలియదు కదా? రావణా నిన్నేమనాలి? కష్టానికి తగ్గట్లు సేవకులకు జీతాలివ్వవు. ఇలాంటి క్రూరుడికి, మదం పట్టినవాడికి, పొగరుబోతుకు, ద్రోహికి ఆపదలు కలిగినప్పుడు సేవకుల్లో ఒక్కడైనా సహాయం చేయడానికి ముందుకు రాడు. కారణం లేకుండా కోప్పడే రాజును, ఇతరులు భయపడేట్లు ప్రవర్తించే రాజును, గర్వంతో తనను తానే పొగడుకునే రాజును, వాడి బంధువులు, వాడి సేవకులే చంపుతారు. తన తప్పులు తెలుసుకుంటూ చక్కటి ఆలోచనతో పనులు చక్కదిద్దకుండా వుండే రాజుకు ఐశ్వర్యమంతా నాశనమై పోయి, వాడు సన్నగడ్డితో సమానమై దుఃఖపడుతుంటే, వాడిని అందరూ అలక్ష్యంగా చూస్తారు కాని, అయ్యో పాపం! వాడికి ఇలాంటి గతి పట్టిందే అని ఒక్కరైనా బాధపడరు'.

"లోకంలో దేనికీ పనికిరానివైనా ఏదో ఒక సమయంలో పనికొస్తాయేమో కాని, రాజుగా వుండి రాజ్యాన్ని పోగొట్టుకున్నవాడు గవ్వకైనా కొరగాడు. రాజుగా వుండి భ్రష్టుడైన వాడు ఎంత గొప్పగా బతికినా, కొరకాని వాడే. ఇవన్నీ తెలుసుకొని పరులు తనకు చేసిన మేలు మరవకుండా, ధర్మస్వభావుడైన రాజు దీర్ఘకాలం సంపదతో సుఖపడతాడు. దుర్మార్గులు తామెంత అధర్మంగా వున్నా, పరులకు హితోపదేశం చేసేటప్పుడు ధర్మాన్నే చెప్తారు. దోషుల మీద కోపం, సాదువులమీద దయ కనబరుస్తూ నీతిమార్గంలో నడిచే రాజును సర్వసేవకులు భయభక్తులతో కొలుస్తారు. అవివేకీ నీలో ఎంత వెతికి చూసినా రాజులకుండాల్సిన గుణాలు ఒక్కటైనా లేవు. ఆకాలంలో పడ్డ పిడుగులాగా దండకారణ్యంలో నువ్వు కాపుగా వుంచిన వారంతా యుద్ధంలో చావడం వేగులు లేనందున నీకు తెలియదు. సుఖంలో మునిగి నిన్ను చంపనున్న శత్రువులను ఉపేక్షిస్తున్నావు. అన్నీ మనకనుకూలమైన దేశాలే అనుకుంటున్నావు. అన్ని కాలాలు మనకు అనుకూలమైనవే అనుకుంటున్నావు. కానీ, భిన్న దేశాలలో, భిన్న కాలాలో జరిగే విషయాలు కామలోలుడవైన నువ్వు తెలుసుకోలేక పోతున్నావు. ఎవరిలో ఎక్కడ ఏ మంచి కలదో, ఏ చెడ్డకలదో తెలుసుకునే శక్తి నీకు లేదు. కాబట్టి, ఓ రాక్షసరాజా! శీఘ్రకాలంలోనే నీ సంపదను పోగొట్టుకుంటావు.

సర్గ–34

# రావణుడికి శ్రీరాముడిని వర్ణించి చెప్పిన శూర్పనఖ

(తన వికార స్వరూపంతో, నిండు కొలువులో రాజు మంత్రులతో వున్న సమయంలో, ఒక ఆడది, రాజు చెల్లెలు, అంతఃపురంలో వుండాల్సింది, బజారు మనిషిలాగా ఇంతమంది లోకి వచ్చి, ఎవరికేమి కోపం వస్తుందో అని ఏమాత్రం ఆలోచించకుండా, మాట్లాడినపుడే శూర్పనఖ సిగ్గు, బిడియం విడిచిందని స్పష్టమైంది. ఇంతవరకు శూర్పనఖ తన పరాభవ కారణం కానీ, పరాభవించిన వాడి పేరుకానీ చెప్పలేదు. ఎందుకు? ఆ విషయం ముందే చెప్తే, ఆమెను అవమానించిన కారణాన తనను దూషిస్తున్నదని అభిప్రాయ పడతాడేమో! అలాంటి అభిప్రాయం కలిగితే, తాను చెప్పినట్లు చేయకపోవచ్చేమో అన్న అనుమానం. చేయకపోతే రాముడిని పరాభావించాలన్న తన కోరిక తీరదు కదా! దశరథుడి విషయంలో కైక ఎలాంటి ఉపాయం చేసిందో అలాగే శూర్పనఖ కూడా ఇక్కడ చేసింది. అక్కడ కామం...ఇక్కడ కోపం).

ఈ విధంగా సిగ్గు, బిడియం, భయం లేకుండా శూర్పనఖ చెప్పిన తన దోషాల గురించి ధనగర్వం, సేనాబలగర్వం కలవాడైనందున, ఎంతమాత్రం విచారపడక, తనను ఎవ్వడు ఏంచేయగలడన్న మదాంధుడై, తన చెల్లెలు చెప్పిన విషయం గురించి ఆలోచన చేశాడు. కోపంతో కళ్లెర్ర చేసి, తనను నిష్టూరాలు

ఆడే చుప్పనాతితో, "చెల్లెలా! అక్కడి వృత్తాంతమంతా వివరంగా చెప్పు. రాముడనే వాడేవాడు ఎవడు? వాడెట్టి పరాక్రమవంతుడు? దేవతా రూపమా? మనుష్య రూపమా? ఎలాంటి స్వరూపం కలవాడు? ఎందుకు దండకారణ్యానికి వచ్చాడు? ఖరాది రాక్షసులను ఏ ఆయుధాలతో చంపాడు? విల్లు, బాణాలతోనా? లేక ఏదైనా నూతన ఆయుదాలతోనా?" అని అడగ్గా శూర్పనఖ రామచరిత్ర చెప్పడం మొదలుపెట్టింది ఇలా.

(రాముడు ఎలాంటి పరాక్రమం కలవాడు, ఏ ఆయుధం కలవాడు, మనుష్యుడా? దేవతా? అని రావణుడు తనకు కావాల్సిన విషయాల గురించి ప్రశ్నిస్తే, శూర్పనఖ కామంతో వున్న వ్యక్తీ కాబట్టి, రాముడి ఆకారం మరిచిపోదామన్నా మరువలేక, కళ్ళకు కట్టినట్లు వుండడం వల్ల, ఆయన ఆకార సౌందర్య వర్ణనతో జవాబిచ్చింది.)

"దీర్ఘమైన భుజాలతో, విశాలమైన కళ్ళతో, నారచీరెలు, జింకచర్మం వస్త్రాలుగా ధరించి, మన్మథుడిలాగా సుందరంగా వుండే దశరథకుమారుడు ఆయన. పేరు రాముడు. భయంకరమైన శౌర్యం కలవాడాయన. భయంకరమైన విల్లు వుంది ఆయన దగ్గర. దాంతో పుట్టలోనుండి పాములు బయటికి వచ్చే విధంగా బాణాలను చిమ్ముతాడు. ఖరుడు,దూషణుడు, పద్నాలుగువేల మంది రాక్షసులను సరిగ్గా మూడు గడియల్లో కాళ్లమీద నిలిచి, ఒంటరిగా బాణాలతో నాశనం చేసాడు. దండకారణ్యంలో వున్న మునులకు ఇక నుండి వాళ్లు రాక్షసులకు భయపడాల్సిన పనిలేదని అభయ హస్తం ఇచ్చాడు. అంతా చస్తే నేనెలా బతికి బయటకు వచ్చానంటావేమో? నేనక్కడ లేకుండా విని చెప్తున్నానేమో అని అనుమానం వద్దు. నేనా గుంపులోనే వున్నాను. కాని, నేను ఆడదాన్నైనందున స్త్రీహత్యా దోషం కలగవచ్చని గొప్ప మనస్సుతో నన్ను చంపకుండా వదిలాడు. ఇంకొకడైతే పద్నాలుగు వేలమందిని తెచ్చింది ఇదే అని నన్ను కూడా చంపేవాడే. ఎంతమంది వచ్చినా తననేమీ చేయలేరని ఆయన ధైర్యం. ఆ విధంగా ఆయన చేతికి చిక్కినా పోపొమ్మని విడవడం వల్ల బతికాను. ఆ రాముడికి లక్ష్మణుడు అనే తమ్ముడున్నాడు. అన్నకు అన్నిటా సమానుడు. అన్నను భక్తితో సేవిస్తాడు. కోపిష్టి. యుద్ధంలో అజేయుడు. సాధువర్తనం కలవాడు. రాముడికి కుడిభుజం, బహిప్రాణం లక్ష్మణుడు".

## సీతను వర్ణించి చెప్పిన శూర్పనఖ

"రాముడికి ఇష్టమైన భార్య సీతాదేవి. ఆమె అందమైన గమనం కలది. సమస్త సద్గుణాలతో గొప్ప కీర్తిని సంపాదించింది. ఆమె తోడలు అరటి స్తంబాల్లా వుంటాయి. ఆమె ముక్కు సంపెంగ పువ్వులాగా వుంటుంది. సౌందర్యానికి వునికిపట్టైన ఆమె వెన్నెల్లాంటి చిరునవ్వు కలది. షోడశ కళాపూర్ణుడైన చంద్రుడి లాంటి ముఖం కలదామెకు. పతికి హితం చేయాలనే కోరిక వుందామెకు. మంచి బంగారు వన్నె కలది. తలనిండా నల్లటి వెంట్రుకలున్నాయామెకు. నీతిలోని స్థిరాంశమేదో అదే ఆమె. సింహం నడుం లాంటి సన్నటి నడుం వుందామెకు. రెండో లక్ష్మి లాగా వనదేవతగా వెలుగుతున్నది. దేవతా స్త్రీలను, కిన్నర స్త్రీలను, గంధర్వ స్త్రీలను చూసా కాని ఇలాంటి స్త్రీని చూడలేదు. యక్ష స్త్రీలను, కింపురుష స్త్రీలను, దైత్య స్త్రీలను, చూసాను కాని రామచంద్రుడి భార్యలాంటి, కళ్లకు ఆనందం కలిగించే కలువపూల లాంటి కళ్లున్న దాన్ని ముల్లోకాలలో ఎక్కడా చూడలేదు. ఇలాంటి ఆమె మరొకరున్నారని కూడా వినలేదు. ఇంతకంటే ఎక్కువగా ఏమి చెప్పాలి?"

"సీత ఎవరికి భార్యో, ఎవరిని ఆమె సంతోషంగా కౌగలించుకుంటుందో, ఆ పురుషుడు మూడులోకాలలో ఇంద్రుడి కంటే గొప్పవాడై పేరుతెచ్చుకుంటాడు. చక్కటి సౌందర్యం, నడవడి కలిగి స్త్రీలలో శ్రేష్టురాలైన ఈ సీత నీకు తగిన భార్య. ఆమెకు నువ్వు తగిన భర్తవి. ఇద్దరినీ పోల్చి చూసి ఆ సీతను తెచ్చి నీకివ్వాలని భావించి నేనక్కడికి పోయాను. ముక్కును పోగొట్టుకున్నాను. మగవారికి తెలియకుండా సీతాదేవిని ఎత్తుకొచ్చి నీకిద్దామనుకున్నాను. దానికోసం చుట్టుపక్కల తిరుగుతూ సీతదగ్గరికి పోయాను. నా ఆలోచన తెలుసుకున్న లక్ష్మణుడు నేను మొత్తుకుంటున్నా వినకుండా, నన్ను పట్టుకొని నా ముక్కు, చెవులు మొదలంటా కోశాడు. నువ్వే స్వయంగా పోయి ఆ సొగసుగత్తెను కళ్లారా చూస్తే, మన్మథుడికి దాసుడవై ఆ క్షణంలోనే ఆమె కావాలని పట్టుబట్టుతావు."

"ప్రేమతో నువ్వు జానకిని భార్యగా చేసుకోవాలంటే అది సాధించడానికి కుడికాలు ముందు పెట్టి తక్షణం బయల్దేరు. ఇప్పుడే దండకారణ్యంలో సీత వున్న చోటుకు పో. రామలక్ష్మణులను యుద్ధంలో చంపు. మగడు చచ్చి దిక్కులేక వున్న సీతను తీసుకొచ్చి నీ ఇష్ట ప్రకారం సుఖపడు. రాముడి చేతిలో చనిపోయిన ఖరుడు మొదలైన రాక్షస సమూహంలో ఒక్కడిమీదైనా నీకు కొంచెం ప్రేమున్నా రాముడిని, వాడికి సహాయం చేసినవాడిని చంపిరా. ఇది నీకు అంగీకారమైతేనే

ధైర్యంతో వెళ్లు. నా మాటలు నీకు మంచిగా అనిపిస్తే, శీఘ్రంగా ఆలశ్యం చేయకుండా సందేహం వదిలి మల్లెపూవులాంటి సీతను తీసుకొని రా. రావణా! నేను చెప్పానని నా మీద నింద వేయవద్దు. నాకు తోచింది నేను చెప్పాను. ఎదుటివారి బలం గురించి కూడా చెప్పాను. నీబలం ఎంతో ఆలోచించి, అంతకంటే ఎక్కువ బలం వుందనుకుంటే బలవంతంగా సీతను తీసుకురా. నీ కొరకై దండకలో దిక్కులేని వారిలాగా చచ్చిపోయిన ఖరాది రాక్షసుల మీద కృతజ్ఞతతో వాళ్లకు కలిగిన అకాల మరణం ఆలోచించి దానికి ఎలా బదులివ్వాలో అదే చేయి”.

సర్గ-35

# రహస్యంగా మారీచాశ్రమానికి పోయిన రావణుడు

దేహాన్ని గగుర్పాటు కలిగించే భయోత్పాదకములైన శూర్పనఖ మాటలు విన్న రావణుడు, మంత్రులతో ఆలోచించి, కార్యం ఎలా చేయాలో నిర్ణయించుకొని, వాళ్లను పొమ్మని పంపి, ఎలా ముందుకుపోవాలో ఆలోచన చేశాడు. రాముడు చేసిన రెండు పనులకు-శూర్పనఖను విరూపను చేయడం, ఖరాదులను చంపడం-ప్రతీకారం తీసుకోకుండా వూరికే వుంటే, తనను పౌరుషహీనుడని, బలహీనుడని, లోకులు దేవతలు నవ్వుతారనీ, మానవంతుడికి మరణం కంటే అపకీర్తి చెడ్డదనీ అనుకుంటాడు.

(రావణుడిలా అనుకుంటాడు: "ప్రాణం పోగొట్టుకొనైనా మానం రక్షించుకోవాలి. కాబట్టి వూరుకోవడం మానహానికరం. అపకీర్తికరం. ప్రతీకారం చేయాలంటే ఏం చేయాలి? ఎలా చేయాలి? బహిరంగంగా యుద్ధానికి పోవాలా? అలా చేస్తే...పదనాలు వేలమంది మహాబలశాలులను ఒక్కడే కాళ్లమీద నిలబడి మూడు గడియల్లో చంపాడే? అలాంటివాడు సామాన్యుడు కాడే? ఇలాంటి వాడిని యుద్ధంలో నేనే జయిస్తానని నమ్మకం ఏంటి? కాబట్టి ఇది అపాయం. వంచన చేసి సీతను అపహరించి తెస్తే....ఎక్కడో వున్న వాళ్లను ఇంటిమీదకు నేనే తెచ్చినట్లు అవుతుంది. వారిక్కడికి వస్తే వూరికే

పోరు. మరో విధంగా ఆలోచిస్తే, రామలక్ష్మణులు నా గురించి తెలుసుకొనడం, తెలిసినా సముద్రాన్ని దాటడం, లంకకు రావడం, యుద్ధంలో గెలవడం, ఇరువురు మనుష్యులకు అసంభవం. ఒకలా వేళ అలా కాకపోతే, భార్యను కోల్పోయిన బాధతో, అవమానంతో, చావనే చస్తే మరీ మంచిది. సీతను వశపర్చుకుంటే నాకే భయం లేదు. ఆ విషయం వాళ్లకు తెలియగానే చస్తారు).

ఇలా నిశ్చయించుకొని, మనస్సు దృడం చేసుకొని, గుఱ్ఱాలుండే చోటుకు పోయి, రహస్యంగా రథాన్ని సిద్ధం చేసి తీసుకొని రమ్మని సారతికి చెప్తే వాడలాగే చేశాడు. ఆయన అనుకున్న విధంగా పోగలిగే ఆ రథం మీద, పది తలల, ఇరవై చేతుల రావణుడు, ఆకాశ మార్గంలో మేఘంలాగా పోయాడు. మార్గమధ్యంలో అనేకానేక సుందర స్థలాలను, వృక్షాలను, మునులను, పక్షులను, అప్సరసలను, గంధర్వులను, దేవతలను, పుణ్యలోకాలను జయించినవారిని, ఔషధులను, అగరు చెట్లను, వనాలను చూసాడు. అందమైన ప్రకాశించే ధనధాన్య సమృద్ధికల సుందరమైన సముద్ర తీరాన్ని చూశాడు. ఆ ప్రదేశంలో మేఘాలతో సమానమైన, నూరామడల పొడవుకల, కొమ్మలున్న పెద్ద మఱ్ఱిచెట్టును చూశాడు. పూర్వం గరుత్మంతుడు స్వర్గానికి పోతూ, తనకు ఆహారంగా గజకచ్ఛపాలను తన గోళ్లలో ఇరికించుకుని తటాలున ఆ మఱ్ఱిచెట్టు కొమ్మమీద వాలగా,ఆ భారాన్ని సహించలేక, కొమ్మ విరిగింది. ఆ కొమ్మను పట్టుకొని వాలఖిల్యాదులు ఆ సమయంలో తపస్సు చేస్తున్నారు. వాళ్లు తమ తపస్సు విఘ్నమైందని తనను శపిస్తారని భయపడ్డ గరుత్మంతుడు, ఆ కొమ్మను ముక్కుతో పట్టుకొని త్వరగా పోయాడు.పోతూ,మాంసాన్నిభుజించి,మునులనుక్షమించమనిప్రార్థించాడు. వాళ్ళు పోయిన తరువాత బోయపల్లెను నాశనం చేశాడు. ఆ సంతోషంతో రెండింతల బలంతో ఆకాశానికి ఎగిరి, ఇనుప కమ్ముల కిటికీలు పగలగొట్టి, రాల్చి, మణులతో నిండిన ఇంద్రుడి ఇంట్లోకి పోయి, గరుత్మంతుడు అమృతాన్ని హరించాడు. అలాంటి గరుత్మంతుడి గుర్తుకల, సుభద్రమనే పేరున్న మఱ్ఱి చెట్టును కూడా చూసి, రావణాసురుడు సముద్రాన్ని దాటాడు.

ఆ వనంలో ఒక ప్రదేశంలో, నిర్మలమైన స్థలంలో, మితాహారుడై, చలించని ఇంద్రియ నిగ్రహంతో, జింక చర్మం ధరించి, జడలతో, నారవస్త్రాలు కట్టుకుని తపస్సు చేస్తున్న మారీచుడి దగ్గరకు పోయాడు రావణుడు. మారీచుడు అతడిని తగు విధంగా మర్యాదలు చేశాడు. మళ్లీ ఎందుకు వచ్చావని అడిగాడు రావణుడిని మారీచుడు.

సర్గ-36

# జనస్థాన వృత్తాంతం మారీచుడికి చెప్పిన రావణుడు

మారీచుడి ప్రశ్నకు జవాబుగా అనునయంగా ఇలా చెప్పాడు రావణుడు. "తండ్రీ! విశదంగా, వివరంగా చెప్తా విను. ఆర్తుడనై వచ్చాను. మహాత్మా! నా ఆర్తి పోగొట్టడానికి నువ్వు తప్ప నాకు వేరే గతి లేదు. నిశాచరశ్రేష్టుడా! నా ఆజ్ఞ మేరకు నా తమ్ములు ఖరుడు, దూషణుడు, ముద్దుల చెల్లి శూర్పనఖ, అతి శూరుడైన త్రిశిరుడు, పద్నాలుగు వేలమంది రాక్షసులు జనస్థానంలో వుంటూ, ధర్మాత్ములైన వారిని బాధలు పెట్టడం నీకు తెలిసిన విషయమే. వారంతా రాముడి మీద కోపంతో ఆయనమీదికి యుద్ధానికి పోగా, అతడు వారందరినీ ఒంటికాలిమీద నిలబడి చంపాడు. అంతే కాకుండా మునులంతా దండకారణ్యంలో భయం లేకుండా తిరగొచ్చని చెప్పాడు. తండ్రి వెళ్ళగొట్టితే భార్యతో అడవుల్లో దుఃఖించే నీచ క్షత్రియుడు, కుచ్చితపు నడవడి కలవాడు, కోప గుణం కలవాడు, ఇంద్రియ జయం లేనివాడు, కరుణా శూన్యుడు, జీవకోటికి కీడు చేయాలన్న ఆశ కలవాడు, ధర్మాన్ని వదిలినవాడు, వివేకం లేనివాడు, రాముడు నాతో విరోధం లేకున్నా నిష్కారణంగా నా చెల్లెలి ముక్కు-చెవులు బలగర్వంతో కోశాడు".

## తనకు తోడు రమ్మని మారీచుడిని వేడుకున్న రావణుడు

రాముడు ఇలాంటివాడు కాబట్టే, దేవతాస్త్రీతో సమానమైన సౌందర్యం కల అతడి భార్య జానకిని తీసుకురావడానికి తాను శీఘ్రంగా పోతున్నాననీ, మారీచుడు తనకు తోడుగా రావాలనీ, తన తమ్ములు, మారీచుడు, తనకు సహాయంగా వుంటే యుద్ధంలో దేవతలనైనా గడ్డిపోచలాగా చూస్తాననీ, ఇది తన నిశ్చయం అనీ, అంటాడు రావణుడు మారీచుడితో. "ఇది నా అభిప్రాయం కాబట్టి నువ్వు నాకు సహాయపడు. శౌర్యంలో, బలంలో, మంచి ఉపాయం చేయడంలో నీకు సమానమైన వారు లేరు. యుద్ధంలో నువ్వు పన్నని మాయలు లేవు. నువ్వు ఇలాంటివాడివని తెలిసేకదా నిన్ను చూడడానికి ఇంతదూరం వచ్చాను. నువ్వేం సహాయం చేయగలనంటావా? నువ్వు చేయాల్సిన పని చెప్తా విను. బంగారు వన్నె విచిత్రపు చుక్కలు కల జింకవై, రాముడు, సీత వున్నా చోటుకు పోయి ఆ ప్రదేశంలో సంచరించు. నిన్ను పట్టుకోవడానికి సీత, రామలక్ష్మణులను పంపుతుంది. అప్పుడు నేను ఒంటరిగా వున్న జానకిని (రాహువు చంద్రకాంతిని హరించినట్లు) అపహరిస్తాను". అని అంటాడు రావణుడు.

(రాహువు చంద్రకాంతిని హరించినట్లు అనడమంటే, రాహువు ఏ విధంగానైతే కొంచెం కాలం లోకానికి కాంతి కానరాకుండా చేస్తాడో, అలాగే, రావణుడు కొంతకాలమే సీత లోకానికి కానరాకుండా చేయగలడని భావం. రాహువు చంద్ర బింబాన్ని ఏమీ చేయలేనట్లు రావణుడు కూడా సీతను ఏమీ చేయజాలడని భావం. లోకంలోని చీకటి చంద్రకాంతి తగులగానే దాని స్వరూపం లేకుండా పోతుంది. అలాగే సీత సాన్నిధ్యం దొరికనివారు తమ అజ్ఞానం పోగొట్టుకుని, బాగుపడతారు. రావణుడు సీత సాన్నిధ్యం లభించినా తన అజ్ఞానాన్ని పోగొట్టుకో లేకపోతాడని భావన).

మారీచుడితో ఇంకా ఇలా అంటాడు రావణుడు: "భార్య లేకపోవడంతో కృశించి, దుఃఖించే రామచంద్రుడిని వధించి సుఖంగా, నిర్విచారంగా వుంటాను. మా తండ్రీ! ఈ మాత్రం సహాయం చేయి".

రావణుడు చెప్పిన రాముడి వృత్తాంతాన్ని ఆసాంతం విన్న మారీచుడు, రామచంద్రమూర్తి శౌర్యం తెలిసనవాడైనందున, తన ప్రాణానికే ముప్పు వచ్చిందికదా! అని గుండెలు ఝల్లన భయపడ్డాడు. నిశ్చేష్టుడయ్యాడు. తెప్పరిల్లి, వణకుతూ, నోట తడిలేకపోవడంతో పెదవులు నాకుతూ, ధైర్యం చెడి శవంతో సమానమై పోయి, రావణుడిని చూస్తూ భయంతో, రెండు చేతులూ జోడించి, తనకు క్షేమకరమైన విధంగా ఇలా అంటాడు.

సర్గ-37

# శ్రీరాముడి బలపరాక్రమాలు రావణుడికి చెప్పిన మారీచుడు

మారీచుడు రావణుడితో భయపడుతూ ఇలా అంటాడు: "రావణా! లోకంలో, స్వార్థలాభంతో వినడానికి ఇంపైన ఇచ్చకాయల మాటలు చెప్పేవారు చాలా సులువుగా దొరుకుతారు. అలాంటివారిని వెతికి తెచ్చుకోవాల్సిన శ్రమ అవసరంలేదు. ఆపత్కాలంలో కూడా వినడానికి కటువైన, ప్రియంకాకున్నా హితంగా, భవిష్యత్ లో మేలు చేసే మాటలు చెప్పేవారు-వినేవారు దొరకడం దుర్లభం. ఒకవేళ ఎదుటివారి మేలుకోరి చెప్పేవాడు దొరికినా, వినేవాడు దొరకడు. కాబట్టి నేను చెప్పబోయే మాటలు వినడానికి అప్రియమైనా, రాబోయే రోజుల్లో మేలుచేస్తాయి కనుక వాటిని ఉపేక్షించవద్దు. రావణా! రామచంద్రుడితో విరోధం వద్దని మొన్ననే నేను చెప్పాను. సరే అని అంగీకరించి పోయావు. ఇంతలో మనస్సు మార్చుకొని మళ్లీ వచ్చావు. ఇలాంటి చపలచిత్తుడు నేనేం చెప్పినా ఎలా వినగలడు? లాభపడగలడు? అయినా నీ మేలు కోరేవాడిని కాబట్టి నీకు లాభం చేకూరే మాటలనే చెప్తా".

"నీకు లోకంలో ఎక్కడెక్కడ ఏమేమి జరుగుతుందో వెంటవెంట తెలియచేసే వేగులవాళ్ళు లేరు. అందువల్ల, గొప్ప పరాక్రమవంతుడు, సుగుణ సంపత్తితో అధికుడు, వరుణుడితో, ఇంద్రుడితో బలంలో సమానుడైన రాముడి

వృత్తాంతాన్ని నీవెరుగవు. నువ్వు రామచంద్రుడికి కోపం కలిగించే పనులు చేయొద్దు. ఆయనకే కోపం వస్తే లోకంలో రాక్షస జాతి అనేది పేరుకుకూడా వుండదు. లోకంలో సాధారణంగా ప్రాణులు నేలమీద పది ప్రాణాలు విడుస్తారు. నీకు అంత అవకాశం కూడా ఇవ్వకుండా, నిలుచున్నవాడి ప్రాణాలు నిలిచి వుండగానే తీయడానికి సీతాదేవి పుట్టిందో?ఏమో? నీ గతి ఎలాగైతే అలాగే కావచ్చు. చేసేవాడివి అనుభవిస్తావు. ఆమె పేరుతో నాకేం కీడు కలగకుండా చూడు. కామమే శీలంగాకల నువ్వు రాజైనందువల్ల లంకాపురం కష్టాల పాలు కాకుండా వుంటుందా? ఎట్లాగూ అవుతుంది. మనసుకు ఏదిష్టమైతే అదే చేసే నీలాంటివారి బంధువులందరూ నాశనమై పోరా? నీ లాంటి చెడు బుద్ధికలవాడు, కఠినస్వభావం కలవాడు, పాపపు ఆలోచనలు కలవాడు, ప్రభువై చెప్పినా తెలుసుకోలేనివాడు, స్వాపస్వాపరాధం వల్ల తాను చెడడమే కాకుండా రాజ్యంలోని ప్రజలందరినీ చెరుస్తాడు".

"రావణా! రామచంద్రమూర్తిలో నువ్వు ఆరోపించిన దోషాలు ఒక్కటైనా లేవు. ఆయన నీచ క్షత్రియుడు కాదు. కుత్సిత స్వభావం కలవాడు కానే కాదు. లోభి కాడు. ధర్మగుణ సమూహం లేనివాడు కాదు. తీక్ష్ణుడు కాదు. భూతాలకు సహితం కీడు చేయడయ్యా...చేయడు. తండ్రి కోపంతో పొమ్మంటే అడవికి రాలేదు...స్వయంగా ఆయనే పితృ వాక్య పాలన కోసం వచ్చాడు. నీకెవరు అలా చెప్పారో కాని అవన్నీ అసత్యాలే. రామచంద్రమూర్తి కఠినచిత్తుడు కాదు. విద్యలేనివాడు కాదు. ఇతరుల ఇష్టప్రకారం మసలుకుంటాడు. ఇది నిజం. ఎందుకు లేనివి కల్పించి వున్నవి తారుమారుగ చెప్తావు నాయనా? ఇక రామచంద్రమూర్తిని గురించి వాస్తవం చెప్తా విను. రామచంద్రమూర్తి ఆకారంగొన్న గొప్ప ధర్మం. యుద్ధంలో పరాజయం లేనివాడు. సత్యమైన శౌర్యం కలవాడు. మోసపు యుద్ధాలు ఆయన చేయడు. దేవతలకు ఇంద్రుడు ఎలాగో, సమస్త జగాలకు ఆయన ఆవిధంగా ప్రభువు. మంచి మనస్సు కలవాడు. సూర్యుడి కాంతిని అపహరించే విధంగా రాముడి నుండి సీతను వేరు చేద్దామని చూస్తున్నావా? ఇది నీకు సాధ్యమా? రామచంద్రమూర్తి వల్ల ఆమె రక్షించబడుతున్నది. రాముడి నుండి వేరు చేస్తే రక్షకుడు లేనందువల్ల నువ్వు చెప్పినట్లు వింటుందని అనుకుంటున్నావు. ఆమె తన పాతివ్రత్యంతో తనను తానూ కాపాడుకుంటున్నది. తన రక్షాభారం ఇతరుల మీద వేయలేదు. కాబట్టి నువ్వు అపహరించినా ఆమె నీకు లోబడుతుందని భావించకు. తమను తాము

కాపాడుకోలేని వారేకదా పరరక్షణ కోరేది? కాబట్టి నీ ఉద్దేశం కొనసాగదు".

"సీతాదేవిని నువ్వు అపహరించాలని చూస్తున్నావు. ఆమె సమీపంలోకి నువ్వు పోగలిగితే కదా....నువ్వు ఆమెను అపహరించడం? ఆమెను రాముడనే అగ్నిహోత్రం చుట్టుకొని రక్షిస్తున్నది. ఆ అగ్ని ఎలాంటిదంటావా? దానికి బాణాలే జ్వాలలు. దూరంగా వుండగానే దహిస్తాయి. ఇక దగ్గరికి పోయి బతికేదెలా? ఆ అగ్నిని ప్రజ్వలించేది ధనస్సు. ఇలాంటి అగ్ని నివురు కప్పి వున్నదని అనుకుంటున్నావేమో? అది భగ-భగ మండుతూనే వుంది. ఇలాంటి అగ్నిలో మిడుతలాగా పోయి ఎందుకు చావాలనుకుంటున్నావు? తండ్రీ! విల్లనే మండుతున్న నోరు కలవాడిని, గొప్ప అస్త్రం అనే శిఖలు కలవాడిని, సీతను నువ్వు అపహరించాలనుకున్నందున కోప్పడ్డవాడిని, ప్రకాశించే పాశం ధరించినవాడిని, శత్రుసమూహాలను సంహరించే వాడిని, సీతాపతి అనే యముడిని సమీపించడానికి, సుఖం, రాచకార్యం, ప్రాణాలు అన్నీ వదిలి, నాయనా ఎందుకు పోతావు?"

"జనకాత్మజ సంబంధమున రాముం డప్రమేయ పురుతేజుం డయ్యెను.... సీతాదేవి సంబంధమున చేసి రాముడు ఛేదింపరాని గొప్ప తేజం కలవాడయ్యాడు. అలాంటి రాముడి విల్లు రక్షిస్తుంటే సీతను తేవడం నీకు సాధ్యమా? సింహం రొమ్ములాంటి విశాల వక్షస్థలం కలవాడు, పురుష శ్రేష్టుడైన శ్రీరాముడి భార్యను, సత్యశీల సంపన్నను, పాపచరిత్ర లేనిదాన్ని సమీపించవద్దు. నీ మేలుకోరి చెప్తున్నాను. రావణా! నువ్వు రాక్షస సింహుడివి. ఆయన నరసింహుడు. హిరణ్యకశిపుడు అంతటివాడు నరసింహుడి బారినపడి ఏమయ్యాడో తెల్సుకదా? అలాంటివాడు రక్షించే దాన్ని, కొంచెమైనా పాపం అనేది లేనిదాన్ని నువ్వు సమీపించవద్దు. నువ్వు రాముడికి కోపం వచ్చినా చెడుతావు....సీతకు కోపం వచ్చినా చెడుతావు. ఇక, ఇరువురికీ కోపం వస్తే నీ గతేంటి? ఆలోచించి ఆ వైపుకు వెళ్లు".

"సీతంటే ఏమనుకుంటున్నావు? రామచంద్రమూర్తి ఆమెను తన ప్రాణం కంటే ప్రియమైనదిగానూ, హితమైనదిగానూ, రక్షిస్తున్నాడు. అలాంటి సీతను నువ్వు అజ్ఞానివై, వలచి, గ్రహించాలనుకోవడం కార్చిచ్చు నెత్తిన పెట్టుకోవడమే. నీ ప్రయత్నం నీకు మరణాంతకం అవుతుందే కాని మానదు. అలా పోకపోతే నీకు క్షేమం కలుగుతుంది. వారంతట వారు నీమీదకు రారు. కాబట్టి నీకా భయం లేదు. రాక్షసరాజా! రామచంద్రమూర్తితో విరోధిస్తే నీ కోరికలు, రాజ్య

భోగాలు, సుఖాలు, ప్రాణం, వీటిలో ఒక్కటైనా మిగలదు. కాబట్టి నీకింకా కొంతకాలం సుఖపడాలనుకుంటే, రామచంద్రమూర్తి మనస్సు నొచ్చుకునే పనేమీ చేయొద్దు. నిన్ను నేను ప్రార్థిస్తున్నాను. నువ్వు లంకకు వెళ్లిపో. అక్కడ నీ మేలుకోరే విభీషణుడులాంటివారిని రహస్యంగా కాకుండా నిండు సభలో చూడు. నువ్వు అనుకున్న పనిలో గుణమెంతో వాళ్లు చెప్తే విను. దాంట్లో ఏది బలమో, ఏది దుర్బలమో, నీ బలమెంతో, రాముడి బలమెంతో నిశ్చయం చేసుకో. ఆ తరువాత ఇది మనకు మేలనీ, ఇది మనకు కీడనీ తేల్చుకుని ముందుకుపో. నాకు తోచింది నేను చెప్పాను. రామచంద్రుడిని నువ్వు యుద్ధరంగంలో సమీపించవద్దు. నా మాట విను. నీకు మేలు కలుగుతుంది".

సర్గ–38

# శ్రీరాముడితో తను పడ్డ కష్టాలు రావణుడికి చెప్పిన మారీచుడు

శ్రీరాముడి బలపరాక్రమాలను వివరంగా, విడమర్చి చెప్పిన మారీచుడు, అంతటితో ఆగకుండా, శ్రీరాముడితో తాను పడ్డ పాట్లు చెప్పాడు రావణుడితో ఈ విధంగా.

“దశగ్రీవా! విను. నేను వెయ్యేనుగుల విస్తారమైన బలంతో, పర్వతంలాంటి ఎత్తైన ఆకారంతో, మంచి దేహకాంతితో, అపరంజి బంగారు కుండలాలతో, గదచేతబట్టుకుంటే నన్ను చూసి భూతాలన్నీ భయంతో వ్యాకులపడేవి. అప్పుడు నేను మునుల మాంసం తింటూ భూప్రదేశమంతా తిరుగుతుంటే విశ్వామిత్రుడు భయపడి దశరథ మహారాజు దగ్గరకు పోయాడు. మారీచుడివల్ల తనకు భయం వుందనీ, తన యజ్ఞాన్ని కాపాడడం కోసం రామభద్రుడిని తన వెంట పంపమనీ అడిగాడు. రాముడు పసిబాలుడనీ, పన్నెండేళ్ల వాడనీ, అస్త్రవిద్యల్లో ఇంకా నేర్పరి కాదనీ, కాబట్టి సైన్యంతో వచ్చి ఆ రాక్షసులను తానే చంపి విశ్వామిత్రుడికి సంతోషం కలిగిస్తాననీ దశరథుడు మునికి చెప్పాడు. దశరథుడి మాటలకు జవాబుగా, ఆ రాక్షసుడిని ఎదిరించగలవాడు రాముడు తప్ప మరెవరూ లేరని, శ్రీరాముడిని తీసుకుపోతాననీ విశ్వామిత్రుడు చెప్పాడు. శ్రీరాముడు పిల్లవాడైనా రాక్షసులను చంపడానికి సమర్థుడనీ, అధికమైన తేజస్సు కలవాడనీ,

రామచంద్రుడిని తన వెంట పంపితే దశరథుడికి మేలు జరుగుతుందనీ అంటాడు ముని. ఇలా చెప్పి రామచంద్రమూర్తిని తన వెంట తీసుకుని సంతోషంగా దండక లోని తన ఆశ్రమానికి పోయి, అక్కడ యజ్ఞం చేయసాగాడు".

"శ్రీరాముడు అప్పుడు బ్రహ్మచారి. ఒంటి వస్త్రం మొలకు చుట్టుకుని, ఉదయం వేళ తామరకొలనులో స్నానమాడి, విశాలమైన రేకుల్లాంటి కళ్ళతో, పులిగోళ్ళ బంగారుతీగ మెడలో వేలాడుతుంటే, మీసకట్టు కూడా లేకుండా, విల్లు మోగిస్తుంటే, అడవి మొత్తం తన దేహకాంతితో శ్యామారుణంగా, సౌమ్యంగా, ఉదయించే బాల చంద్రుడిలాగా ప్రకాశిస్తూ తిరుగుతున్నప్పుడు విసవిసా నేనక్కడికి వచ్చాను. వస్తున్న నన్ను చూసి, కొంచెమైనా తత్తరపాటు లేక విల్లెక్కిపెట్టి నిలిచి వున్నప్పుడు, పసిబాలుడు...వీడితో ఏంపని అని అలక్ష్య భావంతో, విశ్వామిత్రుడు హోమం చేసే వేది దగ్గరకు పోయాను. రాముడు నన్ను ఒకే ఒక్క తీవ్రమైన బాణంతో నూరామడ దూరంలో వున్న సముద్రంలో పడేట్లు చిమ్మాడు. చంపకుండా నన్ను ప్రాణాలతో వదిలిన కారణాన మూర్ఛపోయి, సముద్రంలో పడి ఎంతో సేపటికి స్మృతి వస్తే, గర్వం పోయి, లంకకు పోయాను. పసివాడు, అస్త్ర విద్య తెలియనివాడు, ముగ్ధుడైన వాడే నన్నిలా బాధించాడు. సైన్యమంతా ధ్వంసం చేసాడు. ఇప్పుడాయన మంచి వయసులో వున్నాడు. నువ్వు కనుక యుద్ధానికి దండెత్తితే కలగబోయే ఫలితం నేను చెప్పాలా? అనుభవించి నువ్వే తెలుసుకుంటావు".

"ఈ కారణం వల్ల రామచంద్రుడిని నువ్వు యుద్ధంలో ఎదిరించడం తగిన పనికాదని భావించి నీ ప్రయత్నానికి అడ్డు తగులుతున్నాను. రామచంద్రుడితో విరోధిస్తే అది వూరికే పోదు. రాక్షస సమూహానికి నువ్వే గొప్ప విపత్తు కలిగించిన వాడివి అవుతావు. నిజం...రావణా! నా మాట నమ్ము. నీ రాక్షసులకు నువ్వే ముప్పు కలిగించవద్దు. బంగారు హర్మ్యాలు, సుందరమైన రాజగృహాలు కల లంకను సీతాదేవికొరకు పాడైపోయే ఆలోచన చేస్తున్నావు. సత్పురుషుడు తానేపాపం చేయకుండా శుద్ధవర్తనుడై వున్నా, పాపులతో సహవాసం చేస్తే, వారి పాపాలకు తానుకూడా చెడిపోతాడు. ఎలా అంటావా? పాములున్న మడుగులో చేపలు ఎవరికీ ఏ ఆపదా కలిగించకుండా ఉన్నప్పటికీ, వాటితో వున్నా కారణాన, వాటిని చంపడానికి వచ్చిన వాళ్ల చేతిలోనో, లేక, గరుత్మంతుడి చేతిలోనో అవీ చస్తాయి. ఆ విధంగా నువ్వు పాపం చేసి, నువ్వు చెడడం కాకుండా, హాయిగా

నిర్విచారంగా ఏ దోషం లేకుండా సుఖం అనుభవించే వారిని కూడా నాశనం చేయాలనుకుంటున్నావు".

"యుద్ధ ముఖంలో రామచంద్రుడి చేతిలో చావగా మిగిలిన రాక్షసులు తమ భార్యలను తమ వెంట తీసుకునో, లేక, వదిలిపెట్టో, దిక్కుల వెంట రక్షించేవాడు లేక పరుగెడుతుంటే లంకలోని ఇళ్లన్నీ బాణ సమూహాలనే అగ్ని జ్వాలలలో కాలి బూడిదైపోవడం నువ్వే కళ్లారా చూస్తావు. ఇతరుల భార్యలను మోహించడం కంటే గొప్ప పాపం వేరేదైనా వుందా? నువ్వు భార్య లేనివాడివి కాదు. పదివేల మంది వయసులో వున్న వారు నీకు భార్యలుగా వున్నారు. వాళ్లతో నీ ఇష్టం వచ్చినట్లు సుఖపడవచ్చుకదా? ఆపదతో కూడిన సీతా సాంగత్యం ఎందుకు కోరుకుంటున్నావు? నువ్వే ఆలోచించు. ఈ పని వల్ల నువ్వు ఉభయ లోకాల్లో చెడిపోతావు. నీ భార్యలతో నువ్వు యధేచ్ఛగా అనుభవించు. నీ వంశాన్ని రక్షించుకో. అందగత్తెలైన నీ భార్యలతో, ప్రేమించే స్నేహితులతో ఇంకా దీర్ఘకాలం సుఖపడాలనే కోరిక వుంటే, రామచంద్రుడికి కీడు తలపెట్టవద్దు. స్పష్టంగా చెప్తున్నా. ఇది రహస్యం కాదు. రావణా! సీతాదేవిని నువ్వు అపహరించవద్దు. నేను ఈ మాట నీ మీద ప్రేమతో, నీ క్షేమం కోరి, చెప్తున్నాను. నా ఆమాట వినకుండా బలాత్కారంగా సీతను అపహరించావా.... బంధువులతో, స్నేహితులతో, యుద్ధంలో రాముడి చేతిలో చస్తావు".

సర్గ-39

# రాముడి బారినుండి తప్పించుకున్న వైనం రావణుడికి చెప్పిన మారీచుడు

"విశ్వామిత్ర యాగ రక్షణ సమయంలో రామచంద్రుడు యుద్ధరంగంలో అందరినీ చంపి నన్ను ప్రాణాలతో ఎందుకు విడిచాడో కారణం తెలియదు. బతికి వుండడం మాత్రం తెలుసు. ఇది పాత సంగతి. కొత్తగా ఇటీవల జరిగిన కథ చెప్తా సావధానంగా విను. రాముడితో దెబ్బతిన్న నేను దండకారణ్యంలో గర్వంతో తిరుగుతూ క్రూరంగా ప్రవర్తించేవాడిని. తపస్వుల సమూహాలను తన్ని వాళ్ల నెత్తురు తాగుతూ, వారి మాంసం తింటూ, అధర్మ మార్గంలో వళ్లు తెలియకుండా తిరుగుతుంటే ఒక నాడు, ముని వేషంలో వున్న రామచంద్రుడు, పరమపతివ్రత అయిన సీత, లక్ష్మణుడు ఒకే చోట కనిపించారు. అప్పుడు రామచంద్రుడిని పొడవడానికి పోయాను దగ్గరికి. ఆయన నావైపు చూసి, చాపం ఎక్కుపెట్టి, వజ్రం లాంటి మూడు బాణాలను విడిచాడు. ఆ బాణం వేగం తెలిసన వాడినికనుక ముందే పరుగెత్తాను".

"రామచంద్రుడి బాణాలు వెనుకవైపు నుండి తగలవు కాబట్టి నేను బతికిపోయాను. నావెంట వచ్చిన వారిద్దరూ ఆ బాణాలు తగిలి చనిపోయారు. రామచంద్రుడిని ఎదిరించి బతకడం ఎవరికీ సాధ్యం? అలా బతికి పోయిన నేను, ఇంకా అలానే తిరుగుతుంటే చంపుతాడనే భయంతో, ఆనాటి నుండి ఈ

ప్రదేశంలో గర్వహీనుడనై, యోగాభ్యాసం చేస్తూ, మునిలాగా వున్నాను. ఆ శ్రీరాముడిని మనసులో అనుకున్నా నేను పడే పాట్లు నాకే తెలుసు. రావణా! చెట్టు–చెట్టులో శ్రీరాముడే పెద్ద విల్లు పట్టుకొని, నారచీరెలు, జింక చర్మం ధరించి, పాశం పట్టుకున్న యముడిలా కనిపిస్తున్నాడు. ఎక్కడో చెట్టెక్కి కూర్చుని నాకు కనిపిస్తున్నాడని అనుకుంటున్నావేమో? అలా కాదు. ఒక్క చోటే ఒక్క రాముడు కనిపిస్తే అలా అనుకోవచ్చు. ఎల్ల వేళలా, వేలాది మంది రామచంద్రమూర్తులు, నాకు కనిపిస్తుంటారు. అడవంతా రామమయంగా కనపడుతున్నది. ఇంద్రజాలం అంటావేమో? రాముడు లేని దూర ప్రదేశానికి పోయి వుందామంటే అక్కడా ఆయనే కనపడుతున్నాడు. పగలు, రాత్రి, కళ్ళు మూసుకున్నా, తెరిచినా రాముడే కనపడుతుంటే అరుచుకుంటూ లేస్తాను. ఆ కారణాన నిద్ర అనేది లేకుండా పోయింది. నేనేం చేయాలి?"

"రాముడిని చూసి భయపడడం అలా వుంచితే, ఆయన పేరు వింటేనే భయం కలుగుతున్నది. రాముడి పేరే కాదు...'ర' కారంతో మొదలైన ఏ శబ్దం, రత్నం, రథం లాంటివి విన్నా రాముడే వస్తున్నాడని భయం కలుగి మనసు కలవరపడుతున్నది. రావణా! రామచంద్రుడి మీద విరోధం మానుకో. యుద్ధంలో నువ్వు ఆయనకు సమానుడివి కాదు. నీ శక్తి నాకు తెలుసు. ఆయన శక్తీ నాకు తెలుసు. ఆయన ఎవరినైనా వధించగల శక్తిమంతుడు. నీకు శక్తి వుంటే, నువ్వే పోయి ఆగ్రహంతో యుద్ధం చేయి. బలం లేకపోతే, అయిందేదో అయింది...ఏం చేయలేమని, బంధువుల మరణం సహించి వూరుకో. మీ ఇద్దరిమధ్య నా ప్రాణం తీయాలని ఎందుకు ఆలోచిస్తావు? ఆ రెండిటిలో ఒకటి చేయి కాని దొంగతనం చేయొద్దు. ఇంకా నేను కొన్ని రోజులు బతికి భూమ్మీద వుండడం నీకు ఇష్టమైతే ఆ సీతాపతి కథ నాతొ చెప్పవద్దు. నా తలపోయ్యే పనైతుంది. అనేకమంది సాధువులు వాళ్ళు ధర్మాత్ములైనప్పటికీ, ఇతరుల దోషం వల్ల నశిస్తారు. అలాగే, నేను నువ్వు మతిమాలి చేసే పనివల్ల చెడిపోతాను. ఇది నిజం. నీ వెంట రాను. ఈ విషయంలో నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో. నన్ను వదిలిపెట్టు".

"రామచంద్రమూర్తి అసమాన బలాతిశయుడు. దృడమైన తేజస్సు కలవాడు. అధికమైన గర్వం, మనోదార్ఢ్యం, శరీర బలం కలవాడు. ఇలాంటి వాడిని రాక్షసజన నాశకుడిగా ఎందుకు చేస్తావు? అడవిలో వారంతట వారు ఒక ఆశ్రమాన్ని ఏర్పాటుచేసుకొని, ఒకరి పేరు ఎత్తకుండా వుంటుంటే, మన

శూర్పనఖ పొగరుబోతు తనంతో ఏమని బెదిరించడానికి పోయింది? అంతటితో ఆగకుండా ఖరాదులను యుద్ధానికి పురికొల్పింది. వారంతా గుంపుగా పోయి యుద్ధం చేశారు. రాముడి చేతిలో చనిపోయారు. దీంట్లో రామచంద్రమూర్తి నేరం ఏముందో చెప్పు? బంధువుల మేలు కోరి, నేను చెప్పిన మాటలు నీ చేదైతే, బంధువులతో, స్నేహితులతో, యుద్ధంలో చస్తావు''.

సర్గ-40

# మారీచుడిని తోడురావడానికి బలాత్కారంగా ఒప్పించిన రావణుడు

న్యాయంగా, పనికొచ్చే విధంగా చెప్పిన మారీచుడి హితవాక్యాలు, చావకోరేవాడు వైరాగ్యంతో మందు నిరాకరించినట్లు, రావణుడికి రుచించలేదు. నీతియుక్తమైన, హితమైన మారీచుడి మాటలకు జవాబుగా ఆయన్ను చూసి రావణుడు నిష్ఠూరంగా ఇలా అన్నాడు.

రావణుడు మారీచుడితో నిష్ఠూరాలు పలుకుతూ ఇలా అన్నాడు. "ఓరీ! మారీచుడా! నిన్నెవడురా ఈ కథలు చెప్పమని అడిగాడు? చవిటి నేలలో విత్తనాలు చల్లినట్లు నోరెండగా ఎందుకురా ఇలా వాగావు? రాముడు మనుష్యుడు, మూర్ఖుడు, పాపాత్ముడు. అలాంటివాడిని నాతో సమానం అనుకొని యుద్ధానికి పోతానా? ఆ విషయంలో నేను అనుకున్నట్లు చేయడాన్ని నివారించగల శక్తి నీకున్నదా? నీతో అది అవుతుందని అనుకుంటున్నావా? ఒక ఆడదాని వ్యర్థప్రలాపాలను విని, రాజ్యాన్ని, తల్లిని, తండ్రిని, హిత సమూహాన్ని వదిలి అడవులకు వచ్చిన వాడెంత బుద్ధిహీనుడో? ఇలాంటివాడిని నువ్వు గొప్పవాడంటున్నావే? నువ్వెంత బుద్ధిహీనుడివి? నువ్వు చూస్తుండగానే, నీ కళ్లెదుటే ఖరుడిని చంపినా రాముడి ప్రియభార్య సీతను పట్టితెస్తాను. నేను నిశ్చయించిన దాన్ని మార్చడం నీకు సాధ్యమా?"

"ఇంద్రుడు, ఆయన దేవతా సమూహం అన్నీ కలిసినా, నా ప్రయత్నాలను కొంచెం కూడా అడ్డుకోలేరు. అలాంటిది నువ్వా నన్ను దిద్దేవాడివి? ఏమీ నీ అహంకారం? ఏది మంచో, ఏది చెడో అనే విషయం రాజు అడిగినప్పుడు కదా చెప్పాల్సింది? ఈ పని ఎలా చేయాలి అని రాజు అడిగినప్పుడు మాత్రమే బతుకు మీద ఆశగల మంత్రి చేతులు జోడించుకుని, వినయంగా తన మనస్సులో వున్నా సంగతి ఉపాయంగా చెప్పాలి. అది కూడా ఎలా చెప్పాలి? చెప్పేమాట ప్రభువుకు మేలు చేసేదిగా వుండాలి. మెత్తటి మాటలు చెప్పాలి. పరుష పదజాలం వాడొద్దు. ప్రతికూలంగా చెప్పకూడదు. అనుకూలంగా చెప్పాలి. శుభకరమైన మాటలతో విషయాన్ని అలంకారంగా, రాజుకు ఇష్టం కలిగించేలా చెప్పాలి. గౌరవ యోగ్యుడైన రాజు మానం విడిచిన మాటలు అవెంత శుభకరమైనవైనా, ఎంత పెద్దవాడు చెప్పినా, పట్టించుకోడు. మారీచుడా! నీ తమ్ములందరూ చచ్చినా చావనీ! నీ చెల్లెలి ముక్కు-చెవులు కోసినా కోయనీ! నాకేంటి? అని వూరికే ఇంట్లో కూర్చోమంటే ఆ అవమానాన్ని సహించి, మానం కోల్పోయి, నువ్వు చెప్పావని ఎలా ఊరుకుంటాను?"

"రాజైన వాడికి వాసవుడి లాగా విక్రమం, అగ్నిలాగా దీక్షత, చంద్రుడి లాగా సంతోషకరత్వం, యముడిలాగా దండం, వరుణుడిలాగా ప్రసన్నత్వం వుంది, ఆయా సమయాల్లో అవసరమైన విధంగా ఉపయోగిస్తే పూజ్యుడవుతాడు. బుద్ధిహీనుడా! నేనొక పనిచేద్దామని నీ సహాయం కోరితే, అది రాచధర్మం అని తెలుసుకోకుండా, తెలివిలేక, ఏవేవో పనికిరాని మాటలు ఇంతసేపు చెప్పావు. ఈ విషయంలో కీడు-మేలు గురించి నిన్నెవడురా అడిగింది? ఈ పనిలో నీ సహాయం కావాలిరా అంటే ఏదేదో వాగావెందుకు? నువ్వు నాకు చేయాల్సిన సహాయం గురించి చెప్తా విను. వెండి చుక్కలు కల బంగారు జింకగా మారు. రామాశ్రమం దగ్గర సీత ఎదురుగా సంచరించు. నీ వ్యవహారం చూసి నువ్వు నిజమైన జింక అని నమ్మి, ఆశ్చర్యపడి, సీతాదేవి నిన్ను పట్టుకొని రమ్మని మగాడిని పంపుతుంది. నువ్వు ఆరాముడిని దూరంగా తీసుకుపోయి అక్కడ జానకీ! లక్ష్మణా! అని చనిపోయేవాడి గొంతుతో రాముడు గొంతులా అనిపించేట్లు బిగ్గరగా అరువు. అది రాముడి గొంతని నమ్మి సీత భయంతో రాముడిని చూసి రమ్మని లక్ష్మణుడిని పంపుతుంది".

"అన్న మీద ప్రేమతో లక్ష్మణుడు రాముడిని వెతకడానికి పోతాడు. ఆ రాజకుమారులు ఇరువురూ లేనప్పుడు రాముడి భార్యను అపహరించి భార్యగా

చేసుకొని సుఖపడతాను. ఈ మాత్రం సహాయం నువ్వు చేసి నీ ఇష్టం వచ్చిన చోటుకు వెళ్లు. నీకు నా రాజ్యంలో సగమిస్తాను. పని పూర్తి కావడానికి నువ్వు ముందు పో. నీ వెనకాలే నేను రథం మీద వస్తాను. రాముడిని మోసం చేసి సీతను అపహరించి, యుద్ధమనేది లేకుండా సుఖంగా కొంచెం సేపట్లోనే ఇంటికి పోతాను. నువ్వు దీనిని చేయకపోతే నిన్ను ఇప్పుడే చంపుతాను. అలా కాకుండా నేను చెప్పింది నీకు అంగీకారమైతే నేను చెప్పినట్లే చేయి. అలా కాదని, నీకిష్టం లేదంటావా....నీ చేత బలవంతంగానైనా చేయిస్తాను. తప్పదు. కాబట్టి తెలివి తెచ్చుకో. రాజులను విరోధించి మాట్లాడేవారు సుఖపడతారా? నేను చెప్పినట్లు అక్కడికి పోతే చావడం సందేహం...తప్పించుకోవచ్చు కూడా. ఇక్కడ ఇలానే వాగుతుంటే నా చేతిలో నీకు చావు తధ్యం. అక్కడికి పోవడం మేలో, లేదా ఇక్కడ చావడం మేలో, ఆలోచించి తగిన విధంగా చేయి''.

సర్గ–41

# రావణుడిని నిందించిన మారీచుడు

రావణుడిలా రాజులాగా ఆజ్ఞాపించడం విన్న మారీచుడు, నిష్ఠూరంగా, ఆయన మాటలకు విరుద్ధంగా, ప్రతికూలమైన మాటలతో ఇలా జవాబిచ్చాడు. "కొడుకులతో, సేవకులతో, మంత్రులతో, స్నేహితులతో సహా అందరికీ కీడు కలిగించే ఈ దుష్టకార్యాన్ని చేయమని నీకు చెప్పిన నీచుడెవడు? వాడు నీచుడు కాబట్టే తానూ చెడక నువ్వు చెడిపోయేట్లు చెప్పాడు నీకు. ఉత్తముడైతే ప్రత్యక్షంగానే నీతో విరోధించి వుండేవాడు. నువ్వు సుఖంగా వుండడం చూడలేక పాడుపని చేయమని ఉపాయంగా చెప్పి, నీకు మృత్యుదేవత నోరు చూపించాడు. నిన్ను యుద్ధంలో జయించలేని నీ శత్రువులు, ఈ విధంగా నిన్ను బలవంతుడితో యుద్ధానికి దింపి, నీ చెడు కోరుకుంటున్నారు. అది నువ్వు తెలుసుకోలేక పోతున్నావు. నీకు మేలు చేసేవాడిలాగా నటిస్తూ, ఎవడో దుష్టుడు, నువ్వు చేయబోయే పాపకార్యంతో నువ్వే నసిమ్చాలని కోరుకుంటున్నాడు".

"నీకు వేగులెలాగూ లేరు. మంత్రులు కూడా లేరా? వాళ్ళైనా నువ్వు చేసే పని తప్పని చెప్పలేదా? అలా నీ మేలుకోరి చెప్పని మంత్రులున్నా లాభం ఏమిటి? లేకున్నా ఏం లాభం? వారింకా బతికే వున్నారా? వక్రమార్గంలో పోయే రాజును సరిదిద్దని మంత్రులున్నా చచ్చినా ఒకటే. వాళ్లు బతికుంటే చివరికి కీడే కలుగుతుంది. రాజు సుగుణ సంపత్తి, నిర్మలమైన మనసు కలవాడైతే మంత్రులు

ధర్మార్థకామాలు కలిగి ధర్మం చేస్తారు. ధనం సంపాదిస్తారు. కామాన్ని అనుభవిస్తారు.రాజలాంటివాడుకాకపోతే,మంత్రులకుధర్మార్థకామాలుండవు. ప్రజలు దుఃఖపడతారు. రాజు బాగుంటే విజయం, ధర్మం, ప్రజలకు కలుగుతుంది. ఆ కారణానే, రాజు సర్వ వేళల రక్షింపబడదానికి అర్హుడు. అలా కాకుండా రాజు క్రూర దండనం, ఇంద్రియ లోలత్వం, జన విరుద్ధత కలవాడైతే ప్రజలను ఎలా పాలిస్తాడు? ఇక మంత్రులు క్రూరమైన ఉపాయాలు చెప్తే రాజుతో వారు కూడా నశిస్తారు. భూజనులకు విరుద్ధమైన మనస్సు కలవాడై రాజు రాజ్యం ఏలుతే, లోకులు రాజువల్లే చెడిపోతారు. కాబట్టి రాజును సరైన మార్గంలో పెట్టాల్సిన విధి మంత్రులది, ప్రజలది. రాజలా వుండకపోతే వాడిని తొలగించి మరొకడిని రాజుగా చేయాలి. ప్రజలకొరకు రాజు కాని, రాజుకొరకు ప్రజలు కాదు".

"ఆకస్మికంగా, నిర్నిమిత్తంగా నాకు ఈ చెడ్డ కీడు కలిగిందని నేను దుఃఖపడడం లేదు. చెప్పినా తెలుసుకోలేక, సర్వసైన్యంతో సహా నువ్వు చెడిపోతున్నావే అని నీకోసం బాధపడ్తున్నాను. నాకు కలగబోయే మరణానికి నేను శోకించడం లేదు. నన్ను చంపి రామచంద్రుడు వెంటనే నిన్నూ చంపుతాడు. ఇది నిజం. పరమపాపాత్ముడవైన నీ చేతిలో చావడం కంటే, నీ శత్రువైన పరమ పుణ్యాత్ముడు రాముడి చేతిలో చ్చస్తే ధన్యుడనవుతాను. నువ్వు చెప్పినట్లు నేను చేస్తే నాకెందుకు రాముడివల్ల భయమంటావేమో? నువ్వు చెప్పిన వేషం వేసుకుని నేనెప్పుడైతే పోతానో, అప్పుడే రాముడు ఇది నా వంచన అని తెలుసుకుంటాడు. ఎప్పుడైతే వంచన అనీ, దుష్టభావం వుందనీ భావిస్తాడో, అప్పుడే చంపక మానడు. నేను పోవడమంటే చావడమే! ఆయన కళ్లకు కనబడ్డ దాకే నా జీవితం. ఇక్కడ నేనొక్కడినే చస్తాను. నువ్వేమో సీతను అపహరించుకుని పోయి బంధువులతో సహా చస్తావు. ఇది నమ్ము. నన్ను చంపించి నువ్వు బతకడం కల్ల. సీతాదేవిని ఎత్తుకుపోతే అందరూ నాశనమే! నీ మేలు కోరి రావణా, నీకు హితమైన దాన్ని బోధిస్తుంటే నా మాటలు అలక్ష్యం చేస్తున్నావు. అయ్యో! నిన్నేమి అనగలను? మృత్యువుకు వశపడి చావాల్సిన వాడు స్నేహితులు చెప్పే మంచి మాటలు వింటాడా?"

సర్గ-42

# పంచవటికి ప్రయాణమైన రావణ మారీచులు

ఇదంతా చెప్పిన మారీచుడు రావణాసురుడిని చూసి, ఇంకా తాను ఆయన మాట వినడం ఆలశ్యం చేస్తే, వెంటనే చంపుతాడేమో అన్న భయంతో, "రావణా! లే. పోదాం పద. విల్లు, బాణాలు, కత్తి ధరించిన రాముడిని చూడగానే దిగులుతో నిలుచున్నవాడిని నిలుచున్నట్లే చస్తాను. నన్ను చంపడానికి ఆయన దర్శనమే చాలు. ఇది వాస్తవమైతే, యుద్ధరంగంలో రామచంద్రుడిని ఎదుర్కొని ఉపిరితో తిరిగి వచ్చేవాళ్ళు వుంటారా? ఇద్దరికీ యమదండం దగ్గరికి వస్తున్నది. అందువల్లే మనిద్దరికీ స్నేహం సరిగ్గా కుదిరింది. చెడిపోయేకాలం దగ్గర పడ్డ నిన్ను నేనేమి చేయగలను? చావడానికి సిద్ధంగా వున్నా నిన్ను ఎవడేం చేయగలదు? రావణా! నువ్వు చెప్పినట్లే నేనే ముందు పోతున్నాను. నీకు మేలు జరుగుగాక!" అని అంటాడు.

మారీచుడి మాటలకు ఆయన్ను సంతోషంతో కౌగలించుకుని, "సై రా మారీచా! పౌరుషంతో కూడిన మాటలు ఇలా మాట్లాడాలి. ఇప్పుడు నువ్వు నిజమైన మారీచుడివి. రత్నాలతో పొదిగిన నా రథం ఎక్కు. త్వరగా పోదాం. నేను నీతోనే వస్తాను. అక్కడికి పోయి జానకిని మోసగించి, నీ ఇష్ట ప్రకారం పో. నేను ఒంటరిగా వున్న సీతను బలాత్కారంగా ఎత్తుకుని లంకకు పోతాను" అని

అంటూ రావణాసురుడు ఆ ఆశ్రమ ప్రదేశం దాటి పోయాడు.

అలా రథంలో కొండ కోనలను దాటి, దండకలోని రామచంద్రుడి ఆశ్రమం సమీపానికి చేరుకున్నారు. రథం దిగి రావణుడు మారీచుడి చేయి పట్టుకుని, అరటి చెట్లున్న రామచంద్రుడి ఆశ్రమం చూపిస్తాడు.

## మాయా మృగమైన మారీచుడు

వచ్చిన పని కానిమ్మని రావణుడు మారీచుడికి చెప్పాడు. ఇంద్రనీలమణుల కాంతిగల కొనకొమ్ములు, తెలుపు నలుపు గల అందమైన ముఖం, ఎర్రతామర–కల్వరంగుగల ముఖం, ఇంద్రనీలాల లాంటి చెవులు, కొంచెం ఎత్తైన మెడ, నీలాల పలుకుల్లాంటి పెదవి, మొల్లలు–చంద్రుడు–వజ్రం లాంటి తెల్లటి కడుపు, తామరల్లోని ఆకుల లాంటి వీపు, ఇప్ప పూవు లాంటి పక్కలు, వైడూర్యాల లాంటి గిట్టలు, సన్నటి పిక్కలు, ఇంద్రధనస్సు లాగా పలు రంగుల తోకతో, నిమిషంలో మారీచుడు శ్రేష్టమైన జింకలాగా ఆ అరణ్యంలో తిరుగుతూ, రాముడి తపోవనం సమీపించాడు. జానకీదేవిని మోసగించడానికి ఆ రాక్షసుడు జింక వేషంలో అక్కడే ఎక్కడ తిరిగితే తనను సీత చూడగలడో అక్కడే తిరుగుతూ, దూరంగా పరుగెత్తుతూ, వెనుకా–ముందుకూ కదలుతూ సమయం కోసం వేచి చూడసాగాడు. ఈ ప్రకారం అడవిలో తిరుగుతున్న ఆ మృగాన్ని చూసి ఇతర మృగాలు నిజమైన మ్రుగమని భ్రమించి దగ్గరకు వచ్చి వాసన చూసి బెదిరి పోసాగాయి. ఇలా అది తిరుగున్న సమయంలోనే జానకీదేవి కంట అది పడింది.

సర్గ-43

# మాయా మృగాన్ని చూసిన జానకీదేవి

పూలు కోయడానికి బయటకు వచ్చిన సీతాదేవి ఆ జింకను చూసి ఆశ్చర్యపడింది. ఆ వింత జింకను ప్రేమతో చూసింది సీత. మనోహరమైన దంతాలతో, పెదవులతో, ఆశ్చర్యంగా నవ్వుతున్న కళ్ళతో చూసింది ఆ జింకను సీత. సీతాదేవి తనను చూసి సంతోషిస్తుంటే, జింక కూడా వింత-వింతగా వేడుకలు చేయసాగింది. అడవిని ప్రకాశించే విధంగా తిరుగుతున్న ఆ వింత జింకను చూసి, భర్త రామచంద్రుడిని, ఆయుధధరుడైన లక్ష్మనుడిని రమ్మని పిలిచింది. దగ్గరకు వచ్చి దాన్ని చూసిన లక్ష్మణుడికి సందేహం కలిగింది. మారీచుడనే రాక్షసుడికి ఇలాంటి ఆకారంలో తిరుగుతూ మునులను, వేటకై వచ్చే రాజులను వధించే అలవాటుందని, యోగశక్తిగల ఆ రాక్షసుడే తన అద్భుత యోగ శక్తితో జింకలాగా తిరుగుతున్నాడని, ఇది నిజమైన జింక కాదని అంటాడు.

### మాయా మృగాన్ని పట్టితెమ్మని కోరిన సీత

బంగారువన్నె, నవరత్నాల కాంతులు, చుక్కలు, అవయవాలు కల ఇలాంటి జింకను ఇన్నాళ్లు అడవుల్లో తిరిగినా మనం చూడలేదనీ, శాస్త్రాలు-లోకులు చెప్పగా కూడా వినలేదనీ, కాబట్టి ఇది మోసపు వేషమే అనీ లక్ష్మణుడు ఒకవైపి చెప్తుండగానే, ఆయన మాటలకు అడ్డుతగిలి, చిరునవ్వుతో భర్త దగ్గరికి పోయి,

సీత ఇలా అంటుంది. "ప్రాణేశ్వరా! ఈ జింక మీదా ఆశ కలిగింది. వల్లభా! మహాబాహూ! దీనిని సులభోపాయంగా పట్టుకో. నేను అడిగానని ప్రయాసపడవద్దు. నాకెందుకంటే, ఆడుకోవడానికి ఇది కావాలి. ఈ అడవిలో మనమెన్నో మృగాలను చూశాం కాని దీని దేహకాంతి దేనికైనా వుందా? ఇంత వింతైన కాంతిగల మృగాన్ని మనం ఇంతవరకు చూడలేదుకదా? లోకంలో ఎన్ని జింకలు లేవు? వింత మృగాలు లేవు? వాటన్నిటినీ మనం చూడలేదా? ఈ అందమైన వన్నె, పొందిక దేనిలోనైనా వుందా? దీన్ని చూడు. నాలుగు పక్కలా తన దేహకాంతులు దట్టంగా చల్లుకుంటూ చంద్రుడిలా వుంది. నామీద దయ వుంచి దాన్ని పట్టితే".

"ఆహా! ఏమి దీని అందం? ఔరా! దీని కాంతి సంపద బలేగా వుందే! దీని స్వరమాధుర్యం, ప్రశస్తం, నిర్దుష్టం, అయిన ఈ జింక ప్రాణేశ్వరా! నా మనస్సును బాగా ఆకర్షించింది. ఈ మృగం ప్రాణంతో దొరికితే అంతకంటే కావాల్సింది ఏమిటి? మన వనవాస కాలం పూర్తైన తరువాత నగరానికి పోయినప్పుడు, మన అంతఃపురంలో ఇది ఒక భూషణమై అలరారదా? రాజ చూడామణీ! నేను చెప్పేది నిజ కాదో నువ్వే ఆలోచించు. దీన్ని చూసి సంతోషించేది నేనొక్క దాన్నే కాదు. భరతుడికి, నీ ఇతర తమ్ములకు, నాకు,మా అత్తలకు, స్పష్టంగా ఈ జింక ఆశ్చర్యం కలిగిస్తుంది. పురుష శ్రేష్టా! ఈ సంగతి కూడా ఆలోచించు. ఒకవేళ ఇది ప్రాణాలతో దొరక్కపోయినా, దీని చర్మమైనా నాకు ఆనందం కలిగిస్తుంది. లేపచ్చికతో చేయబడిన దర్భాసనం మీద దీన్ని పరచుకుని నీతో కూర్చోవాలని అనుకుంటున్నాను."

"ప్రాణేశ్వరా! నాకది లేదు...ఇది లేదు....అది కావాలి...ఇది కావాలి, అని భర్తను ఇబ్బంది పెట్టడం స్త్రీకి సమంజసం కాదు. ఇది తగదని నా అభిప్రాయం. ఆ కారణాన నేనేదీ మిమ్మల్ని అడగలేదింత వరకూ. అలాంటప్పుడు, ఇది కావాలని మిమ్మల్నెందుకు కోరుతున్నానంటారా? దీని దేహకాంతి నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది. ఆడదాన్ని కాబట్టి నిబ్బరించుకోలేక పోతున్నాను. దీన్ని తేవడం మీకు సులభాసాధ్యమని తెలుసు. అదీ కాకుండా, నగరానికి పోయిన తరువాత, చెల్లెళ్ళు, స్నేహితురాళ్లు, అడవి నుండి ఏం విమ్తవస్తువు తెచ్చావంటే, దీన్ని చూపిస్తాను. క్షమించు".

సీతాదేవి మాటలకు పరాక్రమవంతుడైన శ్రీరామచంద్రుడు, ఆ జింక

ఆశ్చర్యకరమైన కొమ్ములను, బంగారువన్నె వెంట్రుకలను, రత్నకాంతుల కొమ్ములను, సూర్యకాంతితో నక్షత్రాల్లాంటి చుక్కలను చూసి సంతోషించాడు.

## లక్ష్మణుడికి సమాధానం చెప్పిన శ్రీరాముడు

సీతాదేవికోరినవిధంగామృగాన్నిపట్టుకోవాలనిభావించినశ్రీరామచంద్రమూర్తి సంతోషంగా లక్ష్మణుడితో అన్నాడిలా: " లక్ష్మణా! చూశావా! ఈ జింక మీద సీతకు ఎంత ఆశ కలిగిందో? ఆడవారి మాటలకు, కోరికలకు ఏముంది అంటావా? అది వేరే సంగతి. మనం కూడా ఇలాంటి సౌందర్యంకల జింకను చూశామా? మున్ముందు చూడగలమా? ప్రపంచమంతా మనం చూశామా? ఎక్కడేముందో ఎవరికి తెలుసు అంటావేమో? చూడకపోతే పోనివ్వు. ఈ లోకంలో కాకపోతే పోనీ. ఇంద్రుడి నందనవనంలో కుబేరుడి చైత్ర రథం వుందని ఎవరైనా చెప్పగా విన్నామా? లేదుకదా? దీని (జింక) కాంతి ఆకాశాన్ని తాకుతున్నది కదా? బంగారు వన్నెతో ప్రకాశించే చుక్కల సమూహంతో అందంగా వుందికదా? వెంట్రుకలు కొన్ని అనులోమంగా, కొన్ని ప్రతిలోమంగా వున్నాయి కదా? అది ఆవలిస్తే మేఘం నుండి వెలువడ్డ మెరుపు లాగా అగ్నిజ్వాల లాంటి నాలుక నోటి నుండి బయటకు వస్తున్నది".

"ఈ జింక ముఖం ఇంద్రనీల కాంతి లాగా, కడుపు శంఖం లాగా ముత్యంలా తెల్లగా, ఠీవి సౌందర్యంలో అతి గొప్పగా వుంది. ఇలాంటిది ఎవరి మనసు హరించదు? అనేకమైన రత్నకాంతులతో నిండి, బంగారు వన్నెతో కూడి, రూపం చూడగానే సీత మాట ఎలావున్నా, ఏ మనుష్యుడి మనస్సు కరగకుండా వుంటుంది? రాజులు మాంసంకొరకు వేటలో మృగాలను చంపుతారు. ధాతువులనే మణులను, బంగారాన్ని, ధనసమూహాన్ని, వేటలోనే సంపాదిస్తారు. రాజుకు సర్వం అడవిలోనే దొరుకుతుంది. ఈ మృగాన్ని చంపడం వల్ల ఏవిధంగా విశేషార్థ లాభం కలుగుతుంది అంటావా? బంగారుమయమైన ఈ శ్రేష్టమైన జింక చర్మం మీద సీతాదేవి నాతొ కలిసి కూర్చోవాలని ఆశపడుతున్నది. మృగజాతుల్లో భూమ్మీద ఈ జింక, ఆకాశంలో చంద్రుడిలోని జింక, రెండే మనోహరమైనవి కాని మిగతవన్నీ కావని నా అభిప్రాయం. ఇది మాయామృగం. జీవితంలో పట్టుబడదు. అందుకే దీన్ని చంపాలి".

## మాయ జింకను చంపాల్సిందేనని లక్ష్మణుడికి చెప్పిన రాముడు

శ్రీరాముడు లక్ష్మణుడితో ఇంకా ఇలా అన్నాడు. ”ఈ కారణాన పరాక్రమంతో దీన్ని చంపడమే తగిన పని. ఈ ప్రదేశంలోనే పూర్వం వాతాపి అనే రాక్షసుడు మునుల కడుపుల్లో ప్రవేశించి తేలులాగా వాళ్ల పొట్టలు పగుల చీల్చి హింసామార్గంలొ నడుస్తుండే వాడు. ఒకనాడు అగస్త్య ముని వాడిని తిన్నాడు. అతడి కడుపులోంచి లేవడానికి ప్రయత్నించే సమయంలో అగస్త్యుడు వాడు భయపడేట్లు, రాక్షసుడు బ్రాహ్మణులంటే లక్ష్యం లేకుండా దయాహీనుడై పాపం పనులు చేస్తున్నాడనీ, శాశ్వతంగా తన కడుపులో జీర్ణమై పొమ్మనీ అన్నాడు. ఆ విధంగా అగస్త్యుడు వాడిని చంపాడు. వీడూ ఆ వాతాపి అంతటి వాడే! అగస్త్యుడి వల్ల వాడు ఎలా చచ్చాడో, వీడు కూడా మనల్ని మోసగించడానికి వచ్చాడు కాబట్టి, వీడూ చావాల్సిన వాడే. నేను వేటకోసం పోతాను. నువ్వు ధృఢ ప్రయత్నంతో సీతకు అపాయం కలగకుండా కాపాడాలి. మన ప్రయత్నాలన్నీ ఈమె మీదే ఆధారపడి వున్నాయి. కాబట్టి శ్రద్ధగా రక్షించు. ఈ మృగం నువ్వు చెప్పినట్లు రాక్షసమాయ అయితే చంపుతాను. లేక సహజ మృగమే అయితే జాగ్రత్తగా పట్టి తెస్తాను. వీట్లో ఏదో ఒకటి చేస్తాను. లక్ష్మణా! సీతాదేవిని చూస్తుండు జాగ్రత్తగా. ఆ మృగం చర్మం మీద ఎంత మోహం పెట్టుకుని చూస్తున్నదో కదా!”

“కాబట్టి ఒక్క బాణంతో ఈ జింకను చంపి చర్మం తీసుకుని శీఘ్రంగా వస్తాను. ఒక బాణ ప్రయోగానికి ఎంత సేపు పట్టుందో, అంత సేపట్లోనే వస్తాను. నేను బాణం ప్రయోగించడమే ఆలశ్యం. నేను వచ్చేదాకా ఈ సీతను నువ్వు హెచ్చరిక తప్పకుండా ఏకాగ్రమనస్సుతో సర్వదా కాపాడు తమ్ముడా. పక్షిరాజైన జటాయువు కార్యసాధన సమర్థుడు. మంచి బలవంతుడు. కార్యాలోచన, కార్యదక్షత, ధైర్యం కలవాడు. ఆయన నీకు సహాయకుడుగా ఈ సీతాదేవిని ప్రతిక్షణం, ఏ మూల ఏం జరుగుతుందో అన్న ఏమరుపాటుతో, ఏమాత్రం పొరపాటు చేయకుండా ఒక వ్రతంగా భావించి రక్షిస్తాడు”.

(శ్రీరాముడి చర్య వలన గ్రహించాల్సిన నీటి వుంది. ఆయన భ్రమ పడడమే కాకుండా, లక్ష్మణుడు చెప్పినా వినలేదు. మారీచుడి మాయ అని నమ్మితే, ఉన్నచోటే వుండి బాణ ప్రయోగం చేయవచ్చుకదా? జింక వెంట పోవాల్సిన పని లేదు. కాకాసురుడి వెంట పడి పోలేదుకడా? కాబట్టి అది నిజమైన జింకే అన్న భ్రాంతి వదలలేదు. సీతాదేవి లోకమాన్య స్త్రీ అవుతుందా? ఆమెకు తెలియని

విషయాలు లేవు కదా? బంగారు జింక లోకంలో వుండదని తెలియదా? పరమ భక్తికల సీత ఎందుకు ఒక క్షుద్ర మృగానికై భర్తను వదిలి వుండాలని అనుకుంది? కాబట్టి కర్మానుసారం బుద్ధి అనే నీతి బలపడుతున్నది.

పరమార్థం విచారిస్తే....మనుష్యులకు కోరికలు కోరే స్వాతంత్ర్యం వుంది. దాన్ని నెరవేర్చే భారం భగవంతుడి మీద వుంది. ఎవరే కోరికలు గట్టిగా కోరినా భగవంతుడు దాన్ని నెరవేరుస్తాడు. కాని దాని ఫలం అనుభవించమని అంటాడు. కాబట్టి మంచి కోరికలు కోరేవారికి మంచి ఫలమే కలుగుతుంది. చెడు కోరికలు కోరేవారికి కలిగేది చెడు ఫలమే! ప్రకృతి విషయమైన కోరికలు కోరేవారందరికీ సీతాదేవికి పట్టిన గేటు పట్టుంది. మారీచుడి మాయే ప్రకృతి. ప్రపంచంలో మనం చూసేవి, వినేవి అన్నీ ప్రకృతి చిత్రాలే! సీతాదేవి మాయ జింకను చూసి భ్రమించి ఆశపడినట్లు మనం కూడా చిత్ర-విచిత్రమైన ప్రకృతి పదార్థాలను చూసి సత్యమని భ్రమ పడుతున్నాం. ఇవి సత్యం కావు. క్షణభంగురాలు. ఆ జింక వల్ల సీతాదేవి ఎలా సుఖపడాలని కోరుకుందో అలాగే మనం ప్రకృతి పదార్థాలవల్ల ఆనందపడాలని కోరతాం. రామచంద్రమూర్తి సీతాదేవి కోరిక నేరవేర్చినట్లే మనకోరికనూ నెరవేరుస్తాడు. సీతాదేవి అనుభవించిన ఫలం మనం కూడా అనుభవించబోతున్నాం. సీతకు ఏం ఫలం కలిగింది? అది ముమ్ముందు తెలుసుకుంటాం).

సర్గ-44

# మాయామృగం వెంట పోయిన శ్రీరాముడు

మూడువంకరల విల్లు, బంగారు పిడికల బాకు, అంబుల పొదులు రెండు ధరించి శ్రీరాముడు ఆ మృగాన్ని పట్టుకోవడానికి వెంటనే బయల్దేరాడు. చేతిలో ధనుస్సు ధరించి వస్తున్న రాముడిని చూసి తనను చంపడానికి వస్తున్నాడని నిర్ణయించుకున్న మాయామృగం పారిపోతే రావణుడు చంపుతాడని భయపడింది. కాసేపు దూరంగా, కాసేపు చెట్లగుంపులో దాక్కుంటూ రాముడికి కనిపించీ-కనిపించకుండా తిరగసాగింది. జింక దొరికిందికదా అని పట్టుకోవడానికి సిద్ధంకాగా, చెంగున నాలుగు కాళ్లతో ఎగిరి ఆవలవైపు దూకేది. కాసేపు దగ్గరికి, కాసేపు దూరంగా, కాసేపు పచ్చిక మేస్తూ, కాసేపు వినోదంగా తిరుగుతూ, కాసేపు రామచంద్రమూర్తికి కాంతులీనుతూ మెరుస్తూ కనిపించేది. శ్రీరాముడు విల్లు ఎక్కు పెట్టగానే, దానిమీదే దృష్టి వుంచి ఆయనకు చిక్కకుండా దూరంగా పరుగేత్తేది. భయపడుతున్నట్లు నటించి ఆకాశంలో గంతులు పెడ్తూ ఆడేది.

తనను చూసి భయపడిందని భావించిన శ్రీరాముడు విల్లు వెనుకవైపు వుంచుకుని దగ్గరగా పోతే, అది కూడా అంతే మెల్లగా ముందు-ముందు పోయేది. ఇది ఎలాగూ చిక్కదు....దీన్ని చంపుదామని విల్లుతీయగానే

బెదిరినదానిలాగా గుప్పించి ఎగిరేది. తనవెంట వచ్చే రామచంద్రుడిని చూడనట్లే పచ్చికల్లో ఆడేది. ఒక్కోసారి రాముడిని ఓర కంటితో చూసేది. కొంతసేపు చాటుగా పోయేది. ఇలా రామచంద్రుడిని ఆశ్రమానికి చాలా దూరంగా తీసుకుపోయింది. అలా చాలా దూరం పోయిన శ్రీరాముడు కోపంతో, బడలికతో ఒక చెట్టు నీడలో నిలుచున్నాడు. అప్పుడా జింక ఒక ఇరుకైన స్థలంలోకి పోయి రామచంద్రమూర్తికి కనిపించింది. చిక్కిందని రాముడు పట్టుకోపోతే, భయంతో విల-విలా తన్నుకుని పరుగెత్తింది. మళ్లీ అది చెట్ల గుంపుల్లో కనిపిస్తే రామచంద్రుడు కోపగించుకుని దీన్ని చంపాలని నిర్ణయించుకుని, సూర్యకాంతిగల బ్రహ్మాస్త్రాన్ని సంధించి, ఆ మృగ రూపంలో వున్న రాక్షసుడికి గురి చూసి కొట్టాడు.

**శ్రీరాముడి బాణానికి "హా! లక్ష్మణా!" అని అరచి చనిపోయిన మారీచుడు**

శ్రీరాముడు వేసిన బాణం జింక రూపంలో వున్న రాక్షసుడి శరీరంలో దూరి, ఆయన గుండెను చీల్చగా, ఆ రాక్షసుడు ఆ దెబ్బకు తాటిచెట్టు పొడవుగా భయంకరమైన ధ్వనితో ఎగిరి పడ్డాడు. అప్పుడు తన మాయా శరీరం వదలిన మారీచుడు ఏం చేస్తే సీత లక్ష్మణుడిని దూరంగా పంపుతుందనీ, రావణుడు ఎలా సీతను అపహరించగలడనీ, ఆలోచించాడు. రాముడి గొంతును అనుకరిస్తూ "హా! సీతా! హా! లక్ష్మణా!" అని అరిచి జింక రూపం వదలి నిజరూపం దాల్చి భూమ్మీద పడి ప్రాణాలను విడిచాడు. అలా పడిపోయిన రాక్షసుడిని చూసిన రాముడికి లక్ష్మణుడి మాటలు స్మరణకొచ్చాయి. సీత మీద మనస్సు పోయింది. లక్ష్మణుడు చెప్పినట్లు ఇది మారీచుడి మాయేనని నిశ్చయించాడు. తన బాణంతో చచ్చినవాడు మారీచుడే అని అనుకున్నాడు. తన గొంతుతో "హా! సీతా! హా! లక్ష్మణా!" అని అరచినది విని సీతాలక్ష్మణులు ఏమని అనుకున్నారో అని ఆలోచిస్తూ, భయంతో, దేహమంతా గగ్గురుమనగా శీఘ్రంగా ఆశ్రమానికి బయల్దేరాడు.

సర్గ–45

# లక్ష్మణుడిని రాముడికి సహాయంగా పొమ్మన్న సీత

ఆశ్రమంలో వున్న సీత తన భర్త గొంతుతో "హా! సీతా! హా! లక్ష్మణా!" అని దుఃఖంతో వినిపించగా లక్ష్మణుడిని చూసి, "అయ్యో లక్ష్మణా! ఇదేం విపరీతం? రామచంద్రుడిని చూడడానికి త్వరగా పరుగెత్తు. ఆ ధ్వని వినగానే గుండెలు ఝల్లుమంటున్నాయి. ప్రాణం చలిస్తున్నది. రామచంద్రమూర్తి ఒంటరిగా వున్నాడు. ఎక్కడ ఎవరి చేతులకు చిక్కాడో, లేక, మరేమైనా ఆపద కలిగిందో? నేనేమి చేయాలి? లక్ష్మణా! మీ అన్న అరుస్తున్నాడు. త్వరగా ఆయనను కాపాడడానికి పోవయ్యా. నా తమ్ముడు చాలా పరాక్రమవంతుడు, నాకు సహాయపడతాడు, అని ఎంతా ఆశ పెట్టుకున్నాడో? రాక్షసులు, సింహాల గుంపులు చుట్టుకుంటే వుండే కోడిలాగా ఎంత దుఃఖపడుతున్నాడో?" అని అనింది. లక్ష్మణుడు సీతను కాపాడమని తనకు అన్న చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకుని సీత చెప్పినట్లు పోకుండా అక్కడే నిలిచి వున్నాడు. అది చూసి సీత లక్ష్మణుడితో కోపంగా మాట్లాడింది.

(పద్నాలుగువేల మంది యోధులను ఒక్కడే తన కళ్ళ ఎదుటే చంపగా చూసినప్పటికీ, ఆయనకు ఏదో ఆపద కలిగిందని అనుకోవడం కర్మబలిష్టమే! స్త్రీలకు సంతోషం వచ్చినా, దేహం తెలవదు....శోకం కలిగినా దేహం తెలవదు.

ఉన్న తెలివి ఊడిపోతుంది).

## లక్ష్మణుడితో కోపంగా మాట్లాడిన సీత

తన మాట ప్రకారం అన్నాను కాపాడడానికి వెళ్ళకుండా నిల్చున్న లక్ష్మణుడితో సీత పరుషంగా మాట్లాడింది. ఇలా. "సుమిత్రపుత్రా! మీ అన్నకు కష్టం కలిగిన ఈ సమయంలో కొంచెమైనా సహాయం చేద్దామని నువ్వు అనుకోవడం లేదు. ఆ కారణాన నిన్ను స్నేహితుడి వేషం వేసుకుని తిరుగుతున్న గొప్ప శత్రువు అని భావిస్తాను. దుష్టకామం కలవాడా! ఓరీ వంచకుడా! నీకు రామచంద్రమూర్తి ఏం చెడు చేశాడు? లక్ష్మణా! నీ వ్యవహారం, నీ ఆలోచన తెలుసుకున్నాను. పాపపు మనస్సు కలవాడా! ఆయన ఆర్తధ్వని స్పష్టంగా విన్నా, నామీద వున్న మోహంతో నన్ను చేపట్టాలని అక్కడికి పోవడానికి ఒక్క అడుగైనా వేయడం లేదు. స్థిరంగా నిల్చున్నావు. అన్నకు ఆపద కలిగినప్పుడు మంచివాడైతే పోకుండా ఇలా నిల్చుంటాడా?"

"అన్నకు కీడుకలగడం నీకు ఇష్టం కాబట్టి ఇంకా నిల్చునే వున్నావు. నీకు అన్న మీద స్నేహం సున్నా. ఇది నిజం. నువ్వు అడవులకు వచ్చిన ఉద్దేశం ఏంటి? నీ తల్లి నీకేం చెప్పింది? ముఖ్యంగా రామచంద్రుడి సేవకే కదా వచ్చావు? రాముడిని సేవించమని కదా నీ తల్లి నీకు చెప్పింది. అలాంటప్పుడు నీ విషయంలో ఏ పాపం ఎంచని రామచంద్రుడికి ప్రాణాపాయం వస్తే అక్కడికి పోకుండా నన్ను రక్షిస్తానని అంటావేమిటి? ఇంత చెప్పినా లక్ష్యం లేకుండా మనస్సులో కొంచెమైనా భయపడవేంటి? రాముడిని రక్షిస్తే నా ప్రాణాలు రక్షించినట్లు అవుతుంది కాని రాముడు లేకుండా నువ్వు నా ప్రాణాలు కాపాడినా దానికి విలువ వుందా?"

సీత ఇలా భయపడుతూ, కన్నీళ్లు కారుతుంటే మాట్లాడడం చూసిన లక్ష్మణుడు ఆమెకు జవాబు చెప్పాడు.

## సీతకు సమాధానం చెప్పిన లక్ష్మణుడు

సీతాదేవి తనను నిష్టూరాలు ఆడుతూ అంటున్న మాటలకు లక్ష్మణుడు జవాబు చెప్పాడు ఇలా. "వదినా! ఎందుకమ్మా ఇంతగా భయపడి దుఃఖపడతావు? నీ భర్తను యుద్ధంలో దేవతలు, మనుష్యులు, యక్షులు, సర్పాల రాక్షసులు,

పిశాచాల నాయకులు, లేదా ఇంకెవరైనా నిలిచి పోరాడగలరా? వాళ్లకూ బతకాలని ఆశ వుండదా? ఎవరికైనా ప్రాణాలు చేదా? ఏది తీపి అంటే, ప్రాణాలే తీపి అనే సామెత లేదా? నీ నోట వచ్చిన మాటలు నువ్వు అనతగ్గవి కాదు. రామచంద్రమూర్తి ఎవరి చేతిలోనూ చావడు. ఒంటరిగా నిన్ను విడిచి పోవడానికి నేను ఒక్క అడుగైనా వేయడం ఎలా సాధ్యం? ముల్లోకాలు ఒక్కటై వచ్చి దండెత్తినా, ఇంద్రుడు దేవతలు కలిసి వచ్చినా, ధీరుడై చలించక యుద్ధంలో నిలిచి రామచంద్రుడు తన బాణాలతో అందర్నీ చంపుతాడు. అందర్నీ నాశనం చేస్తాడు. అమ్మా! నామాట నమ్ము. మనస్సు నిబ్బరించుకో. నీ భర్త శీఘ్రంగా మృగాన్ని చంపి సుఖంగా ఏ కీడూ లేకుండా, ఇక్కడికి వస్తాడు. ఎందుకు కలత చెందుతావు?"

"మనం విన్నది రామచంద్రమూర్తి గొంతు కాదు. ఏ మాయలమారో అలా గొంతు మార్చి అరిచాడు. ఆ మారీచ రాక్షసుడే అలా స్వరం ఇంద్రజాలంలా అనుకరించాడు. నన్ను పో–పొమ్మంటున్నావు...నేనెలా పోతానమ్మా? నిన్ను నా రక్షణలో వుంచికదా రామచంద్రమూర్తి పోయాడు? ఆయన వచ్చి అడిగితె నేనేమని సమాధానం చెప్పాలి? రామచంద్రమూర్తి వచ్చి ఇదేనా నిన్ను చేయమంది అని అడిగితే ఏమనాలి? ఆయన ఆజ్ఞ ఉల్లంఘించి, ఆయన మాట వ్యర్థం చేసి, నేనెలా పోతాను? నేను పోతే నీ గతి ఏంటి? నీకేం అపాయం వస్తుందంటావా? ఖరుడు చనిపోయినప్పటి నుండి రాక్షసులందరూ మన మీద పగపట్టి వున్నారు. ఏ విధంగానైనా మనల్ని చంపాలని కుట్రలు పన్నుతున్నారు. వాళ్లే మనల్ని వేరుచేయడానికి ఇలాంతో మోసపూరిత ధ్వనులు చేస్తున్నారు. ఇది ఆలోచించకుండా నువ్వెందుకు దుఃఖపడతావు?"

## లక్ష్మణుడిని నిష్టూరాలు ఆడిన సీత

లక్ష్మణుడు ఇలా అనగానే సీత కోపంతో, కళ్లెర్రచేసి, నిజం చెప్తున్న ఆయన్ను చాలా కఠినంగా నిందించింది. "ఓరీ! మనుష్యుడైన వాడికి పరాయివారి పట్ల వుండాల్సిన దయ కూడా నీ అన్న మీద లేదు నీకు. వినరా! దయ లేకపోతే పోనీ... చస్తే చస్తాడులే...అనే క్రూరత్వం కూడా వుంది. దీనర్థం....నువ్వు ఆర్యజాతిలో పుట్టాల్సిన వాడివి కాదు. ఎందుకంటే...ఆర్యులకు వుండాల్సిన దయాగుణాలు నీలో లేకపోవడమే కాకుండా క్రూరత్వం, మోసం కూడా నీలో వున్నాయి. నువ్వేం వంచన చేశావంటావా? అన్నకు సేవ చేస్తానని చెప్పి, నమ్మించి, అడవుల్లోకి

వచ్చి, ఆపదవేళ ఆదుకోవకపోవడం వంచన కాదా? ఇలాంటి గొప్ప వంశానికి అపకీర్తి తెచ్చి దాని గౌరవం నాశనం చేయడానికి ఎలా పుట్టావురా? దుర్మార్గుడు చస్తే చస్తాడు అనడానికి, రామచంద్రమూర్తి అలాంటివాడు కాదుకదా? సద్గుణాలలో గొప్పవాడు కదా? అలాంటివాడికి కీడు చేయడం నీకిష్టమైనప్పుడు నువ్వు ఎలాంటివాడివనాలి? నువ్వు నిజంగా రామచంద్రమూర్తి కీడు కోరేవాడివే. లేకపోతే, కీడు కలగడం చూసి, ఆర్తనాదం వినీ, దుష్టుడా! దీరుడవైనా కూడా, కొంచెమైనా సంకోచించక, పాపం అని అనుకోక, నేను పోను అని అనవచ్చా?" అని అంటుంది సీత.

సీత ఇంకా ఇలా అంటుంది లక్ష్మణుడితో. "నీ నడవడిలో వింత లేదు. లోకంలో జ్ఞాతులు మారువేషాలు వేసుకుని దయలేకుండా ఎప్పుడూ నీలాగే కీడుచేయడానికి భయపడరు. లక్ష్మణా! నువ్వు నిజంగా అన్నకు సహాయం చేయాలనే మంచి అభిప్రాయంతో అడవికి వచ్చావా? లేదు...చెడ్డ అభిప్రాయంతో వచ్చావు. ఏమిటి నీ చెడ్డ తలంపు అంటావా? చెప్తా విను. భరతుడు, నువ్వు రామచంద్రమూర్తికి సవతి తల్లి కొడుకులు. ఒక సవతి తల్లి కొడుకు రాజ్యం అపహరిస్తే, నువ్వు నన్ను అపహరించాలని అనుకుని ఇక్కడికి వచ్చి వుంటావు. లేదా, రాజ్యం అపహరించినట్లే భార్యను కూడా అపహరిస్తాను, నువ్వు సహాయం చేయమని భరతుడు పంపితే వచ్చి వుంటావు. రాముడికి సహాయం చేయడానికి అడవికి వచ్చావా? లేక, ఆయన్ను చంపే శక్తిలేనందువల్ల ఎప్పుడు చస్తాడా అని కాచుకుని వున్నావా?"

"ఇది నీ ఆలోచన అయినా, భరతుడి ఆలోచన అయినా, ఇది జరిగేది కాదు. ఎందుకంటావా? ఆ పుండరీకాక్షుడి భార్యనైన నేను మరొకరిని కలలోనైనా స్వీకరిస్తానా? రామచంద్రుడే లేకుంటే ఈ దేహంలో ప్రాణాలుంటాయా? వుండనిస్తానా? నువ్వు చూస్తుండగానే నీ కళ్ళ ఎదుటే ఈ నిమిషంలోనే ప్రాణాలు విడుస్తాను. చూస్తుండు".

(సీతాదేవి సాక్షాత్తు లక్ష్మీదేవి. ఆమెలాంటి ఉత్తమురాలు ఏ లోకంలోనూ లేదు. అలాంటిది లక్ష్మణుడి తత్వం తెల్సి కూడా ఇలా మాట్లాడవచ్చా? స్త్రీ ఎప్పుడైనా స్త్రీనే. స్త్రీ స్వభావం బొత్తిగా లేని స్త్రీ వుండదు. వారికి కోపం వస్తే, అనరాని మాటలు, చేయరాని పనులు వుండవు. ఇక లక్ష్మణుడు నిష్కారణంగా భరతుడిని అనరాని మాటలన్నందుకు ఇది పర్యవసానం. నిష్కారణంగా సీతతో పడరాని మాటలు పడ్డాడు. అన్నదమ్ములను ఇద్దరినీ సీత తిట్టడం వల్ల ఆమె

కూడా ఇలాంటి నిందలతో యావజ్జీవితం గడపాల్సి వచ్చింది.

ఇక అవతారం విషయం ఆలోచిస్తే వాస్తవం తెలుసుకోవచ్చు. సీత పుట్టింది లంకను చెరచడానికే. సమూలంగా రావణుడిని చంపడానికే ఆమె పుట్టింది. వేదవతి లాగే అన్నది కదా? ఆ కార్యాన్ని సీత చేయాల్సి వుంది. దానికొరకై లంకకు వెళ్ళాలి. రామలక్ష్మణులు తన దగ్గర వుంటే, రావణుడు రాలేడు. కాబట్టి మాయా మృగం నెపంతో రాముడిని మంచిమాటలు చెప్పి దూరంగా పంపింది. లక్ష్మణుడు అలా పోయేవాడు కాదు. రామాజ్ఞను కూడా ఉల్లంఘించి పోయేంత పని చేస్తేనే కాని ఆయన పోడు. ఇట్లా నిందలు వేస్తేనే ఆయన పోతాడు. ఇలా కార్యసాధన మార్గం ఆలోచించి, పంపడానికి సిద్ధమైంది కాని జ్ఞాన హీనగా, దుష్టురాలిగా మాట్లాడ లేదు)

## సీత మీద కోపంతో రాముడి దగ్గరకు పోయిన లక్ష్మణుడు

వినడానికి కూడా యోగ్యంకాని మాటలను జానకి లాంటిది పలకగా, జితేంద్రియుడైన లక్ష్మణుడు శరీరం గగ్గురపడగా, రెండు చేతులు జోడించి సీతవైపు తిరిగి, ఆమెకు బదులు చెప్పడానికి తన మనస్సు అంగీకరించడం లేదంటాడు. ఇంకా ఇలా అంటాడు. "నువ్వు నాపాలిట దేవతవని నా అభిప్రాయం. యోగ్యా-యోగ్య విచారం చేయకుండా నోటికి వచ్చినట్లు కఠినంగా మాట్లాడడం స్త్రీలకు కొత్త కాదు. చెడు విషయంలోనూ, మంచి విషయంలోనూ వారి ఇష్టప్రకారం నడచుకోకపోతే పురుషులను నోటికి వచ్చినట్లు తిట్టారు. స్త్రీలకందరికీ లోకంలో ఇలా పరుషంగా అనుచిత భాషణం చేయడం స్వభావంగా వచ్చింది. స్త్రీలు ధర్మజ్ఞానం లేనివారు. చపలచిత్తులు. ఎంత క్రూరకార్యం చేయడానికైనా వెనుదీయరు. దయాదాక్షిణ్యాలు లేవు. అన్నదమ్ములు, తండ్రిబిడ్డలు, ఒకరితో ఒకరు కలిసి వుండకుండా కొంపలు విడదీయగల నేర్పరులు. మదించినదానా! నీమాటలు కొర్రు కాల్చి గుచ్చినట్లు అయింది".

"న్యాయం చెప్పేవాడినైన నేను న్యాయం పలుకుతుంటే, నీ దుష్టవాక్యాలను ఈ వనదేవతలందరూ వివరంగా సాక్షులై విందురుగాక. ఛీ! సహజంగా స్త్రీత్వమే పాపాత్మకం. కోపస్వభావంగలదానా! పెద్దవాడు తండ్రితో సమానమైన అన్న ఆజ్ఞ పాలిస్తున్న నన్ను ఈ విధంగా సందేహించినందున నువ్వు ఇప్పుడే పాడైపో. అబలా! ఇప్పుడే పోతాను రాముడున్న దగ్గరికి. ఇప్పుడు నీకు స్వస్తి కలుగుకాక.

వనదేవాతలు రక్షించెదరుగాక. నాకు చెడు సూచించే అపశకునాలు కనిపిస్తున్నాయి. రామచంద్రుడితో తిరిగి వచ్చిన తరువాత నిన్ను చూడగలనో? లేదో?"

ఇలా ఎప్పుడైతే లక్ష్మణుడు అన్నాడో, జానకి కన్నీళ్లు కారుస్తూ, ఏడుస్తూ, కర్ణశూలాల లాంటి మాటలన్నది. "నేను విషం తిని చస్తాను. గోదావరిలో దూకుతాను. ఉరిపోసుకుంటాను. మంటల్లో పడి చస్తాను. ఇతరులను కాలి వేలితోనైనా తాకుతానా?" అని అంటూ గట్టిగా ఏడుస్తూ, రెండు చేతులతో దబ–దబా అని కడుపుమీద కొట్టుకుంది. లక్ష్మణుడు ఓదార్చినా వినలేదు, ఆగలేదు. ఆ తరువాత లక్ష్మణుడు ఇంకా ఇక్కడే వుంటే ఏమవుతుందోనని భయపడి, సీతకు నమస్కారం చేసి, రుజుత్వమే మేలని భావించి, రాముడి దగ్గరకు పోయాడు.

## సర్గ-46

# యతివేషం ధరించి సీతవద్దకు వచ్చిన రావణుడు

లక్ష్మణుడు అలా వెళ్లిపోగానే అవకాశం దొరికిందని రావణుడు సీతను చేరదల్చుకున్నాడు. సన్న్యాసి వేషం వేసుకుని, సన్న కాషాయ వస్త్రం కట్టుకుని, ఎడమ భుజం మీద త్రిదండం పట్టుకుని, చేత కమండలం వుంచుకుని, గొడుగు పట్టుకుని, శిఖ కలిగి, పావుకోళ్లు తొడుక్కుని, అన్నదమ్ములిద్దరూ లేకపోవడంతో సీతదగ్గరకు పోయాడు రావణుడు. వాడికి భయపడి చెట్ల ఆకులూ కదలలేదు. గాలి ఆగిపోయింది. వేగంగా పారే గోదావరినది వాడి భయంతో మెల్లమెల్లగా నడిచింది. దుష్టుడైన రావణుడు మగడు సమీపంలో లేడని వ్యధపడుతున్న సీతను సమీపించబోయాడు. ఆవేశించిన కామంతో, మోసబుద్ధితో, వేదఘోష చేస్తూ, సీతదగ్గరకు పోయి సవినయంగా ఆమెతో ఇలా అన్నాడు.

"మనోహరమైన దానా! పచ్చని వస్త్రం ధరించిన దానా! అందమైన బంగారు వన్నె కలదానా! చంద్రుడి లాంటి ముఖంకలదానా! కమలంతో కలసిన తామరతీగె లాగా ఉన్నదానా! సుందరీ! నువ్వెవరు? నువ్వు భూదేవతవా? కీర్తివా? లక్ష్మీదేవివా? స్వతంత్రించి తిరిగే రతీదేవివా? దేవతాస్త్రీవా? ఆడ ఏనుగు లాంటి నడకగల దానా! నా మనస్సు హరిస్తున్నావు. నువ్వెవరివి? వాస్తవం చెప్పు. మల్లె మొగ్గల్లాంటి దంతాలు కలదానా! నీ దంతాలు నిర్మలంగా, నున్నగా,

సమంగా, మొగ్గల్లాంటి కొనలతో వున్నాయి. వెడల్పాటి కళ్ళదానా! నీ కళ్ళు చివర్లో ఎర్రగా, నిర్మలంగా, దీర్ఘంగా నల్లని గుడ్లు కలిగి వున్నాయి. నీ మొల అందంగా బలిసి విశాలంగా వుంది. నీ తొడలు ఏనుగు తొండాలలాగా వున్నాయి. అబలా! నీ స్తనాలు వుబ్బి గుండ్రంగా ఎత్తుపల్లాలు లేకుండా, ఒకే విధంగా ఒకదానిని మరొకటి రాసుకుంటూ తాటిపళ్ళలాగా మనోహరంగా బలిసి వున్నాయి. చూసేవారి హృదయాలను హరిస్తున్నాయి''.

“అందమైన చిరునవ్వు, అందమైన దంతాలు, అందమైన కళ్ళు, అందమైన వెంట్రుకలదానా! శృంగార చేష్టలకు సముద్రమైన దానా! పిడికిట పట్టే నడుం కలదానా! హృదయానికి ఇంపైనదానా! ఒకదానికొకటి రాసుకునే తొడలదానా! కఠినమైన కుచాలుకలదానా! ఏటి ప్రవాహం అడ్డం లేకుండా తీరాన్ని కోసి లోపలికి తీసుకున్నట్లు కమలాల లాంటి కళ్ళుకల చిన్నదానా! నీ చూపులతో నా మనస్సును కరిగించి హరించావుకదా? నేను దేవతా స్త్రీలను, యక్షస్త్రీలను, కిన్నర స్త్రీలను, కన్నులకు సంతోషం కలిగించే ఎందరినో చూశాను కాని, సౌందర్య సంపదలో నీలాంటి దాన్ని భూలోకంలో చూడలేదు. సుందరీ! నీ వయస్సు, నీ సౌకుమార్యం, నీ చక్కదనం, ఆలోచించగా నువ్వు వంటరిదానివై ఈ అడవిలో వుండడం నాకు వెర్రి కలిగిస్తున్నది. లతాంగీ! నువ్వు ఇంటికి పో. భయంకరమైన రాక్షసులు ఇక్కడ తిరుగుతుంటారు. కాబట్టి నువ్వు ఇక్కడ వంటరిగా వుండకూడదు. నీకు తగినవిధంగా త్వరగా పోయి బంగారుమేడలను, ఉద్యానవనాలను అలంకరించడానికి పో. నువ్వు అక్కడ వుండడమే వాటికి అలంకారం''.

“కమలాల లాంటి కళ్ళదానా! శ్రేష్టమైన పూదండలు, శ్రేష్టమైన భోజనం, శ్రేష్టమైన వస్త్రం, శ్రేష్టుడైన మగడు నీకు కావాలి. ఇది నా అభిప్రాయం. అల్పుడు, సామాన్య పురుషుడు నీకు తగిన మగడు కాదు. మనుష్య స్త్రీలలో ఇలాంటి అందగత్తె లేదు. కాబట్టి నువ్వు దేవకాంతవని నమ్ముతున్నాను. అలా అయితే వాళ్లలో నువ్వెవరివి? ఏకాదశ రుద్రులకు సంబంధించిన దానివా? నిజంగా మరుత్తులకు చెందినదానివా? ప్రేమతో చెప్పు. దేవతా స్త్రీలు, కిన్నర స్త్రీలు ఇది రాక్షస భూమి కాబట్టి ఇక్కడికి రారు. నువ్వెక్కడిదానివి? వంటరిగా ఇక్కడ ఎందుకున్నావు? చెప్పు''.

“నీలాంటి సుందరి మనుష్యులలో లేరు. కాబట్టి నువ్వు మనుష్య స్త్రీవి కాదు. దేవతా స్త్రీవే అయ్యుండాలి. ఇది రాక్షస భూమికాబట్టి దేవతా స్త్రీలు, కిన్నర స్త్రీలు

ఇక్కడికి రారు. అయినా నువ్వు వచ్చావు. రాక్షసులకు ఇష్ట దేవత రుద్రుడు కాబట్టి ఆ రుద్రులకు సంబంధించిన దానివా? లేక, వాయువు ఇక్కడ తిరుగుతుంటాడు కాబట్టి వాయువులకు చెందిన దానివా? నిజం చెప్పు. ఇక్కడ పులులు, సింహాలు, కోతులు, చిరుతపులులు, ఎలుగులు, పెద్దగద్దలు, విస్తారంగా ఇక్కడ తిరుగుతున్నాయే? నువ్వెలా భయం లేకుండా ఇక్కడ వున్నావు? మదిరాక్షీ! నీ భర్త ఎవడు? నీ కులం ఏది? నీ జాతి ఏది? వయసుదానివి కదా, ఇక్కడ ఎందుకు వున్నావు? ఇది రాక్షసుల గుంపులు తిరిగే స్థలం" అని రావణుడు అడిగాడు. బ్రాహ్మణ సన్న్యాసి వేషం వేసుకున్న వాడిని సీతాదేవి శీఘ్రంగా, యతులను పూజించే విధంగా పూజచేసి సత్కరించింది.

## యతివేషంలో వున్న రావణుడిని సత్కరించిన సీత

బిక్షాపాత్ర, కమండలాలు ధరించి, బ్రాహ్మణ సన్న్యాసి వేషంలో వున్న రాక్షసుడిని, తనకు కీడుచేసే ఆలోచనలో వున్నవాడిని, విరోధించినా తాను గెలవలేనివాడిని, రాక్షసుడని తెలిసీ, బ్రాహ్మణుడిని పూజించిన విధంగానే ఆయననూ పూజించింది సీతాదేవి. "ఇదిగో దర్భాసనం..ఇక్కడ కూర్చో. ఇదిగో అర్ఘ్యం...ఇదిగో పాద్యం... సర్వం సిద్ధం. ఇదిగో నీ ఆహారం కొరకు అడవిలోని పండ్లు....తృప్తిగా భుజించు" అని శాస్త్ర ప్రకారం చెప్తున్న సీతను, రాముడి భార్యను, భూపుత్రిని, తన చావుకోరకు రావణుడు బలాత్కారంగా అపహరించాలనుకున్నాడు. అడవిలో మాయా మృగాన్ని వేటాడడానికి పోయిన రామచంద్రుడు లక్ష్మణుడితో కలిసి వస్తాడేమోనని అడవివైపు నాలుగు దిక్కులా చూశాడు కాని వాళ్ళు కనపడలేదు. యథాప్రకారం అడవి చెట్లు మాత్రం కనబడ్డాయి. అది చూసి సీత మనస్సు భయంతో కలవరపడింది.

(సీతారామలక్ష్మణులు వున్న పర్ణశాలకు ఉత్తరాన పర్వతాలు, తూర్పున గోదావరి నది వుంది. దక్షిణాన, పడమర అడవి వుంది. మారీచుడు రామచంద్రమూర్తిని పడమటగానే తీసుకుపోయాడు. రావణాసురుడు పోవాల్సింది దక్షిణ మార్గాన కాబట్టి ఆ తోవలో రామచంద్రమూర్తి వుండకూడదు కదా?)

సర్గ-47

# మాయా యతికి తన వృత్తాంతం చెప్పిన సీతాదేవి

తనను బలాత్కారంగా తీసుకుపోదలచి రావణుడు ఆ విధంగానే ప్రశ్నించాడని సీత భావించింది. అయినా, అతిథులను, అభ్యాగతులను ఆదరించాల్సిన విధానం చక్కగా తెలిసిన సీత, ఇంగిత జ్ఞానం వున్నది కాబట్టి, రావణుడి మాటలు, వాడి ఆర్భాటం విని-చూసి, వీడు నిజమైన సన్యాసి కాదనుకుంటుంది. ఉదర నిమిత్తం సన్యాసి వేషం ధరించిన బ్రాహ్మణుడు అనుకుని, అతిథితో అబద్ధం ఆడకూడదని, బ్రాహ్మణుడితో అసత్యం ఆడరాదని, అతిథి బ్రాహ్మణుడైతే అసలే అసత్యం ఆడకూడదని అనుకుంటుంది. వీడు దొంగ సన్యాసి కాబట్టి వంచకులకు వంచనతో సమాధానం చెప్పాలి అనీ, అలా చెప్పడం దోషం కాదనీ, అల్ప కాలం ఆలోచన చేసి వాడికిలా చెప్పడం ప్రారంభించింది.

"మిథిలా రాజు, మహాత్ముడు, జనకరాజు కూతుర్ని. నా పేరు సీత అంటారు. నీకు మేలు కలగాలి. నేను శ్రీరాముడి భార్యను సుమా! సర్వ విధాల భోగోపకరణాలు కలదాన్ని. మనుష్య సుఖాలతో పన్నెండు సంవత్సరాలు మామగారి ఇంట్లో నా భర్తతో కూడి, ఎలాంటి కొరతలేకుండా గడిపాను. ఆ తరువాత మా మామగారు శ్రీరాముడికి పట్టాభిషేకం చేయాలని పదమూడో సంవత్సరంలో ఆలోచన చేశాడు. దానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేశాడు.

అప్పుడాయన ప్రియమైన భార్య కైక, నా భర్త దేశాన్ని వదిలి పోవాలని, తన కొడుకు రాజ్యానికి పట్టాభిషిక్తుడు కావాలని, రెండు వరాలు తన భర్తను కోరింది. తన మాట అంగీకరించకపోతే ప్రాణాలు విడుస్తానని బెదిరించింది. నా మామగారు ఆమెను ఎంత ప్రార్థించినా ఆయన విన్నపం చెవిన పెట్టలేదు. ఆ పట్టాభిషేక విఘ్నకాలానికి నా భర్తకు ఇరవై అయిదు సంవత్సరాల వయసు. నాకు పద్దెనిమిదేళ్ల వయసు. ఇంత లేత వయసువారు అడవుల్లో ఎలా తిరగ గలరో కూడా మా అత్త కైకేయి ఆలోచించలేదు".

(రామచంద్రమూర్తి విశ్వామిత్రుడితో అరణ్యానికి పోయేటప్పుడు ఆయన వయసు పన్నెండేళ్ళు. ఆ సంవత్సరమే సీతా వివాహం. తరువాత పన్నెండేళ్ళు అయోధ్యలో సుఖంగా వున్నాడు. ఆ తరువాత సంవత్సరం పట్టాభిషేక ప్రయత్నం కాబట్టి అప్పటికి రాముడికి పాతిక సంవత్సరాలు. అరణ్యావాసం ఆరంభమైన తరువాత ఋశ్యాశ్రమాలలో పదేళ్లు గడిపాడు. పంచవటిలో మూడేళ్లు వున్నాడు. వనవాసారంభం మొదలు పెట్టి ఇప్పటికి పద్నాలుగవ సంవత్సరం కాబట్టి, సీతాపహరణ సమయానికి శ్రీరాముడికి ముప్పై ఎనిమిదవ ఏడు. సీత జనకుడికి దొరికింది మొదలు ఆరు సంవత్సరాలు మిథిలలో వుంది. వివాహం తరువాత అయోధ్యలో పన్నెండేళ్ళు వుంది. పదమూడో సంవత్సరం అరణ్యాలకు ప్రయాణం కాగా, వనవాసానికి బయల్దేరి అప్పటికి సీతాదేవికి పద్దెనిమిది సంవత్సరాలు గడిచాయి. కాబట్టి, ఇప్పటికి సీతకు, ముప్పై ఒక్క ఏళ్లు గడిచాయి. ఇది ముప్పై రెండో ఏడు".

సీత రావణుడికి ఇంకా ఇలా చెప్పింది. "లోకంలో రాముడు, రాముడు, రాముడు అని స్మరిచని వాళ్లుండరు. అంత గొప్ప ఆయనకెలా కలిగిందంటావా? ఆయన అసత్యం చెప్పడు. సద్గుణాల రాశి. తప్పుపట్టడానికి ఒక్క దోషమైనా దొరకదు. స్త్రీల విషంయంలో కానీ, ధన విషయంలో కానీ, నిష్కల్మషమైన హృదయం కలవాడు. సర్వ భూతాలకు మేలుచేసే గుణాలుకలవాడు. ఈ గుణాలన్నీ ఈయనలో కలవని చాటిచెప్పే విధంగా ఆయనకు కమలాల లాంటి పెద్ద కళ్ళు, మోకాలినంటే చేతులు కలవాడు. కళ్ళు, చేతులు చూడగానే ఈయన మహానుభావుడనే భావన కలుగుతుంది. ఇలాంటి నా భర్తకు తన భార్య ముద్దు తీర్చడానికి దశరథ మహారాజు పట్టాభిషేకం చేయలేదు. తండ్రి దగ్గరున్న రాముడితో, ఆయన ఆజ్ఞప్రకారం రాజ్యాన్ని భరతుడికి ఇచ్చి, పద్నాలుగేళ్లు అరణ్యాలకు పొమ్మని, తండ్రిని సత్యవాదిని చేయమని కైక చెప్తుంది. తండ్రిని

సత్యవచనుడిని చేయడానికి, దేనికీ భయపడని రాముడు, అరణ్యాలకు వచ్చాడు".

"నా భర్త సవతి తమ్ముడు, శూరుడు, లక్ష్మణుడు అన్నకు సహాయంగా విల్లు-బాణాలు ధరించి మాతో అడవులకు వచ్చాడు. కైక కారణాన రాజ్యాన్ని పోగొట్టుకుని మేం ముగ్గురం అడవుల్లో తిరుగుతున్నాం. కొంచెం సేపు నువ్వు ఇక్కడ వుంటే నా భర్త వస్తాడు. నీకు వనఫలాలు ఇస్తాడు. బ్రాహ్మణుడా! నీ పేరేంటి? నీ గోత్రం ఏమిటి? నువ్వే కులం వాడివి? ఏ జాతివాడివి? వివరంగా చెప్పు. ఎక్కడైనా ఆశ్రమంలో వుండకుండా ఈ అరణ్యాలలో ఎందుకు తిరుగుతున్నావు?"

సీతాదేవి ప్రశ్నలకు క్రూరపు నడవడికల ఆ రాక్షసుడు తన చరిత్ర చెప్తా వినమని అంటూ, పరుషంగా మాట్లాడాడు.

## సీతకు తన వృత్తాంతం చెప్పి దుర్భాషలాడిన రావణుడు

తన భర్త జగత్తులో గొప్పవాడని, మనుష్యులలో ప్రసిద్ధుడని సీతాదేవి చెప్పిన మాటలకు, తన పేరు వింటే దేవతలు, దైత్యులు కూడ గడ-గడలాడుతారని తన ప్రతిష్టను చెప్పుకున్నాడు రావణుడు సీతతో ఇలా. "ఎవని పేరు చెప్తే మనుష్యులు మాత్రమే కాకుండా దేవతలు, దైత్యులు కూడా గడ-గడలాడుతారో, అలాంటివాడిని, రాక్షసుల నాయకుడిని, నా పేరు రావణాసురుడు. నీకు మేలు కలుగుగాక. నిన్ను చూసింది మొదలు నా భార్యలమీద ప్రేమ కలగడం లేదు. నాకు స్త్రీల కరవు లేదు. ఉత్తమ స్త్రీలనెందరినో బలాత్కారంగా తెచ్చాను. అట్లా అయితే నువ్వెందుకు అని అడుగుతావేమో?వారందరికీ నువ్వు ప్రభ్వివై వుండు. నా గృహం లవణ సముద్రం మధ్యలో కొండ శిఖరం మీద వుంది. దాన్ని లంక అంటారు. అక్కడికి వచ్చి నాతో కలిసి వుండు".

"ఆ లంకలో వున్న బంగారు మేడలమీద, నందనవనం లాంటి అందమైన ఉద్యానవనాలలో, అక్కడి తెల్లటి మేడల వరండాలలో, విలాస సంచారయోగ్యమైన ప్రదేశాల్లో, అతిశయంగా, పెంపు-సొంపు రాణించగా వుంటే ఇక్కడి అరణ్యాలు నీకెలా రుచిస్తాయి? నువ్వు నా భార్యవైతివా సమస్తాభరణాలతో అలంకరించబడిన ఐదువేలమంది ఉత్తమ వంశంలో పుట్టిన స్త్రీలు శ్రద్ధాభక్తులతో నిన్ను సేవిస్తారు".

## రావణుడిని నిష్ఠూరాలాడిన సీత

రావణుడిలా చెప్పగా, అంతవరకూ వాడికి చేస్తున్న ఉపచారాలను వదిలి, సీతాదేవి అమితమైన కోపంతో, రాక్షసులకు ప్రభువైనా రావణుడిని లెక్కచేయకుండా, గట్టి మనస్సుతో జవాబిచ్చింది ఇలా.

"స్థైర్యం, ధైర్యం కల శ్రీరామచంద్రుడు నా హృదయేశ్వరుడు. నేను రాముడికి అనుకూలమైన వ్రతం కలదాన్ని. రాముడు ఇంద్రుడి లాంటివాడు. సముద్రంలాగా కలతపెట్ట సాధ్యపడనివాడు. పూజ్యమైన గుణాలనే చిహ్నంగా కలవాడు. ప్రపంచమంతా తన స్వరూపంతో, గుణంతో, వ్యాపించినవాడు. గొప్ప తేజస్సుకలవాడు. సత్యమంటే మితంలేని అనురాగం వున్నవాడు. అలాంటి రాముడికి నేను అనువ్రతను. నువ్వు దుష్కీర్తితో కూడిన వాడివి. నువ్వు చెడు నక్కలాగా వంచకుడివి. క్షుద్రజంతువివి. నేను ఆడ సింహాన్ని....లభించేదాన్ని కాదు. ఇలాంటి నన్నా నువ్వు కోరుతున్నావు? సూర్యతేజస్సును పట్టుకోలేనట్లు, నువ్వు నన్ను స్పృశించడమైనా సాధ్యమా? బలవంతంగా నువ్వున్న చోటుకు ఎండ వస్తుందా? ఇలాంటి రామచంద్రుడి భార్యను కోరడం వల్ల నీకు మరణకాలం ఆసన్నమైంది".

"అమితమైన ఆకలితో వేగంగా పోతున్న సింహం, పెనుపాము కోరలు తీయడానికి ప్రయత్నించడం, మందర పర్వతం అరచేతిలో బంధించడం ఎలాగో, అలాగే, పురుష శ్రేష్టుడైన శ్రీరామచంద్రమూర్తికి ఆత్మ అయిన ఆయన భార్యను అపహరించడం. రెండూ సమానమే పాపాత్ముడా! కాలకూట విషాన్ని తాగి సుఖంగా జీవించాలనుకోవడం, సూది కొనలతో కళ్లలో గుచ్చుకోవడం, పెద్ద బండ మెళ్ళో వేసుకుని సముద్రాన్ని ఈదడం అలా అపాయకరమో, యుద్ధంలో మహాబల పరాక్రమ సంపన్నుడైన శ్రీరాముడి భార్యను కోరడం అలాంటి అపాయకరమే! సూర్యచంద్రులను అరిచేత పట్టుకోవడం ఎలాంటిదో, భయంకర బాణాలుకల శ్రీరాముడి ప్రియురాలైన నన్ను పట్టడం అలాంటిదిగా భావించు".

"రాముడే శూరుడా? మగవాడా? నువ్వు శూరుడివి కావా అంటావేమో? సింహానికీ, నక్కకూ; సముద్రానికీ, వీదులవెంటపారే చిన్న నీటి కాలువకూ; గరుత్మంతుడికీ, చిన్న కాకికీ; ఏనుగుకీ, ఎలుకకీ; నెమలికీ, నీరుకాకికీ; శ్రేష్టమైన సారాయికీ, పుల్లటి కడుగు నీళ్ళకీ; శ్రీగంధానికీ, బురదనీటికీ ఎంత తారతమ్యం వుందో శ్రీరామచంద్రుడికీ, నీకూ అంత తారతమ్యం వుంది.

బంగారానికీ, సీసానికీ; రాజహంసకూ, గద్దకూ గల భేదమే సుగుణ శ్రేష్టుడైన శ్రీరాముడికీ, మోసగాడివైన నీకూ వుంది. బంగారు పిడుగుల బాణాలతో ప్రకాశించే విల్లు ధరించే రామచంద్రుడు యుద్ధంలో బ్రహ్మాండంగా పోరాడగలవాడు నాకు రక్షకుడై వుండగా, ఇది ఆడది-ఏం చేయగలది? అని నువ్వు నీ భుజబలంతో అపహరించినా, ఈగతో నెయ్యి తాగితే నెయ్యితో సహా ఈగ ఎలా వాంతి పుట్టించి నెయ్యిని జీర్ణం కాకుండా చూస్తుందో, అలాగే నువ్వు నన్ను జీర్ణించుకోలేవు. నువ్వు నీవాళ్ళతో సహా చెడిపోతావు".

అని గట్టి మనస్సుతో కఠినమైన మాటలు అన్నప్పటికీ భయంతో, భీకరమైన గాలికి వణికే అరటి చెట్టులాగా గడ-గడ వణికింది. అది చూసి సీతను మరింతగా భయపెట్టుతూ, రావణాసురుడు తన కులం, బలం వర్ణించసాగాడు.

సర్గ-48

# తన స్వరూపం చూపి సీతను భయపెట్టిన రావణుడు

తన కులం, బలం వర్ణిస్తూ రావణాసురుడు, సీతతో ఇలా అంటాడు. "చలించే జింక కళ్ళదానా! ఈశ్వరుడి స్నేహితుడైన కుబేరుడికి నేను సహోదరుడిని. దశకంఠుడిని...నీ మగడికి ఒకటే తల వుంటే, నాకు పది తలలున్నాయి. రావణుడు అనే సార్ధక నామధేయం కలవాడిని. గంధర్వులు, పన్నగులు, గరుడులు నన్ను చూసి భయపడతారు. మృత్యువును చూసినట్లు ఎవరిని చూస్తే పరుగెత్తుతారో, యుద్ధంలో ఎవరిని చూసి కుబేరుడు పరుగెత్తాడో, ఎవరికి భయపడి తన పట్టణమైన లంకను విడిచి కుబేరుడు కైలాసం చేరాడో, ఎవరు పుష్పక విమానాన్ని లాక్కొని తన వాహనంగా చేసుకున్నాడో, అలాంటి నా ముఖాన్ని చూసి ఇంద్రుడు మొదలైన దేవతలు కూడా పరుగెత్తుతారు. నేనున్న చోట గాలి కదలదు. సూర్యుడు చంద్రుడిలాగా చల్లగా అయిపోతాడు. ఎక్కడెక్కడ నేను నిలుస్తానో అక్కడ చెట్లమీద ఒక్క ఆకైనా భయంతో కదలదు. నదులుకూడా వాతి వేగాన్ని వదిలి కట్టుబడి నిలుస్తాయి".

"క్రూరులు, భయంకరాకారం కల రాక్షసులు, సర్వ పదార్థాలు, చుట్టబడిన ప్రాకారాలు, బంగారుమయమైన తొట్టికట్లు, ఏనుగులు, రథాలు, గుర్రాలు, మణులతో చేయబడిన తోరణాలు, మంగళవాద్యాల ధ్వనులు, దేవతల

ఉద్యానవనంలో అన్ని ఋతువులూ కాచే పూలు-పండ్ల చెట్లతో సముద్రమధ్యంలో, ఇంద్రపురితో సమానమైన లంక అనే పేరుగల నా పట్టణం వుంది. కుసుమకోమలా! చూడడానికి రా. ఈ పాడు అడవులు చూసి-చూసి మంచివస్తువులను చూడగోరే నీ కళ్ళకు లంకను చూస్తే సంతోషం కలుగుతుంది. నువ్వు సంతోషంతో నా పట్టణంలో, నాతో, ఆనందిస్తే మళ్లీ మనుష్య స్త్రీల సాంగత్యం మనసునందైనా స్మరించవు. నువ్వు అయోధ్యలో మనుష్య సుఖాలను అనుభవించానని చెప్పావు. నువ్వు లంకకు వస్తే మనుష్య సుఖాలు, దేవతల సుఖాలు కూడా అనుభవించవచ్చు. వాటికి అలవాటు పడితే, ఆ తరువాత, ఇప్పుడు నువ్వు గొప్పవాడు అనుకుంటున్న మనుష్యమాత్రుడైన రాముడిని, నీ వియోగం వల్ల చచ్చేవాడిని, నీచుడిని, బలహీనుడిని, దరిద్రుడిని తలచుకోనైనా తలచుకోవు".

"తన ముద్దులకొడుకు భరతుడికి పట్టాభిషేకం చేసి, నీ మామ పెద్దవాడైన నీ మగడిని, న్యాయంగా రాజ్యం రావాల్సిన వాడిని, అయోధ్యనుండి వెడలగొట్టితే, రాజ్యం సాధించే బలం లేని కారణాన అడవులకు వచ్చాడు రాముడు. న్యాయంగా తనకు రావాల్సిన రాజ్యాన్ని దక్కించుకునే శక్తిలేని బలహీనుడిని, ఊళ్లోకూడా వుండనీయకుండా తరిమికొట్టితే రాజ్యాన్ని వదిలినవాడిని, క్షీణించిన ఆయుష కలవాదిని, ఊళ్లో వుంటే చంపుతారన్న కారణాన అడవులపాలై ఒంటిగా ఇక్కడికి వచ్చి దాగినవాడిని, మునివేషం వేసుకుని అడవుల్లో దుఃఖపడుతున్నవాడిని కోరడం అందమైన నీకు తగునా? సీతా నువ్వెంత కఠిన స్వభావం కలదానివే? అలాకాకపోతే, మన్మథ బాణాలతో కలతచెందిన మనసు కలవాడనైన నన్ను, ఎంతో ఆశపడి నీతో సుఖం అనుభవించ కోరిన నన్ను, రాక్షస లోకానికంతా ప్రభువైన నన్ను, గడ్డిపోచను చూసినట్లు అలక్ష్యంగా అవమానకరంగా చూస్తున్నావే? ఇది నీకు ధర్మమా? ఎదుటివాళ్ల పరువు ఆలోచించావా?"

"పిరికిదానా! ఇప్పుడు, లోకానికో, మగడికో, బంధువులకో భయపడి నన్ను తిరస్కరిస్తున్నావు. కాని ఆ తరువాత నువ్వే మన్మథ తాపంతో పరితపిస్తావు. నీలాగే పూర్వం ఊర్వశి తనను కోరిన పురూరవుడిని కాలితో తన్ని, ఆ తరువాత అయ్యో! ఎంత పొరపాటు చేశాను, అలాంటివాడిని పోగొట్టుకున్నానే? ఇప్పుడు నా తాపం ఎవరు తీరుస్తారు? అని పశ్చాత్తాప పడలేదా? నీ గతీ అంతే అవుతుంది. రాముడేమో మహాబలపరాక్రమసంపన్నుడని అంటున్నావు. నా

గోటికి కూడా సమానం కాదు. నన్ను, లోకాలన్నీ హాహా అని ఏడిపించే వాడినైన నన్ను, దేవతా స్త్రీల గర్భాలను నా పేరు చెప్పి మాత్రమే విచ్ఛిత్తి చేయగల నన్ను, పది తలల వాడినైన నన్ను, కైలాస పర్వతాన్ని ఎత్తిన నన్ను, కుబేరుడిని ఓడించి పుష్పక విమానాన్ని పొందిన నన్ను, ఇంద్రుడిని బందీచేసిన నన్ను, బ్రహ్మ-శివుడి వరాలు పొందిన నన్ను, ముల్లోకాలు జయించిన వాడినైన నన్ను చేరడానికి నీకు సందేహమెందుకే? నువ్వే నన్ను ప్రార్థించాలి కాని నేనై నిన్ను వచ్చి వేడుకోవాలా?"

"నీ పూర్వ పుణ్యం ఫలించడం వల్ల సీతా! నేను వచ్చాను. కాబట్టి నన్ను నిరాకరించవద్దు. నన్ను నిరాకరించడం అంటే నువ్వు నీ పూర్వపుణ్య ఫలాన్ని అనుభవించకపోవడమే! కాబట్టి నన్ను అంగీకరించు" అని రావణుడు అనగానే, ఒంటరిదాన్నే, పురుష సహాయం లేనిదాన్నే, కఠినంగా మాట్లాడితే వీడేమి చేస్తాడో అని భయంతో, కోపంతో, సీతాదేవి కఠినంగానే జవాబిచ్చింది.

(ఇతర పురుషులు తనను సకామ దృష్టితొ చూసినా, ఇచ్చకాల ఆశకలిగించినా, తాకినా, ఎవరైతే వికారానికి గురికారో ఆమె నిజమైన పతివ్రత. ఎవరైతే మనోవాక్కాయలలో నైనా పర పురుషుడిని సేవించదో, ఇతరులు ధనమిస్తానని అన్నా ఆశపడదో, ఆమె పతివ్రత. ఆమె జనజనభూషణం అనబడుతుంది. దీనులై ఇతరులు ప్రార్థించినా, బలాత్కారంగా ఈడ్చినా, వస్త్రాదులు తెచ్చి ఇచ్చినా, పతివ్రత ఇతరులను కామించదు. ఇతరులు తనను చూసి నవ్వినా నవ్వదు. తనను వాడు చూసినా చూడదు. పలుకరించినా పలకదు. అలాంటిది పతివ్రత. సౌందర్యం, యవ్వనం కలదైనా, పండితురాలైనా, ఎవరైతే మనస్సులో వికారం చెందదో ఆమె పతివ్రత. సుందరుడు, వయస్కుడు, స్త్రీజన మనోహరుడు, ప్రియుడు అయిన పురుషుడిని ఎవరైతే కోరదో ఆమె మహాపతివ్రత. మగడు తింటేనే తాను తింటుంది. మగడు దుఃఖపడితే ఆమె దుఃఖపడుతుంది. మగడు సంతోషిస్తే ఆమె కూడా సంతోషపడుతుంది. మగడు గ్రామాంతరం పోతే ఆమె మాలిన వస్త్రం కడుతుంది. మగడు నిద్రించిన తరువాత పడుకుంటుంది. ఆయనకంటే ముందే నిద్ర లేస్తుంది).

## రావణుడిని నిందించిన సీత

రావణుడికి కఠినంగా జావబిస్తూ సీత, "ఏమిరా! దేవజాతులైన యక్షులకు, గుహ్యకులకు నాతుడై సర్వ భూతవంధ్యుడైన కుబేరుడి తమ్ముడివై, ఇలాంటి పాపపు పని చేయదల్చావు. ఛీ, సిగ్గులేనివాడా! ఇంద్రియాలను జయించలేని

నిన్ను రాజుగా కలవారైనందున నీ మూలాన్న రాక్షసులందరూ చస్తారు. ఓరీ! ఇంద్రుడి భార్య శచీదేవిని అపహరించినా ఎదో ఒక విధంగా బతికితే బతకవచ్చేమో కాని రామచంద్రమూర్తి భార్యను అపహరించి మళ్లీ బతకడం నీకు సాధ్యమా? (చెప్పిన మాటే మళ్లీ–మళ్లీ చెప్తూ సీత) ఓరీ! చెడ్డ మనస్సు కలవాడా! ఇంద్రుడి భార్యని హరించినా బతకవచ్చేమో కాని రామచంద్రుడి భార్యనైన నన్ను నీచపు మాటలు అనడం వల్ల నువ్వు అమృతం తాగినా మోక్షం రాదు. ఇక హరిస్తే ఏమవుతావో ఆలోచించు. మృత్యువు నుండి నీకు విడుదల లేదు" అన్నది.

సర్గ-49

# సీతను బలాత్కారంగా ఎత్తుకుని పోయిన రావణుడు

సీతాదేవి ఇలా కఠినంగా రావణుడిని నిందించగానే రావణుడు కోపంతో శరీరం తెలియకుండా, భుజాలు ఎగురవేస్తూ అన్నడిలా. "బుద్ధిలేనిదానా! నా పరాక్రమం చెప్తా విను. నేను ఆకాశంలో నిలబడి భూమిని రెండు చేతులతో పైకి ఎత్తమంటావా? మృత్యుదేవత మొర్రో అని ఏడుస్తూ వుండేలా యుద్ధంలో మొట్టమంటావా? హిమవత్పర్వతాన్ని బద్దలయ్యేట్లు కొట్టమంటావా? సూర్యుడిని నేలమీదికి తోయమంటావా? సముద్రంలోని నీళ్లన్నీ తాగమంటావా? ఓసీ! మూఢురాలా!కోరిన రూపాన్ని దరించగలిగి, మన్మథాకారం కల నన్ను, సర్వ సుఖాలను కలిగించే నన్ను, నాథుడిని, నా నిజ స్వరూపం చూడు" అని అంటూ సీతను భయపెట్టడానికి తన నిజ స్వరూపాన్ని చూపించాడు.

దొంగ సన్న్యాసి వేషాన్ని వదిలి ఆ దుష్టుడు పదితలల, ప్రళయకాలంలో సూర్యాగ్నిలాగా మితిమించిన తేజం కల, బంగారు కుండలాల, కోపంతో కూడిన, నల్లటి మేఘంతో సమానమైన, విల్లు-బాణాలు కల కాలుడితో సమానమైన తన శరీరాన్ని చూపించాడు. ఎర్రటి వస్త్రాలు ధరించి, ఎర్రటి కళ్ళతో, ఎండాకాలంలోని సూర్య తేజస్సు వేడిమితో,విజృంభించి, కఠినమైన మాటలతో రావణుడు సీతాదేవితో ఇలా అన్నాడు.

“వినవే సీతా నా మాట! నీ మనస్సులో నీ యోగ్యతకు సరిపోయే భర్తను, ముల్లోకాలలో ప్రసిద్ధికెక్కిన వాడిని కావాలనుకుంటున్నావా? కళ్యాణీ నన్ను చూడు. నేను అలాంటి పొగడ్త కలవాడిని. నీమీద ప్రేమ వున్నవాడిని. నీకిష్టం కాని పని ఎన్నడూ చేయను. నామాట విని ఆ మనుష్యుడిని మరిచిపోయి దనుజుడనైన నన్ను కూడి నాకు శుభం కలిగించు. ఓసీ! బుద్ధిలేనిదానా! నువ్వు తెలివికలదానివనుకుంటున్నావు కాని నీకు తెలివేలేదు. నీకు తెలివే వుంటే, ఒక ఆడదాని మాట ప్రకారం, రాజ్యాన్ని, స్నేహితులను, బంధువులను, అందరినీ వదిలి, క్రూర సర్పాలు, ఏనుగులు, మృగాలు, రాక్షసులు సంచరించే అడవిలో తిరుగుతూ, శత్రువులను ఎదిరించి రాజ్యాన్ని సంపాదించుకునే ధైర్యంలేని దరిద్రుడిని ఎలా మోహిస్తావు? ఏం గుణాలు చూసి మెచ్చావే?”. ఇలా అని అంటూ రావణాసురుడు, అయ్యో! వీడు చెడిపోతున్నాడే? అని స్నేహభావంతో మంచిమాటలు చెప్తున్న సీతను కామంతో పరవశుడై, పట్టుకున్నాడు.

రావణుడు, ఎడమ చేత్తో సీతాదేవి తల వెంట్రుకలను, కుడిచేత్తో తొడలను, శీఘ్రంగా పట్టుకుని, తన మాయారథం అక్కడికి రాగానే, ఆ క్రూరుడు భయంకరమైన బెదిరించే మాటలతో బెదిరించి, బలాత్కారంగా ఒడిలో ఎత్తుకున్నట్లు ఎత్తుకుని, రథంలో వేశాడు. ఆ సమయంలో యముడితో సమానమై, తీక్షణంగా ప్రకాశించే కోరలతో, పర్వతమంత శరీరంగల ఆ రాక్షసుడిని చూసి వనదేవతలు భయంతో అడవుల్లోకి పరుగెత్తారు. ఈ విధంగా ఆకాశంలో శీఘ్రంగా పోయే రథం మీద కడుబాధతో సీతాదేవి పిచ్చిపట్టినట్లు భ్రమచెందిన దానిలాగా ఏడ్చింది.

(సీతాదేవిని రావణుడు ప్రత్యక్షంగా తాకాడా? లేదా? అనే విషయం చర్చనీయాంశం. వాల్మీకి రామాయణంలో రావణుడు సీతాదేవిని తాకి తీసుకుపోయాడని స్పష్టంగా చెప్పడం జరిగింది. రామచంద్రమూర్తి మాయామృగం వెంట పోయినప్పుడు అసలు సీతను దాచి మాయా సీతను ఆశ్రమంలో వుంచాడనీ, రావణుడు తాకింది ఆమెనేననీ కొందరి వాదన. సీతాదేవి చుట్టూ గిరిగీసి, దానిని సీత దాటిపోవలదని లక్ష్మణుడు, రాముడికొరకై పోయేటప్పుడు చెప్పినట్లు మరికొందరి వాదన. రావణుడు పెళ్లను తీసుకుపోయాడే కాని సీతను తాకలేదని వారంటారు. రావణుడు అపహరించినది మాయా సీత అనడానికి వాల్మీకి రామాయణంలో ప్రమాణం లేదు).

## రామలక్ష్మణులను తలచుకుంటూ ఏడ్చిన సీతాదేవి

రావణుడు ఎత్తుకుపోతున్న సీత రామలక్ష్మణులను తలచుకుంటూ ఏడ్చిందిలా. "అయ్యో! లక్ష్మణా! పెద్దల పాదసేవ చేయడంలో ఆసక్తి వున్నవాడా! మీరు ఖరాదులను చంపాడన్న కోపంతో ఈ పాపాత్ముడు బలవంతంగా నన్ను దొంగిలించి ఎవరి అడ్డం లేకుండా పోతున్నాడు. మహా భుజబలం కలవాడా! ఇది నీకు తెలియదా? ఆశ్రిత రక్షణార్థివైన రామచంద్రా! నీ ఆశ్రితురాలైన నన్ను వీడు ధర్మం తప్పి తీసుకుపోవడం చూడలేదా? రామా! న్యాయాన్ని ధిక్కరించి తిరిగే దుష్టులను శిక్షించే నువ్వు నన్ను దొంగిలించిన ఈ దుష్టుడిని ఎందుకు వదులుతున్నావు? పాపాత్ముడా! రావణా! నీ పాపఫలం వెంటనే అనుభవానికి రావు. కొంతకాలానికి అవి పక్వాలై ఫలితమిస్తాయి. నువ్వు చేసే పాపాని ఫలితం త్వరలోనే అనుభవిస్తావు. నీకు చెడిపోయే కాలం దాపరించినందున రావణా! ఇలాంటి పాపకార్యం చేయడానికి వచ్చావు. కాబట్టి శత్రువులకు మృత్యువైన శ్రీరాముడి చేతిలో నీ ప్రాణాలు పోతాయి".

"అయ్యో! కైక మాకు ఇలాంటి ఆపద రావాలని కోరికదా, మమ్మల్ని అడవులకు పంపింది? ధర్మాత్ముడైన రాముడి భార్యను నన్ను, ఈ నీచుడు అపహరించడం వల్ల కైక కోరిక నెరవేరింది కాబట్టి, ఇక ఆమె తనకు కావాల్సిన వాళ్ళతో పూర్తిగా సుఖపడుతుంది. అడవిలోని పూలతో, పండ్లతో నిండివున్న వృక్ష సమూహాల్లారా! తీగలారా! ఆకాశాన సంచరించే వాళ్లూ, మీరు రాముడిని చూసినప్పుడు సీతను రావణుడు అపహరించాడని దయతో చెప్పండి. మాల్యవంత పర్వతమా! దేవా విరోధి అయిన రావణుడు నీ భార్యను అపహరించి తీసుకుని పోతున్నాడని రాముడికి చెప్పు. గోదావరీ నదీ! నీకు దండం..దండం. కోదండ ధరుడైన రాముడితో నీ భార్యను రావణుడు అపహరించాడని చెప్పు. అడవిలోని చెట్లమీద వుండే దేవతా సమూహాల్లారా! దండకలో నివసించే నానా విధమైన పక్షినాయకులారా! మృగ నాయకులారా! మీకు నమస్కారం. నామీద దయవుంచి శ్రీరాముడి దగ్గరకు పోయి నాగతి ఇదీ అని చెప్పండి. మీకు దయ వుంటే త్వరగా చెప్పండి. ఓ పర్వతాల్లారా! తన ప్రాణం కంటే ఎక్కువైనా సీతను రావణుడు హరించాడని, రక్షించమని శ్రీరాముడికి చెప్పండి. పర్వతాల్లారా! నామీద దయవుంచి ఈ మాత్రం మాట సహాయం చేస్తే, ఆ తరువాత నేను స్వర్గంలో వున్నా, యమలోకంలో వున్నా, రామచంద్రమూర్తి నన్ను విడిపిస్తాడు".

## జటాయువును చూసి అరచి దుఃఖించిన సీత

రామలక్ష్మణులను తలచుకుంటూ ఏడుస్తున్న సీతాదేవికి, ఒక పెద్ద చెట్టుమీద వున్న గద్దరేడు జటాయువు కనిపించింది. రామవియోగ దుఃఖంతో, రామచంద్రమూర్తికి ఏమైందో అన్న భయంతో, బాధ పడ్తూ వున్న సీత పెద్ద గొంతుతో గట్టిగా జటాయువును పిలిచింది. పిలుస్తూ..."తండ్రీ! జటాయూ! ఇదిగో చూడు. ఈ పాపాత్ముడు రావణుడు క్రూరకార్యం తలపెట్టి, నేను ఏడుస్తున్నా వదలక, దయాహీనుడై దిక్కులేనిదానిలాగా నన్ను తీసుకుపో తున్నాడు. వీడు చాలా బలవంతుడు. విజయాలతో ప్రసిద్ధిగాంచినవాడు. దయాదాక్షిణ్యం లేనివాడు. నువ్వు వాడిని జయించడం సాధ్యం కాదు. ఎందుకంటే, వీడు సాయుధుడు. నీవు నిరాయుధడవు. పాపపు మనస్సుకలవాడు కాబట్టి నిరాయుధుడిని కొత్తకూడదన్న ధర్మజ్ఞానం లేనివాడు. అన్నా! తండ్రీ! జటాయువా! పాపాత్ముడైన ఈ రాక్షసుడు నన్నీవిధంగా బలవంతంగా పట్టుకునిపోతున్నాడు. యుద్ధం చేయవద్దంటివి కదా? మరేం చేయమంటావా? సందేహం వద్దు. ఇప్పుడే శీఘ్రంగా పోయి, నా పరిస్థితి రామలక్ష్మణులకు చెప్పు. మహాత్మా! ఇంతమాత్రం సహాయం చేసి ఈ దీనురాలిని రక్షించు". అంటుంది సీతాదేవి.

(జటాయువు దాస్య విధానం తెలుసుకోవాలి. స్వామికార్యం ప్రతిఫలాపేక్ష కోరక నిబద్ధతతో చేసేవాడు దాసుడు. దాసుడికి స్వామికార్యంలో నీచమనేది తెలియదు. ప్రాణభయం వుండదు. సిగ్గుపడడు. ఈ పని చేయగలనా? చేయలేనా? నా శక్తి ఏంటి? శక్తికి మించిందా? అని ఆలోచించడు. యధాశక్తి పనిచేయడం తన వంతు అనుకుంటాడు. జయాపజయాలు భగవంతుడి మీద భారం వేసి వుంటాడు. ఇలాంటివాడు కాబట్టే, ముసలివాడైనా, నిరాయుధుడైనా, అసహాయుడైనా, జటాయువు తన ప్రాణం ఇచ్చి రామసేవ చేశాడు. కాబట్టే మోక్షఫలం లభించింది. అంటే, మోక్షమనేది కేవలం మనుష్యులకే కాకుండా భూతకోటికందరికీ లభిస్తుంది.

అలాగే, ఎంత కష్టాలలో వున్నా ధర్మాత్ములు ధర్మ బుద్ధి వదలరు. అధర్మ మార్గాన నడవరు. యుద్ధం చేసి తనను విడిపించమని సీత జటాయువును కోరలేదు. అది ఆపాయమని ఆమెకు తెలుసు. రామలక్ష్మణులకు తన సంగతి చెప్పమని మాత్రమే అడిగింది. ఆమె కోరిక నెరవేర్చాడు కాని తక్షణమే వెళ్లలేదు. ఎందుకంటే, తానూ వాళ్ల దగ్గరకు పోయి తీసుకొచ్చేలోపల రావణుడు లంకకు చేరుతాడు. ఏం ప్రయోజనం? అనుకున్నాడు. కొంతసేపైనా వాడిని ఆపుచేస్తే మంచిదని, ఇంతలో రామలక్ష్మణులు రావచ్చని భావించి యుద్ధానికి దిగుతాడు).

## సర్గ-50

# రావణుడిని దూషించిన జటాయువు

కొంచెం-కొంచెం తూగుతున్న జటాయువు, సీత చేస్తున్న అరుపులు వింటాడు. మహాకాయుడైన రావణుడిని, వాడి అంకంలో వున్నా సన్నని సీతను చూసి, వాడికి అడ్డంగా పోయి, "రావణా! నేనెవరని అనుకుంటున్నావో? శాశ్వతమైన, శ్రేష్టమైన భగవద్దాస్యం అనే ధర్మకార్యం అంటే ప్రీతికలవాడిని. సత్యస్వరూపుడైన భగవంతుడంటే ధ్యానరూపకమైన బుద్ధికలవాడిని. కాబట్టి అలాంటి భగవంతుడి భార్యను నువ్వు అపహరించుకుని పోతుంటే, నా దాస్యధర్మం నిర్వహించడానికి వచ్చాను. గద్దలకు రాజును. పక్షీ...నువ్వేమి చేయగలవు? అంటావేమో? మహాబలుడైన నాపేరు జటాయువు. నేను జీవించి వుండగా, నువ్వు ఆమెను అపహరించలేవు".

"ఓరీ! నా సంగతి చెప్పాను. ఇక శ్రీరామచంద్రమూర్తి స్వరూప స్వభావాలను చెప్తా విను. రాముడంటే ఏమనుకుంటున్నావో? సమస్త ప్రపంచంలోని భూతాలకు మేలు కోరేవాడాయన. కాబట్టి నీ మేలూ కోరేవాడే! అలాంటి నీ మేలు కోరేవాడికి కీడు చేయవచ్చా? చేస్తే నువ్వు కృతఘ్నుడివి కావా? ప్రపంచ క్షేమం కోరేవాడు భగవంతుడు కదా! అంటావేమో? ఆ భగవంతుడే దశరథకుమారుడనే పేరుతొ కనపడుతున్నాడు. మేలు చేయాలని వుంటే చాలా అంటావేమో? ఆ ఆలోచన కార్యరూపంలో పెట్టగల బుద్ధిబలం కలవాడు. ఆయనలోనే సుత్రామ, వరుణ శబ్దాలు అన్వయిస్తాయి. ఇంద్రుడు తూర్పుకు, వరుణుడు పడమరకు

రాజులు కాగా, ఈయన సమస్త ప్రపంచానికి రాజై వున్నాడు. ఆయన దేవతలకే రాజు కాదు...నీకు కూడా ఆయనే ప్రభువు".

"అంత ప్రసిద్ధికెక్కి, అంతటి మహిమకల జగన్నాథుడి భార్యను, మహాసాధ్విని, జగన్మాతను, అపహరించడం నీకు సమంజసమేనా? ఆమె అంటే నీకు అలాంటి గొప్ప అభిప్రాయం లేదంటావా? నువ్వు రాజువు కదా? రాజు ధర్మ పద్ధతిలో నడవాలికకదా? అలాంటప్పుడు రాజు పరస్త్రీని, ఎలాంటిదైనా అపహరించవచ్చా? రాజు భార్య తల్లికదా? తల్లిని కాపాడినట్లే, రాజభార్యలను కాపాడాలికదా? ఇతర స్త్రీలను అపహరిస్తే ఏమైతుంది అంటావేమో? పరుల సొత్తు కొంచెమైనా అపహరించడం నీచకార్యం అయినప్పుడు, పరుల భార్యలను అపహరించడం ఎంత నీచమో ఆలోచించావా? ఇలాంటి నీచకార్యం నీకు విశేష హాని కలిగిస్తుందని ఆలోచించావా? పరుల భార్యలను కోరడం వల్ల నీకు ఆయుక్షయం అని తెలియదా? నువ్వు ఆమెను తీసుకునిపోవడం నీకు మంచిది కాదు. వదిలి పెట్టు. ఓరీ! క్రూరుడా! నీ భార్యను ఎలా ఇతరులు తాకకూడదో, ఇతరుల భార్యను కూడా తాకరాదని తెల్సుకో".

"ధర్మం అంటే ప్రీతికల రాజులు శాస్త్రం నిందించిన ధర్మ, అర్థ, కామాలకు ఆశపడరు. పులస్త్యుడంత గొప్పవాడికి మనుమడవై ధర్మ జ్ఞానం తెలియకపోతే ఎలా? ధర్మార్థకామాలు చక్కగా తెలుసుకుని ధర్మాన్ననుసరించి మంచిపనులు చేసే రాజు పెద్ద నిధిలాంటివాడు. ధర్మం కానీ, పుణ్యం కానీ, పాపం కానీ రాజులు ఎలా చేస్తారో, ప్రజలు అలానే చేస్తారు. నువ్వు దొంగతనం చేస్తే నీ రాజ్యంలోని ప్రజలు కూడా అలానే చేస్తారు. అప్పుడు రాజ్యానికి, ధర్మానికి ఏ గతి పట్టుందో ఆలోచించు. కాబట్టి ధర్మార్థకామాలకు రాజు మూలం. కనుక నువ్వు స్వచ్ఛందవ్యాపారం వదిలి శాస్త్ర ప్రకారం నడుచుకో. పాపపు స్వభావం కలవాడా! ఇంద్రియ చపలత కలవాడా! సాధువులకు బాధ కలిగించే వాడా! నీకెలా గొప్ప సంపద లభించిందిరా? నువ్వు ఆ ఐశ్వర్యం పోయి త్వరలోనే భ్రష్టుడివి అవుతావు".

"నీకు పుట్టుకతో వచ్చిన పాపగుణం నీ శవాన్ని కాల్చినపుడు కాని పోదు. నేను చెప్తున్న బుద్ధులు పాపాత్ముడివైన నీ మనసుకు పట్టాయా? ఒకవేళ ఇప్పుడు పట్టినా స్థిరంగా వుంటాయా? విరోధానికి కూడా కారణముండాలి. అపకారం విరోధి లక్షణం. నీ లంకా నగరంలో కాని, నీ దేశంలో కాని, మరెక్కడైనా కానీ శ్రీరామచంద్రమూర్తి నీకేమన్నా కీడు చేశాడా? ఎందుకిలా నిష్కారణంగా కలహానికి కాలు దువ్వుతున్నావు? ఎందుకు పాపం తెలియని శ్రీరాముడి

విషయంలో తప్పు చేస్తున్నావు? దీనివల్ల నీకు అపాయమేకాని మేలుజరగదు. ఓరీ రాక్షసుడా! నీ తమ్ముడైన ఖరుడిని చంపడం నీకు అపకారం చేసినట్లే అని అంటావేమో? శూర్పనఖ చెప్పుడుమాటలు విని శ్రీరాముడిమీదకు యుద్ధానికిపోయి ఖరుడు చచ్చాడు. యుద్ధంలో తన ప్రాణరక్షణ తాను చేసుకోవడం తప్పా? అలాగే నీకు మగతనం వుంటే శ్రీరాముడి మీదికి యుద్ధానికి వెళ్లు. ఏ పాపం ఎరుగని సీతను దొంగిలించి ఆమెను బాధపెట్టడానికి శ్రీరాముడు చేసిన తప్పేంటి?"

"రాక్షసరాజా! నువ్వు సీతను బలాత్కారంగా తీసుకుపోవద్దు. అది చాలా పాపపు పని. నువ్విలా చేసినట్లు రాముడికి తెలిస్తే చూపులతోనే నిన్ను ఆయన చంపుతాడు. రాబోయే కీడు తెలుసుకోలేక యమపాశాన్ని మెడలో వేసుకున్నావు. మోయలేని బరువు తలకెత్తుకున్నావు. జీర్ణంకాకుండా రోగంతో చచ్చినట్లు, సీతను అపహరిస్తే నీకు అపాయం తప్పదు. ఓరీ! నేను ముసలివాడినని అలక్ష్యం చేయవద్దు. నాకు ఇప్పుడు అరవై వేల సంవత్సరాల వయస్సు. ఇన్నాళ్లూ ఏలోపం రాకుండా తండ్రి రాజ్యాన్ని పాలించాను. నువ్వు ధృడమైన వయసులో వున్నావు. విల్లు, రథం, కవచం, బాణాలు వున్నా శూరుడివి. నేను ముసలివాడిని. అయినా సీతను నా కళ్లెదుట తీసుకుని నువ్వు సుఖంగా పోలేవు. చెప్పినమాట విను. సీతను హరించి రాముడినుండి విడదీయలేవు. రాక్షసుడా పరుగెత్తకుండా మగవాడివైతే కాసేపు యుద్ధం చేయి. యుద్ధం చేస్తే ఖరుడు చచ్చినట్లు నువ్వూ చస్తావు. ఎన్నోసార్లు రామచంద్రమూర్తి రాక్షసులను చంపినట్లు నిన్నూ చంపుతాడు. ఎందుకు ప్రాణభయంతో పరుగెత్తుతావు? నువ్వు కాసేపుంటే రామలక్ష్మణులను తెస్తాను. నేను వారికై పొతే నువ్వు లంకకు పారిపోతావు".

"నా దేహంలో ప్రాణం వున్నంతవరకు సీతాదేని తీసుకుని నిన్ను పోనీయను. నా ప్రాణానికి ప్రమాదం కలిగినా సంతోషమే. నేనేం చేస్తానో చెప్తా విను. పోవద్దు...పోవద్దు...నిలబడు. రావణా..నేనేం చేస్తానో చెప్తా. నువ్వు పోవాలనుకున్నా నా కంటబడి ఎక్కడికీ పోలేవు. ఎదిరించి నా శక్తికొద్దీ నీకు ఉత్సాహంగా యుద్ధ బిక్ష పెట్తాను. దానిని స్వీకరించు. నిన్ను రథం మీదనుండి నేలపడగొడ్తాను".

సర్గ–51

# జటాయువు రావణుల యుద్ధం

జటాయువు మాటలు విన్న రావణాసురుడు వీడిని ఎలాగైనా హతమార్చాలన్న పట్టుదలతో, కోపం తెచ్చుకుని, తన ఇరవై కళ్ళనుండి నిప్పులురాలుస్తూ, జటాయువును తాకాడు. అలా వాళ్లిద్దరూ ఒకళ్లనొకరు ఎదిరించుకున్నప్పుడు పెద్దగాలితో చిమ్మబడిన రెండు మేఘాలు ఒకదానినొకటి తగిలినట్లు, రెక్కలున్న రెండు మాల్యవంతాలు గుద్దుకున్నట్లు వుంది. ఇద్దరూ అలా సమాన బలవేగాలతో ఎదుర్కున్నారు ఒకరినొకరు. ఆ ఇద్దరూ ఆశ్చర్యకరంగా యుద్ధం చేస్తుంటే, రావణుడు జటాయువు మీద కుప్పలు–కుప్పలుగా, వర్షంలాగా, పదునైన భయంకర బాణాలను ప్రయోగించాడు. జటాయువు వాటన్నిటినీ తన ముక్కుతో, గోళ్లతో నేలబడగొట్టాడు. రావణుడి శరీరమంతా పుండులాగా అయ్యేట్లు జటాయువు తన గోళ్లతో చీల్చి చాలా బాధ కలిగించాడు. దీంతో కోపం తెచ్చుకున్న రావణుడు “చచ్చావురా జటాయూ!” అంటూ, పదునైన బాణాలను గురిచూసి కొట్టాడు. ఆ బాణాలను సంధించిన విల్లును సాహసంతో, రావణుడి మీదకు దూకి, రెండు తునకలుగా జటాయువు విరిచాడు.

పరాక్రమవంతుడైన రావణుడు ఇంకో విల్లు తీసుకుని, బాణవర్షంలో జటాయువును ముంచేశాడు. బాణాల మధ్యలో పక్షిలాగా కాసేపున్న జటాయువు, తన రెక్కల వేగంతో వాటన్నిటినీ చెదరగొట్టి, బాణాలను, విల్లును

తుంచాడు. అంతటితో ఆగకుండా జటాయువు రావణాసురుడి కవచాలను తన రెక్కల దెబ్బలతో పొడి–పొడి చేసి నేలమీద పడేశాడు. బంగారు కవచాలతో ప్రకాశించే కంచారగాడిదల రథాన్ని నిలబడేశాడు. చంద్రుడి లాంటి తెల్ల గొడుగును దాన్ని పట్టుకున్న వారితో సహా, చామరంతో కలిపి నేలపడేశాడు. సారథి శిరస్సును ముక్కుతో నొక్కి తుంపడంతో, విల్లు విరిగి, సారథి చచ్చి, గుర్రాలు నేలకూలిన రావణుడు, సీతాదేవిని గట్టిగా పట్టుకుని నేలమీద పడ్డాడు. ఇది చూసిన భూతాలన్నీ జటాయువును మేలు–మేలంటూ స్తోత్రం చేశాయి. ముసలివాడు, అలసటచెందినవాడైన మహాబలుడు జటాయువును చూసి, ఇక వీడు నన్నేమీ చేయలేడని సంతోషంతో సీతతో సహా రావణుడు ఆకాశానికి ఎగిరాడు. ఇలా ఎగిరిపోతున్న రావణుడిని చూసి జటాయువు జాలిపడి, తెంపు చేసి, వాడికి అడ్డంగా పోయి, “ఓరీ! రామచంద్రుడి భార్యను నువ్వు తీసుకుని పోవడం రాక్షస వంస సమూల నాశనానికె సుమా!” అంటాడు.

## రావణుడిని పరుషోక్తులాడిన జటాయువు

జటాయువు రావణుడిని పరుషోక్తులతో ఇలా అంటాడు. “స్నేహితులతో, చుట్టాలతో, కొడుకులతో, సమూహంతో, మనుమలతో, విషాన్ని మంచినీళ్లలాగా తాగుతున్నావు వివేకహీనుడా! ఇంతమందితో విషంతాగడం ఎలాంటిదో సీతను అపహరించి తీసుకుపోవడం అలాంటిది. బుద్ధిలేని మనుషులు నీలాగే, ఇలాంటి పని చేస్తే, దుష్ఫలితాలు కలుగుతాయే! అని ఆలోచించక చేయకూడని పని చేసి తరువాత ఆపదల పాలవుతారు. యముడు నీ మెడకు పాశం తగిలించి గట్టిగా ముడి వేశాడు. కాబట్టి నువ్వెక్కడికి పోయినా నీకు చావు తప్పదు. చేప గాలంతో ఎరను మింగినట్లయింది నీ పని. రావణా! వాళ్ల బలపరాక్రమాలు అపరిమితమైనవని తెలియక నువ్వు వాళ్లతో విరోధించావు. వాళ్లు నీకంటే తక్కువ వారుకాదు. నువ్విలా తమ ఆశ్రమంలోని సీతను అపహరించడం వల్ల వాళ్లు బాగా కోపం తెచ్చుకుని, నిన్ని బంధువులతో సహా యుద్ధంలో చంపుతారు. చెడిపోవద్దు రావణా! పరుగెత్తకు…నిలు…నిలు”.

“ఓరీ! పిరికివాడా! ఈ ఆడదానిని అపహరించి ప్రాణభయంతో పారిపోతున్నావే? ఇది లోకం నిందించే దొంగపని కాదా? శూరుడు ఇలా చేయవచ్చా? నువ్వు శూరుడివైతే కాసేపు ఆగు. రాముడి చేతిలో నీ తమ్ముడు చ్చచ్చినట్లే నువ్వూ యుద్ధంలో చస్తావు. మరణకాలం సమీపిస్తుంటే, తన

నాశనానికి పురుషుడు ఎలాంటి పాపపు పని చేస్తాడో, అలాగే నువ్వు నీ దుష్టతనంతో చేయతలపెట్టావు. కాబట్టి నీకు చావు తథ్యం. నీలాగా ఎవడురా పాపపు పని చేస్తాడు? నువ్వు చేశావు కాబట్టి నీ నాశనం తప్పదు. బ్రహ్మదేవుడైనా పాపపు పని చేస్తే చెడిపోతుంటే, నువ్వెంతరా?"

ఈ విధంగా హితోక్తులు చెప్పి జటాయువు వేగంగా, రావణాసురుడి వీపుమీద వాలి, గోళ్లతో వాడి వీపు చీల్చి, రావణుడు కదలకుండా చేశాడు. రావణుడి తల వెంట్రుకలను తన వాడి గోళ్లతో, బాణం లాంటి ముక్కుతో, పెరికాడు. కోపంతో రావణుడు పెదవి కొరుకుతూ, గిర్రున వెనక్కు తిరిగాడు. సీతను అలానే గట్టిగా ఎడమ చేత్తో పట్టుకుని, కుడి చేత్తో జటాయువును కొట్టాడు. ఆయన దాన్ని వేగంగా తప్పించుకుని, రావణుడికి ఎదురు ముఖంగా వచ్చాడు. జటాయువు తన ముక్కుతో సీతను పట్టుకున్న రావణుడి పది ఎడమ చేతులను తుంపాడు. అవి మళ్లీ-మళ్లీ మొలిచాయి. తన చేతులు తెగడంతో, రోషంతో మండుతున్న కళ్ళతో, రావణుడు సీతను వదిలి తన పిడికిళ్ళతో, పాదాలతో, జతాయువును కొట్టాడు. దరిమిలా, రాక్షసరాజుకు, జటాయువుకు ఘోర యుద్ధం జరిగింది.

### జటాయువు రెక్కలు నరికిన రావణాసురుడు

ఇలా ఘోర యుద్ధం జరుగుతుంటే, రావణుడు కత్తితో జటాయువు కాళ్లను, రెక్కలను నేలమీద పడేట్లు నరికాడు. రావణుడిలా నరకగా, నేలమీద పడి, కొనవూపిరితో వున్న జటాయువును చూసి సీతాదేవి, తనవల్ల కదా, ఆయనకు ఇలాంటి విపత్తు కలిగింది అని దుఃఖపడింది. ఏడ్చింది. నల్లని మేఘంలాంటి, తెల్లని రొమ్ము కల నేలమీద పడి వున్న జటాయువును రావణుడు చూశాడు.

(పర్ణశాలకు ఒక మైలు దూరంలో వున్న జటాయువు వృక్షం దగ్గర యుద్ధం ప్రారంభించి అక్కడికి సుమారు 5-6 మైళ్ల దూరంలోని దుమ్ముగూడెం దగ్గర వున్న జటాయువు గుట్టదాకా యుద్ధం చేశారు. అక్కడ జటాయువు రెక్కలు ఖండించి పడగొట్టాడు రావణాసురుడు).

సర్గ–52

# రామలక్ష్మణులను గురించి ఆక్రోశించిన సీత

ప్రాణాలు వెడలిపోవడానికి సిద్ధంగా వున్న ఆ పక్షిరాజు జటాయువును చూసి సీతాదేవి ఎంతో పరితాపంతో కన్నీళ్లు కాల్వలుగా పారేట్లు ఏడ్చింది. ఏడుస్తూ రామచంద్రుడిని తలచుకుని ఇలా అంటుంది బిగ్గరగా. "కాబట్టి రామచంద్రా! నాకు కలిగిన కష్టం తెల్సుకోవడానికి నీకు ఎడమకన్ను, ఎడమభుజం అదిరి వుండాలి కదా! పాలగరుడ భరద్వాజాలు తప్ప ఇతర రకాల పక్షులన్నీ కుడివైపు నుండి ఎడమగా పరుగెత్తి వుండాలికదా? ఈ అపశకునాల వల్ల నాకేదో కీడు కలిగిందని నువ్వు ఉహించి త్వరగా రావచ్చుకదా? రామచంద్రా! నీ శరీరంలో, నువ్వున్నచోట, మృగపక్ష్యాదుల వల్ల కనపడే అపశకునాలే కాకుండా, ఇక్కడ వుండే మృగాలు, పక్షులు కూడా నీ దగ్గరికి గుంపులు–గుంపులుగా వస్తున్నాయి. వీటిని చూసైనా నాకు కలిగిన కష్టాన్ని తెలుసుకుని వుండవచ్చు కదా? ఇంతదాకా నీ భార్యకు కలిగిన అవమానం నీకు తెలవకపోవడం అంటే, నేను మహాపాపం ఏదో చేశానని అనుకోవాలి. అల్ప పాపం అయితే ఇంతవరకు నేను అనుభవించిన దాంతో సమసిపోయి వుండాల్సింది".

"నా పాపం పెద్దదే అనడానికి నావార్త నీకు తెలియకపోవడం అనే ఒక్క కారణమే కాదు. నన్ను రక్షించడానికి ప్రయత్నించిన ఆ పుణ్యధనుడు జటాయువు,

ఈ నీచుడి చేతిలో హతమయ్యాడు. నా పాపపం పెద్దది కాకపోతే జటాయువు జయించే వుండేవాడు. కాని, నా పాలిటి పెద్దమ్మ, నాలాంటి పాపాత్మురాలికి సహాయం చేయాలనుకున్న ఆయన్ను ఎందుకు బతకనిస్తుంది? మహాపాపాత్ములకు సహాయం చేయడానికి ప్రయత్నించినవారికీ పాపాత్ముల పాపం వారిని ఆ సహాయం చేయకుండా బాధిస్తుంది. రామా! నేను సీతను. భూమి పుత్రిని. నన్నీ రాక్షసుడు పట్టుకుని పోతున్నాడు. రక్షించడానికి రా. తండ్రీ! లక్ష్మణా! త్వరగా రా!".

ఈ ప్రకారం, సీతాదేవి, రామలక్ష్మణులు సమీపంలో వుంటే తన అరుపులు విని వస్తారేమోనని ఏడ్చింది. "రామా! రామా! రఘురామా!" అని పెద్దగా ఏడుస్తుంటే రావణుడు, సీత తల వెంట్రుకలను పట్టి ఈడ్చాడు. ఆ సమయంలో, జంగమ స్థావరాలతో లోకాలు గాఢమైన చీకటితో వ్యాపించబడి, స్వస్థావస్థ తప్పి, బాధతో సోలిపోయింది. గాలి ఆగి పోయింది. సూర్యుడు వెల-వెలపోయాడు. బ్రహ్మదేవుడు రావణుడు సీతను బాదిస్తుమ్తే చూసి, "దేవకార్యం చక్కబడ్డది. రావణుడు చావడం ఖాయం" అనుకుంటాడు. దేవతలు, ఋషులు సీత పడ్తున్న బాధలు, కష్టాలు చూసి దుఃఖపడ్డారు. కాబోయే రావణుడి చేటుకు సంతోషించారు.

## సీతను ఎత్తుకుని పరుగెత్తిన రావణుడు

"రామా! రామా! లక్ష్మణా!" అని ఏడుస్తున్న సీతాదేవి ఆకాశమార్గాన తీసుకుని అతి వేగంగా పరుగెత్తాడు రావణుడు. నల్లటి మేఘంలాంటి కాంతికల రావణుడి పక్కన, బంగారువన్నెకల సీతాదేవి తొలకరి మెరుపులాగా ప్రకాశించింది. బంగారుమయమైన ఆమె పైట కొంగు గాలికి ఎగిరి, రావణుడిని కప్పడం చూస్తుంటే, కాలుతున్న కొండలాగా అతడు కనబడ్డాడు. మంగళకారిణి అయిన సీత కట్టిన పట్టువస్త్రం, ఆకాశంలోని సూర్య కిరణాలు తగలడంతో ఎర్రటి మేఘంలాగా కనిపించింది. రావణాసురుడి తొడమీద వున్న ఆ సీతాదేవి చక్కని ముక్కు కల ముఖం రాముడు దగ్గర లేనందున కళతప్పింది. మంచి నొసలు కల, ముంగురుల దాకా వ్యాపించిన, అందమైన, దోషరహితమైన, వికసించిన కమలాలతో సమానమైన, సీతాదేవి ముఖం మేఘాన్ని పగలతీసుకుని వచ్చి కనబడే చంద్రుడిలాగా కనిపించింది.

అందమైన తెల్లటి దంతాలు, సంపెంగ మొక్క లాంటి ముక్కు, బంగారు

సొమ్ముల విలాసం, పడుతూ-ఎగురుతూ వుండే వెంట్రుకలు, దొండపండు లాంటి పెదవి కలిగి రావణాసురుడి అంకాన వున్న సీతాదేవి ముఖం పగలు ఉదయించిన చంద్రబింబం లాగా వుంది. సీతాదేవి సహజ సౌందర్యం బొగ్గులో పొదిగిన మణిలాగా రావణుడి దగ్గర వుండడం వల్ల కాంతిహీనంగా కనపడింది. నల్లటి శరీరం కల రావణుడి దగ్గర వున్న బంగారు వన్నెకల సీత, బంగారపు ఒడ్డాణం నీలమణితో కలిసి ప్రకాశించినట్లుంది. చక్కటి అందమైన బంగారు ఆభరణాలతో ఇంపుగా, కమలంలాగా కాంతికల సీత, రావణుడి దగ్గర, మేఘం దగ్గరి మెరుపులాగా వుంది. పగడపు తీగలాంటి సీత నల్లటి రావణుడి ఒడిలో బంగారపు గొలుసుతో కట్టబడిన ఏనుగులాగా ప్రకాశించింది. సీతాదేవి ధరించిన బంగారపు సొమ్ముల ఘల్లు-ఘల్లను ధ్వని రావణుడిని మెరుపులతో, ఉరుములతో కూడిన మేఘంలాగా కనబడేట్లు చేసింది.

సీతాదేవి తల నుండి రాలిన అందమైన పూలు నేలమీద పడుతూ, రాక్షసుడి పరుగెత్తే వేగానికి కలిగిన సుడిగాలికి, అవి కూడా సుళ్లు పెట్టుకుంటూ, వాడి చుట్టూ తిరిగి నేలమీద పడడం చూస్తుంటే, నక్షత్రాలు మేరు పర్వతాన్ని చుట్టి తిరుగుతున్నట్లుగా వుంది. రత్నాలు చెక్కబడిన సీతాదేవి ధరించిన కాలి కడియం జారి భూమ్మీద మధుర ధ్వనితో చక్రాకారం లాగా మెరుగుతీగలా పడింది. రావణుడు సీతను బలవంతంగా తీసుకుని పోవడం, ఆయన ఇంట్లో కాల్చడానికి కొరివిని తీసుకుపోయినట్లు వుంది. ఆమె ధరించిన అగ్నికాంతి కల బంగారపు సొమ్ములు ఆకాశాన్నుండి చుక్కలు రాలినట్లు నేలమీద పడ్డాయి. ఆమె మెడలో ధరించిన ముత్యాలసరం ఆకాశగంగలాగా కనిపించింది. పక్షులతో సహా గాలికి కదులుతున్న కొమ్మలున్న చెట్లు ఎగురుతున్న కొమ్మలకు భయపడవద్దని సైగలు చేసినట్లుంది.

సింహాలు, పులులు, పక్షులు, మృగాలు అన్నిచోట్లా తిరుగుతూ, సీతాదేవి నీడను చూసి, గుర్తించి, ఆకాశంవైపు చూస్తూ అరిచాయి. రావణుడు భూమ్మీద దిగినట్లయితే వాడిని ఇవన్నీ పీక్కుని తినేవేమో! పర్వతాలన్నీ, మోసంతో సీతాదేవికి కలిగిన విపత్తుకై ఏడ్చాయి. సూర్యమండలం కాంతిహీనమై బాధతో మెల్లగా పోయినట్లు కనిపించింది. "ఈ వంచకుడు సీతాదేవిని దిక్కులేనిదానిలాగా మోసగించి కఠినంగా హరించి తీసుకుపోతుంటే, లోకంలో ఇందరు వుండికూడా ఒక్కరైనా అయ్యో! పాపం! నీకి తగదని, విడవమని అనరేంటి? లోకంలో ఇంకా ధర్మం, సత్యం, రుజుత్వం, దయ అనేవి

మిగిలాయా? ఈ గుణాలు కలవారు లేరులేరు" అని భూతాలన్నీ ఏడ్చాయి.

పెద్ద మృగాలు సీత నీడ వెంట పరుగెత్తుతుంటే పిల్ల మృగాలు ముఖాలు వేళ్లాడతీసుకుని భయంతో వణకుతూ, కన్నీళ్లు పొరలి-పొరలిరాగా సీతాదేవి పోయే మార్గాన్ని కనురెప్ప కూడా వాల్చకుండా చూసి-చూసి బాగా దుఃఖపడ్డాయి. భూమీ్మదకు చూస్తూ, మనోహర ధ్వనితో "రామా! లక్ష్మణా!" అని ఏడుస్తూ, పుణ్యాత్ములు, మంచి మనసున్నవారు ఎవరైనా అడ్డం రాకపోతారా? విడిపించరా? అని దిక్కులు చూస్తున్న సీతను చూసి వనదేవతలు పెద్దపెట్టున ఏడ్చారు. ముత్తెపుసరులు తెగిపోగా; పెదవి ఆరిపోగా;, పగుళ్లువారగా; తిలకం, కాటుక, కరగగా; వెంట్రుకలు చెదరగా వున్న సీతాదేవిని తన చావుకొరకే రావణుడు పట్టుకుని పోతుంటే, తెల్లబారిన ముఖంతో భయంతో సీతాదేవి బాధపడింది. ఏడవడం వల్ల, కోపం వల్ల, కళ్ళు రెండూ ఎర్రగా కాగా రావణుడి మర్మాలు ఛేదించే భయంకర వాక్యాలతో సీత ఆయన్ను సంబోధించింది.

సర్గ-53

# రావణుడిని నిందించిన సీతాదేవి

రావణుడిని నిందిస్తూ ఇలా అంటుంది సీత. "ఓరీ! రాక్షస వంశానికి వెదురుపొదకు కార్చిచ్చు లాంటి వాడా! ఆడదాన్ని, నన్ను, వంటరిగా వుండడం చూసి నువ్వీవిధంగా దొంగిలించి పరుగెత్తి పారిపోతున్నావే? నీకు కొంచెమైనా సిగ్గులేదా? నీ మాయ వల్లే కదా, అడవిలో మాయామృగం రూపంలో నా మనోవల్లభుడిని దూరంగా తీసుకుపోయింది? రాక్షస వంశం అనే అడవికి నువ్వే చిచ్చు పెట్టావు కదరా? నా మామ గారి స్నేహితుడైనందున నన్ను కాపాడడానికి వచ్చిన ముసలి గద్దతో యుద్ధం చేసి చంపావు. నీచ చరిత్రుడా! ఆహా! నువ్వెలాంటి శూరుడివిరా? ముసలి గద్దతోనే ఇంత పెద్ద యుద్ధం చేయాల్సి వస్తే, రామలక్ష్మణుల బారినపడితే నీగతి ఏమవుతుంది? యుద్ధంలో నిలబడి, ఇదిగో...రావణుడిని...యుద్ధానికి వచ్చాను...అని పేరు చెప్పుకునే పౌరుషం లేక, యుద్ధంలో నా భర్తను గెలవలేక, నన్ను దొంగిలించి పారిపోతున్నావే? పాపాత్ముడా! ఏమిరా నీ పౌరుషం? ఏమిరా నీ బలం?"

"స్త్రీ చౌర్యం అనే నింద్యమైన నీచపు పని చేసి, ఇతరుల భార్యయైన ఆడదాన్ని దొంగిలించి, భయపడి, పరుగెత్తుతున్నావే .... మూర్ఖుడా! నీకు కొంచెమైనా సిగ్గులేదురా! ఛీ! శూరుడు కాకపోయినా శూరుడనే పేరుచెప్పుకునే ద్రోహచింతగల నిన్ను మగవారు చూసి నవ్వుతారు సుమా! నువ్వు శూరుడననీ,

పెద్ద బలవంతుడననీ, వ్యర్థమైన మాటలు చెప్పావుకదా! పాపాత్ముడా! కాలమనేది వున్నంతదాకా నీకు అపకీర్తి కలిగించి, నీ వంశాన్ని నాశనం చేసే పని చేయడానికి పూనుకున్నావు. చీ! శూరుడిలాగా కొంచెం సేపు నిలుస్తే నీ శరీరంతో ఇలా పోగలవా? యాతనా శరీరంతో యమలోకానికే పోతావు. మృత్యుదేవత తరుముతున్నట్లు చావు–బతుకు తెలియకుండా పరుగెత్తుతున్నావే....నిన్నా రామరాజేమి చేయగలడు? ఏదీ, మగవాడివైతే క్షణం సేపు నిలువు....నీ పాపకార్యం అనుభవిస్తావు. ఆ రాజకుమారుల కళ్లకు నువ్వు కనిపిస్తే, నువ్వు, నీ సైన్యాలు ఒక్క ముహూర్త కాలమైనా బతకడం సాధ్యపడుతుందా? దుష్ట రాక్షసుడా!''

“అడవిలో కార్చిచ్చు వ్యాపిస్తే పక్షులు దాన్ని సమీపించలేనట్లు, నువ్వు రామలక్ష్మణులు ప్రయోగించే బాణాలను కన్నెత్తి కూడా చూడలేవు. ఇక నువ్వు వాటిని ఖండించడం ఏమిటి? యుద్ధం చేయడం ఏమిటి? ఎందుకురా చెడిపోతావు? నేను చెప్తున్న మంచిమాటలు వినరా! నన్ను తిరిగి తీసుకునిపోయి రాముడికి అప్పగించు. అలా నామాట ప్రకారం చేయకపోతే, నన్ను నువ్వు అవమానించడం వల్ల కలిగిన కోపంతో, ఆవేశంగా యుద్ధం చేసి నీ దేహాన్ని రాబందులకు, నక్కలకు, గద్దలకు తృప్తితీరా తినడానికి విందుగా వేస్తాడు. ఏదో చెడు ఆలోచనతో నన్ను నువ్వు తీసుకుని పరుగెత్తి పారిపోతున్నావు. నామాట విను. ఎప్పటికైనా నీకోరిక నెరవేరేది కాదు. ఓరీ! మాయలమారీ! నా మగడిని, జయించడం సాధ్యపడని వాడిని, జగన్నాథ సమానుడిని, రాముడిని విడిచి శత్రువు స్వాధీనంలో దీర్ఘకాలం బతకలేను. నువ్వు ఇంద్రియ చపలత్వంతో నీకు మంచేదో, చెడేదో, తెలుసుకోలేక బుద్ధిహీనుడివై వున్నావు. ఎందుకంటావా? నువ్వు పాపాత్ముడివి. కాబట్టి నీకు మంచి మార్గం కనిపించదు''.

“చావు సమీపిస్తుంటే మనిషికి మంచి వస్తువులు తినబుద్ధికాదు. పథ్యం చేయాలనిపిస్తుంది. చెడు పథ్యంలాగా అనిపిస్తుంది. ఇది సత్యం. నామాట అసత్యం కాదు. నిన్ను యముడు విందుకోసం తీసుకుపోతున్నాడు. ఇంత ఘోర పాపకార్యం కొంచెమైనా జంకు–గొంకు లేకుండా నిర్విచారంగా చేయడం వల్ల త్వరలోనే బంగారు చెట్లను చూస్తావు. యమలోకంలో నెత్తుటి ఏరులో, నిప్పుల ఏరులో ఈదుతావు. అసిప్రత వనంలో ఆటలాడుతావు. నమ్ము. యమపురంలోని బూరుగు చెట్లను చూస్తావు. పరస్త్రీలను కామించిన నీకు ఈ నరకబాధ తప్పదు. నీచపు నడవడికలవాడా! శ్రీరాముడిని మోసగించి నువ్వు విషం తాగినవాడిలాగా

ప్రాణాలను నిలబెట్టుకుంటావా? అది నీకు సాధ్యమా? దయాహీనుడా! నీ జీవితకాలం ఈ రోజుతో ముగిసింది. లంకలోకి చేరితే శ్రీరాముడు నిన్నేమి చేస్తాడని అనుకుంటున్నావా? యమకింకరులు నీమెడకు పాశాలు తగిలించారు. కాబట్టి నీకు లంకలోనే కాదు, స్వర్గ పాతాళ లోకాల్లో ఎక్కడ ప్రవేశించినప్పటికీ నిన్ను రామచంద్రమూర్తి తప్పక చంపుతాడు".

"తమ్ముడు కూడా తోడు లేకుండా, ఒంటరిగా రాముడొక్కడే పద్నాలుగువేల మంది దుష్ట రాక్షసులను అల్పకాలంలో సంహరించాడు. అలాంటి గొప్ప అస్త్రాలను తెలిసినవాడు ఎంతటి పనైనా చేయగలదు. తన పెళ్లాన్ని దొంగిలించిన నీచజాతివాడివైన నిన్ని యుద్ధంలో ముక్కలు-ముక్కలుగా నరక్కుండా వుంటాడా?"

ఇలా రకరకాలుగా మాట్లాడుతూ, ఏడుస్తున్న సీత స్మృతితప్పి పడుతూ ఉన్నప్పటికీ, రావణుడు ఆమెను తీసుకు పోవడం ఆపలేదు.

సర్గ–54

# తన ఆభరణాలను కపుల ముందు పడవేసిన సీతాదేవి

పాపాత్ముడు రావణాసురుడు సీతాదేవిని అలా తీసుకుపోతుంటే అప్పటిదాకా ఒక్కడైనా కనపడలేదు. అలా జరిగినందుకు బాధపడుతున్న సీతాదేవికి ఒకచోట కొండశిఖరం మీదున్న ఐదుగురు వానరులు కనిపించారు. వీరన్నా తన స్థితిని రాముడికి చెప్పకపోతారా అని భావించిన సీత తన సొమ్ములను తీసి కొంగులో ముడివేసి, వారిముందర పడేట్లుగా ఆ మూటను కిందకు జారవిడిచింది.

(రావణుడు సీతను చంకలో ఇరికించుకుని పోయాడు. ఆమె కుదురుగా వుండలేదు. ముందు–వెనుకలకు వాలుతూ వుంది. ఎవరెప్పుడు అడ్డం తగులుతారో అన్న భయంతో త్వరగా లంకకు చేరాలన్న తపన రావణుడిది. రామలక్ష్మణులు రాకపోతారా అని సీత ఆశ. ఇలా చంకలో పొర్లడం వల్ల వెనుకపక్కగా వాలి సీత సొమ్ములను ఉత్తరీయంలో ముడికట్టి కిందకు పడేసింది. సీత పైటకొంగు చింపలేదు. సీతకు ఇప్పటి స్త్రీలలాగా పైటలేదు. కట్టుకున్న వస్త్రం ఒకటి, కప్పుకునే వస్త్రం ఉత్తరీయం ఒకటి వున్నాయి. ఇలా కప్పుకున్నదానిలో సొమ్ములు మూటకట్టి పడేసింది).

సీతాదేవి సొమ్ములు మూట కట్టి కిందపడేయడం వేగంగా పోతున్న రావణుడు

గమనించలేదు. చూసే వ ఉన్నట్లయితే దాని ఆనవాలు లేకుండా చేసేవాడు. ఇక వానరులు, "రామా! రామా!" అని ఏడుస్తున్న సీతను చూశారు. ఎత్తుకుని పోతున్నవాడు రావణుడని సుగ్రీవాదులు గుర్తించారు కాని ఆమె ఎవరో తెలుసుకోలేక పోయారు. ఇలా వాడెందరినో ఎత్తుకుపోవడం వారికి తెలుసు. మనకెందుకు అనవసర కలహం అని వాళ్లు వూరకే వుండిపోయారు. బలవిద్వేరథం ఎందుకనుకున్నారు. అదీకాక రావణుడికి, వాలికి స్నేహం వుందని వాళ్లకు తెలుసు. ఈ వార్త తెలియగానే ఇదే సమయమని వాలి, తమ్ముడు సుగ్రీవుడిని, చంపడానికి బయల్దేరుతాడు. ఇవన్నే ఆలోచించి వానరులు ఊరకే వుండిపోయారు.

ఇదిలా వుండగా రాక్షసరాజు రావణాసురుడు అమిత వేగంగా సీతను చంకలో వుంచుకుని, బలాత్కారంగా పర్వతాలు, తటాకాలు దాటి అవలీలగా, అదుపూ–అడ్డం లేకుండా సముద్రాన్ని సమీపించాడు. మొసళ్లు, పాఠీనాలు, తిములు, తిమింగలాలు వున్న సముద్రాన్ని చేరగానే తన గడ్డమీదకు వచ్చాననీ, ఇక తనకు భయం లేదనీ రావణుడు సంతోషిస్తూ వుంటే ఇక వాడు చచ్చినట్లే అని సిద్ధులు అనుకున్నారు.

## సీతతో లంక చేరిన రావణుడు

లంకానగరం చేరిన రావణుడు, పూర్వం మయుడు మాయతో తాను నిర్మించిన గుహలో హేమను వుంచిన తరహాలో, తన అంతఃపురంలో సీతను వుంచి, పిశాచ స్త్రీలను పిలిచి స్వర్వకాల సర్వావస్థలలో సీతమీద కావలిగా వుండమని ఆదేశించాడు. సీత వున్న చోటుకు స్త్రీలను కానీ, పురుషులను కానీ రానివ్వద్దని చెప్పాడు. ఆమె కోరినవి, అవి బంగారమైనా, రత్నాలైనా, వస్త్రాలైనా ఏదైనా సరే అది తెచ్చి ఇవ్వమన్నాడు. తెలిసికాని, తెలియకకానీ సీత విషయంలో కఠినంగా మాట్లాడవద్దని హెచ్చరించాడు. ఇలా ఉత్తర్వులు ఇచ్చి ఆ రాక్షసుడు రావణాసురుడు అంతఃపురం విడిచి, ఆ తరువాత తనేం చేయాలో ఆలోచించి, తనకు బ్రహ్మ వరం కలదు కనుక తనకేం కాదని గర్వపడ్డాడు.

## జనస్థానానికి కాపలా వాళ్ళను పంపిన రావణుడు

రావణుడు అంతఃపురం వదిలిన తరువాత గొప్పబలం కల ఎనిమిదిమంది

రాక్షసులును పిలచి, సందేహం లేకుండా, విశిష్టమైన ఆయుధాలన్నీ తీసుకుని దండకారణ్యానికి పొమ్మని వారిని ఆదేశించాడు. ఆ తరువాత ఇలా అన్నాడు వాళ్లతో: "దండకలో ఖరాదులు చంపబడ్డ స్థలంలోనే మీరు వుండండి. అది పూర్వం ఖరుడున్న స్థలం. మీకు భయం లేదు. పౌరుషంగా వుంటూ, శత్రువుల రాక–పోకలను గమనించండి. పూర్వం నేనక్కడ వుంచిన ఖరాదులైన రాక్షస నాయకులను రాముడు చంపాడు. దాంతో నాకు ఆయనతో విరోధం కలిగింది. ఆ పగ తీర్చుకోవడానికి ఉపాయం ఆలోచిస్తున్నాను. ప్రత్యక్షంగా పోయి యుద్ధం చేయడానికి ధైర్యం చాలడం లేదు. అలా అని ఊరకే వుండడం కుదరదు. కోపం వస్తున్నది. ఏ విధంగానైనా రాముడిని రణంలో చంపి కాని నిద్రపోను".

"కాబట్టి, ఖరుడిని చంపినవాడిని ఎలా చంపాలా అని నేను ఆలోచిస్తున్నాను. రాముడిని చంపికాని సుఖపడను. మీరక్కడికి పోయి రాముడి చర్యలన్నీ కనిపెట్టి రాత్రనక, పగలనక ప్రతిదినం హెచ్చరికగా తిరగండి. ఒక్కచోటే వుండవద్దు. ఎప్పటికప్పుడు ఆ రాముడి వృత్తాంతం, విశేషాలు నాకు చెప్తుండండి. మీరు ఆ రాజకుమారులను చంపడానికి కూడా ప్రయత్నం చేయండి. ఇంతమంది వుండగా మీ ఎనిమిది మందినే ఎందుకు పంపుతున్నాను అని అడుగుతారేమో? మీ బలం, శౌర్యం నేను అనేక యుద్ధాలలో చూశాను కాబట్టీ, మీ విషయం బాగా తెలసు కాబట్టీ, ఈ మహాకార్య భారాన్ని మీమీద వుంచుతున్నాను. ఇతరులు ఇంత పని చేయలేరు".

ఈ విధంగా సంతోషం కలిగించే మాటలను రావణుడు చెప్పడంతో విన్న ఆ ఎనిమిదిమంది రాక్షసులు రావణుడికి నమస్కారం చేసి, అతడి ఆజ్ఞానుసారం కనబడనంత వేగంగా ప్రయాణం చేసి దండకకు చేరారు. ఈ విధంగా రావణుడు రాముడిమీద పగబట్టి,సీతను తెచ్చి, అజ్ఞానంతో "కృతకృత్యుడనయ్యాను, సీత దక్కింది, రాముడు చచ్చాడు" అని సంతోషించాడు.

సర్గ-55

# తన సౌధాన్ని సీతకు చూపించిన రావణుడు

పరాక్రమవంతులు, బలవంతులైన ఎనిమిదిమంది రాక్షసులను దండకారణ్యానికి పొమ్మని ఆజ్ఞాపించిన రావణుడు, ఇక తనకు రాముడివల్ల భాయంలేదని తన జ్ఞానహీనత వల్ల భావించాడు. ఇలా అనుకున్న రావణుడు, మన్మథ బాణాలకు లోని, సీతాదేవిని తలచుకుంటూ, వెంటనే ఆమె వున్న ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ రావణుడు తన ఆజ్ఞానుసారం రాక్షస స్త్రీల కాపలాలో వుండి, కలతచెందిన సీతను, తనకు ముఖం చాటేస్తున్న దానిని, చూసాడు. రేచు కుక్కలు చుట్టుముడితే భయపడే ఒంటరి ఆడ జింకలాగా, ఆడ తాచుపాములాగా నిట్టూర్పులు విడుస్తున్న సీతను, తన నగర సౌందర్యం చూపించడానికి, రావణుడు, బలాత్కారంగా ఈడ్చుకుంటూ తీసుకెళ్లాడు.

వేలాదిమంది స్త్రీలను, నిగ-నిగాలాడే రత్నాలుగల అందమైన మేడలను, మిద్దెలు, పక్షులు కల ఇంటిలో బంగారు వాకిలిలో ఒక సోపానం ఎక్కి సీతతో రావణుడు ఇలా అన్నాడు.

"ఓ సీతా! ఈ వైపు చూడు. బంగారం, దంతంతో కూడి నిర్మలంగా వున్నా కిటికీలు ఎన్ని ఉన్నాయో! ఎట్లా వున్నాయో! ఆ పక్కన, మనోజ్ఞంగా, కాంతిగా కల గృహాలెన్ని వున్నాయో! ఓసీ ముద్దరాలా! ఆ పక్కన మనోహర క్రీడల్లో ఆసక్తికల ఆడ హంసలు ఎలా వున్నాయో చూడు. ఈ పక్కన ఇంపు-సొంపు

కలుగు పూజ్యమైన కొత్త-కొత్త ప్రమదావనాలు ఎలా వున్నాయో చూడు. కొలకుల సోంపు ఆధిక్యత ఎలా వుందో చూడు. చిలుకల గుంపుల కలకల ధ్వనులు ఎలా వున్నాయో చూశావా? పూచిన చెట్లన్నీ సంతోషంగా వున్నాయి. చూసావుకదా! ఇకనైనా నీ మైకాన్ని వదిలిపెట్టు".

ఇలా దేవతలా ఇళ్ల లాంటి తన ఇళ్లను చూపించి ఇంకా ఆమెను మోసం చేయడానికి మళ్లీ ఇట్లా అన్నాడు.

"శ్రేష్టమైన ఈ గృహాలు, అసమాన గౌరవార్హమైన ఈ రాజ్యం, వేలాది మంది నా రాణులు, నా బతుకు, ఇవన్నీ నీస్వాదీనం చేస్తాను. ఇప్పుడు నువ్వు వీటన్నిటికీ పట్టపు రాణివి. ఎందుకు ఏడుస్తావు? నన్ను భర్తగా స్వీకరించు. సంతాపంతో ఏడుస్తుంటే, నీ ఏడుపుకు అంతం వుండదు. యావజ్జీవం నువ్వు ఇలా ఏడ్వాల్సిందే. అలాకాకపోతే సుందరీ! నీ యోగ్యతకు తగ్గ మంచిమార్గాన్ని చెప్తా విను. నా మాటలు ఆదరించి విను. ఇంకా రాముడు వస్తాడు....నన్ను తీసుకు పోతాడు....ఆయనతో అడవిలో అల్లాడుతాను....అని ఆశలు పెట్టుకోవద్దు. నామాట ఇంక ఏమాత్రం ఉపేక్ష చేయొద్దు. కామ బాణాలతో పీడించబడుతున్న నన్ను తోసిపుచ్చడం నీకు తగునా?"

"నా మగడు ఎందుకు రాడు? నావి వ్యర్థాశలు ఎలా అవుతాయి అంటావేమో? విను. నూరామడల వైశాల్యం కలిగి, వేలాది భయంకర రాక్షసులు వున్న లంకను గురించి నువ్వేమనుకుంటునావు? నీ వూరు లాంటిదే అనుకుంటున్నావా? ఇంద్రుడు మొదలైన దేవతలు కాని, రాక్షసులు కాని సమీపానికైనా రాలేరు. ఇక రాముడు లంకలోకి రావడం ఎలా సాధ్యపడుతుం ది? సముద్రాన్ని ఎలా దాటుతాడు? కోటలను ఎలా భేదిస్తాడు? ఇంతమంది రాక్షసులు ఉరకే చూస్తూ వుంటారా? ఒకవేళ వచ్చాడనుకో....యుద్ధంలో యక్ష-దేవతా సమూహాలు కూడా బలంలో నాతొ సమానం కాదే. ఇక ఒంటరిగాడు, మనుష్యుడు, వచ్చి, నాతో యుద్ధం చేసి, గెల్వగలడా? కాబట్టి నీకోరికలు గొంతెమ్మ కోరికలే!"

"రాజ్యం లేనివాడిని, దీనుడిని, బతికే మార్గం లేనివాడిని, కొంచెమే తేజం కలవాడిని, రాముడు-రాముడని పదే-పదే తలచి-తలచి ఎందుకేడుస్తావు? అలాంటివాడు నీకు తగిన భర్త కాడు. నీకు తగిన భర్తను నేనే. కాబట్టి నన్ను పొందు. ఓసీ పిరికిదానా! యవ్వనం శాశ్వతమా? కాదు. వృథాగా వయస్సు పోతే ఆ తరువాత ఏం సుఖపడతావు? కాబట్టి ఇప్పుడే నాతో సుఖంగా వుండు.

రాముడిని చూస్తానని ఇంకా ఎందుకు ఆశపడుతున్నావు? శరీరంతో రావడం సంగతి అటుంచు....మనసుతోనైనా ఇక్కడికి రాగలడా? నువ్విక్కడ వున్నసంగతి తెలిసేదెలా? తెలిసినా రావడం ఎలా? అగ్నిజ్వాలలను చేత్తో పట్టుకోవడం సాధ్యమా? చలించే కళ్ళదానా! విను. నా భుజబలంతో కాపాడబడుతున్న నిన్ను పరాక్రమంతో నన్ను గెలిచి తీసుకుపోయేవాడు లోకంలో లేడు. నన్ను రాజ్యసంపదతో ఏలుతే దేవతలు, చరాచర భూతసంఘాలు నీ సేవ చేస్తాయి".

"నువ్వెందుకు సందేహిస్తున్నావు? ఎవరికీ భయపడుతున్నావు? లంకా రాజ్యానికంతా పట్టాభిషిక్తవై ఏలుకో. నువ్వు చెప్పినట్లే నేను చేస్తాను. కష్టాలు అనుభవిస్తే పాపాలు తగ్గుతాయి. కాబట్టి నువ్వు గతంలో చేసిన పాపాలు కారడవుల్లో కష్టపడడం వల్ల నశించాయి. పూర్వం నువ్వు చేసిన పుణ్యాలు అనుభవించే కాలం వచ్చింది. ఈ చందనాన్ని మనమిద్దరం పూసుకుందామా? పూల సరాలు ధరించుదామా? బంగారు ఆభరణాలు ధరిద్దామా? సీతా పుష్పకం అని పేరున్న ఈ విమానం నలుదిక్కులా వ్యాపించే సూర్యకాంతి లాంటిది. దీన్ని మా అన్న కుబేరుడి నుంచి యుద్ధంలో జయించి తెచ్చాను. ఇది చాలా మనోజ్ఞమైంది. దీంట్లో మనిద్దరం సుఖభోగాలను అనుభవిద్దామా? కమలం లాంటి కాంతికల నీ ముఖం నువ్వు ఏడవడం వల్ల సహజ విధం చెడింది. ఈ వ్యాకులత్వం వదిలి నన్ను దయతో ఏలుకో".

ఇలా రావణుడు అనడంతో, సీతాదేవి వాడికి తన ముఖం కనబడకుండా చీరే కొంగులో కప్పి, కళ్ళ వెంట నీళ్ళు కారుతుంటే భయపడసాగింది. సీతాదేవి అలా ముఖం కప్పుకోవడం చూసిన రావణుడు ఇలా అన్నాడు. "సతీ! పతివ్రతా ధర్మం చెడుతుందని అభిప్రాయంతో సిగ్గు పడుతున్నావు. చాలు-చాలు. సిగ్గుపడాల్సిన పని లేదు. ఏడవాల్సిన పనీ లేదు. ధర్మానికి లోపం కలిగించే కార్యం ఇందులో ఏముంది? జానకీ! నీ పాదధూళి నా శిరస్సు మీద ధరించి నిన్ను ప్రార్థిస్తున్నాను. నేను నీ దాసుడిని. దయతో నన్ను ఏలుకో. మన్మథ తాపంతో నీచపు మాటలన్నాను. నీ పాదాలకు నా పదితలతో నమస్కరించాను". ఇలా సీతతో పలికిన రావణుడు తనకీ స్త్రీరత్నం దక్కెననుకుంటాడు.

సర్గ-56

# రావణుడిని పరుషోక్తులాడిన సీత

రావణుడు సీతను ఇలా తనకిష్టమైన రీతిలో భయపడే మాటలు అంటుంటే, భయపడకూడదనుకున్న సీత, పతివ్రతలైన స్త్రీలు పరపురుషులతో సాక్షాత్తుగ సంభాషించ కూడదు కాబట్టి, ఒక గడ్డిపోచను వాడికి అడ్డంగా వేసింది. "నువ్వు ఈ గడ్డిపోచతో సమానమనే భావం" కూడా దీంట్లో వుంది. తన పాతివ్రత్య మహిమవల్ల రావణుడు తననేమీ చేయలేడనే ధైర్యం వున్నది కాబట్టి భయం కలగకపోయినా రామవియోగం వల్ల దుఃఖం వచ్చింది సీతకు. తన కొరకు రామచంద్రుడు ఎంత శోకిస్తున్నాడో అన్న బాధ కూడా కలిగింది. స్త్రీలతో బలవంతంగా భాగిస్తే రావణుడు తలపగిలి చస్తాడన్న అప్సరస శాపం మనసులో వుంచుకుని సీత నిర్భయ అయింది. ఒకవేళ బలాత్కరిస్తే యోగబలంతో అదృశ్యమై అస్పృశ్యను అవుదామనుకుంది కాబోలు.

ఆ తరువాత రాముడు దేబె అనీ, దీనుడనీ, దుర్బలుడనీ, మనుష్యుడే కదా అనీ అన్న రావణుడి మాటలకు ప్రత్యుత్తరంగా సీత వాడితో ఇలా అంటుంది. "ఓరీ! నేను దిక్కులేనిదాన్ననీ, శీలహీననని పలికినట్లు అంటున్నావు. నన్ను నువ్వేమనుకుంటున్నావురా? సత్యప్రతిజ్ఞ కలవాడు, సత్యాన్ని దాటని వాడు, ధర్మాత్ముడు, జగత్ప్రసిద్ధుడు, ధర్మంలో నిలకడ కలవాడు, ధర్మమే తరుణోపాయంగా భావించే వ్యక్తి కోడలిని. నువ్వు ఒక్క రథం మీద ఒకే దిక్కుకు

పోగలవు. ఆయన పది దిక్కులకు పోగలడు. ఒక్క రథాన్ని నడిపినట్లు పది రథాలను ఒకేసారి నడపగల సమర్థుడు. ఆయన కొడుకు, శూరపుత్రుడు రామచంద్రుడు, ముల్లోకాలలో పూజ్యుడు. నీలాగా భయంతో కాదు, భక్తితో పూజ్యుడు. కొందరికే మాత్రం పూజ్యుడు కాదు...దేవ-మనుష్య-తిర్య గ్బాల-వృద్ధ-స్త్రీ-పురుషపశు,పక్ష్యాదులకు పూజ్యుడు. రాముడని ప్రసిద్ధికి ఎక్కినవాడు. నువ్వేమో హింసించి, బాధించి రావణుడని ప్రసిద్ధికెక్కావు. ఆయనేమో రమింపచేసి, రమించి రాముడని ప్రసిద్ధికెక్కాడు. విశాలమైన కళ్ళుకలవాడు. నీలాగా భయంకరమైన మిడిగుడ్లు లేవాయనకు. దీర్ఘమైన చేతులున్నాయి. ఆయన చేతులు చూడగానే ఎవరికైనా మహాపురుషుడు అనిపిస్తుంది. నీలాగా తుట్టెపురుగులాగా విశేష హస్త-మస్తక-పాదాలు కలవాడు కాదు. మిక్కిలి ధర్మస్వరూపుడు. నీలాగా ధర్మ విరుద్ధ స్వభావం కలవాడు కాదు. నాకు ప్రాణ విభుడు. నా ప్రాణాలకు అధిపతి. నా ప్రాణాలు ఆయన అధీనంలో, ఆయన స్వాధీనంలో, ఆయన ధారణ-పోషణలో వున్నాయి. నా ప్రాణాలమీద విభుత్వం నాకూ లేదు. కాబట్టి నేను ఆయన సొత్తును. దీన్ని మరొకరి స్వాధీనం చేయడానికి నాకు అధికారం లేదు. దీన్ని పోగొట్టుకోవడం, కాపాడుకోవడం ఆయన పని. నువ్వు అనుకూలిస్తే మంచిది....లేదంటే చెడిపోతావు".

"నాకే కాదు, నీకూ ఆయన దైవమే. నువ్వు ఆయన్ను పూజించాల్సిందే కాని ధిక్కరించకూడదు. నువ్వు మొదటి నుండీ ఆయన్ను దిక్కరిస్తున్నావు. కాబట్టి నిన్ను చంపడానికి అసమాన శౌర్యం కలవాడాయన. పైగా లక్ష్మణుడు ఆయనకు తోడుగా వున్నాడు. ఆయన దరిద్రుడని అన్నావు......కాని ఆయన సర్వదా సలక్ష్మీకుడు. ఆ విషయం ఎలా నీకు తెలుస్తుంది అని అడుగుతావేమో? ఆయన పరబ్రహ్మ లక్షణం లాంటి లక్షణాలు కలవాడు. పరబ్రహ్మ లక్షణాలు, పరబ్రహ్మంలో కాకుండా మరెక్కడ వుంటాయి? సింహం మూపురాల్లాంటి మూపురాలు కలవాడు రాముడు. కాబట్టి సింహం క్షుద్ర మృగాన్ని చూసినట్లు నిన్ను చూస్తాడు. అలాంటి దైవం, లక్ష్మీవంతుడు వైకుంఠంలో వుండకుండా ఇక్కడికి ఎందుకు వచ్చాడంటావా? అనరన్యుడి శాపం ప్రకారం నిన్ను చంపడానికి ఇక్ష్వాకు వంశంలో పుట్టాడు. ఈ విషయాలు తెలుసుకోకుండా ఏమిటేమిటో వాగుతున్నావు. అలా అయితే నిన్నెందుకు ఇంతదాకా చంపలేదంటావా? కారణం కోసం వేచి వున్నాడు. నన్ను నువ్వు ఆయన ఎదుట ముట్టుకున్నట్లయితే ఖరుడిని చంపినట్లు నిన్నూ చంపేవాడే. నువ్వాయన ఎదుట

పడలేదు. కాబట్టి బతికి పోయావు. ఎదుటపడితే చచ్చేవాడివే".

"నీ రాక్షస సేన భయంకరాకారం కలదనీ, దృఢమై-భయంకరమైన బలం కలదనీ ఆడదాన్నైన నా ఎదుట ఇక్కడ ఈ మూల ఇంట్లో గేహేశూరుడవై ప్రజ్ఞలు చెపుతున్నావు. నీ సేనాబలం, భయంకరత్వం ఎంతదాకా? గరుత్మంతుడి కంటబడేవరకే కదా పాముల భయంకరత్వం, బలం? ఆ తరువాత తలవంచుకుని నేల రాలాల్సిందేకదా? అలాగే నీ బలమంతా నా భర్త ప్రయోగించే బంగారు పిడుల బాణాలు గంగానది అలలు ఒడ్డును మింగినట్లు నీ సేనను మింగుతాయి. నువ్వు వరబలంతో దేవతల చేతుల్లో, దైత్యుల చేతుల్లో చావవేమో. నా భర్తకు కోపం వచ్చేట్లు చేస్తే యుద్ధంలో నా భర్త చేతుల్లో చావకుండా ఆ వరాలు కాపాడలేవు. నా భర్త దేవ-దైత్యుల జాతిలో చేరినవాడు కాదు. నా మగాడే సంకల్పిస్తే నీకు వరాలిచ్చిన బ్రహ్మ-రుద్రాదులను కూడా చంపగలడు. ఇక వాళ్ల వరాలు నిన్నేం కాపాడగలవు? అది కాకుండా మనుష్యుల చేతుల్లో చావకుండా నీకు వరం లేదుకదా? కాబట్టి యజ్ఞంలో యూపస్తంబానికి కట్టబడిన పశువు చావడానికి ఎలాసిద్ధ పడుతుందో నామీద మనసు పెట్టిన నువ్వు చావడం ఖాయం. రామబాణాల బారినపడి నువ్వా బతికేది?"

"నీచబుద్ధికల రాక్షసా! రామచంద్రమూర్తి కోపంతో మండుతున్న కళ్ళను చూసినంత మాత్రానే, ఆ నిమిషంలో కాలి నేలపడవా? కుక్కను కొట్టడానికి బచ్చెనకోల కావాల్నా? అలాగే, నిన్ను చంపడానికి బాణ ప్రయోగం అవసరమా? నీ పరాక్రమం గురించి నువ్వు చెప్పిన మాటలు దంభవాక్యాలు. వాస్తవం చెప్తా విను. రామచంద్రమూర్తికి కోపం వస్తే, చంద్రుడినైనా నేలపడవేస్తాడు. రూపం కనబడకుండా భుజబలంతో చేయగలడు. అలాంటి అసమాన బలసంపన్నుడు ఈ తుచ్ఛ సముద్రాన్ని దాటి వచ్చి, తనమీద అనురాగం వున్న తన ఇల్లాలిని చెరనుండి విడిపించలేడని అనుకుంటున్నావా? రాక్షసా! అవశ్యం విడిపిస్తాడు. నీ ఐశ్వర్యం, నీ గృహాలు, లంక నీకింకా వుందని నన్ను ఆశ పెట్టున్నావు. ఎప్పుడైతే నువ్వు పరస్త్రీని కామ దృష్టితో స్పృశించావోఅప్పుడే నీ సంపద నాశనమై పోయింది. ఆయుస్సు, ఇంద్రియబలం, దేహబలం, సర్వం నాశనమైనదని భావించు. నీ కారణాన లంకాపురం పతిలేనిదై పోయింది. అక్కడి స్త్రీలు విధవలై పోయారు. ఇంతమాత్రానికా ఈ పొగరు? వినాశకాలం సమీపించినా పొగరువల్ల తెలుసుకోలేక పోతున్నావు. ఎంత మూర్ఖుడివిరా?"

"అల్పబలం కల నన్ను నా భర్త దగ్గరనుండి విడతీసినందున పాపాత్ముడా, నీ

పాపం నీకు కొంచెం సుఖం కూడా ఇవ్వదు. చూస్తుండు. నా మగడికి దేహబలమే కాదు....దైవ బలం కూడా వుంది. కాబట్టి ఆయన అమితమైన తేజస్సు కలవాడు. నీకు దైవబలం లేదు. కాబట్టి నీకు తేజస్సులేదు. నువ్వు చెప్పిన దేబె, జోగి నువ్వే కాని రామచంద్రుడు కాదు. ఆయన ధర్మయుక్తమైన నడవడి కలవాడు. మంచి మనస్సు కలవాడు. భయం అంటే ఏమిటో తెలియనివాడు. అసమానమైన శౌర్యంలొ ఆయన్ను మించినవారు లేరు. భయంకర మృగాలున్న అడవిలో ఉన్నాడాయన. నీ బలాన్ని, నీ గర్వాన్ని బాణాల వర్షంతో కక్కిస్తాడు. మృత్యువు సమీపించిన వాళ్లు కాల మహిమ వల్ల వాళ్లు చేయాల్సిన పనులు కాకుండా చేయకూడని చెడు పనులను అవే మంచివనుకుని చేస్తారు. ఆ విధంగా నాశనమైపోయే కాలం నీకూ, నీ రాక్షసమూకకు, నిన్ను కట్టుకున్న స్త్రీలకు, నువ్వు నన్ను బలవంతంగా తేవడం వల్ల ఏకకాలంలో కలిగింది".

"యజ్ఞశాల మధ్యలో వున్నా ఉపకరణాల పాత్రను, వేదమంత్రాలతో పవిత్రంగా వుంచాల్సిన దాన్ని, ఎవరైనా తాక వశమా? అలాగే పతివ్రతనైన నేను కూడా పవిత్రమైన వేదినే. ధర్మం విడనాదని దశరథరాజు కుమారుడి భార్యనైన, పతివ్రతనైన నన్ను రాక్షసాధముడా, పాపాత్ముడా, దుష్ట చరితుడా, మూర్ఖుడా, నీకు తాక సాధ్యమా? ఓరీ! నీ వల్ల నేను చెడిపోను. నాకా భయం లేదు. నా భర్త ఇక్కడికి ఎలాగూ వస్తాడు. నిన్ను ఎలాగూ చంపుతాడు. లంకా నాశనం కాక తప్పదు. ఇది నిశ్చయం. నీకు నేను భయపడను, వశపడను. నన్నిప్పుడే చంపుతానంటావా? ఈ దేహం జడ పదార్ధం. దీన్ని కట్టేస్తావా? కానివ్వు. తింటావా? తిను. దాని వల్ల నాకేం నష్టం లేదు. ఈ శరీరం నేను రక్షించవలసిన అవసరం నాకు లేదు. వున్నా, పోయినా ఒకటే. నా శరీరం చెడ్డా, నేను చెడిపోను. నా మనస్సు చెడితే నేను చెడిపోయినట్లు. న అమనస్సు నా స్వాధీనంలో వుంది. దాన్ని నువ్వేం చేయలేవు".

ఇలా అని ఊరుకుంది సీతాదేవి.

## సీతదగ్గర రాక్షస స్త్రీలను కాపలా పెట్టిన రావణుడు

కఠినంగా మాట్లాడి, కోపంతో ఏమీ మాట్లాడకుండా సీతాదేవి వుండిపోవడంతో, రావణుడు ఆమెకు భయం కలిగే విధంగా మండిపడుతూ, ఇలా అన్నాడు.

"ఓసీ నవ్వు ముఖందానా! సీతా, విను. ఇక్కడ నుండి పన్నెండు నెలల్లో నువ్వు

నామీద విశ్వాసం కలిగి, ప్రేమగా నన్ను కామించకపోతే, ఆ గడువు ముగుస్తుండగానే, నా ఉదయం భోజనానికి, నా వంటవాళ్లు నిన్ను ముక్కలుగా కోసి వండుతారు" అని చెప్పి, ఆమెకు కాపలాగా వున్న రాక్షస స్త్రీలను చూసి తన కోపం తగ్గిపోయే విధంగా సీతాదేవి కొవ్వు తీసేయండని చెప్తాడు.

(సీతాపహరణం జ్యేష్ఠమాసంలో జరిగింది. రామ–రావణ యుద్ధం ఫాల్గుణ మాసంలో, కృష్ణపక్షంలో జరిగింది. హనుమంతుడు సీతాదేవిని సందర్శించింది ఫాల్గుణ మాసారంభంలో. అప్పటికి పది నెలల గడువు అయింది).

రావణుడి మాటలకు రాక్షస స్త్రీలు అంగీకార సూచనగా నమస్కరించారు. అప్పుడు రావణుడు నేలను గట్టిగా తన్నుకుంటూ, సీతను అశోకవనానికి తీసుకు పొమ్మంటాడు. అక్కడ ఆమెను వుంచి ఎల్లప్పుడూ విడువకుండా ఆమె చేష్టలను మిక్కిలి రహస్యంగా గమనించమని చెప్తాడు. "భయంకర చూపులు కలవారా... వికార రూపాలు కలవారా....మాంసం, నెత్తురు ఆహారంగా కలవారా....ఈ సీతను మంచిమాటలతో కాని, బెదిరించి కాని, మచ్చిక చేసుకుని నాకు స్వాధీనం చేయండి" అని అంటూ రావణుడు అక్కడినుండి పోతాడు. ఆ తరువాత రాక్షస స్త్రీలు సీతాదేవిని అశోకవనానికి తీసుకుని పోయారు. ఇక అప్పటినుండి సీత రాకాసుల గుంపుల వశంలో వుండిపోయింది. కట్టివేయబడిన ఆడ జింకలాగా అయిందామె పని.

భయం కలిగించే పెద్ద కళ్ళ రాక్షస స్త్రీలు భయపెట్టుతుంటే, తన ప్రియుడు, శ్రీకరుడు, దైవం అయిన మగాడిని సర్వదా ధ్యానించ సాగింది.

సర్గ-57

# అపశకునాలను కని పరితపించిన రాముడు

ఇక్కడ సీతాదేవి వ్యవహారం, సంగతులు ఇలావుంటే, అక్కడ దండకలో రాముడి సంగతి వేరే విధంగా వుంది. కామరూపి, మాంస భక్షకుడు, జింక రూపం ధరించిన వంచకుడు మారీచుడుని చంపిన రాముడు ఆశ్రమానికి రావాలని త్వర-త్వరగా వస్తుంటే, వెనుక పక్క నక్క కూత వినిపించింది. ఇది అశుభం తెలుపుతున్నది, దీనివల్ల కీడు కలుగుతుంది, అని భావించిన రాముడు, రాక్షసులు సీతను ఎత్తుకు పోయారేమో అని అనుమానిస్తాడు. దుష్టుడైన మారీచుడు తన గొంతు లాంటి గొంతుతో గట్టిగా అరిచాడనీ, ఆ ధ్వనిని సీత, లక్ష్మణుడు వింటే సీత తప్పక తన కోసం లక్ష్మణుడిని పంపుతుందనీ, లక్ష్మణుడు తనను వెతుక్కుంటూ అడవిలో సీతను ఒంటరిగా వదులుతాడనీ, ఆ తరువాత ఏమి కీడు జరుగుతుందోననీ శంకిస్తాడు రాముడు. తనలో తాను ఇలా అనుకుంటాడు రాముడు:

"ఔరా! ఏమి విచిత్రం? లోకంలో బంగారు జింక వుంటుందా? మారీచుడు నన్ను ఈ విధంగా మోసం చేసి దూరంగా తెచ్చి, నా బాణాలతో చస్తూ, వూరికే చావకుండా, సీతా...లక్ష్మణా...అని అరుస్తూ చావాలా? ఇదంతా ఆలోచిస్తుంటే, నాకు ప్రత్యక్షంగా కీడు చేయలేరు కాబట్టి రాక్షసులే మాయతో సీతకు కీడు చేయనున్నారా? కాబట్టి ఒంటరిగా వున్నా కలికి సీతకు, నా చిన్న తమ్ముడికి

క్షేమం కలగుగాక! జనస్థానవాసం కారణాన రాక్షసులతో అంతంలేని విరోధం కలిగింది. అపసకునాలు విస్తారంగా కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా నక్కల అరుపులు వినపడుతున్నాయి. ఏమి కీడు రానున్నదో? ఏ ఘోర విషయం చూడడం తటస్థిందో? ఏమి చేయగలం? సీతా లక్ష్మణులు ఏ గతి పట్టారో" అని వ్యసనపడ్డాడు రాముడు. నడుచుకుంటూ వస్తున్న రాముడికి మృగాలు, పక్షులు, కుడి నుండి ఎడమవైపుగా భయంకర ధ్వని చేసుకుంటూ పోవడం జరిగింది. ఇది చూసి, లక్ష్మణుడిని, సీతను గురించి ఆలోచించుకుంటూ ఆలశ్యం చేయకుండా పోసాగాడు రాముడు.

ఇలా పోతున్న రాముడు ఆశ్రమాన్ని సమీపించాడు. అక్కడే ముఖం వేలాడవేసుకుని, ఒంటరిగా వస్తున్నా తమ్ముడి చూశాడు. వెంటనే ఏదో కీడు జరిగిందని శంకించాడు. తమ్ముడిని సమీపించి, ఆయన ఎడమచేయి పట్టుకుని, విచారంగా మొదలు పరుశంగాను, తరువాత మృదువుగాను, ఇలా అన్నాడు. "అయ్యో లక్ష్మణా! ఏం పనిచేసావు? ఎందుకు ఒంటరిగా సీతను అడవిలో విడిచి ఇక్కడికి వచ్చావు? రాక్షసులు ఆ ఆడదాన్ని తిన్నారో? తీసుకుని పోయారో? ఈ రెండింటిలో ఒకటి జరిగి వుండాలి. సందేహం లేదు. అశుభ చిహ్నాలు కనపడుతున్నాయి. అన్నా! లక్ష్మణా! సీతాదేవి ప్రాణంతో వుండగా మనం చూడగలమా? లేదనుకుంటా. ఎందుకంటావా? అదిగో చూడు, విను. నక్కలు, పక్షులు, పెద్ద మృగాలు, సూర్యుడికి ఎదురుగా పరుషపు ధ్వనులు చేస్తున్నాయి. ఆ అపశకునాలు మనకెలా మేలు కలిగిస్తాయి? జింక లాగా కనిపించిన ఈ దుష్ట రాక్షసుడు మోసంతో నన్ను చాలా దూరం తీసుకుని పోయాడు. వాడి మోసపు ఆటలు అర్థంకాగానే చంపేశాను".

"లక్ష్మణా! ఎడమకన్ను అదురుతున్నది. సంతోషం మనస్సులో ఏమాత్రం లేదు. నాయనా, ఆశ్రమంలో సీత లేదు. పగ తీర్చుకోవడానికి రాక్షసులు ఆమెను పట్టుకుని పోయారో లేక వారి బాధ పడలేక ఆమే చనిపోయిందో లేక మనల్ని వెతుక్కుంటూ వచ్చి దారి తెలియక వేరే తోవలో ఎక్కడికైనా పోయిందో?"

సర్గ–58

# లక్ష్మణుడిని చూసి సీతను తలచుకుని దుఃఖపడిన రాముడు

రాముడు ఇంకా ఇలా అంటాడు: "ఇంట్లో సుఖం లేదని సాధారణంగా స్త్రీలు బాధపడుతుంటారు. స్త్రీల బుద్ధి ఇలా ఉన్నప్పటికీ, ఎవరూ చెప్పకపోయినా, బలవంతపెట్టకపోయినా, సుఖపడడానికి కాకుండా వినోదం చూడడానికి, దండకారణ్యంలో కాలినడకన తిరగడానికి నామీద భక్తితో సీత వచ్చింది. నేనెలాంటి వాడిని? రాజ్యహీనుడిని. దుఃఖంతో తపించేవాడిని. నిలువనీడ ఇవ్వడానికి పిలిచేవారు లేని ద్రిమ్మరిని. ఇలాంటి నేను నా కష్ట దశలో సహాయంగా వున్న, చేతనైన సుఖం కలిగించిన, జనకరాజ పుత్రికను వదిలి వచ్చానే, తమ్ముడా! నా భార్య ఏమైపోయిందో చెప్పవయ్యా? ఊపిరితో వుందా? లేదా?"

"నా ప్రాణాలు, దేహం నిలబడడానికి ఎవరైతే సహాయ పడ్డారో ఆమెను ఎడబాసి ఈ దేహాన్ని రక్షించలేను. అలాంటి ఆమె నా దగ్గర లేకపోతే సార్వభౌమత్వం కాని, ఇంద్రత్వం కాని కోరను. అట్లాంటి సుమకోమల సీత ఏదిరా లక్ష్మణా? అన్నా, లక్ష్మణా! నా ప్రాణాలకంటే నాకు ప్రియమైనది కావడం వల్లే నా ప్రాణం ఇచ్చెనా, నేనెవరిని రక్షించాలో అలాంటి సీత దండకలో ప్రాణాలతో వుందా? లేదా? అది ముందు చెప్పు. నేను పద్నాలుగు సంవత్సరాలు

అరణ్యంలో కోరతలేకుండా వుంటానని చెప్పాను. ఇప్పుడు సీత లేకపోతె నేను చెప్పిన మాట అసత్యం కాదుకదా? దానివల్ల రాముడు సత్యప్రతిజ్ఞుడనే గొప్పతనానికి హానికలగాడు కదా? నాయనా చెప్పరా! సీత మరణిస్తే, నేనూ మరణించినట్లే. మేమిద్దరం లేకపోతే నీకు ఈ అడవిలో పనేముంది? అయోధ్యకు వెళ్లు. నువ్వు అయోధ్యకు రావడం చూసి, నేను అడవుల్లో చావాలనుకుంటున్న కైక తన కోరిక నెరవేరిందని సంతోషిస్తుంది కదా?"

"లక్ష్మణా! సీతాదేవి ప్రాణాలతో వుంటే ఆశ్రమానికి వస్తాను. లేకపోతె, అంతదూరం రావడం ఎందుకు? ఇక్కడే చస్తాను. కాబట్టి, సీత జీవించి వుందా, లేదా చెప్పు. నేను వెళ్లేటప్పుడు జీవించి వ ఉన్న ఆమె, ముద్దులు ఒలుకుతూ, నవ్వుతూ, నాకెదురుగా వచ్చి మంచి మాటలు చెప్పకపోతే నేను ఆశ్రమానికి రాను. దానిముందే మరణిస్తాను. లక్ష్మణా! చెప్పు, సీత ప్రాణంతో వుందా? రాక్షసులు ఏమన్నా మింగారా? రాక్షసులు ఎత్తుకు పోయారా? అయ్యో ఆమె చిన్న వయసుది. మంచి స్వభావం కలది. విలాసంతో వున్నది. ఎక్కడుందో? ఏమో? మారీచుడి అరుపుకు సీత మోసపోయినా, నువ్వెలా మోసపోయావు? సీత పొమ్మన్నా రక్షించాల్సిన వాడివి అబలను ఒంటరిగా వదలి ఎలా వెళ్లావు? అలా వెళ్లి మనకు కీడు చేసే రాక్షసులకు అవకాసం ఇచ్చావు. రాక్షసులు ఆమెను చంపారో? ఏమో? ఇలా జరగవచ్చని కొంచెమైనా ఆలోచించావా? అయినా నిన్ను అని ప్రయోజనం లేదు. సముద్రంలో మునిగాను. చెడ్డాను, చచ్చాను. ఇంతకంటే ఎక్కువ ఏమికావాలి? ఈ గతి నాకు కలగాలని మీకీ బుద్ధి పుట్టించాడు." అని సీతకొరకై రాముడు వెక్కి-వెక్కి ఏడ్చాడు.

సర్గ–59

# సీతను విడిచి ఎందుకు వచ్చావని లక్ష్మణుడిని అడిగిన రాముడు

పర్ణశాలకు వెళ్తున్న శ్రీరాముడు తనను కలవడానికి వస్తున్న తమ్ముడు లక్ష్మణుడిని దారిలో చూసి శోకంతో తపిస్తూ ఇలా అన్నాడు.

"నువ్వు సీతను రక్షిస్తావని నమ్మి కదా సీతను ఒంటరిగా నీ స్వాధీనంలో వుంచి నేనిలా వచ్చాను? నేను కాపాడలేక నీకాపని అప్పచెప్పానా? ఆ స్త్రీరత్నాన్ని అడవిలో ఒంటరిగా వదలిపెట్టి ఇక్కడేదో మునుగిపోయినట్లు ఆదరబాదరాగా పరుగెత్తుకుంటూ వచ్చావు. నిన్ని చూసింది మొదలు నాకేదో భయంగా వుంది లక్ష్మణా. వచ్చినవాడివి సీతను కూడా తీసుకుని రావచ్చుకదా? ఆమె లేకుండా నువ్వు ఒక్కడివే రావడం దూరం నుండే చూసిన నాకు గుండె పగిలింది. ఎడమ భుజం, ఎడమ కన్ను అదిరాయి. అయ్యో! కొంప మునిగింది కదా అనుకున్నాను".

ఇలా రామచంద్రమూర్తి తనమీద నిందవేయడంతో, దోషం ఆరోపించడంతో, ఆయన పడుతున్న దుఃఖబాధను గమనించి, ఇంతకు పూర్వమే సీత మాట్లాడిన మాటలకే నొచ్చుకున్న లక్ష్మణుడు మరింత నొచ్చుకుని ఇలా జవాబిచ్చాడు అన్నకు. "అన్నా! ఆ ధ్వని నీ గొంతుక ధ్వని అని మోసపోయి స్వతంత్రించి నాకై నేను రాలేదు. 'సీతా, లక్ష్మణా, కావరే' అనే ధ్వని అరణ్యంలో కలూగగా సీత విని

భయపడి నన్ను పొమ్మని, నీమీద ప్రేమవల్ల నన్ను బలవంతపెట్టింది. అలా తొందరపెట్టడంతో, 'రాముడికి భయం లేదమ్మా....ఆయనకు అపాయం కలగచేసేవాడు లోకంలో లేడమ్మా....అది రాముడి గొంతు కాదమ్మా....ఎవడో మాయలమారి పనది అమ్మా....రాముడు తనను రక్షించమని మరొకరిని వేడుకుంటాడా?' అని ఆమెకు నమ్మకం కలిగేలా ఎంతో చెప్పాను. 'వదినా, ఎందుకమ్మా ఇంతగా భయపడతావు? రామచంద్రుడికి రాక్షసుల వల్ల యుద్ధంలో భయం కలుగుతుందా? ఇదేమిటమ్మా? ఆ గొంతు ఆయనదని నమ్మతగునా? అది ఆయన గొంతు కాదని, రాక్షసుడే అలా అరిచాడు. అమ్మా తొందరపడకుండా నిబ్బరించుకో' అని చెప్పాను".

"అన్నా! ఇంకా ఇలా అన్నాను. 'రామచంద్రుడనగా ఏమని తలచావమ్మా?దేవతలనైనా తన భుజబలంతో కాపాడగల ఆయన తనం ఉ రక్షించమని నిన్ను కోరుతాడా? ఇది నిజమని నీవెలా నమ్ముతావమ్మా? ఎవడో, ఏదో కారణంతో మా అన్న గొంతులాంటి గొంతుతో రక్షించమని అరిచాడు. ఆ ధ్వని మార్పు వింటే అది మా అన్నది కాదని అర్థమవుతుంది. కాబట్టి తొందరపడవద్దు. శాంతించు. నువ్వు కూడా నీచ స్త్రీలాగా దుఃఖపడవచ్చా? ప్రపంచంలో ఇంతవరకు పుట్టినవారిలో, ఇక ముందు పుట్టబోయేవారిలో యుద్ధంలో రామచంద్రుడిని ఎదిరించి గెలవగలవారు లేరు. కాబట్టి నీ మనస్సులో కలిగిన భయం వదలి నిశ్చింతగా వుండు. దేవతలందరూ ఏకమై వచ్చినా రామచంద్రుడిని యుద్ధంలో జయించలేరు. ఇక ఈ నీచ రాక్షసులు ఏం చేయగలరు?' అని నేను చెప్పగా మతిభ్రమ కలిగిన సీత ఇలా అంది. 'నువ్వు నన్నుకోరి అన్న చావాలన్న పాప చింతతో వున్నావు. నీ కోరిక కొనసాగుతుందా? లక్ష్మణా! నీ అభిప్రాయం తెల్సింది. నువ్వు నాకు సీత లభించేట్లు చేస్తే నేను నీకు సహాయం చేస్తానని నువ్వు, భరతుడు అంగీకారానికి వచ్చారు. ఆ ఒడంబడిక తరువాతే నువ్వు రాముడి వెంట వచ్చావు. అలా కాకపోతే తనను కాపాడమని అన్న అరిస్తే కాపాడడానికి పోని తమ్ముడు ఎవరైనా వుంటారా? నువ్వు రహస్య వర్తనం కల పగవాడివి కాని, రాముడికి తమ్ముడివి కాదు. ఎప్పుడు వీలవుతుందా, ఎప్పుడు సీతను హరిస్తానా? అన్న ఆశతో నా కోసమే నా మగడి వెంట వచ్చావు'. ఈ మాటలు వినగానే నా పెదవులు అదిరాయి. కళ్ళు ఎర్రగా అయ్యాయి. కోపం పట్టలేక, అక్కడ వుండలేక ఆశ్రమం వదిలి వచ్చాను. అన్నా! వున్నా విషయం చెప్పాను. "

## సీతను విడిచి రావడం తప్పని లక్ష్మణుడికి చెప్పిన రాముడు

లక్ష్మణుడు ఇలా చెప్పడంతో, రాముడు, "పాప రహితుడా! నువ్వు సీతను విడిచి రావడం సరైన పనికాదు. ఇప్పుడేమనుకున్నా ఏం ప్రయోజనం? స్త్రీలకు కోపం వస్తే ఏదో అంటారు. అందునా, భర్తకు కీడు కలిగిందని భయంతో, శోకంతో, పీడించబడ్డ వారి విషయం చెప్పాల్నా? ఇవన్నీ నువ్వు ఆలోచించకుండా సీత కోప్పడ్డదని నువ్వు కూడా కోపంతో నా శౌర్యం, నా శక్తి తెలిసికూడా ఆడదాన్ని ఒంటరిగా అడవుల్లో వదిలి వచ్చావే? ఏమనాలి నిన్ను? ఎదుటివారు కోప్పడితే నేనూ కోపగించుకోవాలి అనుకున్నావే కాని దానివల్ల కలిగే అపాయాన్ని ఆలోచించలేదుకదా? ఆడది నిన్ను కఠినంగా మాట్లాడిందని కోపగించి ఇలా రావడం తగునా? స్త్రీజాతికిది సహజం. తిట్టిన తిట్టనీ....మనపని మనం చేసుకుందాం...అని సహించి ఊరక వుండాల్సింది. నేను వచ్చిన తరువాత ఈ వృత్తాంతం అంతా చెప్పితే నేను విచారించేవాడిని కదా? నేను భార్య మాటలు విని నిన్ను సందేహించే వాడినని అనుకున్నావా? అలా కాకుండా దూరంగా విడిచి రావడం మంచిదా? నా ఆజ్ఞ జవదాటావుకదా? తల్లితండ్రుల ఆజ్ఞలు పరస్పర విరుద్ధమైనప్పుడు నేనెలా ప్రవర్తించానో అనేది కూడా ఆలోచించ లేదుకదా? జింక శరీరంతో ఆశ్రమం నుండి నన్ను తీసుకువచ్చిన రాక్షసుడు, నేనొక బాణం వేయగా, అది తగిలి జింక శరీరం వదిలి, రాక్షస వేషంలో తీక్షణమైన నా బాణాల దెబ్బలను సహించలేక ప్రాణాలు కోల్పోతూ దూరంగా వినపడేట్లు నా గొంతులాంటి గొంతుతో, నేనే అరచినట్లు అరవగా అది విని నువ్వు సీతను విడిచి వచ్చావు".

సర్గ-60

# పర్ణశాలలో సీతలేకపోడం చూసి దుఃఖపడ్డ శ్రీరాముడు

రాముడు తాను చెప్పదలచుకున్న మాటలను లక్ష్మణుడికి చెప్పి, త్వర-త్వరగా ఆశ్రమం వైపు అడుగులు వేస్తుంటే, ఎడమకన్ను కిందిభాగంలో అదిరింది. కాళ్లు కూలబడ్డాయి. దేహం వణకడం మొదలైంది. ఆయన తనకు కలుగుతున్న అపశకునాలకు వ్యాకులపడుతూ, "సీతాదేవి ఇంకా క్షేమంగా వున్నదా? నేనామెను చూడగలనా?" అనుకుంటాడు. ఇలా అనుకుంటూనే తన ఆశ్రమంలో ప్రవేశిస్తాడు. అక్కడ సీత లేకపోవడం చూసి దుఃఖంతో భ్రమ చెందిన వాడై, చేతులు జోడించి ఆశ్రమాన్ని పరికించి చూశాడు. గృహలక్ష్మి లాంటి స్త్రీరత్నం సీత లేని కారణాన కమలాలు లేని కొలనులాగా, వాడిపోయి ఏడుస్తున్న వృక్షాల లాగా, కాంతిహీనమైన వనం లాగా, పాడుబడ్డ తన ఆశ్రమం ప్రవేశించి వెదికిచూసిన రాముడు సీత లేదని నిశ్చయించుకుని, మనసు కలత చెందగా ఆమెను తలచుకుని ఏడ్చాడు.

సీత ఏమైందోనని రకరకాల ఆలోచించడం మొదలెట్టాడు. "సీతను రాక్షసులు పగబట్టి ఎత్తుకు పోయారా? క్రూర మృగాలు భక్షించాయా? ఏదైనా కారణాన ఎక్కడికైనా పోయిందా? పరిహాసం కోసం ఎక్కడైనా దాక్కున్నదా? ఒక్కతే ఆశ్రమంలో వుండలేక అడవుల్లోకి పోయిందా? పూలు-పళ్ళు తేవడానికి

ఎటైనా పోయిందా? సరస్సు దగ్గరికి స్నానాకి పోయిందా? మంచి నీళ్లు తేవడానికి వెళ్ళిందా? ఎక్కడి పోయి వుంటుంది? నేనేం చేయాలి? ఎక్కడ వెతకాలి? ఎలా వెతకాలి? ఈ పాడు అడవిలో ఎవరిని అడగాలి?" అనుకుంటూ, సీతను వెతికి-వెతికి కళ్ళు వుబ్బేట్లు రామచంద్రమూర్తి ఏడ్చాడు. దుఃఖం ఎక్కువవతుంటే ఎర్రగా అవుతున్న కళ్ళతో, వికారమైన చూపులతో, పిచ్చి పట్టిన వాడిలాగా, మూర్ఖుడిలాగా ఏడ్చాడు. తనకెవరు దిక్కని అనుకున్నాడు.

## సీతను వెతికిన రాముడు

సీతాదేవి దాక్కున్నదేమో అని చెట్టు-చెట్టు దగ్గరకూ పరుగెత్తాడు రాముడు. గుట్ట-గుట్టకూ పరుగెత్తాడు. బాగా ఏడ్చాడు. తనను ఇలా చిక్కులు పెట్టడం తగునా ప్రియురాలా అనుకున్నాడు తనలో. దీనంగా ఏడ్చాడు. ఏడుస్తూ..."దొండతీగా, దొండపండులాంటి పెదవికలదానిని చూశావా? కడప చెట్టా, నీ పూలంటే ఇష్టపడే నా ప్రియురాలిని చూశావా? చిలుకా, నీ లాగా పలికే దాన్ని చూశావా? మారేడు పండా, నీ లాంటి స్తనాలుకలదానిని చూశావా? మద్ది, నీ పండ్లంటే ఇష్టమైన దాన్ని వీక్షించావా? జింకల మందలారా, మీ కళ్లలాంటి కళ్లున్నదాన్ని వీక్షించారా? కకుభమా, నీ లాంటి తొడలు కలదాన్ని కాంచారా? ఏనుగా, నీలాగా నడిచే దాన్ని తిలకించావా? తిలకమా, స్త్రీలలో శ్రేష్టురాలైన నా ప్రియురాలిని కంటివా? నేరేడా, నీవైనా నిజం చెప్పు....నీ పళ్ళలాగా నున్నగా, మినమిన మెరిసే దేహకాంతికల దానిని ఈ అడవిలో చూశావా? అశోకమా, నువ్వు శోకాన్ని పోగొట్టే దానివి కాబట్టి నీకా పేరు వచ్చింది. నేను శోకంతో బాధపడుతున్నాను. సీతాదేవి వృత్తాంతాన్ని చెప్పి నన్ను నీ పేరు కలవాడిగా చేయి". అని అంటాడు రాముడు.

ఇంకా ఇలా సాగింది రాముడి వెతికే ప్రక్రియ. "ఓ తాటిచెట్టా, నా మీద నీకెందుకీ కోపం? నీ ఫలాల లాంటి కుచాలున్న స్త్రీ నీ దగ్గరకు రాలేదా? మామిడీ, నీ దయ ఎలాంటిదో చూస్తాను. నీ క్రొంజిగురువంటి అరచేయి కలదానిని నువ్వు చూడలేదా? ఓ నీపమా, నువ్వు చెట్లకు రాజువి. నీ పూలలాంటి పెదవికలదానిని చూడలేదా? నిమ్మా, ఎందుకు నీకింత కోపం? పిలిచినా పలకవేంటి? నీ పండ్ల లాంటి పాలిండ్లు కలదానిని చూశావా? పాటలమా, నీ పువ్వుల లాంటి ఎర్రటి పెదవులు కలదానిని చూశావా? కొత్త ఉసిరికా, కొత్త వయసులో వున్నదాన్ని నువ్వు చూశావా? సరళమా, సరళమైన హృదయం కలదాన్ని చూడలేదా? మల్లె

తీగా, తీగెలాంటి శరీరం కలదాన్ని చూశావా? అడ ఏనుగా, నీ ముక్కు లాంటి తొడలు కలదానిని; ఆడ జింకా, నీ కళ్ళలాంటి కళ్ళు కలదానిని; తుమ్మెదా, నీలాగా నల్లనైన వెంట్రుకలు కలదానిని; సింహమా, నీ నడుం లాంటి నడుం కలదానిని; మీరేనుగులాగా నడిచే దానిని చూడలేదా?"

ఇంకా ఇలా కొనసాగుతుంది రాముడి వెతకడం. "మనోహరమైన జింకలారా, జింక కళ్ళ లాంటి కళ్ళు కలది మీదగ్గరున్నదా? మీరైనా చెప్పండి. గజరాజమా, ఏనుగులాగా నడిచేదాని పోయిన జాడ నీకు తెలిసే వుండవచ్చు. చెప్పు. పులీ, ఎందుకు నీకు సందేహం? నువ్వు మింగావని నేనలేదు. సీత ఎక్కడి పోయిందో చెప్పు. ఓసీ కోకిలా, నీ కంఠం లాంటి కంఠంకలది ఎక్కడికి పోయిందో చెప్పు. నీకు తెలిసే వుండాలి. చిలుకా, నీలాగా పలికే దాన్ని చూశావా? హంసమా, హంస గమనను నువ్వు చూశావా? తుమ్మెదా, తుమ్మెదల లాంటి జడకల దాన్ని చూశావా? అయ్యో, నామీద దయవుంచి సీత ఏమైందో చెప్పండి. కాంతా, పోవద్దు...నిలు–నిలు. మన్మథపుష్పబాణమా, నీ హృదయం ఇంత దయలేనిదా? ప్రాణ సఖీ, ఎందుకు నామీద అలిగావు? ఇది పరిహాస సమయమని కులుకుతూ–కులుకుతూ పరుగెత్తుతున్నావు. నేనది చూశాలే! నీ చీరే నాకు కనిపించింది. నల్లటి వెంట్రుకలు కలదానా, ఇలా నేను చూసి పిలిచినా పలకవేంటి? కోపమా? నన్ను రక్షించు".

ఇలా అడిగిన దాన్నే అడిగి, చెప్పిన మాటే చెప్పి, పోయిన చోటుకే మళ్లీ పోయి, అక్కడ సీత లేనందున మనసులో తల్లడిల్లుతు మూర్ఛపడి, లేస్తూ, సొక్కుతూ, ఆరాటపడుతూ, ఆ అడవిలో సీతను వెతికినా ఎక్కడా కనపడలేదామె.

## సీత రాక్షసుల చేతిలో చనిపోయిందని విలపించిన రాముడు

ఎంతగానో కలతచెందిన మనసుకల శ్రీరామచంద్రుడు, సీతాదేవి రాక్షసుల చేతిలో చిక్కి మరణించిందేమోనని అనుమాన పడతాడు. అలా కాకపోతే ఇంతలోనే ఎక్కడి పోయి వుంటుందని అనుకుంటాడు. "అయ్యో! అందమైన కమ్మలతో, చంద్రబింబం, కమలాలతో సమానమైన సీత ముఖం ఇప్పటికే ఎంత వాడిపోయిందో కదా? మనోహరమైన సంపెంగ పూవు లాగా వుండే ఆమె పచ్చని దేహంతో ముత్యాల సరాలు ఆమె వంటిమీద వేలాడుతుంటే, ఆమెను అదే పనిగా అరుస్తుంటే రాక్షసులు నరికి వేశారేమో? చిగురైన, కోమలమైన ఆమె చేతులను తెగేవిధంగా విరిచి చెరుకు తుంటలాగా తింటున్నారేమో? చెరకు తుంటలాగా

భావించి ఆమె నడుమును ఏనుగు లాగా విరిచి పాపాత్ములు తింటున్నారేమో? దుష్ట రాక్షసులు సీతను చంపారేమో? అన్నా! లక్ష్మణా! నేను చిత్త భ్రమలో వున్నాను కాబట్టి, బహుశా, నాకు సీత కనపడలేదేమో? నీకైనా కనిపించిందా? చిన్నారి చిన్నదానా! నిన్ను నేను మళ్లీ చూడగలనా?" ఇలా ఏడుస్తూ శ్రీరాముడు వేగంగా ఒక వనం తరువాత మరో వనంలొ వెతుకుతూ, భ్రమతో, సీతా–సీతా అని పిలుస్తూ వెర్రివాడిలాగా శోకించాడు.

సర్గ-61

# రాముడికి సమాధానం చెప్పిన లక్ష్మణుడు

సీతాదేవిని తలచుకుంటూ శ్రీరాముడు భయంతో, శోకంతో రెండు చేతులెత్తి "హా" అని ఏడ్చాడు. అలా ఏడుస్తూనే, "ఏరా తమ్ముడా! లక్ష్మణా! సీత ఆశ్రమంలో లేదుకదరా? ఎక్కడికి పోయిందో కదరా? ఘాతుకంగా ఏదైనా తిన్నదేమో? ఎవరైనా ఎత్తుకుని పోయారేమో కదరా? కమలాల లాంటి కళ్ళున్న సీతాదేవిని విడిచి నేను ఒక్క నిమిషమైనా బ్రతకగలనా? నా చెలీ! మళ్లీ నిన్ను కళ్లారా చూడగలనా? అయ్యో! స్త్రీ రత్నమా! బాలా రత్నమా, నా ఏడుపు అలా వుండనీ, నువ్వు మచ్చిక చేసుకున్నందున నీతో తిరిగిన క్రీడామృగాలు నిన్ను విడిచినందువల్ల విశేషంగా ఏడుస్తున్నాయే? అదికూడా నీకు తెలియదా? సీతాదేవిని విడిచిన దుఃఖాతిశయంతో మరణించి స్వర్గానికి పొతే, అక్కడ నా తండ్రి 'ఏమిరా! రామా! నీకు నేనేం చెప్పానురా? పద్నాలుగు సంవత్సరాలు అడవిలో వుండమన్నాను కదా? ఆ గడువు ముగిసిందా? ఇక్కడికి వచ్చావెందుకురా? ఛీ!' అని అసత్యవాదిని, మోసగాడిని, మర్యాద తప్పినవాడిని అయిన నన్ను చీవాట్లు పెట్తాడు. నా మంచి కీర్తి అంతా వదిలిపోయే విధంగా నామీద దయలేకుండా నన్ను వదిలి నువ్వు ఇలా పోవచ్చా? నన్ను విడిచి నువ్వు ఎక్కడికో పోగాలిగావు కాని, నేనలా పోలేను కదా? ఇంక నా గతేంటి? ఈ

శరీరాన్ని నేనెలా మోసుకుని తిరగ్గలను?" అంటాడు.

సీతాదేవిని ఇలా వెతుక్కుంటూ బురదలో మునిగిన ఏనుగులాగా సహించలేని బాధతో వున్న అన్నకు లక్ష్మణుడు హితవాక్యాలను చెప్పడిలా.

"అన్నా! ఎందుకిలా దుఃఖంతో బాధపడతావు? ఈ వంకల్లో, వాగుల్లో, గుహలలో, లోయలలో, కానలలో, కోనలలో, కొండగుహల్లో, సీతను వెతికితే ఆమె కనిపించదా? ఎక్కడా వుండకుండా ఎక్కడికి పోతుంది? దీరుల్లో శ్రేష్టుడా! లే..లెమ్ము. సీతాదేవికి వనసంచారం అంటే ఇష్టమని నీకు తెలియదా? స్నానానికే పోయిందో, వికసించిన కమలాల కోసమే పోయిందో, నవ్వులాటకై దాక్కుందేమో లేక మనల్ని భయపెట్టడానికి దాక్కుందేమో? సీతాదేవి ఎక్కడికి పోగలదు? మనం ప్రయత్నం చేసి వెతుకుతే దొరక్క పోతుందా? అవశ్యం దొరుకుతుంది. నువ్వు బాధను వదలుకో. దుఃఖపడవద్దు". ఈ మాటలు విన్న రాముడు మళ్లీ లేచి అడవిలో తిరిగి వెతకడం మొదలుపెట్టాడు.

కొండలు, గుట్టలు, కోనలు, నదులు, కాన్లు, కొలకులు వెతికి-వెతికి సీతాదేవి జాడ లేకపోయేసరికి రామచంద్రమూర్తి లక్ష్మణుడితో ఇలా అన్నాడు. " లక్ష్మణా! దండకారణ్యం అంతా వెతికాం. వృధా కష్టం అయింది కదా? ఆ మదగజగామిని ఎక్కడికి పోయిందో,ఏమో? నేనేమి చేయాలిప్పుడు?". జవాబుగా లక్ష్మణుడు, "అన్నా, పూర్వం బలి దగ్గరనుండి బలాత్కారంగా భూమిని గ్రహించినట్లు నువ్వు సీతను మళ్లీ పొందగలవు". అప్పుడు రామచంద్రమూర్తి ఇలా అన్నాడు.

"ఈ ప్రదేశమంతా వెతికాం. శ్రమ కలిగిందే కాని సీతైతే కనబడలేదు. ఈ పర్వతంలో అనేక గుహలున్నాయి. ఎక్కడని మనం వెతకగలం?" అని అంటూ, కాసేపు మూర్ఛపోవడం, కాసేపు నేలమీద పడడం, కాసేపు ఏడవడం, "బాలా! సీతా! సీతా! ఎక్కడికి పోయావే?" అని నేలమీద పడిపోయాడు. తమ్ముడు లక్ష్మణుడు సమాధాన పరచడానికి ఏవేవో మాటలు చెప్పినా వాటిని అంగీకరించకుండా దుఃఖంతొ బాధపడుతూ పరితపించాడు. సీతాదేవిని కానక రామచంద్రుడు, తానూ భరించాల్సిన భార్యను ఆపదల నుండి రక్షించ లేదే అనుకుంటాడు. ఆశ్రితురాలైన పతివ్రతను వదలడం మహా పాపకార్యం అనుకుంటాడు. మన్మథ బాణ పీడితుడైన రాముడు "సీతా" అని గట్టిగా ఏడ్చాడు.

సర్గ-62

# ఉన్మత్తుడి మాదిరి దుఃఖిస్తూ సీతను తలచుకున్న రాముడు

వాస్తవానికి సీతాదేవి తన ఎదురుగా లేకపోయినా, మన్మథతాపం వల్ల కళ్లకు కట్టినట్లు దగ్గరే వున్నట్లు భావించిన శ్రీరాముడు, ఆ సీతను గురించి గద్గద స్వరంతో, మాట కూడా సరిగ్గా రాకుండా, తన బాధ ఇలాంటిదని చెప్పనలవి కాకుండా, విచారంతో చాలా-చాలా అన్నాడు, తనలో అనుకున్నాడు.

"జానకీ! కొత్త పూలమీద నీకున్న ప్రేమ వల్ల అశోకవృక్షం కొమ్మ పూల చాటున దాగావులే! తెలుసుకున్నాను. నేను కనుగొన్న తరువాత కూడా దాక్కోవడం ఎందుకు? లీలావతీ! నీ అందమైన తొడలు అరటి బోదెలలాంటివి కదా? అందువల్ల, కదలీ వృక్షాల మధ్యన వున్నా నువ్వు అందంగా ఉన్నందున అవి నాకు కనపడుతున్నాయి. దాచిపెట్టడం నీకు సాధ్యమా? విశాలమైన, దీర్ఘమైన కళ్ళుకలదానా! కొండగోగు పూలకని కొండగోగు వనానికి పోయి నవ్వులాటకు నన్ను పరిహాసం చేయడం నీకు ధర్మమా? నిన్ను చూడలేక బాధపడుతున్నానే? సీతా! నువ్వు పరిహాసప్రియవని నాకు తెలుసు. అయితే, ఇది పరిహాసానికి సమయమా? తిరిగి-తిరిగి, ఏడిచి-ఏడిచి, చాలా అలసిపోయాను. ఇలాంటి ఆపద సమయంలో నాతొ ఎగతాళి ఎందుకు?"

"అన్నా! లక్ష్మణా! నేనింతగా పిలుస్తున్నానే? ఒకవేళ వుంటే, 'ఓ'...

అనుకుంటూ పలికి రాకపోయేదా? శత్రువులు మింగారో? ఎత్తుకునే పోయారో? రెంటిలో ఒకటి జరక్కపోతే సీత కనపడకుండా వుండదు. ఈ మృగాలు కన్నీళ్లు కారుస్తూ సీతను రాక్షసులు తిన్నారని దుఃఖపడుతున్నాయి. ఎక్కడికి పోయావే సీతా? ఎక్కడున్నావే? నీ కారణాన, కైక నన్ను చంపదల్చుకున్న కోరిక నెరవేరుతుందా? జానకితో అరణ్యానికి వచ్చి, జానకిని పోగొట్టుకుని, గడువు తీరగానే నేనేమని అంతఃపురానికి పోతాను? పోయినా, లోకులేమంటారు? రాముడు అసమర్థుడనీ, చూపు గుర్రమేకాని సత్తువలేదనీ, సత్తువ వున్నా జానకి మీద దయలేనివాడనీ, అందుకే ఆమెను దక్కించుకోలేక పోయాడనీ, అనరా? ఒకరన్నా, అనకపోయినా, సీతలేకపోతే నాకు సుఖం ఎక్కడిది? ఎకపత్నీవ్రతుడను కదా! భార్యలేనివాడి బతుకు పాడేకదా? శిఖం ఎక్కడినుండి వస్తుంది?''

"అరణ్యంలో మనం కాపురం చేయాల్సిన గడువు త్వరగా తీర్చి అయోధ్యకు పోగానే, కూతురు, అల్లుడు చాలాకాలానికి తిరిగి వచ్చారని జనకుడు చూడడానికి వచ్చి, సంతోషంతో, 'అల్లుడా! అందరూ క్షేమమా?' అని అంటే నేనేమని చెప్పాలి? 'మీకూతురు తప్ప' అని చెప్పాల్నా? చెప్పడం సరే...ఆయన ముఖం నేనెలా చూడాలి? జానకి లేదనే వార్తా ఆయన చెవుల పడిందా, కడుపు దుఃఖాన తన బిడ్డను తలచి-తలచి శోకంతో తపించి-తపించి, సగం చచ్చిపోతాడు కదా? నేను ఇంటికి పోగానే, మా అమ్మ కౌసల్యాదేవి ఎదురుగా వచ్చి, 'కుమారా! నాకోడలు ఏదిరా?' అని అడిగితే నేనేమని చెప్పాలి? ఆ తరువాత మీ అమ్మ వచ్చి, 'రామచంద్రా! ఏదిరా జానకి?' అంటుందే? ఏమని చెప్పడానికి నోరెలా వస్తుంది? ఆ తరువాత కైకమ్మ కల్లబొల్లి చిరునవ్వుతో పరిహాసంగా 'సీతను అడవికి దారబోసి వచ్చావా' అంటుందే? నేనేమని అబద్ధం చెప్పాలి? భరతశత్రుఘ్నులు వచ్చి 'అన్నా! మా వదినె రాలేదా ఏమి?' అని ప్రశ్నిస్తారు కదా! ఏమని జవాబివ్వాలి? సీత రాలేదు, రాముడు ఒక ఆడదాన్ని కాపాడలేక పెళ్లాన్ని రాక్షసుల పాల్చేసి తాను మాత్రం వచ్చాడని పలచగా మాట్లాడేవాళ్ళ నోళ్లు ఎలా మూయించాలి? లక్ష్మణా! నేనేం చేయాలి? ఇప్పుడు నేను చెప్పినదంతా పోనివ్వు. భరతుడి పురానికి రాను. స్వర్గానికి పోతాననుకో. సీత లేని కారణాన అదికూడా శ్మశానంలా శూన్యంగా కనపడుతుంది''.

## లక్ష్మణుడిని అయోధ్యకు పొమ్మన్న రాముడు

“లక్ష్మణా! నువ్విక్కడ ఇంకా ఆలశ్యం చేయకుండా అయోధ్యకు పో. భరతుడిని గట్టిగా కౌగలించుకుని, నేను చెప్పానని, నా మాటలుగా ఇలా చెప్పు: ‘భరతా! నువ్వు శాశ్వతంగా రాజువై రాజ్యాన్ని పాలించు. ఇది రామాజ్ఞ’ అని చెప్పు. ఇంత కార్యం చేసిన మా తల్లి కైకకు, మీ అమ్మకు, కౌసల్యకు, నా ఆజ్ఞగా నమస్కారం చేయి. మా అమ్మను చాలా–చాలా అడిగానని చెప్పు. సీత పోయిన వ్యవహారం, నా చావు గురించి కూడా చెప్పు. అన్నివిధాలా నువ్వు ఆమెను జాగ్రత్తగా చూసుకో. నాయనా! ఇక పోయిరా. నీకు మేలు కలుగుగాక. నాయనా! నేను లేకుండా నువ్వు అడవుల్లో తిరగాల్సిన పనిలేదు. సీతాదేవి లేకుండా దేహంలో ప్రాణాలుండవు”.

ఇలా వెల–వెలబోతూ, అతిశయించిన బాధతో రాముడు సీతాదేని తలచుకుంటూ మాట్లాడుతుంటే, దుఃఖపడుతుంటే, లక్ష్మణుడు చలించిన మనస్సుతో కలవరపడ్డాడు.

సర్గ–63

# శ్రీరాముడి శోకం

ప్రియురాలినీ, ఆమెకు కలిగినా అపదనూ స్మరించడం వల్ల కలిగిన పరవశత్వంతో, ప్రియవిరహం వల్ల కలిగిన శోకంతో, తనకు కలిగిన దుఃఖానికి తనలాగే శోకిస్తున్న తమ్ముడు లకష్మణుడితో రామచంద్రమూర్తి ఇలా అన్నాడు.

"శోకం మీద శోకం విశేషంగా ప్రాప్తించి నా గుండెలు పగిలేట్లు కళవళ పరుస్తున్నాయి. ఈ లోకంలో నాలాంటి మహాపాపి మరొకరు వుండరు. పూర్వజన్మలో నేను విస్తారంగా ఎన్నో పాపాలను చేసిన కారణాన ఈ జన్మలో వాతి ఫలితంగా పెద్ద దుఃఖం మీద దుఃఖంలాగా ఇలా సంభవించింది. ఒకటివెంట ఇంకొక కష్టం ఏమిటంటే....చెప్తా విను. మొదటిది...న్యాయంగా రావాల్సిన రాజ్యం నాకు రాకపోవడం. ఆ కారణాన నా మేలు కోరిన ముఖ్య బంధువులందరినీ వదలడం. నాకొరకై తండ్రి చావడం. తల్లిని దిక్కులేనిదానిగా చేసి నేను అడవులకు రావడం. ఇవన్నీ ఈ శరీరాన్ని దహించి వేస్తున్నాయి. ఇప్పుడు భార్యను పోగొట్టుకోవడంతో అవన్నీ జ్ఞాపకానికి వచ్చి రగులుతున్న అగ్నికి కట్టెలు చేర్చినట్లె భగ్గున మండుతున్నాయి. ఎవడో రాక్షసుడు బలాత్కారంగా ఈడ్చి పట్టుకుని ఆకాశాన పరుగెత్తగా భయపడ్డ సీతాదేవి మారుపడ్డ గొంతుతో దిక్కులేనిదానిలాగా ఏడవకుండా వుంటుందా? బలవంతంగా తీసుకునిపోయి ఏం చేయగలడు? వశపర్చుకోవడం సాధ్యంకాని

పని. కాబట్టి కోపంతో చంపి వుండవచ్చు. చంపి, ఎర్ర చందనం పూయడం వల్ల, అందమైన, మనోహరమైన ఆమె కుచాలు నెత్తురు ధారలు కారేట్లు ఎవరో దుష్టుడు చేస్తే ఆమె అందం చెడిపోయిందేమో? మృదువైన ఆమె తీయటి మాటలు, ఆ నల్లటి వెంట్రుకలు, అందమైన ముద్దులు కారే ముఖం, రాహువు చేతిలో చిక్కి దుఃఖపడే చంద్రుడిలాగా కాన్తిహీనమై పోయిందేమో?"

"ముత్యాలహారాలు వేలాడే ఆమె మెడను చీల్చి నీచమైన మనసు కలవారెవరైనా ఆమె నెత్తురు తాగారేమో? నేను ఒంటరిగా అడవిలో నడిచిపోయిన కారణాన రాక్షసులు హింసిస్తే ఆమె ఏడవకుండా వుంటుందా? ఇది గోదావరీ నది. దీనిమీద సీతకు అమితమైన ప్రేమ. ఇక్కడికి ప్రతిరోజూ వస్తుంది. ఇక్కడున్నదేమో? వుండదు. ఎందుకంటే ఎన్నడూ ఇక్కడికి ఒంటరిగా రాలేదు. పద్మంల లాంటి ముఖం, పద్మం లాంటి కళ్ళు కల పద్మిని, సీతాదేవి, పద్మాల కోసం గోదావరీ నదికి వచ్చిందేమో? ఒంటరిగా ఎన్నడూ ఇల్లు విడిచి వెళ్ళని సీత ఇవ్వాళ ఇక్కడికి వస్తుందా? రాదు. అసమానమైన పూల సమూహాలతో అందంగా, ఆడే తుమ్మెదలు, ఆడే చిలుకలు, పక్షులు వున్నా ఈ పూలపొద దగ్గరికి వచ్చిందేమో? వచ్చి వుండదు. ఎందుకంటే, సీత పిరికిది....ఒంటరిగా రావడానికి ప్రయత్నం చేయదు".

ఇలా వెతికి–వెతికి ఎక్కడా సీతను చూడలేక జగచ్చక్షువు కాబట్టి, తన వంశానికి మూలపురుషుడైన సూర్యుడిని అడగడం ప్రారంభించాడు. "రవీ! నీకు నమస్కారం. లోకంలోని అందరి సత్య ప్రవర్తన, అసత్య ప్రవర్తన తెలిసినావాడివి కదా! నా భార్య ఎక్కడికి పోయింది? ఎవరైనా ఎత్తుకు పోయారా? చెప్పు".

ఆకాశాన వున్న సూర్యుడికి భూమ్మీద గృహాలలో జరిగే విషయాలు చూసి వుండకపోవచ్చని వాయుదేవుడిని అడగసాగాడు. "వాయుదేవా! నీకు తెలియని విషయం లోకంలో లేదు. సీత మరణించిందా? లేక, ఎవడైనా అపహరించాడా? ఈ అడవుల్లో ఎక్కడైనా చిక్కుకుని దారి తెలియక ఇబ్బందుల్లో పడిందా? ఆలశ్యం చేయకుండా చెప్పు".

ఈ విధంగా రామచంద్రమూర్తి విలపిస్తుంటే ధైర్యవంతుడైన లక్ష్మణుడు రాముడిని ఉరట పరచడానికి కాలానుగుణమైన కొన్ని మాటలు చెప్పాడు ఇలా. "అన్నా! ఏడవవద్దు. సంతాపంతో శుష్కించి విచారించవద్దు. ధైర్యంగా వుండు. శోకంతో కృశించవద్దు. స్త్రీరత్నమైన సీతాదేవిని వెతుకుదాం. మహాత్ములైన వారు కష్టమైన పనులు చేయడానికి కొంచెం కూడా బాధపడరు".

(స్త్రీపురుషుల సంయోగం వల్ల కలిగిన దేహం భగవంతుడికి లేదు. అయినా విష్ణుమూర్తి ఇతర అవతారాలలాగా కాకుండా రామావతారం దోషరహితమై, చైతన్యం కలదై, నిత్యసుఖ స్వరూపమైన తన శరీరాన్ని ప్రకాశించేట్లు చేసింది. రామచంద్రమూర్తిలో రావణుడికి భగవంతుడనే బుద్ధి లేకుండా చేసి వాడికి మోక్షం లేకుండా చేయడమే రామచంద్రుడి శోకానికి ఫలం అని చెప్పడం జరిగింది. రావణుడి చేత సీతను అపహరించేట్లు చేయడం, వాడి పుణ్యాన్ని నాశనం చేసి, వాడిని తన చేతిలో చంపబడేట్లు చేయడమే. గొప్ప తపస్సు చేసి సంపాదించిన బలం కల రావణుడిని అంతకంటే అధిక తపోబలం లేకుండా చంపడం సాధ్యపడదు. దేవతలు అంతకంటే ఎక్కువ తపస్సు చేయలేరు. కాబట్టి, వాడికి అనుచితమైన అనురాగం సీతమీద కలిగించి, దానివల్ల వాడిని మోహితుడిని చేసి, రావణుడి తపశ్శక్తి నాశనం చేసి, దేవతలా కార్యం సాధించాలని లక్ష్మీదేవితో కలిసి ఆలోచించి సీతాతో సహా అవతరించాడు విష్ణువు.

రామచంద్రమూర్తి మాయామానుషవేశాధారి అని అంగీకరించాలి. కర్మబద్ధులై జన్మించిన ప్రాకృత జనులు ఎలా ప్రవర్తించారో ఆయనా అలానే చేశాడు. భార్య మీద ప్రేమగల మనుష్యులు ఆమెను పోగొట్టుకుంటే ఎలా ఏడుస్తారో రాముడు కూడా అలానే చేశాడు. కన్నీరు కార్చడం. ఏడవడం, సత్యమే కాని అది తామస శోకం వలన కలిగింది కాదు.

జయ–విజయులకు మూడో జన్మలోకాని ముక్తిలేదనే విషయం భగవంతుడికి తెలుసు. రావణ–కుంభకర్ణులది రెండవ జన్మే కాబట్టి ముక్తిలేదు. భగవంతుడు రావణుడికి మోక్షం లేకుండా చేయడానికి వాడికి దుర్బుద్ధి పుట్టించి వాడితో ఒక అకార్యం చేయించి అది నెపంగా వాడిని వధించాడు. లోక శిక్షకోసం వచ్చినవాడు కదా భగవంతుడు).

సర్గ-64

# సీత పోయిన మార్గం రాముడికి సూచించిన అడవి మృగాలు

లక్ష్మణుడి మాటలకు జవాబుగా శ్రీరాముడు తమ్ముడితో, "లక్ష్మణా! నువ్వు గోదావరీ నది దగ్గరకు వెళ్లు. అక్కడ సీతాదేవి పద్మాలు కోయడానికి వెళ్లి వుండవచ్చు" అని అనగానే లక్ష్మణుడు అలాగే అంటూ, గోదావరీ తీరానికి వెళ్లాడు. అక్కడ "ఓ సీతమ్మా! ఓ వదినమ్మా!" అని ఎంత అరిచినా బదులు మాట వినపడలేదు. అక్కడ అంతా వెతికి సీత కనబడనందున ఆ వార్తను అన్న రామచంద్రమోర్తికి తెలిపి ఇలా అన్నాడు. "ఎంత వెతికినా ఆ సీతాదేవి ఆకారం కనబడలేదు. ఆమె ఎక్కడికి పోయిందో జాడ లేదు. పిలిచినా సీత పలకలేదు".

లక్ష్మణుడి మాటలకు రామచంద్రుడు నదిని చూసి, "తల్లీ! గోదావరీ! చిగుళ్ల లాంటి పాదాలుకల నా సీత ఇక్కడికి వచ్చిందా? మరెక్కడికైనా పోయిందా? దొంగ ఎవడైనా వచ్చి హరించుకు పోయాడా? చెప్పు" అని ప్రశ్నించాడు. జవాబు చెప్పమనీ, రావణుడే హరించాడని తెలియచేయమనీ, భూతాలు ఎంత సూచించినా రావణుడు ఏం చేస్తాడోనన్న భయంతో రామచంద్రమూర్తి ఎంతగా ప్రార్థించినా గోదావరీ నది ఏమీ చెప్పలేదు. ఇలా నది మౌనం వహించడంతో ఇక సీతాదేవి లభించే ఆశ లేదనుకున్నాడు రాముడు.

అప్పుడు తనలో తానే ఇలా అనుకుంటాడు రాముడు: "సీత తండ్రి, నా తల్లి,

సీత ఏదని అడుగుతే నేనేమని చెప్పాలి? రాజ్యాన్ని పోగొట్టుకుని అడవుల్లో దొరికే కందమూలాలతో కడుపు నింపుకుని, కష్టాలను తన మనస్సుకు రానీయకుండా కాపాడే ఆ కమలాక్షి అడవిలో ఎక్కడికి పోయిందో? నా గతేంటి అని అనునిత్యం విచారిస్తూ, ఆదరిస్తూ, వుండే సీతాదేవి లేని కారణాన నిద్ర లేకపోవడంతో రాత్రంతా చాలా దీర్ఘంగా కనపడుతున్నది కదా? ఆహా! ఇప్పుడు కనుక నాకు సీతాదేవి లభిస్తే, ఈ జనస్థానంలో వుండే గోదావరీ జలాలలో, కొండవంకాలు దూకుతున్న ప్రసవణగిరిలో, సీతాదేవిని నాచేతిలో పట్టుకుని నా అపేక్షలన్నీ తీరేట్లు తిరిగేవాడిని కదా?"

అదే ధోరణి కొనసాగిస్తూ తమ్ముడితో, "లక్ష్మణా! చూశావా? అడవి మృగాలు చాలా సార్లు నా వైపు చూసుకుంటూ ఏదో చెప్పాలని తాపత్రయ పడుతున్నాయి. వీటికి సీత పోయిన జాడ తెలుసేమో?" అని అంటూ కన్నీరు కార్చుకుంటూ వాటిని అడుగుతాడిలా. "మృగాలూ...సీత జాడ మీకు తెలియునా?" అని. అవి చివాలున లేచి, దక్షిణ దిక్కుగా పయనమై తలలు పైకి ఎత్తుకుని రామలక్ష్మణుల ముఖాలు చూసుకుంటూ పరుగెత్తాయి. అప్పుడు లక్ష్మణుడు వాటి అభిప్రాయం అర్థం చేసుకుని అన్నతో ఇలా అన్నాడు.

"అన్నా! నువ్వు సీత ఏది? అని అడగ్గా, నిన్ను చూసి మృగాలు, భూమి, ఆకాశం దక్షిణ దిక్కును చూపిస్తున్నాయి. (ఆకాశం రావణుడు పోయిన మార్గం). మనం నైరుతి దిక్కుగా పోదామా? చక్కగా పోతే, గోదావరి నది దాటిపోవాల్సి వస్తుంది. కొంచెం పక్కగా తిరిగి పోతే ఏదీ అడ్డంరాదు. కాబట్టి అలాగే పోదాం. మనం ఆ మార్గంలో పోతే, జానకి లభించే ఉపాయం దొరకవచ్చు".

లక్ష్మణుడు చెప్పింది విన్న రామచంద్రుడు, ఆ ఆలోచన బాగుంది అనుకుంటాడు. వెంటనే లక్ష్మణుడు వెంటరాగా, అక్కడంతా వెతుక్కుంటూ పోతూ, ఒకచోట నేలమీద పూలు రాలి వుండడం చూశాడు. వాటిని చూసిన రఘువంశవర్ధనుడైన రామచంద్రమూర్తి కడు దుఃఖంతో, డగ్గుత్తికతో తమ్ముడితో ఇలా అంటాడు.

"లక్ష్మణా! ఈ పూలు కోసి నేను తనకు ఇవ్వగా, సీత, తన జడలో ముడుచుకుంది. ఇవి కొట్టుకుని పోకుండా, దుమ్ము నిండకుండా, వాడిపోకుండా, వుంది నేను గుర్తించడానికి వాయువు, భూమి, సూర్యుడు రక్షించారు". ఇలా అంటూనే, రామచంద్రమూర్తి మెల్లగా పోయి జలపాతం కల పెద్ద కొండను చేరి

బాధతో కూడిన స్వరంతో “ఆబల, సర్వాంగ సుందరి, సీత, మనోహర వనరాజి, నావల్ల విడవబడ్డ ఆమె ఇక్కడ తిరగడం నువ్వు చూశావా?” అని పర్వతాన్ని ప్రశ్నించాడు. రాముడు ప్రశ్నించింది పర్వతాన్ని కాబట్టి ప్రతిధ్వని పుట్టింది. ఆయన అన్న మాటలే మళ్లీ వినబడ్డాయి. ఇలా తాను చెప్పిన మాటలే మళ్లీ వినపడడంతో నిర్లక్ష్య భావనతో తనను పర్వతం పరిహసిస్తున్నదని రామచంద్రమూర్తి కోపగించుకున్నాడు. ఒక సింహం అల్ప మృగాన్ని చూసినట్లు, పర్వతాన్ని చూసి రాముడు కళ్లెర్ర చేసుకుకుని, “బంగారు కాంతి, మెరుపు కల నా సీతను చూపడానికి ప్రయత్నం చేయని ఓ పర్వతమా! నిన్ను, నీ నెత్తాలను, గిత్తాలను నేలపడవేస్తాను. నేను మంచి మాటలతో అడిగినప్పుడు నువ్వు సౌమ్య మార్గంలో సీతను అర్పించావా, సరే! అలాకాకపోతే, నా బాణాలతో నిన్ను బాధించి నిన్ను కాల్చి బూడిద చేస్తాను” అని అంటాడు.

సీతాదేవి వృత్తాంతం ఈ నది చెప్పకపోతే దీనిలోని నీళ్లన్నీ ఇంకిపోయేట్లు చేస్తానని కోపంతో పలకాడు.

## సీతాదేవి ఆభరణాలను నేలమీద చూసిన రాముడు

రాముడు భయపడుతూ అటూ–ఇటూ తిరుగుతూ సీతను వెతుకుతూ వుండగా, ఆమె పాదాల చిన్న ముద్రలు, అ అపాదాల వెంటే పోయిన పెద్ద–పెద్ద రాక్షస పాదాల ముద్రలు, విరిగిపడిన ధనుస్సు, రథం, అమ్ములపొది, అక్కడక్కడా పడి వుండడం గమనించాడు. అవి చూసి తొట్రుపడుతూ రాముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు:

“లక్ష్మణా! సీతాదేవి ధరించిన జోమాలెపూసలు, బంగారు సొమ్ములు, ఇవే చూడు. ఆమె ధరించిన పూలదండలు నేలరాలాయి. నేలమీద బంగారు పూసల్లాగా నెత్తురు బొట్లు పడ్డాయి. కాబట్టి కోరిన రూపం ధరించగల రాక్షసులు నా సీతను పట్టి తెచ్చి ఇక్కడ తునకలు–తునకలుగా నరికి తిన్నారని భావిస్తాను. ఇక్కద విల్లు పడి వుండడానికి కారణం, బహుశా ఇద్దరు రాక్షసులు ఆమె కొరకు పోరాడారేమో? అలా కాకపోతే నిర్మానుష్యమైన ఈ అడవిలో ఇవెందుకున్నాయి? లక్ష్మణా! బంగారు సొమ్ములతో అలంకరించబడి తళతళ మెరిసే రత్నాలతో, ముత్యాలతో వున్నా ఈ విల్లు ఎవరిదో కదా? ఇది ఇక్కడ విరిగి పడడానికి కారణం ఏంటో? అలాగే ఎర్రటి, బంగారంతో చేయబడ్డ, ముత్యాలు–వైడూర్యాలు చెక్కబడ్డ, నేలమీద పడ్డ తునకలైన ఈ కవచం ఎవరిదో కదా?”.

"నూరు కమ్మలు కలిగి, మేలైన పూదండలతో ప్రకాశిస్తూ విరిగిన ఈ గొడుగు భూమీమ్మద ఇలా పడి వుండడానికి కారణం ఏమిటి? ఇది ఎవరిది కావచ్చు? బంగారు కవచాలు, భయంకర ఆకారాలు, పెద్ద దేహాలు, భయం కలిగించే పిశాచ ముఖాలు కల కంచరగాడిదలు ఇక్కడ పది వుండడానికి కారణం ఏమిటి? మండుతున్న అగ్నితో సమానంగా ప్రకాశిస్తున్న ఒక రథం విరిగిపడ్డది. ఇది ఏ వీరుడిదో? బంగారు పిడుల ఈ బాణాలు ఎవరివో? ఈ పొదుల్లో బాణాలు నిండినవి నిండినట్లే వున్నాయి. వెలితికాలేదు. తునిగిపడి వున్నాయి. ఒక చేతిలో పగ్గాలు, ఒక చేతిలో కొరడా పట్టుకుని సారథి చచ్చిపడి వున్నాడు. వీడేవారి సారథి కావచ్చు? చెవులలో కుండలాలు, తలమీద పాగా కలవారై చామరాలు పట్టుకున్న ఈ ఇద్దరెవరో?"

## దేవతలమీద కోపంతో జగత్సంహారం చేస్తానన్న రాముడు

రాముడులక్ష్మణుడితోఇంకా ఇలాఅన్నాడు:"ఇక్కడ జరిగిన విషయం ఆలోచించి చూస్తుంటే ఎవడో రాక్షసుడు అడవిలో నా భార్యను అపహరించినట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. ఇప్పటిదాకా, సీతే తనంతట తానుగా, ఎక్కడికైనా పోయిందేమోననీ, లేదా, మృగాలే బక్షించాయేమోననీ, లేదా, మాంసార్థి అయిన ఏ బక్క రాక్షసుడో హరించాడేమో నని ఎవరిమీదా నింద మోపకుండా, ఎక్కడికో పోయి వుంటుందేమో అని ఉపేక్ష చేస్తున్నాను. కాని ఇక్కడి పరిస్థితి చూస్తుంటే, బలిష్టుడైన రాక్షసుడే విరోధ బుద్ధితో నాకు అపకారం చేయాలనుకుని సీతను అపహరించాడని అర్థమవుతున్నది. కాబట్టి మనకు రాక్షసులతో ప్రాణాంతకమైన విరోధం కలిగింది అనడం నిశ్చయం. రాక్షసులు సీతను అపహరించి ఎక్కడైనా దాచిపెట్టయినా వుండాలి, లేదా, ఆమె చచ్చిపోయైనా వుండాలి, లేదా, రాక్షసులు ఆమెను తినైనా వుండాలి. వీటిల్లో ఏదో ఒకటి నిజం. ఇలా రాక్షసులు బాధ పెట్టుతుంటే ధర్మం రక్షించబడదు కదా? ధర్మం తనను రక్షించే వారిని రక్షిస్తుంది అనడం సరైంది కాదుకదా? తన ఇష్టం వచ్చినప్పుడు, ఇష్టం వచ్చినవారిని రక్షిస్తుందేకాని సర్వత్రా సర్వజనులను సర్వ విధాలా ప్రతిసమయంలో రక్షిస్తుంది అనడం సత్యం కాదుకదా?"

"రాక్షసులీవిధంగా సీతను బక్షిస్తుంటే, లక్ష్మణా! ధర్మఫలదాతలైన దేవతలైనా అక్కరకు వచ్చినప్పుడు ఆదుకుందాం అనుకోలేదు కదా? కాబట్టి వీళ్లూ నాకపకారం చేసినవారే! వీరిలా నా శత్రువులకు అనుకూలంగా వుంది నాకు

అపకారం చేసి సుఖపడగలరా? దేవతలు ధర్మపక్షం వాళ్లు కదా? వారెందుకు నాకపకారం చేస్తారంటావా? లక్ష్మణా! బ్రహ్మాండకోటులను పుట్టించడానికి, గిట్టించడానికి, శక్తి వుండికూడా దాన్ని చూపకుండా దయతో సాధువైన వాడిని జ్ఞానం లేనికారణాన ధర్మ, అధర్మ పక్షంవారు అందరూ అవమానపరిచేవారే. శిష్టులు శిష్టులవల్లే పూజించబడుతారు. దుష్టులు సర్వత్రా పూజించబడతారు. కేవలం శుద్ధసాత్వికులైన వారిని మిశ్రసాత్వికులు కూడా అధిక్షేపిస్తారు. అసూయపడతారు. అపకారం కూడా చేస్తారు. జగత్సృష్టిసంహారకశక్తి నాలో వున్నప్పటికీ, దయను పురస్కరించుకుని సాదు వృత్తిలో వుండడం వల్ల కేవలం తామసులు, రాక్షసులే కాకుండా, మిశ్రసాత్వికులు, దేవతలు కూడా చులకన చేస్తున్నారు".

"లోకంలో మేలుచేయగోరి, ఆ కారణాన, ఎవరికీ అపకారం చేయక-కోరక, మెత్తనివాడై మిక్కిలి దయ స్వభావగుణంగా వుండి, ఆ కారణాన శాంతికాముకుడై వున్నవాడిని లోకం బలహీనుడిగా తలచి, వాడలా నటిస్తున్నాడని అపవాదు వేస్తుందే కాని, వాడికి సామర్థ్యం వున్నా వూరకున్నాడని భావించదు, ఆదరించదు. ఇది సత్యం. నా చరిత్ర ఇప్పుడు ఇలాగే అయింది. సంహారశక్తి, దండించే అధికారం వున్నప్పటికీ, దానిని బయటపెట్టలేక మేలే చేయాలని నిర్ణయించుకున్న కారణాన సురాసురులు ఇరువురూ నన్ను దుర్బలుడు అయినందున సాధువులాగా నటిస్తున్నాడని భావిస్తున్నారు. లోకవిధం ఎలాంటిదంటే కుట్టితే తేలు-తేలు అని భయపడి దూరంగా పోతారు జనులు. కుట్టకపోతే ఇది కుమ్మర పురుగని దాన్ని లక్ష్యం చేయరు. పుల్లలతో పొడిచి బాధపెట్తారు. ఇది బుద్ధిహీనులైన లోకుల లక్షణం. నాలోని కళ్యాణగుణాలు ఈ సమయంలో వీరిచే తప్పులుగా భావించబడ్డాయి కదా! కానిమ్ము...రాక్షసులు, భూత సమూహాలు, ఇక నా పౌరుష గుణాన్ని చవిచూసి ఎలాంటి పాట్లు పడనున్నారో చూస్తుండు".

"తూర్పు కొండమీద కరకర అంటూ చురుకు కిరణాలతో ఖరకరుడైన సూర్యుడు ఉదయించి చంద్రుడి తేజస్సు హరించిన విధంగా నేను కూడా పరుష గుణాలతో మృదు గుణాలను హరించి ప్రకాశిస్తాను. అప్పుడు కాని వీళ్లకు నామీద భయభక్తులు కలగవు. రాక్షసులలో, పిశాచాల్లో, యక్షుల్లో, గంధర్వుల్లో, భూజనుల్లో ఒక్కడైనా సుఖపడుతాడేమో చూడు....ఈ క్షణంలోనే నా పరాక్రమాన్ని ప్రదర్శిస్తా చూడు. లక్ష్మణా! వాడైన నా బాణ పరంపరల తేజస్సుతో

వాయుసూర్యాగ్నిహోత్రుల ప్రభ చెడి, కొండశిఖరాలు విరిగిపడి, గ్రహాలు తోవతప్పి తికమకలాడి, చంద్రబింబం జారిపడి, సముద్రాలన్నీ ఎండిపోయి, చెట్లతీగల పొదలు తెగిపడి, లోకాలన్నీ నాశనం చేస్తాను. అదిగో...నా అస్త్రాలవల్ల వ్యాపించిన ఆకాశాన్ని తలెత్తి చూడు. విమానాలమీద తిరిగే దేవతలను నేలపడవేస్తాను. మూడులోకాలు బాధపడేట్లు చేస్తాను. నాసీతకు ఏబాధ లేకుండా దేవతలు నాకు సమర్పించారా.....సరి. లేదా, ప్రసిద్ధమై వ్యర్థం కాని నా పరాక్రమాన్ని ఏడుస్తూ చూస్తారు".

"నేనిప్పుడు ఆకర్ణాంతం లాగివిడిచిన బాణసమూహాలతో ప్రపంచం అతలకుతలమై, అల్లకల్లోలమై, చెల్లాచెదరై, పచ్చంపాడై, పంచాబంగాళమై, పాండవబీడై, పగుళ్లుపారి, పటాపంచమై, మర్యాద తప్పినది అయిపోతుంది. ఈ దేవతలు, రాక్షసులు చొక్కి,సోలి, వాలి, కూలి, తూలి, వెలి, మాలి నా బాణాలతో ఖండించబడుతారు. నేనే ధ్వంసం చేయదలచుకుంటే వీరు సహించగలరా? నాకు ప్రియమైన సీతను మంచితనంగా తెచ్చి దేవతలు–ఇతరులు ఇవ్వకపోతే, లక్ష్మణా! ముల్లోకాలు ఏవిధంగా రూపంలేకుండా నాశనం అవుతాయో చూస్తుండు".

అని చెక్కిళ్లు అదురుతుంటే, భయంకరమైన కోపంతో, ఎర్రటి కళ్ళతో రాముడు తన పెద్ద విల్లుని చేతిలోకి తీసుకుని, చక్కటి బాణాన్ని అల్లెతాటిలో సంధించి, ప్రళయకాలాగ్ని లాగా మండిపడుతూ, తమ్ముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు: "ఎవరెన్ని విరుగుడులు చేసినా ముసలితనం, మరణం, కాలం, అదృష్టం వాటి–వాటి సమయంలో రాకతప్పనట్లు, నాకు కోపం వస్తే, నేను చేయదలచుకున్న పనిని నివారించగలవాడు లేడు. మనోజ్ఞమైన నడవడికలిగినదైన, నవ్వు ముఖం కలదైన నా సీతను మృదుమార్గాన తెచ్చి ఇచ్చారా, సురాసురురులు బాగుపడతారు. ఇవ్వకపోతే కుతకుత వుడికించి ఆపత్సముద్రంలో ముంచి తేలుస్తాను".

సర్గ-65

# శ్రీరాముడిని శాంతింప చేసిన లక్ష్మణుడు

సీతాదేవిని అపహరించిన కారణాన కలిగిన దుఃఖంవల్ల బాధపడే రాముడిని, శోకం వల్ల తపించే రాముడిని, ప్రళయకాలాగ్నిలాగా లోకాలను సమూలంగా కాల్చివేద్దామన్న పరుషగుణం వహించిన రాముడిని, ఎక్కుపెట్టిన విల్లు నీడ చూస్తున్న రాముడిని, వేడి నిట్టూర్పులు విడుస్తున్న రాముడిని, సర్వప్రాణి సంహారం చేయడానికి విజృంభించి ప్రళయకాల రుద్రుడిలాగా వెలుగుతున్న రాముడిని, శత్రుసంహారం కొరకు తప్ప ఎప్పుడూ కోపం తెచ్చుకొని రాముడిని చూసి లక్ష్మణుడు పెదవులు ఎండిపోతుంటే, ముఖం వెల-వెలపోతుంటే, ఆయనతో ఇలా అన్నాడు.

“అన్నా! నువ్వు సర్వదా జగాలకు మేలుచేయడానికి ఇష్టపడే వాడివే. కోపం లేనివాడివే. మృదుస్వభావుడివే. ఇలాంటి నువ్వు ఇప్పుడు కోపం తెచ్చుకుని నీ సహజగుణం వదలవచ్చా? ఇది నీకు ధర్మమా? చంద్రుడిలో లక్ష్మి, సూర్యుడిలో విశేషప్రభ, భూమిలో అమితమైన ఓర్పు, వాయువులోని గమనించే గుణం, స్థలనం లేకుండా స్థిరంగా వుండే నైజం....ఇవన్నీ వాటిలో ఒక్కొక్కటిగానే వుంటాయి. నీలో ఇవన్నీ మరింత కీర్తితో శాశ్వతంగా కాపురం చేస్తున్నాయి. ఇలాంటి నువ్వు లోకాలను బాధించడం న్యాయమా? శాంతించమనీ, ఓర్చుకోమనీ అంటున్నానని ప్రశ్నిస్తావేమో? ఇంతసేపు ఓర్చుకుంటే ఎవరైనా నీ

స్థితి ఏమిటి అని కానీ, ఎందుకు ఏడుస్తున్నావని కానీ, సీత ఇక్కడ వున్నదని అన్నవాడు కానీ లేరు.....ఎంతకాలం ఓర్చుకున్నా ఫలితం ఇదేకదా అని అంటావేమో?"

"అన్నయ్యా! అలాకాదు. ఊరు-పేరు తెలియనివాడు ఎవడో ఒక్కడు చేసిన నేరాన్ని కనిపెట్టే శక్తిలేక లోకాన్నంతా నాశనం చేయడం న్యాయమా? ఇలాంటి పని చేయకూడదని నువ్వే నాకు ఒకసారి చెప్పావు కదా? విరిగిన ఈ రథం ఎవరిదో, ఎందుకు ఎవరివల్ల విరిగిందో అనే విషయం మనం విచారించి తెలుసుకోవాలి. విరిగిన గుర్రపు గిట్టలను, దొరలిన చక్రాల కమ్మలను, నేలబడ్డ నెత్తురు బొట్లను, పరిశీలించి చూస్తే ఇవన్నీ ఒకడివే అనిపిస్తున్నది కాని యుద్ధంలో రెండవవాడు వున్నట్లు లేదు. సైన్యం పోరాడినట్లు కనిపించడంలేదు. అలా అయితే, ఒక్కడే తన రథాన్ని తానే విరగగొట్టుకుని, తన సారథిని, గుర్రాలను తానే చంపుకుంటాడా? కాబట్టి, ఇవన్నీ నువ్వు ఆలోచించకుండా ఎవడో ఒకడి కోసమని లోకమంతా నాశనం చేయడం మంచిదా? రాజైన వాడు మృదుత్వం, శాంతి కలిగి ఎప్పుడు-ఎవరిని-ఎలా దండించాలో అలాగే చేయాలికాని ఇష్టం వచ్చినట్లు ఎవరిని పడితే వారిని కఠినంగా దండించతగునా?"

"ఎవడో ఒకడు అపరాధం చేస్తే దాన్ని లోకమంతా ఒప్పుకున్నాడని భావించి, ఆ లోకమంతా వధ్యమని నువ్వు అనుకోవడం పొరపాటు. ఎందుకంటే, తమ రక్షణ కోరే సర్వభూతాలను రక్షించగలవాడివి నువ్వు ఒక్కడివే కాని వేరొకడు లేడు. అలాంటివారు పొందదగిన, శ్రేష్ఠమైన, కీర్తించతగిన పరమగతి కూడా నువ్వు తప్ప వేరొకరు కారు. ఇలాంటి నీకు ఆపదవస్తే ఎవరైనా సంతోషిస్తారా? సహాయం చేసే సామర్థ్యం లేక కొందరు, తెలియక కొందరు వున్నారేమో కాని నీకు అపరాధం చేయతలచిన వారెవరూ వుండరు. యజ్ఞంలో ఋత్విక్కులు దీక్ష తీసుకుని, యజ్ఞం చేసేవాడి కీడు కోరితే అది వాళ్ళకే నష్టం కాబట్టి అలా చేయరు. మేలే కోరుతారు. అలాగే దేవతలు, గంధర్వులు, దానవులు, కొండలు, నదులు నీకు దుఃఖం కలిగించరు. నిబ్బరించుకుని ఆలోచించు".

"చేతిలో విల్లు పట్టుకుని, నేను నీకు తోడురాగా తపస్వుల సహాయంతో సీతను అన్నిచోట్లా వెతుకుదాం. పర్వతాలలో, అడవుల్లో, గుహలలో, నదీతీరాలలో, కలువల కొలనుల్లో, దేవతలుండే స్థలాలలో, ఓర్పుగా, హెచ్చరికగా వెతుకుదాం. మనం చేయాల్సినదంతా చేసిన తరువాత. అప్పటికీ దేవతలు మంచితనంగా

సీతను సమర్పించకపోతే, అప్పుడు ఏది ఉచితమో ఆ పని చేద్దాం. అప్పుడది చేస్తే న్యాయంగా వుంటుంది. నీమీద నింద పడదు. మంచి మాటలవల్ల, మంచి నడవడి వల్ల, వినయం వల్ల సీతాదేవి లభించకపోతే, సాదుమనస్సుకల ఓ రాజనందనా, అప్పుడు నీ ఇష్టం వచ్చినట్లు చేయి. వజ్రాలలాంటి కఠోరమైన బంగారు పింజల బాణాలతో నీ ఇష్ట ప్రకారం లోకాన్ని భస్మం చేయి''.

అని అంటాడు లక్ష్మణుడు రాముడితో.

సర్గ–66

# మరిన్ని శాంతివచనాలు చెప్పిన లక్ష్మణుడు

శ్రీరాముడిని శాంతింప చేసే ప్రయత్నంలో లక్ష్మణుడు అన్నగారితో మరిన్ని విషయాలను చెప్తాడు. ఆయన పాదాలమీద పడి నమస్కరించి, ఇలా అంటాడు. "అన్నా! పూర్వజన్మలోనే కాకుండా ఈ జన్మలోనూ విస్తారంగా తపస్సు చేసి, ఎన్నో అశ్వమేధయాగాలను చేసి, మరెన్నో గొప్ప పుణ్యకార్యాలను చేసి, మన తండ్రి అతి కష్టంతో దేవతలు అమృతాన్ని సంపాదించినట్లు నిన్ను కన్నాడు".

(శ్రీరామచంద్రమూర్తిని అమృతంతో పోల్చడం అంటే, అమృతం వల్ల దానికేమీ లాభం లేదు కాని, దాన్ని అనుభవించిన దేవతలకే లాభమని అర్థం. అలాగే శ్రీరాముడు దేవతలకు, లోకులకు భోగ్యుడై వారికి మేలు చేయడానికి పుట్టాడని అర్థం. లోకాన్ని ఉద్ధరించడానికి పుట్టిన శ్రీరాముడు లోకాలను నాశనం చేయడం తగదని లక్ష్మణుడు అంటున్నాడు. అలాగే, అమృతాన్ని సంపాదించడం కోసం ముప్పైమూడు కోట్ల దేవతలు కష్టబడ్డారు కానీ, రాముదికోరకు ఒక్క దశరథుడే కష్టపెడ్డాడని భావన. అమృతం ఎలా రాక్షసుల వినాశనానికి కారణమైందో అలాగే రాముడు కూడా రాక్షస సంహారం చేయాలని చెపుతున్నాడు లక్ష్మణుడు. అందుకే, దేవతలమీద, ఇతర భూతాల మీద కోపం చూపకుండా, అమృతంలాగా ఎల్లప్పుడూ నిర్మలంగా వుండాలని సూచన ఇచ్చాడు లక్ష్మణుడు).

లక్ష్మణుడు ఇంకా ఇలా చెప్పాడు రాముడికి. "నీలో తప్ప ఇతరుల్లో లేని నీ కళ్యాణగుణాలకు సంతోషించి మన తండ్రి నిన్ను ఎడబాసిన కారణాన మరణించాడని భరతుడు చెప్పాడు కదా? అలాంటి కళ్యాణగుణాలను వదిలి ఇలాంటి హేయగుణాన్ని చేపట్టి, లోకానికి ఉపద్రవం కలిగిస్తే, మన తండ్రి నీవిషయంలో ఏమని భావిస్తాడు? రాముడు సౌమ్యుడు, సాధువు, జితేంద్రియుడు, శాంతుడు అనుకున్నానే? ఇంతటి క్రూరుడా, అని అనుకోడా? నువ్వు చేయాలనుకున్న లోకోపద్రవం తండ్రికి కూడా చేసినట్లే కదా? తన నాశనానికా తండ్రి నిన్ను కన్నది? కకుత్థ్సుడి వంశంలో పుట్టిన వాళ్లలో శ్రేష్టుడివైన నువ్వు, మహాశుద్ధసత్త్వం కల నువ్వు, అప్రాకృతుడవైన నువ్వు, కకుత్థ్సుడిలాగా దేవతలను, లోకులను రక్షించాల్సిన నువ్వు, శోకంతో సహించలేని విధంగా పరితపిస్తుంటే, ప్రకృతిబద్ధులైన ఇతరులందరూ దుఃఖం సహించగలరా? అలాంటి వారిలోనే దుఃఖం అణచుకునేవారు కనిపిస్తుంటే నువ్వు దుఃఖపడడం శోచనీయం".

"జగాలను పుట్టించే భారం బ్రహ్మదేవుడిది. సంహరించే భారం రుద్రుడిది. రక్షించే భారం నీది. అలాంటి నువ్వు ధర్మాన్ని వదిలి లోకులను సంహరించాలనుకుంటే భూప్రజలకు రక్షకుడెవరు దొరుకుతారు? పైరును రక్షించడానికి వేసే కంచే పైరును మేయడానికి సిద్ధపడితే ఇక దాన్ని రక్షించే ఉపాయం ఏమిటి? లోకంలో నువ్వొక్కడివే దుఃఖమనుభవించుతున్నానని అనుకోవద్దు. నీకున్నంత దుఃఖం ఎవరికీ లేదనుకోవద్దు. ఇంద్రుడుగా వున్నా నహుషుడి కొడుకు స్వర్గానికి పోయికూడా, అవివేకం వల్ల, అహంకారం వల్ల, మళ్లీ భూమ్మీదకు రాలేదా? మన పురోహితుడైన వశిష్టుడి కొడుకులు వందమంది ఒకేసారి నశించలేదా? సమస్త భూతాలను సర్వాదా మోసే భూదేవి ఒక్కోసారి గడ-గడలాడ లేదా? లోకాలకు కళ్లలాంటి సూర్యచంద్రులు రాహుకేతు గ్రహాల వాత బడలేదా? ఎంత మహాత్ములైనా, దేవతా శ్రేష్టులైనా, దైవ సంకల్పాన్ని దాటగలరా? ఎవరైనా కష్టాలను ఎదుర్కోకుండా కాలమంతా సుఖంగా గడుపుతారా? లేరుకదా? కాబట్టి ప్రాణులకు మేలు-కీడు స్వభాసిద్ధంగా వస్తాయి".

"సీతాదేవి రాక్షసుల చేతిలో చచ్చినా కూడా అందుకోసం నువ్వు గుండెలు పగిలేలా ఏడవవద్దు. అది జ్ఞానంలేనివాడు చేయాల్సిన పని. ఏడ్వడం వల్ల రాగల లాభం ఏమిటి? నువ్విలా ఏడుస్తుంటే సీతాదేవి వస్తుందా? ఏడ్వడం వల్ల దేహం,

మనస్సు చెడడమే తప్ప మరేం లాభం లేదు. జ్ఞానంకలవాడు దేనికీ దుఃఖపడడు. అనఘా! జీవకోటుల యథార్థస్థితి అయిన జననమరణాలు, సుఖదుఃఖాలు, శోకసంతోషాలు, సంయోగవియోగాలు లాంటివి నిత్యం జరిగేవి కావు. రావడం, పోవడం వాతి స్వభావగుణాలు. కాబట్టి వాటికి పరితాపపడడం మంచిదికాదు. నీచమైన హృదయ దౌర్బల్యం వదిలి, గొప్ప మనస్సు చేసుకుని, ఇలా వ్యసనపడడం నీకు తగునేమో ఆలోచించు. జ్ఞానం కలవారు స్వభావసిద్ధమైన బుద్ధిబలంతో మేలు–కీడులను పరీక్షిస్తారు".

"పూర్వం చేసిన పుణ్యపాపకర్మల గుణాలు కానీ, దోషాలు కానీ, మనం ఇప్పుడు ప్రత్యక్షంగా చూడలేం. మనం ఈ కర్మ చేశాం....మనకీ ఫలం కలుగుతుంది.... అని నిశ్చయంగా చెప్పడం ఎవరికీ సాధ్యపడదు. ఈ కర్మ ఈ విధంగా చేయడం వల్ల ఈ ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నాం అని కర్మ చేసిన విధం చెప్పడం కూడా సాధ్యపడదు. కాని, కారణం లేకుండా ఏదీ జరగదు. ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నాం కాబట్టి, దీనికి కారణమైన కర్మ ఎదో, ఎప్పుడో చేశాం అని మాత్రం చెప్పగలం. అలాంటి కర్మ చేయడం వల్లే ఈ ఫలం కలిగిందని చెప్పవచ్చు. మనకు కారణం తెలిసినా, తెలియకున్నా, అనుభవించడం తప్పదు. కాబట్టి సుఖం అనుభవానికి వచ్చినప్పుడు మనం చేసిన పుణ్యం వల్లే ఇది కలిగిందని కాని, దుఃఖం కలిగినప్పుడు మనం పూర్వం ఏదో పాపం చేశామని అందుకే ఇది కలిగిందని భావించరాదు. సుఖం కలిగినందువల్ల పుణ్యమే చేయాలని కాని, దుఃఖం కలగడం వల్ల పాపం చేయరాదని అనుకుని మనస్సు ధృడ పరచుకోవాలి. సంతోషానికి పొంగక, దుఃఖానికి బాధపడక వుండాలి".

"రామచంద్రా! నువ్వు మూర్ఖుడివి కాదు. కార్యాకార్య, ధర్మాధర్మ విషయంలో నీకుకల స్థిరజ్ఞానం దేవతలకు కూడా లేదు. అయినప్పటికీ దుఃఖాతిశయం వల్ల నీ జ్ఞానం నివురుగప్పిన నిప్పులాగా నిద్రబోతున్నది. మనుష్యులను చూద్దామా, వాళ్ళు నీదగ్గరకు వచ్చి తమ మీద కోపం ఎందుకని అడిగే సాహసం కూడా చేయలేరు. దేవతలేమో నీమూలాన బాగుపడేవారు. కాబట్టి నీకు అపరాధం చేయరు. కాబట్టి వాళ్ళను ఎందుకు బాధించాలి? వ్యర్థ కోపం వల్ల, వ్యర్థ శోకం వల్ల ఏ పనీ కాదు. మనకపకారం చేసినవాడు ఎవడో కనిపెట్టి శూరుడివైన నువ్వు వాడిని దండించు. దానివల్ల నీకు సీత మళ్లీ లభిస్తుంది. కీర్తీ కలుగుతుంది".

సర్గ-67

# లక్ష్మణుడి మాటలకు శాంతుడై సీతను వెతుకుటకు తయారైన రాముడు

శ్రేష్టమైన మంచి నీతి వాక్యాలను, వాటి అర్థాన్ని, చిన్నవాడైనా తమ్ముడు లక్ష్మణుడు చెప్పగా విన్న పెద్దవాడైన రామచంద్రమూర్తి, దాంట్లోని సారాన్ని గ్రహించి, కోపంతో లోగడ చేద్దామనుకున్న పనిని వదిలి, విల్లు ఆధారంగా నిలబడి, "నాయనా! లక్ష్మణా! సీతను వెదకడానికి ఏం చేయవచ్చు? ఎక్కడికి పోదాం?" అని అడిగాడు. శోకతప్తుడైన రామచంద్రమూర్తి ఇలా అడగ్గా, లక్ష్మణుడు జవాబుగా ఇలా చెప్పాడు. "ఈ జనస్థానంలో పెద్ద-పెద్ద మృగాలు, గుహలు, కొండలు, చొరలేని మార్గాలు వున్నాయి. కిన్నరుల ఇండ్లున్నాయి. భయంకరమైన రాక్షసుల దీనంలో వుందిది. పెద్ద-పెద్ద చెట్లున్నాయి. కాబట్టి రాక్షసులు సీతను తెచ్చి ఇక్కడే, ఎక్కడో దాచిపెట్టి వుంటారు. కాబట్టి సీతాదేవిని ఇక్కడే ఎక్కడో వెతకాలి. నీలాంటి బుద్ధి సంపదకలవాడు ఆపద వస్తే చలించాలా? ఎంత గట్టిగా గాలి వీచినా కొండలు కదులుతాయా?". ఇలా చెప్పగా రామచంద్రమూర్తి తమ్ముడు తనవెంటరాగా అడవి ప్రదేశమంతా వెతికాడు.

### జటాయువును చూసిన రామలక్ష్మణులు

ఇలా వెతుక్కుంటూ పోగా-పోగా, ఆ పర్వతం దగ్గరే ఒకచోట పెద్ద

కొండలాగా వున్న, నెత్తుటితో తడిసిన, పుణ్యాత్ముడిని, ప్రాణం పోయినా సరే స్వామికార్యం చేయాలన్న భక్తి కలవాడిని, పక్షి శ్రేష్టుడిని, జటాయువును చూశారు రామలక్ష్మణులు. చూసి తమ్ముడితో ఇలా అన్నాడు రాముడు. "విరోధులను శిక్షించినవాడా! చూశావా? వీడు రాక్షసుడు....సీతను మింగి, మనం చంపుతామేమోనని భయంతో గద్దలాగా హాయిగా కూచున్నాడు. వీడిని నా భయంకర బాణాలతో, తక్షణమే, ఆలస్యం చేయకుండా చీలుస్తాను". ఇలా అంటూనే జటాయువుకు ఎదురుగా పోయి, ఒక తీవ్ర బాణాన్ని సంధించగా భూతలం వణికింది. అప్పుడు నెత్తురు చొంగ కక్కుతూ, మరణతాపంతో బాధపడుతూ, గద్గద స్వరంతో పక్షిరాజు రామచంద్రుడితో ఇలా అన్నాడు.

## సీతాపహరణ వృత్తాంతం రాముడికి చెప్పిన జటాయువు

"ఆయుష్మంతుడా! అడవిలో ఔషధిని వెదికిన విధంగా దేన్నైతే వెతుకుతున్నారో, ఆ సీతను, నా ప్రాణాన్ని, తెమ్టినీ రావణుడే అపహరించాడు. నువ్వూ, లక్ష్మణుడూ, పావనైన సీతను ఒంటరిగా అడవిలో విడిచిపోగా, రావణుడు బలవంతంగా ఆమెను ఎత్తుకుని ఆకాశమార్గాన పోసాగాడు. అది చూసిన నేను, విసురుగా వాడికి అడ్డం పోయాను. వాడిని ఎదిరించి వాడితో బలం కొద్దీ యుద్ధం చేసి వాడి రథాన్ని నేలపడగొట్టాను. వాడిని కింద పడేశాను. నేను విరిచిన విల్లు ఇక్కడే పడి వుంది. పొది కూడా ఇక్కడే పడిపోయి వుంది. నా రెక్కల దెబ్బకు చచ్చిన సారథి ఇక్కడే పడిపోయి వున్నాడు. ఇదే నేను విరగ్గొట్టిన రథం. నేను ముసలివాడినై అలసిపోయాను. అప్పుడు వాడు తన కత్తితో నా రెక్కలను తెగనరికి నేలమీద పడేసి, సీతను పట్టుకుని ఆకాశమార్గాన పరుగెత్తాడు. నీ భార్యకోసం ముందే రావణుడు నన్ను చంపాడు. నా స్నేహితుడైన దశరథుడి పుత్రా! చావడానికి సిద్ధంగా వున్న నన్ను నువ్వు కూడా చంపాలా?"

## జటాయువు దుస్థితికి దుఃఖించిన రాముడు

జటాయువు మాటలు విన్న రాముడు తన విల్లు దూరంగా పడవేసి, అతడిని కౌగలించుకుని, తమ్ముడితో కలిసి ఏడ్చాడు. "లక్ష్మణా! నా నిర్భాగ్యం ఎలాగుందో చూశావా? రాజ్యం పోవడం, భయంకర అరణ్యంలో దుఃఖపడడం, సీతను పోగొట్టుకొనడం, జటాయువు మరణం.....ఇవన్నీ, సర్వం దహించే అగ్నిహోత్రుడినైనా కాలుస్తాయి. సహించలేని ఈ తాపం చల్లార్చుకొనడానికి

నేను సముద్రంలో దూకినా నా శరీరం వేడి వల్ల సముద్రం ఎండుతుంది కాని నేను చల్లబడను. ఎంత వెతికి చూసినా నా కంటే అదృష్టహీనుడు లోకంలో లేరు. జటాయువు మన తండ్రికి స్నేహితుడు. పుణ్యాత్ముడు. ముసలివాడు. పక్షిరాజు. నా నిర్భాగ్యం వల్ల కొట్టబడి నేలకూలాడు చూశావా?”

అని లక్ష్మణుడితో అంటూ, రెక్కలు నరకబడి నెత్తురుకారుతున్న జటాయువును తన చేత్తో తుడిచి, “పుణ్యాత్ముడా! నా ప్రాణంతో సమానమైన సీత వృత్తాంతం చెప్పు” అని అడిగాడు.

సర్గ-68

# సీతా వృత్తాంతం సవివరంగా రాముడికి చెప్పిన జటాయువు

జటాయువును సీత ఎక్కడున్నడని పదే-పదే ప్రశ్నిస్తూ నేలమీద పది, మూర్ఛిల్లిన శ్రీరాముడు, తేరుకుని, లేచి, లక్ష్మణుడితో ఇలా అన్నాడు. "తమ్ముడా! మహోపకారం చేసిన ఈ పక్షిశ్రేష్టుడు నాకొరకు తెగించి యుద్ధం చేసి పడిపోయి కొన ఉపిరితో వున్నాడు. మాట్లాడడానికి శక్తి కూడా లేదు. ఏదో ఒక ఆమాట చెప్పినా స్వరం హీనంగా వుంది". అ ఆతరువాత జతాయువుతో ఇలా అన్నాడు. "ఓ గద్దరేడా! జటాయూ! నువ్వు మాట్లాడగలిగితే సీతాదేవి గురించి నీకు తెలిసిన విషయం, నువ్వు చంపబడ్డ విధం, ఎందుకు సీతను రాక్షసుడు పట్టుకునిపోయాడు? వాడికెందుకు నామీద కోపం వచ్చింది? అప్పుడు సీతాదేవి ముఖం ఎలా వుంది....లాంటి విషయాలు చెప్పు. ఆ పాపాత్ముడు, రాక్షసుడు తనను తీసుకునిపోతున్నప్పుడు సీత ఏమన్నది? ఆ మాటలన్నీ స్పష్టంగా చెప్పు. ఆ రాక్షసుడు ఎలాంటివాడు? ఏ దేహం కలవాడు? వాడుండే నగరం ఏది? వాడెంత శూరుడు? తండ్రీ! సీతను ఏ విధంగా వాడు పట్టుకుని పోయాడో సవివరంగా చెప్పు".

ఇలా రామచంద్రుడు అడగ్గా, జటాయువు మెల్లగా రెప్పలు తెరిచి, రాముడిని చూసి, చాలా సన్నటి గొంతుతో జవాబిచ్చాడిలా. "రామా! వాడు మాయగాడు.

తన శక్తితో పెనుగాలిని మబ్బుల గుంపును కల్పించి వాటి చాటున ఎవరినీ కానరాకుండా చేసి, రహస్యంగా సీతాదేవిని శూరుడై బలాత్కారంగా పట్టుకుని ఆకాశమార్గాన పోయాడు. భయంకర యుద్ధంలో ఎదుర్కొన్న నన్ను చూసి, నా మీదపడి, కత్తితో నా రెక్కలు నరికి అమితమైన వేగంగా దక్షిణ ముఖంగా పరుగెత్తాడు. రామా! కళ్ళు తిరుగుతున్నాయి. నామనస్సు నా స్వాధీనంలో లేదు. ప్రాణవాయువులు వాటి-వాటి స్థానాలు వదిలాయి. అదిగో...వట్టివేళ్ళ కొనలున్న బంగారు మెట్లు కనబడుతున్నాయి. రాక్షసుడు సీతాదేవిని అపహరించిన ముహూర్తం "వింద". ఆ ముహూర్తంలో అపహరించబడిన సొమ్ము మళ్లీ స్వంతదారుడికి చేరుతుంది. తప్పదు. ఆ రాక్షసుడు తొందరలో ఇది గమనించలేదు. కాబట్టి నీ భార్యను అపహరించినవాడు కాలం మింగిన చేపలాగా అయిపోతాడు. రామా! సీతకొరకు నువ్వు ఆందోళనపడవద్దు. నువ్వు ఆ రాక్షసుడిని యుద్ధంలో చంపి మళ్లీ సీతను గ్రహించి గొప్ప కీర్తిని సంపాదించి సంతోషంగా అయోధ్యకు పోతావు".

ఇంతదాకా స్మృతి తప్పకుండా తెలివిగా చెప్పి, రాముడు అడిగిన మిగతా ప్రశ్నలకు జవాబియ్యదలచి, మాట్లాడడానికి ఎంత ప్రయత్నించినా వీలుకాక, ఆయన నోట్లో నుండి మాంసం, నెత్తురు, కక్కుతూ ఏదో చెప్పబోయాడు. ఆయన చెప్పాలనుకున్నది, పూర్తిగా చెప్పలేకపోయింది, "విశ్రవసుడు అనే ముని కన్నకొడుకు, కుబేరుడి సోదరుడు...(రావణుడు)...." అని చెప్తుండగానే ఉపిరి పోయింది. "చెప్పు, చెప్పు" అని రాముడు చేతులు జోడించి అడుగుతుండగానే పక్షిరాజైన జటాయువు ఆయన చూస్తుండగానే దేహం విడిచి స్వర్గానికి పోయాడు. కళ్ళు ఎర్రగా కాగా, నోరు తెరిచి, తల నేలమీద వాల్చి, భూమ్మీద పాదాలు వెడల్పుగా కాగా, దేహం వణుకుతుంటే, ఉపిరి విడిచాడు.

## జటాయువు మృతికి శోకించిన రాముడు

అలా నేలమీద పడ్డ జటాయువును చూసి రామచంద్రమూర్తి బాగా దుఃఖపడి, తమ్ముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు. "తమ్ముడా! యితడు అనేక సంవత్సరాలు పాపాత్ములైన రాక్షస స్థావరమైన దండకలో వుండి, తన పరాక్రమంతో భయం లేకుండా గడిపి, చివరకు ఇక్కడే మరణించాడు చూశావా? చిన్నతనం నుండీ ఇక్కడే వేలాది సంవత్సరాలు తన ఇష్టప్రకారం సంచరించి చివరకు ఇక్కడే చనిపోవడం అంటే కాలం దాటడం ఎవరికీ శక్యం కాదనే కదా? లక్ష్మణా!

చూశావా! సీతను రాక్షసుడు తాకకుండా వుండడానికి ఆమె ముందు తాను నిలిచి రాక్షసుడిని ఎదిరించి, యుద్ధం చేసి, తన అఖండ పక్షిరాజ్యాన్ని, ఆయుషును, నాకోసం వదిలి నేలమీద పడ్డాడు. భూమ్మీద ఇలాంటి పరోపకారుడిని, ఉదారచిత్తుడిని, పుణ్యాత్ముడిని చూశామా?"

"లక్ష్మణా! తండ్రి కొరకు నేను రాజ్యాన్ని వదిలితినని గొప్పగా చెప్తారు. తండ్రి కొరకు కొడుకు చేయకపోతే తప్పుకాని, చేయడం గోప్పేమీకాదు. ఇతడేమో మనుష్య జాతిలో చేరినవాడు కాదు. మనకు బంధువు కూడా కాదు. మన దగ్గరివారిలో చేరినవాడూ కాదు. జీతం తీసుకున్న సేవకుడు కూడా కాదు. మనం ఆయనకు చేసిన ఉపకారం ఏదీ లేదు. మన ఉపకారం ఆయన ఆశించినవాడూ కాదు. ఇలాంటి వాడు ఒక ఆడదాన్ని రక్షించాలని దీర్ఘకాలంగా ఏలుతున్న రాజ్యాన్ని, అంతకంటే గొప్పదైన తన ప్రాణాన్ని, వదిలిపెట్టాడు. ఇలాంటి పనినే కదా ఉపకారం అని, ఔదార్యం అనీ, పుణ్యమనీ, భక్తీ అనీ అంటారు. లక్ష్మణా! పరోపకారులు మనుష్యుల్లోనే వుంటారని, యాత్ర జాతుల్లో, ఇతర ప్రదేశాల్లో లేరని అనుకోవద్దు. ఇతర జాతులైన పశుపక్ష్యాదులలో కూడా శూరులు, రక్షించే యోగ్యతా కలవారు, పరులకు మేలు చేయగోరే వారు, సాధువులు, ధర్మ మార్గంలో ప్రవర్తించే వాళ్లు వుంటారు".

"మన తండ్రి నాకెలా పూజ్యుడో, ఇతడు కూడా అలా పూజ్యుడే. ఎందుకంటావా? తండ్రైన దశరథమహారాజు నాకొరకై ఎలా ప్రాణం వదిలాడో తండ్రికి స్నేహితుడైన ఇతడు కూడా అలాగే నాకోసం ప్రాణం విడిచాడు. కాబట్టి తండ్రిలాగా నా చేత సంస్కారం చేయించుకోవడానికి అర్హుడు. మంచి కీర్తికలవాడు. గౌరవించడానికి యోగ్యుడు. ప్రియుడు. ఇతడి పాట్లు చూస్తుంటే సీతకొరకు, ఆమెను కోల్పోయిన దుఃఖం నా మనస్సులో లేదు. ఎందుకంటావా? సీతాదేవి, నా సేవవల్ల కలిగే ఆనందానికై, అది అనుభవించాడానికి నాతొ వచ్చింది. అది సకామసేవే కదా? ఇతడేమో నా వల్ల ఏ లాభం కోరకుండా నాకోసం ప్రాణాలనే ఇచ్చాడు. కాబట్టి ఇది విశేష దుఃఖాన్ని కలిగిస్తున్నది".

## జటాయువుకు అగ్ని సంస్కారాలు చేసిన రాముడు

జటాయువుకు అగ్నిసంస్కారాలు చేద్దామని నిశ్చయించుకున్న రాముడు తమ్ముడితో, "లక్ష్మణా! నా పనికోసమై ప్రాణాలు విడిచిన ఈ పక్షిరాజును శాస్త్రప్రకారం నా తండ్రిలాగే దహన సంస్కారం చేస్తాను. కాబట్టి చితి పేర్చు"

అని జటాయువున్న దిక్కుగా చూశాడు. చూసి, ఆయన్ను వైకుంఠం పొందమంటాడు. పక్షి కాబట్టి కర్మాదికారం లేనందున, అగ్నిసంస్కారానికి యోగ్యత లేనందువల్ల, ఉత్తమలోకాలు లేకపోయినా తన ఆజ్ఞ వల్ల ముక్తిని పొందమని అంటాడు జటాయువును. రామచంద్రమూర్తి బ్రహ్మవిధి ప్రకారం సంస్కరించి, యోగులు పొందే సనాతమైన తన లోకాన్ని ఇచ్చాడు. రామానుగ్రహం వల్ల ఆ గద్ద పరమపదానికి పోయి విష్ణుసారూప్యాన్ని పొందింది.

(జటాయువు ఋషులలాగా మోక్షం కొరకు పరమాత్మోపాసన చేయలేదు. అలాంటివాడికి రాముడెలా మోక్షం ఇచ్చాడు? అలాగైతే అందరికీ ఇవ్వ వచ్చుకదా? అని ఆక్షేపించవచ్చు. దీనికి సమాధానం...మోక్షానికి ఆత్మోపాసన ఒక్కటే మార్గం కాదు. చాలా మార్గాలున్నాయి. భగవద్గీతలో కర్మ, జ్ఞాన, రాజయోగాలు, భక్తీ, ప్రపత్తి, క్షేత్రక్షేత్రజ్ఞజ్ఞానం, అవతార జ్ఞానం లాంటివి చెప్పడం జరిగింది. బ్రహ్మసూత్రాలలో 32 విద్యలు చెప్పడం జరిగింది. ఇవేవీ లేకున్నా ప్రేమ ఒక్కటే మోక్షసాధనమని శాస్త్రాలు చెప్తున్నాయి. అనన్యమనస్కుడై, భగవంతుడి కోసం రాజ్యాన్ని, ప్రాణాన్ని విడిచి ఆయన సమక్షంలో ఆయనమీదే దృష్టి నిలిపి ప్రాణం వదిలి, ఆయన చేతులమీదుగా సంస్కారం పొందిన జటాయువుకే మోక్షం లేకపోతే ఇంకెవరికి వుంటుంది? ఇలాంటివారికెవరికైనా మోక్షం ఇస్తాడు రాముడు కాని, ప్రకృతిబద్ధులై, కామదాసులై, భక్తీ శూన్యులైన వారందరికీ మోక్షం ఎలా ఇస్తాడు? జటాయువు కంటే ఎక్కువ త్యాగం చేసినవారెవరు? కాబట్టి జటాయువుకు మోక్షమివ్వడం న్యాయమే).

జటాయువును సొదమీద పెట్టి, అగ్ని రగిలించి, తన తండ్రిలాగే ఆయనకూ నిప్పు పెట్టి జింక మాంసంతో పిండాలు చేశాడు. ఆ పిండాలను లేతపచ్చిక మీద వుంచి, బ్రాహ్మణులు స్వర్గప్రాప్తి కోసం మనుష్య ప్రేతాలను ఉద్దేశించి ఏ మంత్రాలను చదువుతారో అవే చదివాడు. ఆ తరువాత గోదావరీ నదిలో తమ్ముడితో సహా స్నానం చేసి,జటాయువుకు నీళ్లు వదిలారు. మరణించిన గద్ద రాజు మహర్షి సమానుడైన రామచంద్రుడి చేత సంస్కారం పొంది పుణ్యలోకాలకు పోయాడు. ఇలా రామలక్ష్మణులు కర్మలు చేసి, జటాయువు మీదనే మనసుంచి, సీతాదేవి తనకు లభిస్తుందని ఆయన చెప్పిన మాటలను విశ్వసించి, సీతాదేవిని కలవాలన్న కోరికతో అడవుల జాడ పట్టుకుని పోయారు.

సర్గ-69

# అయోముఖిని విరూపను చేసిన లక్ష్మణుడు

రాజకుమారులు రామలక్ష్మణులు ఇద్దరూ, నైరుతిమూలగా కొంతదూరం పోయి, ఆ అడవికి మూడు కోసుల దూరంలో వున్న క్రౌంచారణ్యంలోకి ప్రవేశించి, అక్కడ బడలిక తీర్చుకోవడానికి మధ్య-మధ్య చెట్ల నీడల్లో కూర్చుంటూ, అనేక అడవి మృగాలున్న ఆ అడవిలో సీతను వెతకసాగారు. ఆ క్రౌంచారణ్యం దాటి తూర్పుగా పోయి, మతంగవనంలో మూడుకోసుల దూరాన వున్న ఒక కొనను సమీపించారు. అది పాతాళం లాగా మిక్కిలి భయంకరంగా శాశ్వతమైన గాడాంధకారం లాగా వుంది. అక్కడ కొంచెం దూరం నుండే భయంకర రాక్షసి ఒకటి వాడి కోరలతో, తల వెంట్రుకలు విరియబోసుకుని, మృగాలను తినేదైన వేలాడే పొట్టతో రామలక్ష్మణులను అడ్డగించింది.

అడ్డగించిన తరువాత ముందు నడుస్తున్న లక్ష్మణుడిని నిలిపి, చేతులతో ఆయన్ను గట్టిగా కౌగలించుకుని, మోహంతో ఆ రాక్షసి ఇలా అన్నది. "ప్రియనాథా! నీకు నేను పెళ్లాన్నవుతాను. మనం బతికినంత కాలం అడవుల్లో ఏటి ఒడ్డుల్లో ఆడుకుందాం. త్వరగా రా...పోదాం. నా పేరు అయోముఖి అంటారు". ఇలా ఆమె చెప్పగా లక్ష్మణుడు కోపంతో, కత్తి దూసి, దాని ముక్కు, చెవులు, చన్నులు నరికాడు. అది మొర్రో అంటూ మొత్తుకుం తూ వచ్చిన దోవలో

వెళ్లింది. అది పోగానే, తమ దారిలో అడవిలో పోతున్న సమయంలో రామచంద్రమూర్తితో లక్ష్మణుడు ఇలా అన్నాడు. "అన్నా! గుండె చెదిరింది. ఎడమ భుజం అదురుతున్నది. ఏదో కీడు కలగబోతున్నట్లు అనిపిస్తున్నది. అన్నా! నా మాట విను. మనకేదో నష్టం రాబోతున్నది. యుద్ధ ప్రయత్నంలో వుందాం. కష్టం వచ్చినా మనకు జయం కలుగుతుందని కూడా శకునాల ద్వారా అర్థమవుతున్నది". అని లక్ష్మణుడు చెప్పగా వాళ్లిద్దరూ అడవుల్లో వెతుక్కుంటూ పోతుండగా వారికి అడవిని చీల్చుకుంటూ పెద్ద ధ్వని వినిపించింది. అదేంటోనని అడవిలో వెతుకుతుంటే ఒకచోట ఒక భయంకరాకారం కనిపించింది.

## కబంధుడి చేత చిక్కిన రామలక్ష్మణులు

పర్వతంలాంటి పెద్ద దేహం, పెద్ద రొమ్ము, తల-మెడ లేకుండా, బిరుసు వెంట్రుకలు, నల్లటి మబ్బు లాంటి, ఉరుము లాంటి ధ్వని, నిప్పుల్లాంటి ఒంటి పెద్ద కన్ను, పెద్ద కోరలు, జింక-ఏనుగు మొదలైన అడవి మృగాలతో ఆడుకునే ఆసక్తి, యోజనం పొడుగు చేతులు కలవాడిని, నోరు తెరిచి వున్న వాడిని, తమ దారికి అడ్డంగా వున్నా వాడిని, కబంధుడిని సమీపించారు రామలక్ష్మణులు. ఆ రాక్షసుడు వీళ్ళిద్దరినీ తన రెండు చేతులతో పట్టుకున్నాడు. సూర్య తేజస్సు లాంటి తేజస్సు ఉన్నప్పటికీ, పెద్ద-పెద్ద విల్లు బాణాలు ఉన్నప్పటికీ, చేత కత్తులున్నా, మహా బలవంతులైనా, ఆ సమయంలో వారిద్దరూ శత్రువు చేత చిక్కి ఆపదపాలయ్యారు. ధైర్యం, పరాక్రమం కల రామచంద్రమూర్తి వాటిని వదలలేదు. చిన్నవాడైనా లక్ష్మణుడు ధైర్యం చెడలేదు. అయినా, వ్యసనపడుతూ అన్నతో ఇలా అన్నాడు.

"అన్నా! నాగతి చూశావా? రాక్షసుడి చేతుల్లో చిక్కుకున్నాను. వీడి నోట్లో పడేట్లు నన్ను వదిలి నువ్వైనా దూరంగా పరుగెత్తు. ఇద్దరిలో ఒకరు బతికినా మంచిదే కదా? ఏవిధంగానైనా నువ్వు నీ భార్యను కలుసుకుంటావని తోస్తున్నది. కాబట్టి నిన్ను ఒకటి ప్రార్థిస్తున్నాను. నువ్వు రాజువై రాజ్యసంపద పూర్తిగా అనుభవిస్తున్నప్పుడు నన్ను మర్చిపోవద్దు". అని లక్ష్మణుడు చెప్పగా, విని రామచంద్రుడు "లక్ష్మణా! నువ్వు కూడా పిరికివాదిలాగా, పామరుడిలాగా బాధపడ్తున్నావా? ఇప్పుడెం మించిపోయింది?". ఇలా వాళ్లిద్దరూ మాట్లాడు కుంటుంటే ఆ భయంకర రాక్షసుడు ఇలా అన్నాడు.

"మీరెవరు? విల్లు, బాణాలు, కత్తులు ధరించి వాదికోమ్ముల కోడెల్లాగా

తిరుగుతున్నారు. ఆకలిగా వున్న నానోట్లో పడడానికి ఇంతదూరం ఎందుకు వచ్చారు? నాబారిన పడ్డ మీరు ఏ ఉపాయం చేసినా బతకలేరు. మీకు వందేళ్ళు నేటితో ముగిశాయి''. అని ఇలా గర్వంతో అంటున్న రాక్షసుడి మాట విని తమ్ముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు రాముడు.

"కష్టం మీద కష్టం కలుగుతున్న మనకు చివరకు ప్రాణానికే ముప్పు వచ్చింది. ప్రియురాలు లభించకపోతే పోయే. భార్యను పోగొట్టుకుని మళ్లీ రాబట్టుకోలేక పోయాదన్న అపకీర్తికి తోడూ రాముడు అడవిలో చచ్చాడన్న అపకీర్తి కూడా వస్తున్నది. ప్రియురాలిని కష్టం నుండి తప్పించలేకపోయాను. ఆ పని అయినట్లయితే మరణ భయం లేదు. ఔరౌరా! ఏం ఆశ్చర్యం? భూమ్మీద పుట్టిన ప్రాణులపైన కాలానికి ఎంత శౌర్యం వుందో చూశావా? నిన్ను, నన్ను కూడా దుఃఖంతో కృశించేట్లు చేసింది. మనగతే ఇలా వుంటే, కాలాని వశపడకుండా తప్పించుకోవడం ఎవరికీ సాధ్యం? ఎంత గొప్ప ధైర్యంకలవారు, సత్య పరాక్రములు, లక్ష్యసిద్ధి కలవారు, యుద్ధంలో శత్రువులకు సహించలేని పరాక్రమం వున్నా కాలం అనుకూలించకపోతే, ప్రతికూలిస్తే, నిర్వీర్యులై పడిపోతారు. దైవం ప్రాణులను చంపాలనుకుంటే అసాధ్యం ఏదీ లేదు. విధికి అసాధ్యం వుందా?"

సర్గ–70

# కబంధుడి చేతులు నరికిన రామలక్ష్మణులు

లక్ష్మణుడితో ఆతడి మనసు గట్టిపడే విధంగా మాట్లాడుతున్న రాముడిని చూసి కబంధుడు తనను చూసి వారెందుకు భయపడుతున్నారని అడిగాడు. వాళ్ళను తన నోట్లో పడేట్లు బ్రహ్మ చేశాడని కూడా అన్నాడు. ఈ రాక్షసుడు మహా బలవంతుడనీ, భయంకర దేహంకల దుష్టుడనీ, ప్రపంచమంతా గెలవగల పరాక్రమం కలవాడిగా కనిపిస్తున్నాడనీ, కాబట్టి తమను మింగుతాడు కాని వదలడని లక్ష్మణుడు అంటాడు. కబంధుడిని ఉద్దేశించి మాట్లాడుతూ, "మహాత్మా! రాజులైనవారు తమను తాము కాపాడుకోలేక, ఎదిరించి యుద్ధం చేయలేక వున్నవారిని, యజ్ఞమధ్యంలోకి తెచ్చిన పశువుల్లా హింసించడం నీచకార్యం, అది న్యాయం కాదు" అంటాడు.

లక్ష్మణుడు చెప్పిన మాటలు విని ఆ రాక్షసుడు, రామలక్ష్మణులను నోట్లో వేసుకుందామని ఆలోచించే లోపలే వాడి తత్త్వాన్ని అర్థం చేసుకున్న వారిద్దరిలో రామచంద్రమూర్తి వాడి కుడిచేయి నరికాడు. రాముడికి కుడిపక్కన వున్న లక్ష్మణుడు తన కత్తి దెబ్బతో ఎడమ చేయి నరికాడు. ఇలా నరకగా ఆ రాక్షసుడు భూమ్యాకాశాలు, దిక్కులు దద్దరిల్లేట్లు నేలకొరిగాడు.

### కబంధుడికి తమ వృత్తాంతాన్ని చెప్పిన లక్ష్మణుడు

దుఃఖంతో కూడిన ఆ రాక్షసుడు రెండు చేతులూ కోల్పోయి వీరిద్దరూ ఎవర్నీ,

ఈ అడవిలో వాళ్లకేమిపని వుందనీ అని ప్రశ్నించాడు. జవాబుగా లక్ష్మణుడు, వాళ్ల చరిత్ర చెప్పాడు ఇలా.

"ఈ పుణ్యాత్ముడు ఇక్ష్వాకు వంశంలో పుట్టాడు. పేరు శ్రీరాముడు. ఈయన మా అన్న. నా పేరు లక్ష్మణుడు. దేవతల మహిమకల మా అన్న తన భార్యతో దండకారణ్యంలో వున్నప్పుడు దుండగులైన రాక్షసులు మాయచేసి చంద్రవదన అయిన ఆయన భార్య సీతమ్మను దొంగిలించగా ఆమెను వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చాం. నువ్వెవరివి? ఇలా మొండెం మాత్రమె ఆకారంగా ఎందుకున్నావు? రొమ్ములో నోరుందికాని పిక్కలు ఎందుకు లేవు? ఎందుకిలా పొర్లుతున్నావు?". ఇది విన్న ఆ రాక్షసుడు దేవేంద్రుడి మాటలు స్మరించి, తనకు శాపమోక్షణ కాలం దగ్గరికి వచ్చింది కదా అని సంతోషించి ఇలా జవాబిచ్చాడు లక్ష్మణుడికి.

"ఓ రాఘవులారా! మీకు స్వాగతం. నా భాగ్యం పండడం వల్ల ఈ సమయంలో మిమ్మల్ని ఇక్కడ చూడగలిగాను. చేతులు పోగొట్టుకున్నాను. చేతులు పోవడం నా అదృష్టం వల్లే. శ్రీరామచంద్రా! గర్వం, వినయం తప్పిన పనులు చేయడం వల్లే నాకిలాంటి వికార స్వరూపం కలిగింది. యథార్థం చెప్తా వినండి".

సర్గ-71

# రామలక్ష్మణులకు తన వృత్తాంతాన్ని చెప్పిన కబంధుడు

"రామచంద్రా! నేను మొట్టమొదట సూర్యచంద్రేంద్రులతో సమానమైన సుందరాకారం కలిగి, ప్రపంచంలోనే అందగాడినని పెరుతెచ్చుకున్నాను. అలాంటి ఆకారం కల నేను గర్వంతో మునులను అరణ్యవాసులను భయపడేట్లు అనేకరకాల దుఃఖపెట్టూ, తమోగుణం ప్రకోపించడం వల్ల దుర్బుద్ధితో స్థూలశిరుడు అనే మునిని నింద్య రూపంలో భయపెట్టాను. ఆ ఋషీశ్వరుడు 'ఓరీ! పాపాత్ముడా! నింద్యమైన ఈ రూపంలో నన్ను బెదిరిస్తావా? నీకు ఈ రూపమే శాశ్వతం కలుగుగాక!' అని శపించాడు. శాపవిమోచనం చెప్పమని ప్రార్థించగా ఈ అడవిలో ఎప్పుడు రామచంద్రుడు నీ చేతులు తెగనరికి దహిస్తాడో అప్పుడే నీకు శాపం తొలగిపోయి, నీ పూర్వ రూపం పొందుతావు అని శలవిచ్చాడు ఆ మునీశ్వరుడు".

"కబంధ రూపం రావడానికి మరో కారణం వుంది. నేను శ్రీయుతుడైన తనువు వల్ల కలిగినవాడిని. ఈ వికారాకారం రావడానికి ఇంద్రుడి కోపమే కారణం. ఆయనకు నామీద కోపం ఎందుకొచ్చిందంటారా? నేను గొప్ప తపస్సు చేసి దీర్ఘాయువు కలిగేట్లు బ్రహ్మ వరం పొందాను. ఆ కారణాన నాకేం భయం లేదని భావించి పొగరుతో బుద్ధిహీనుడనై ఇంద్రుడిని యుద్ధానికి రమ్మని

పిలిచాను. ఇంద్రుడు వజ్రాయుధం వేటుతో నా తల, రొమ్ము, కడుపు, తొడలు కుదించుకు పోయేట్లు అణచి వేశాడు. నేనప్పుడు, నాకీ దురవస్థకన్నా మరణమే మేలని చంపమని ప్రార్థించాను. ఎంతవేడుకున్నా బ్రహ్మదేవుడి వాక్కు వృథాకాకూడదని నన్ను చంపలేదు. చావకుండా, బతకలేకుండా అయింది నా పరిస్థితి. రెంటికీ చెడ్డ వాడినయ్యాను. నేనెలా బతకాలయ్యా? అని అడిగితే, ఆమడ పొడుగున్న చేతులు, కడుపులో నోరు అనుగ్రహించాడు. వాటి సహాయంతో ఏనుగులను, పులులను, సింహాలను, ఇతర మృగసమూహాలను చంపి తింటున్నాను. లక్ష్మణుడితో సహా ఎప్పుడు రాముడు నా చేతులను నరుకుతాడో అప్పుడు మళ్లీ నేను స్వర్గానికి వస్తానని చెప్పి ఇంద్రుడు పోయాడు".

"ఇక అప్పటి నుండి ఈ వికార స్వరూపం పోవడానికి ప్రయత్నం చేస్తూ, ఎవరు కనపడ్డా పట్టుకుని, రాముడు చిక్కకపోతాడా అని ఆసతో ఎదురు చూస్తున్నాను. మహాత్మా! నన్ను యుద్ధంలో ఎంత గొప్ప పరాక్రమవంతులైనా చంపలేరు. కాబట్టి ఆ మునీశ్వరుడు చెప్పిన రాముడివి నువ్వే. మీకు నేను సహాయం చేస్తాను. మీ కార్యం సాధించగల స్నేహితుడిని చూపిస్తాను. నన్ను అగ్నితో దహించు" అని అంటాడు కబంధుడు. తాను జనస్థానంలో వుండగా రావణుడు అనే రాక్షసుడు తన భార్యను దొంగిలించాడనీ, వాడి పేరు తప్ప ఇతర వివరాలేవీ తమకు తెలియవనీ వాడితో చెప్పాడు రాముడు. "వాడెక్కడ వుంటాడో తెలిస్తే చెప్పు. మనస్సు వికలం చెంది అడవుల్లో తిరుగుతున్నాను. మేము ఎవరికైనా ఉపకారం చేస్తాం కానీ, అపకారం చేయం. నువ్వు కోరినట్లు నీకు ఉపకారం చేస్తాం. మామీద దయతలచి అలక్ష్యం చేయకుండా, వాడి స్థితిగతులు చెప్పు. నిన్ను నీ మాట ప్రకారమే దహనం చేస్తాను. నీ ద్వారా మాకు తెలియాల్సింది జానకిని అపహరించినవాడేవాడు?"

తన దేహాన్ని వేగంగా దహించి వేస్తే సీతను దాచి వుంచిన రహస్యమంతా దాచకుండా చెప్తానంటాడు కబంధుడు రాముడితో. ఆ పని సూర్యాస్తమయం లోపే చేయమంటాడు. వాడి విషయం తెలిసినవాడు ఒకడున్నాడనీ, అతడితో ధర్మబద్ధంగా స్నేహం చేయమనీ, అతడు ప్రపంచంలో తిరగని చోటు లేదనీ, అతడు రాముడికి ఉపకారం చేస్తాడనీ చెప్పాడు కబంధుడు.

సర్గ–72

# స్వస్వరూపాన్ని పొందిన కబంధుడు

కబంధుడు చెప్పిన మాటలు విన్న లక్ష్మణుడు వాడిని దహనం చేయడానికి సన్నాహాలు చేశాడు. అతడి శరీరాన్ని ఒక బిలంలో తోసి, ఎండు కట్టెలను పేర్చి, మండే కొరివి ఆ కట్టెల్లో వుంచి, అగ్నిని పురిగొల్పాడు. కొవ్వుతో నిండి, మాంసం ముద్దలాగా వున్న ఆ దేహాన్ని అగ్నిహోత్రుడు వేగంగా కాల్చకుండా మెల్లగా కాల్చసాగాడు. ఇంతలో రామలక్ష్మణులు చూస్తుండగానే, మండుతున్న ఆ మంటల్లో నుండి నిర్మలమైన వస్త్రాలు ధరించి, తళ– తళలాడే సొమ్ములు అలంకరించుకుని, ఆకాశానికి ఎగిరిన కబంధుడు, తాను సీతాదేవిని చూసిన విధం రాముడితో ఇలా చెప్పాడు.

"రామచంద్రా! లోకంలో సంధి, విగ్రహ, యానా, సన, ద్వైదీభావ, సమాశ్రయంలనే ఆరు ఉపాయాలను రాజులైన వారు పనులు చక్కబెట్టడానికి ఆలోచిస్తారు. ఈ ఆరింటిలో సంధి తప్ప తక్కినవి నీకు ప్రస్తుతం సరిపడేవి కాదు. విరోధి ఉనికి తెలిస్తేనే కదా, యుద్ధానికి సన్నద్ధం కావడం జరిగేది. కాబట్టి సంధి విషయం ఒకటే ఆలోచించాల్సి వుంటుంది. ప్రత్యక్ష శత్రువు ఎవరైంది నీకు తెలియలేదు కాబట్టి, నువ్వు వాడితో సంధి చేద్దామన్నా కుదరదు. కాబట్టి మొదలు నీ శత్రువు విషయం, సీత ఉనికి తెలుసుకోవాలి. ఇది మీ ఇద్దరివల్ల సాధ్యపడేది కాదు. కాబట్టి అన్యుల సహాయం తీసుకోవాలి. ఇతరులతో సంధి అంటే,

ఎలాంటివారితో చేయాలి? కయ్యానికి, నెయ్యానికి, వియ్యానికి సమానత్వం కావాలి. తనకంటే గొప్పవారితో స్నేహం కుదరదు. తక్కువ వారితో స్నేహం చేస్తే లాభం లేదు. తనకంటే ఎక్కువవాడు తనని చులకన చేస్తాడు కాని, నిండు మనస్సుతో ఆదరించడు. ఇప్పుడు మీ అన్నదమ్ములు ఇద్దరూ సమర్థులే అయినా, నీ భార్య కొరకై నీకు కష్టదశ ప్రాప్తించింది. నీ కొరకై నీ తమ్ముడు కష్టదశలో వున్నాడు".

## సుగ్రీవుడితో స్నేహం చేసుకొమ్మని రాముడికి చెప్పిన కబంధుడు

"కాబట్టి నీ స్థితిలాంటి స్థితిలో ఉన్నవాడిని చూసి స్నేహం చేసుకో. అలా జరగకపోతే నీ పని అయ్యేట్లు నాకు అనిపించడం లేదు. అలాంటివారు ఎవరైనా వున్నారా అని అడుగుతావేమో? సుగ్రీవుడు అనే వానర రాజు, తన అన్న వాలికి తనమీద కోపం రాగా, నలుగురు వానరులను సహాయంగా తీసుకుని దుఃఖపడుతూ, పంపానది ఒడ్డున వున్న పవిత్ర ఋశ్యమూక పర్వతం మీద సంచరిస్తున్నాడు. అతడు పరాక్రమవంతుడు. ఋజువర్తనం కలవాడు. సత్యం చెప్తాడు. బుద్ధి సంపదకలవాడు. ధైర్యవంతుడు. శౌర్యంలో ప్రసిద్ధుడు. అతడితో నువ్వు స్నేహం చేస్తే నీ భార్యను వెదకడానికి అతడు నీకు సహాయపడతాడు. రామా! నువ్వెందుకు దుఃఖపడతావు? ఏదెలా జరగాలో అలాగే జరుగుతుంది కాని, దానిని తప్పించడానికి ఎవరికి సాధ్యం? ఎలాంటివారికైనా కాలాన్ని దాటడం సాధ్యం కాదుకదా?.

"నిర్మలమైన మనస్సు కలవాడా! నువ్వు అక్కడికి ఇప్పుడే శీఘ్రంగా వెళ్లు. సుగ్రీవుడితో స్నేహం చేయి. వాడు మహాబలవంతుడు. శ్రేష్టమైన గుణాలు కలవాడు. మోసబుద్ధిలేకుండా, వీడొక కోతి...వీడేమి చేయగలడని అలక్ష్యం చేయకుండా అగ్నిసాక్షిగా వానర రాజుతో స్నేహం చేయి. వాడు మిక్కిలి పరాక్రమవంతుడు. ఎవరైనా తనకు సహాయపడతాడా అని వెతుకుతున్నాడు. మీకు ఆయన మేలే చేస్తాడు. నువ్వు చేసిన మేలు ఆయన మరవడు. వానరులందరికీ అతడు ప్రభువు. కోరిన రూపం ధరించగలడు. అతడి కోరిక నెరవేర్చే శక్తి మీకుంది. ఆయన కోరిక మీరు వెంటనే నేరవేర్చినా, లేకున్నా, మీ పని అతడు చేస్తాడు".

"సుగ్రీవుడు ఋక్షరాజు స్త్రీగా వున్న సమయంలో ఆమె శరీరంలో సూర్యుడికి జన్మించాడు. పంపానదీ తీరంలో అన్న వాలికి భయపడి తిరుగుతున్నాడు. వాడు నమ్మేట్లు నువ్వు నీ ఆయుధాలన్నిటినీ తాకి ప్రతిజ్ఞ చేసి అతడితో స్నేహం చేయి.

అతడికి తెలియని రాక్షసులు వుండే చోటు భూమ్మీద లేదు. సూర్యకిరణాలు వ్యాపించే భూమ్మీదగల నదులు, నదాలు, కొండలు, అడవులు, వెతికి నీ భార్య ఎక్కడున్నదీ వార్తా తెప్పించగల సమర్థుడు సుగ్రీవుడు. నిన్ను ఎడబాసిన కారణాన దుఃఖిస్తున్న సీతాదేవి రావణుడి బందీగా ఎక్కడ ఉన్నదో కనుక్కోగల సమర్థుడతడు. ఆ రావణుడి ఇల్లు వెతికి, వాడామెను పాతాళంలో దాచినా, మేరువు కొనలో ఉంచినా, రాక్షసుల గుంపును చంపి ఆమెను తీసుకురాగలడు".

సర్గ–73

# రాముడికి పంపామార్గం చెప్పిన కబంధుడు

ఇంతదాకా రామలక్ష్మణులు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. తూర్పు, దక్షిణం, పడమర సముద్ర తీరాలలో అంధ్ర, పాండ్యాది దేశాలున్నాయి. కాబట్టి వాళ్లు తూర్పుకు పోలేదు. అదీకాకుండా కొండలు కూడా అడ్డం వస్తాయి అటుపోతే. జటాయువు కూడా దక్షిణం వైపే పొమ్మని సలహా నిచ్చాడు. ఈ మార్గానికి కిష్కింధ పడమరగా వుంది. అంటే కాకుండా శబరి ఆశ్రమానికి పోవడానికి తూర్పు వైపు తప్ప మిగతా వైపున మార్గం లేదు. కొండలు అడ్డం వస్తాయి. కాబట్టి వీళ్లు పడమరగానే పోయి, ఆ తరువాత తూర్పుకు తిరగాల్సి వుంటుంది. నాసిక దగ్గర పంచవటి అనే వాదన చేసేవారికి ఇది వ్యతిరేకం.

ఈ నేపథ్యంలో సీత లభించే ఉపాయం చెప్పిన కబంధుడు, ఇంకా ఇలా అన్నాడు. "ఇక్కడినుండి పడమరగా పోతే పండ్లతోనూ, పూలతోనూ నిండిన తోటలు కనిపిస్తాయి. అందులో మారేళ్ళు, నేరేళ్ళు, గన్నేరులు, గోగులు, పనసలు, రేగులు, రావులు, మామిడిలు, క్రోవులు, ముంతమామిడిలు, వారిజాలు, కడపలు లాంటి ఎన్నో చెట్లున్నాయి. ఆ చెట్ల పండ్లు తింటూ మీరు మరింత ముందుకు పోతే, అక్కడ పూసిన చెట్ల వనం వుంటుంది. నందనవనంలాగా వున్న ఆ తోటలో అన్ని ఋతువుల్లో అన్నిరకాల పండ్లు, పూలు లభ్యమవుతాయి. మేఘాలతోను, పర్వతాలతోను, సమానంగా పండిన

పండ్ల బరువుతో వృక్ష సమూహాలు నెలకు ఒరిగి వుండి శోభిల్లుతూ అలరారుతాయి. పండ్లు తినుకుంటూ అడవీ-అడవీ, కొండా-కొండా చూసుకుంటూ పొండి".

## పంపా సరస్సును వర్ణించి రాముడికి చెప్పిన కబంధుడు

పంపా సరస్సును వర్ణిస్తూ కబంధుడు రాముడితో ఇలా అంటాడు. "బెగ్గురులతో, రాజహంసలతో, చక్రవాకాలతో, మనోహర ధ్వనులతో, పాచితీగలులేని జలాలతో, ఇసుకనేలతో ప్రకాశిస్తూ వుంటుంది పంపా సరస్సు. నిర్మలమైన గట్టి చదరపు నేలల తీరాలు, కొత్తగా వికసించిన కమలాలు, కలువలు, మంచి వాసనలతో గుమ-గుమలాడే జలప్రవాహాలు కలిగిన పంప ఇంతవరకూ అనుభవించని సంతోషాన్ని కలుగచేస్తుంది. అక్కడి జలాల్లో విహరించే పక్షులు మనుష్యులు తమదగ్గరికి వచ్చినప్పటికీ, బెదరక, చలించక, సంతోషంతో తిరుగుతూ వుంటాయి. ఆ సరస్సులో గండుచేపలు, చారలు, రొయ్యలు, కొర్రలు, బొమ్మడాయలు, వాలుగాలు, ముళ్లులేని చేపలు నివసిస్తుంటాయి. మీకు కావాల్సినవి తీసుకోండి. లక్ష్మణుడు వాటిని బాణాలతో కొట్టి, చర్మం ఒలిచి, రెక్కలు పీకి, ఇనుపకడ్డీలకు గుచ్చి నిప్పులో పక్వం చేసి ముళ్లు తీసివేసి నీకు భక్తితో తెచ్చి ఇస్తాడు. తృప్తిగా తిని, తామరాకుల వాసనతో, సుఖకరమైన చల్లదనంతో, స్ఫటికంలాగా తెల్లదనంతో, సంతోషకరంగా వున్నా పంపాసరోవర జలాలను నీ తమ్ముడు తామరాకు దొప్పలో తెచ్చి ఇస్తే సంతోషంగా తాగు. అడవిపందులు నీళ్ళు తాగడానికి పంపాతీరానికి రావడం నువ్వు చూస్తావు. సాయంకాలం తిరుగుతుంటే విశేషించి పూసిన పూలను, చల్లటి నీళ్ళను చూడవచ్చు".

## శబరికి దర్శనం ఇమ్మని రాముడికి చెప్పిన కబంధుడు

కబంధుడు ఇంకా ఇలా చెప్పాడు రాముడితో. "వికసించిన కమలాలు, కలువలు, శ్రేష్టమైన ఇంపైన పూలతో నిండిన కానుగచెట్లు, బొట్టుగు చెట్లు, మనోహరమైన పలురకాల ఇతర చెట్లు మీకు సంతోషం కలిగిస్తాయి. ఆ పూలను మనుష్యులెవరూ ధరించరు. అవి ఎప్పటికీ వాడిపోవు. తొడిమలు వూడవు. ఆ స్థలంలో మతంగుడనే మహాముని తపస్సు చేస్తుంటే అతడి శిష్యులు అడవినుండి కందమూలాదులు తెచ్చేవాడు. ఆ సమయంలో ఆ శిష్యుల శరీరం నుండి

చెమటలు రాలగా వాటివల్ల పుట్టినవి కాబట్టి అ అపూలకు అలాంటి మహిమ కలిగింది. చెమట వల్ల పుట్టినవి కాబట్టి ఎవరూ ధరించరు. వారంతా ఆ స్థలం వదిలిపోయారు కాని, వారి దాసిమాత్రం ఆ చోటు వదలలేదు. దీర్ఘకాలం జీవించి వున్న, యతి ధర్మాన చరిస్తున్న, గురుశుశ్రూష అనే పరమ ధర్మం అనుష్టిస్తున్న ఆమె భగవత్సమానుడవైన నిన్ను, సర్వ భూతాలచే నమస్కారాలు అందుకుంటున్న నిన్ను, దర్శించి స్వర్గం చేరాలనుకుంటున్నది. నీరాక కొరకు వేచి చూస్తున్నది".

"ఆ వనప్రదేశంలో ఏనుగుల గుంపు సంచరిస్తుంది కాని మతంగుడి తపోమహిమవల్ల ఒక్క ఎనుగైనా ఆ పక్కకు రాదు. ఆ సరస్సుకు పడమట మిక్కిలి రహస్యమైన ఆశ్రమం ఒకటి వుంది. అక్కడ ఆ స్త్రీరత్నం ఎల్లప్పుడూ తపస్సు చేస్తుంటుంది. దేవతలా వనంతో, ఇంద్రుడి నందనవనంతో సమానమై వింత-వింత పక్షుల గుంపులతో నిండిన ఆ అడవిలో నువ్వు సంతోషంగా గడుపుతావు. అక్కడ ఆమెను చూసిన తరువాత పంపాసరోవరానికి పో. ఆ సరోవర తీరంలోనే పూసిన చెట్లతో, మనోహరంగా కనిపించే ఋష్యమూక పర్వతం వుంది. అక్కడ ఏనుగులు విశేషంగా తిరుగుతుంటాయి. ఆ కొండమీద నిద్రపోయేవాడు కలలో ఏ సొమ్ము చూస్తాడో మేలుకోనగానే అది లభిస్తుంది. పాపాత్ములు ఆ కొండమీద నిద్రపోకూడదు. ఒకవేళ పోతే, నిద్రలో వారిని రాక్షసులు కొట్టుతారు. రామచంద్రా! ఇది బ్రహ్మ చేసిన ఏర్పాటు. మతంగాశ్రమం సమీపంలో వుంటూ, పంపాతీరంలో తిరిగే ఏనుగు పిల్లల ఘీంకారాలు కొండమీదికి వినపడతాయిఅక్కడి. పరిశుద్ధమైన అక్కడి చల్లటి కొలను నీళ్లను తాగిన అడవి ఏనుగులు ఇష్టప్రకారం సుఖంగా వుంటాయి".

"అక్కడి ఎలుగుబంట్లు, పులులు, జింకలను చూడగానే నీకు శోకం ఉపశమిస్తుంది. ఆ పరవతంలో ఒక పెద్ద గుహ వుంది. దానికి పెద్ద రాతిమూత వుంది. దాంట్లోకి ప్రవేశించడం మంచిదికాదు. ఆ గుహకు తూర్పు దిక్కుగా ఒక మంచినీళ్ల మడుగుంది. ఆ మడుగు ఒడ్డున మంచి ఫలాలతో కూడిన చెట్లు, జింకల మందలు వున్నాయి. ఆ గుహలో సుగ్రీవుడు వాలి భయంతో నలుగురు వానరులతో నివసిస్తున్నాడు. ఒకానొకప్పుడు పర్వతం పైభాగంమీద సుగ్రీవుడు గుహ వదిలి వస్తుంటాడు".

ఇలా చెప్పి కబంధుడు ప్రయాణానికి సిద్ధమయ్యాడు. రామలక్ష్మణులు పొమ్మని ఆజ్ఞాపించారు. కబంధుడు సంతోషంగా పోయాడు. రామలక్ష్మణులు త్వరగా పడమటి దిశగా పయనమయ్యారు.

సర్గ–74

# శబరిని చూసిన రామలక్ష్మణులు

పడమటి దిక్కుగా పోతున్న రామలక్ష్మణులు దారిలో కొండలు, తీయటి పండ్లున్న అడవులు, చెట్లు చూసుకుంటూ పోయి కొండ దగ్గర ఆరాత్రి గడిపి, సూర్యోదయం అవగానే పరిశుద్ధ జలాల పంపానదిని చూస్తూ తిరిగి ప్రయాణం కొనసాగించారు. పడమటి దిక్కున వున్నా ఒడ్డులో వెతికి అక్కడ శబరి వుండే రమ్యమైన ఆశ్రమాన్ని చూసి సమీపించారు. (పంప ఒడ్డున ఈ ఆశ్రమం ఇప్పటికీ వుందట. ఈ గుహవాకిట్లో పట్టపగలు ఎండలు మండిపోతున్నప్పటికీ, దుప్పటి కప్పుకోనేంత చల్లటి గాలి వీస్తుంది). శబరి వీరిని చూసి చేతులు మోడ్చి, వారిపాదాలను అంటి నమస్కరించి, పాద్యం ఇచ్చి, తగిన ఉపచారాలను అన్నింటినీ శాస్త్ర ప్రకారం కావించింది. ఆ తరువాత నిలబడి వున్న ఆమెను చూసి శ్రీరామచంద్రుడు పలకరించాడు.

"సాధుచారిత్రా! నీ తపస్సులు, వ్రతాలు విఘ్నం లేకుండా జరుగుతున్నాయికదా? కోపంలోను, ఆహారంలోను నిర్మలమైన మనస్సుకలదానా! నియమం వుంది కదా? నువ్వు నియమించుకున్న వ్రతాలు నెరవేరుతున్నాయా? మనస్సు సర్వదా ప్రసన్నంగా, శాంతంగా వుందికదా? గురుసేవలు కొనసాగుతున్నాయి కదా? దానివల్ల ఫలితం అనుభవానికి వస్తున్నదా?" అని రామచంద్రమూర్తి శబరిని ప్రశ్నించగా, తపస్సు ధనంగాకల

ఆ పుణ్యస్త్రీ, ముక్తులైన వారికి సమ్మతమైన నడవడికల ఆ యోగసిద్ధురాలు, కౌసల్యా పుత్రుడిని చూసి మిక్కిలి భక్తితో, వినయంతో ఈ విధంగా అన్నది.

(గురువు, గురుపుత్రులు లేరుకదా! ఇప్పుడేమి శుశ్రూష అనకూడదు. గురువు పోయినా నిజమైన శిష్యులు గురుపాదుకలు వుంచుకుని వాటికి గురుపూజ చేసినట్లే చేస్తారు. మనస్సు, వాక్కు, కాయం శుద్ధంగా వుంచుకుని గురుభక్తి, దైవభక్తి కలిగుంటే భగవంతుడు మనల్ని వెతుక్కుంటూ తానె వస్తాడని శబరి–రామ చరిత్రం వల్ల అర్థమవుతున్నది. భగవత్ దర్శనాపేక్ష వుంటే చాలు. రామచంద్రమూర్తిని వెతుక్కుంటూ పోయి దర్శించడం శబరికి సాధ్యమయ్యేదా?)

"అపహతపాపా! నా గురుశుశ్రూషకు ఫలం నిన్ను చూసిన తరువాత ఇప్పుడే కదా ఫలించింది? గురుశుశ్రూషకు ఫలం భగవత్సాక్షాత్కారం. అది నాకు ఇప్పుడే కలగడం వల్ల గురుశుశ్రూష ఇప్పుడే ఫలించింది. అలాగే నా తపాలకు, వ్రతాలకు ఫలమేంటి? భగవత్సాక్షాత్కారమే! అదికూడా నీ దర్శనభాగ్యాన ఇప్పుడే ఫలించింది పుండరీకాక్షా! భూమ్మీద జన్మించిన వారిలో సార్థకజన్ముడు ఎవడు? భగవంతుడిని సాక్షాత్కరింపచేసుకున్నవాడే! ఇప్పుడు నేను నిన్ను కళ్లారా ప్రాకృత చక్షువులతో చూడగలగడం అంటే నా జన్మ సార్థకం అయినట్లే కదా? దేవతా శ్రేష్టుడా! నిన్ను చేతులారా పూజించి మోక్షం పొందుతాను. నీ దయార్ద్ర దృష్టి వల్ల పాపాలు నశించాయి. అరిషడ్వర్గం హతమయింది. మోక్షం లభించింది".

"శ్రీరఘురామచంద్రా! నేను శుశ్రూష చేస్తుండే నా గురువులు, మీరు చిత్రకూటానికి వచ్చారనీ, ఇక్కడికి వస్తారనీ, మీ దర్శనం చేసుకుంటే నాకు మళ్లీ జన్మలేని లోకం లభిస్తుందనీ చెప్పిన కారణాన మీ కొరకు వేచి చూస్తున్నాను. సంతోషంగా మీ కోసం మంచివి, ఏరి–కోరి నానా రకాలైన కందమూల ఫలాలు సంపాదించాను". శబరి మాటలకు ఆమెను చూసి రామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "అమ్మా! నీ గురువుల ప్రభావం విన్నాను. అది ప్రత్యక్షంగా చూడాలని కోరికగా వుంది. కాబట్టి నీకిష్టం వుంటే ఆ చిత్రాలను చూపించు".

### మతంగాశ్రమం వింతలు రామలక్ష్మణులకు చూపించిన శబరి

రామచంద్రమూర్తి అడిగినదానికి బదులుగా శబరి, ఆయనతో ఇలా జవాబిచ్చింది. "రామచంద్రా! వర్షించే మేఘాలలాగా నల్లగా వ్యాపించి

మృగాలతో, పక్షులతో నిండి వున్న ఈ మతంగవన స్థలంలో తమ మంత్రాల శక్తితో మా గురువులు తీర్థాలను కల్పించారు. పడమటి వేదిమీద మా స్వాములు ముసలితనంతో వణకుతున్నప్పటికీ భగవదారాధన మానకుండా పూలతో పూజించేవారు. వారి తపోమహిమ వల్ల వేదులు వాళ్లు లేకున్నా దిక్కులన్నిటినీ ప్రకాశింప చేస్తున్నాయి. శుష్కోపవాసాలు చేసి బలహీనులై నడవలేని కారణాన సముద్రాలకు పోలేకపోతే, వాళ్ల పిలుపు మేరకు సముద్రాలే ఇక్కడికి వచ్చాయి. చూడు....రామచంద్రా. మా గురువులు స్నానాలు చేసి తడిసిన నారవస్త్రాలు ఈ చెట్లకొమ్మల మీద వుంచి పోయారు. వారి తపఃప్రభావం వల్ల నేటికీ అవి ఆరలేదు. వారు దేవతారాదనలో పూజించిన పూలు ఇప్పటికీ వాడిపోలేదు. వినతగినవన్నీ విన్నావు....చూడతగినవన్నీ చూశావు. ఇక నేను నా గురువులున్న చోటుకు పోయి వాళ్ళను దర్శించాలి. నాకు ఆజ్ఞ ఇవ్వు".

ఆ పుణ్యాత్మురాలు చెప్పిన అమతలన్నీ విన్న రామచంద్రుడు ఆమె గురుభక్తికి, దైవభక్తికి మెచ్చి, ఇలా అన్నాడు. "సాధుచారిత్రా! నువ్వు చేయాలనుకున్న సత్కార్యాలన్నీ గ్రహించినట్లే భావించు. నీ కోరిక ప్రకారం వెళ్లిపో".

సర్గ–75

# పంపాతీరం చేరిన రామలక్ష్మణులు

శబరి పరమపదానికి పోగా, ఏకాగ్రమనస్కుడై, తన తమ్ముడు లక్ష్మణుడిని చూసి రామచంద్రుడు మతంగముని గురించి చెప్పాడిలా. “ఆహా! ఏమి, ఈ ఋషుల మహిమ? అవి చూస్తూ వుంటే చాలా ఆశ్చర్యంగా వుంది. లక్ష్మణా! ఇక్కడ జింకలు, పులులు, మచ్చికతో సహజ విరోధం వదిలి నమ్మకంగా తిరుగుతున్నాయి. మునీశ్వరులు వున్నప్పుడే కాకుండా వాళ్లు పోయిన తరువాత కూడా వాళ్ల తేజస్సు వ్యాపించి ఉన్నందున హింస అనేది కనబడడం లేదు. మునీశ్వరుడు సృష్టించిన సముద్ర జలాలతో పితృ తర్పణం చేశాం. ఇది మనకు మేలు చేస్తుంది. లక్ష్మణా! మన కష్టకాలం పోయింది. ఇక సౌఖ్యమే కలుగుతుంది. ఇక్కడికి సుగ్రీవుడు వుండే పర్వతం దగ్గరే. ఎంతో దూరం లేదు. ఇక మనం పంపకు పోదాం. అక్కడే కదా సుగ్రీవుడు వానరులతో వుండే ఋశ్యమూకం వున్నది. మనం సుగ్రీవుడిని చూడడానికి పోదాం పద. సీతను వెతికే పని అతడిదే కదా?”. అన్న మాటలకు లక్ష్మణుడు తానూ ఆ విషయమే ఆలోచిస్తున్నానని అన్నాడు. వాళ్లు పంపాతీరం చేరారు.

పంపా సరోవరం చూసిన రామలక్ష్మణులు దాని సౌందర్యానికి, వ్రతనిష్ఠ కల మునులతో కూడిన దాని మహిమకు ఆశ్చర్యపడి నేత్రానందంగా దాన్నే చూసుకుంటూ పోయారు. దానికి కొంచెం దూరంలో వున్నమతమ్ము కొలనులో

స్నానం చేసి ఆ రాజకుమారులు సమీపంలోని అందమైన వనాలను చూస్తూ పోసాగారు. అలా పోతున్న వారికి అందమైన తీగలతో ప్రకాశించే బొట్టుగు చెట్లు, మాదిఫల వృక్షాలు, గన్నేరులు, మొల్లతీగెలు, మర్రులు, ఏడాకుల అరటులు, మొగలి చెట్లు, ఎర్ర గన్నేరులు, మామిడితోపులతో కూడిన ఆ వనం అలంకరించబడిన పడుచులాగా వుంది. చిలుకలు, గుడ్డికొంగలు, నేమిళ్ళు లాంటి మనోహరమైన పక్షుల ధ్వనులు వింటూ సంతోషంగా పంప చేరారు. అప్పుడు రాముడు లక్ష్మణుడితో, "ఈ పంప ఒడ్డున వున్న ఋశ్యమూకపర్వతం మీదనే కదా ఆ పుణ్యాత్ముడు సుగ్రీవుడున్నది? శోకతప్తుడినై రాజ్యాన్ని కోల్పోయి, భార్యను పోగొట్టుకుని ఎలా బతకాలి? కాబట్టి మన పనికోసం నువ్వు సుగ్రీవుడిని చూడడానికి వెళ్లు. నేను పోవడం మర్యాద కాదు". ఇలా లక్ష్మణుడితో చెప్తూ, రామచంద్రమూర్తి అధికమైన దుఃఖంతో పంపాతీరాన్ని చూడడానికి అనువైన స్థలానికి తమ్ముడితో కలిసి చేరాడు. అందమైన ఆ కొలను చూసిన వారికి ఇన్నాళ్లు కలగని సంతోషం కలిగింది.

**(సమాప్తం)**

# అరణ్య కాండ చివరి పద్యాలు

**కం:** రామా! గుణధామా! రిపు, భీమా! సౌందర్యకామ! విశ్రుతేజ
స్సోమా! శుభనామా! రుచి, సీమా! లస దొంటిమిట్ట
సీతారామా!

**మంద్రాక్రాంత:** దీరా! యూర్ధ్వేశ శుచినముచి ద్వేషిదిక్సాంఖ్యపద్యో
దారారణ్య ప్రథితచరితో ద్దామ వాత్సల్య సీమా
క్రూరారాతి క్రథనకలిత క్రూరకోపా యపాపా
వారాశీడ్జాకమల మధుపా భక్త హృత్పద్మ సద్మా

**గద్యం:** తనపాదభక్తుల తనయునిగా జేసి యనుకంపవీక్షించె
జననమంద
ఆవలదాలక్ష్మణార్యుడై రక్షించి రామాయణంబను
గ్రహము చేసె
స్వీయమంత్రంబును జేట్లూరినరసింహ,
దేశికుండై యుపదేశమిచ్చె
ఏకశిలానగరౌకుడై గ్రహియించి,
యాంధ్రవాల్మీకిరామాయణంబు
వ్యాఖ్యదానికిపుడు వ్రాయించుకొనియెను, గరిమతోడను వనకాండమునకు
వాసుదాసుచేత స్వప్రభావంబును, బ్రకటపరుప రామభద్ర విభుడు.


ఇది శ్రీమద్రామచంద్ర చరణారవింద మిళిందాయమాన,
మానసత్వమహోవైభవ వావిలికొలను రామచం
ద్రాయతనూభవ సుజనవిధేయ సుబ్బరాయ
(వాసుదాస) నామధేయ ప్రణీతంబైన
మందరాఖ్య స్వయంకృత వ్యాఖ్యాన
సమేత శ్రీమదాంధ్రవాల్మీకి

రామాయణమను నిర్వచన
మహాకావ్యంబునందు
నారణ్యకాండము

**అనువక్త–వాచవి**
**వనం జ్వాలా నరసింహారావు**
**శ్రీరామార్పణమస్తు**

**శ్రీ శ్రీ శ్రీ**

**శ్లో: నమోస్తు రామాయ సలక్ష్మణాయ, నమోస్తు దేవ్యైజనకాత్మజాయై**
**నమోస్తు వాతాత్మ భువేవురాయ, నమోస్తువల్మీకభ వాయతస్మై**





వనం జ్వాలా నరసింహారావు తండ్రి వనం శ్రీనివాసరావు గారు– పరమ భాగవతోత్తములు, శ్రీరామ భక్తులు.... తన 83వ ఏట 1998 లో పరమపదించారు. తల్లి వనం సుశీలమ్మగారు – సహస్ర చంద్ర దర్శనం చేసుకొని నవంబర్ 2013 లో తన 90వ ఏట మరణించారు. స్వగ్రామం – జన్మస్థలంః. ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, వనం వారి కృష్ణాపురం గ్రామం, ఆగస్ట్ 15, 1947 న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి, ఆగస్ట్ 8, 1948 న జననం. ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్లు, నలుగురు తమ్ములు, విద్యాభ్యాసంః సొంత గ్రామంలో మాధ్యమిక, ఉన్నత పాఠశాల చదువు ఖమ్మంలో, కళాశాల చదువు ఖమ్మం, హైదరాబాద్ లలో, విశ్వవిద్యాలయం చదువు ఉస్మానియా, నాగపూర్ లలో... లెక్కలు, భౌతిక–రసాయన శాస్త్రాల్లో డిగ్రీ, అడ్మినిస్ట్రేషన్ లో ఎంఏ, లైబ్రరీ సైన్స్ లో డిగ్రీ.

వివాహంః ఏప్రియల్ 30, 1969 న (స్వర్గీయ) అయితరాజు రాంరావు– రాధ గార్ల కుమార్తె విజయలక్ష్మితో వివాహం. ఇద్దరు ఆడపిల్లలు (ప్రేమ మాలిని, కిన్నెర), ఒక కొడుకు (ఆదిత్య). ఆరుగురు (యశ్విన్, మిహిర, అన్ష్, మేధ, కనక్, ఇరా) మనుమలు, మనుమరాళ్లు. ఉద్యోగాలు – ఇతర వ్యాపకాలు, లైబ్రేరియన్‌గా జీవనయానం ప్రారంభం... గవర్నర్ కుముద్ బెన్ జోషి దగ్గర ప్రాజెక్టు అధికారిగా... హస్తకళల అభివృద్ధి సంస్థలో కొన్నాళ్లు... మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో కొంత కాలం.... అత్యవసర సహాయ సేవల సంస్థలో మరికొంతకాలం... ఇలా అక్కడా ఇక్కడా.. ప్రస్తుతం తెలంగాణ సిఎం కేసీఆర్ గారి దగ్గర సీపీఆర్వోగా. ఆంగ్లంలో పుస్తకాలు – హైదరాబాద్, చెన్నై, గోవా (స్టర్లింగ్ పబ్లిషర్స్), ఎ సింక్రోనస్ హిస్టరీ స్క్రాప్ బుక్, యాన్ ఎజెండా ఫర్ డెవెల ప్మెంట్ ఆఫ్ ఏపీ, గవర్నెన్స్ విత్ఎ డిఫరెన్స్, .... తెలుగులో – తిలక్ జ్ఞాపకాలు, అనుభవాలే అధ్యాయాలుగా, ఇదీ సుపరిపాలన, సుందరకాండ మందర మకరందం, బాలాకాండ మందర మకరందం, అయోధ్యకాండ మందర మకరందం, బాలకాండ మందర మకరందం, అయోధ్యకాండ మందర మకరందం, ధర్మధ్వజం.

# Araṇya-Kāṇḍa *MANDARA MAKARANDAM*

Written by: *Vanam Jwala Narasimharao*

Published by: *Darshanam Devotional Magazine*